www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

మంగళవారం | 16-4-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 1 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్లపక్షం, తిథి: అష్టమి మ. 1.25 తదుపరి నవమి; నక్షత్రం: పుష్యమి తె. 5.16 తదుపరి ఆశ్లేష; వర్జ్యం: ఉ. 11.48-1.33; దుర్ముహూర్తం: ఉ. 8.31-9.20, రా. 10.14-10.59; అమృతఘడియలు: రా. 10.17-12.01; రాహుకాలం: మ. 3.00-4.30; సూర్యోదయం: 6.01; సూర్యాస్తమయం: 6.27 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

లోక్‌సభ ఎన్నికల్లో టీడీపీ కూటమిదే పైచేయి

25 స్థానాల్లో 14 తెలుగుదేశానికి

జనసేన, బీజేపీలకు చెరో రెండు

వైసీపీ 7 సీట్లకే పరిమితం

'న్యూస్‌ఎక్స్' సర్వేలో వెల్లడి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 15: ఆంధ్రప్రదేశ్‌లో లోక్‌సభ ఎన్నికల్లో టీడీపీ కూటమికే ఎక్కువ స్థానాలు వస్తాయని 'న్యూస్‌ఎక్స్' ఆంగ్ల వార్తా చానల్ సర్వేలో తేలింది. 25 లోక్‌సభ స్థానాల్లో 14 తెలుగుదేశం పార్టీ చేజిక్కించుకుంటుందని.. దాని మిత్రపక్షాలైన జనసేన, బీజేపీ చెరో రెండు చోట్ల గెలుస్తాయని.. మొత్తంగా 18 సీట్లను ఎన్డీయే చేజిక్కించుకుంటుందని ఆ చానల్ వెల్లడించింది. తాజాగా నిర్వహించిన 'ఒపీనియన్ పోల్' ఫలితాలను సోమవారం విడుదల చేసింది. గత ఎన్నికల్లో 22 లోక్‌సభ సీట్లను

మిగతా 2వ పేజీలో...

అతనే.. అతనే.. అతనే..

ముమ్మాటికీ అవినాశే



మా నాన్న హత్య ఆయన పనే | ఇవిగో పక్కా ఆధారాలు | ఇంకేం కావాలి?

అవినాశ్‌రెడ్డికి వివేకా హత్య లైవ్ అప్‌డేట్స్ తెలుసు

నాన్న హత్య రోజు తెల్లవారుజామున ఎర్రగంగిరెడ్డి, అవినాశ్ మధ్య ఫోన్ కాల్స్

ఆ తర్వాత ఎంపీ నుంచి బయటివ్యక్తులకు ఫోన్

అంతకుముందు రోజు అవినాశ్ ఇంట్లోనే సునీల్

తలపై గొడ్డలిపోట్లు ఉంటే గుండెపోటని ప్రచారం

'సాక్షి'లో అలాగే ప్రసారం.. చైర్మన్‌ను విచారించాలి

వివేకా, అవినాశ్ కుటుంబాల మధ్య పదేళ్లుగా రాజకీయ విభేదాలు.. అడ్డు తొలగించాలనే హత్య

చేతి వేళ్లు నరికేశారు.. నుదిటి మీద, తల వెనుక గొడ్డలి వేట్లు.. వీడియోలు చూస్తుంటే ఏడుపొస్తోంది

వేళ్లన్నీ అవినాశ్ వైపే.. జగన్ కాపాడుతున్నారు

ఫోన్‌ను సీబీఐకి ఎందుకు సరెండర్ చేయరు?

పెద్దల ఒత్తిడి వల్లే సీబీఐ విచారణ ఆలస్యం: సునీత



ప్రజెంటేషన్ సందర్భంగా అవినాశ్‌రెడ్డికి వెళ్లిన కాల్స్ రికార్డును చూపిస్తున్న సునీత

పక్కా సాక్ష్యాధారాలతో హైదరాబాద్‌లో సునీత పవర్ పాయింట్ ప్రజెంటేషన్

వివేకా హత్య ముమ్మాటికీ అవినాశ్ రెడ్డి పనే. ఇందుకు అన్ని ఆధారాలూ ఉన్నాయి. ఇవిగో సాక్ష్యాలు మీ ముందు పెడుతున్నా. ఇంతకంటే ఇంకేం కావాలి? హంతకులను కాపాడుతున్న ముఖ్యమంత్రి జగన్ చేతిలో అధికారం ఉండకూడదు.

వివేకా హత్య జరిగిన తరువాత 2019 మార్చి 15 తేదీ తెల్లవారుజామున 2 గంటల నుంచి 4 గంటల మధ్యలో అవినాశ్ నంబరు నుంచి చాలా కాల్స్ బయటికి వెళ్లాయి. ఆ కాల్స్ ఎవరికి వెళ్లాయో అవినాశ్ ప్రజలకు చెప్పాలి. -సునీత

హైదరాబాద్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య లైవ్ అప్‌డేట్స్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సోదరుడు, ఎంపీ అవినాశ్ రెడ్డికి తెలుసునని వివేకా కుమార్తె డాక్టర్ సునీతా రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. ఈ కేసులో వేళ్లన్నీ అవినాశ్ వైపే

మిగతా 12వ పేజీలో...

ఆర్టీసీ సొమ్ముకు ఎసరు!

పీఎఫ్‌సీ బాండ్లకు మళ్లించేందుకు జగన్ సర్కారు రెడీ!

ఏపీఎండీసీలో వాటాల అమ్మకం బయటకు రావడంతో ఉలికిపాటు

ప్రత్యామ్నాయంగా ఏపీపీఎఫ్‌సీ ద్వారా రూ.7,000 కోట్ల అప్పు తెచ్చే యత్నం

గ్యారెంటీ ఇచ్చేందుకు ఆర్థిక శాఖ సిద్ధం

చకచకా కదులుతున్న పీఎఫ్‌సీ ఫైలు

రేపోమాపో గ్యారెంటీ లభించే అవకాశం

ఆర్టీసీ నిధులతో ఈ బాండ్ల కొనుగోలు?

గతంలోనూ విద్యుత్ ఉద్యోగుల పీఎఫ్ ఫండ్ మళ్లించి బేవరేజెస్ ఎన్‌సీడీల కొనుగోలు

ఆ సొమ్ము సొంత అవసరాలకు వాడకం

ఇప్పుడు ఆర్టీసీ ఉద్యోగుల వంతు?

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఎన్నికల ముందు మే 2వ తేదీన ఏదేమైనా సరే రూ.7,000 కోట్ల అప్పు తేవడం కోసం జగన్ ప్రభుత్వం విశ్వప్రయత్నాలు చేస్తోంది. ఇందుకోసం ఆర్టీసీ నిధులపై కన్నేసింది. ముందుగా ప్లాన్ చేసి పెట్టుకున్న రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ (ఏపీఎండీసీ) బాండ్ల గుట్టు రట్టవడంతో ఉలిక్కిపడింది. చివరి నిమిషంలో ఆ అప్పురాకపోతే ఎలా అనుకుని.. రాష్ట్ర పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ (పీఎఫ్‌సీ) ద్వారా ఇంకో రూ.7,000 కోట్లు అప్పు తెచ్చుకునేందుకు

మిగతా 12వ పేజీలో...



సోమవారం రోడ్‌షోలో పట్టీతో జగన్

దేవుడి దయతో రాయి తగలాల్సిన చోట తగల్లేదు

కన్ను, కణతను తాకలేదు

గాయపరచడం.. కుట్రలు బాబు నైజం.. మళ్లీ జగన్ అదే విద్వేషం

జనంలోంచే రాయి

విసిరింది ఒక్కడే.. ఆగంతకుడు చేత్తోనే విసిరాడు

ముందు జగన్‌కు, తర్వాత వెలంపల్లికి తగిలింది

కణతపై తగిలితే.. ప్రమాదమనే ఊహతోనే 307

ఫోరెన్సిక్ ల్యాబ్‌లో పలు వీడియోల విశ్లేషణ

విద్యుత్ తీగలు కిందకున్నందునే సరఫరా కట్

సీపీ కాంతిరాణా టాటా వెల్లడి.. ఈసీకి నివేదిక



విజయవాడ, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): సీఎం జగన్‌పై జరిగిన రాయిదాడి ఘటనకు సంబంధించి ఎన్టీఆర్ జిల్లా పోలీసు కమిషనర్ కాంతి రాణా టాటా పలు కీలక విషయాలు వెల్లడించారు. దాడి ఘటన ఆగంతకుడి పనేనని, రాయి విసిరింది ఒక్కడేనని వివరించారు. దుండగుడు వినియోగించింది 'ఒక్కరాయే'నని తెలిపారు. అంతేకాదు.. ఆ రాయి కూడా జనంలోంచే పడిందన్నారు. జగన్‌కు ఎడమవైపు నుదుటిపై

మిగతా 11వ పేజీలో...

సమాచారం ఇస్తే రూ.2 లక్షల నజరానా

'గులకరాయి కేసు'లో పోలీసుల ప్రకటన



పలాసలో నిర్వహించిన ప్రజాగళం సభకు హాజరైన జనం.. మాట్లాడుతున్న చంద్రబాబు

అబద్ధాలు.. మోసాలు.. గులకరాయితో డ్రామాలు

జగన్‌రెడ్డీ.. ఎన్నాళ్లీ నాటకాలు?

వీటిని జనం నమ్మే పరిస్థితి లేదు

ఎప్పుడు ఇంటికి పంపుదామా అని ఎదురుచూస్తున్నారు

సీఎం రోడ్‌షోలో కరెంటు పోవడమేంటి?

నేనొచ్చి తీసేశానా.. నా గవర్నమెంటు ఉందా?

రాయి తగిలాక బస్సులోకి వెళ్లకుండా బస్సు మీదే డ్రామాలేంటి?

గత ఎన్నికల్లోనూ కోడికత్తి డ్రామా

దగాకోరు వ్యవహారాలను జనం నమ్మరు

ఉద్యోగులకు అన్ని బకాయిలూ ఇచ్చేస్తా

రాగానే 25 వేల కానిస్టేబుల్ పోస్టుల భర్తీ

నా తొలి సంతకం డీఎస్సీపైనే

అభివృద్ధికి మద్దతివ్వండి.. బాబు పిలుపు

జగన్‌రెడ్డి మోసగాడు.. ఆయన చెప్పేవన్నీ అబద్ధాలు.. కనికట్టు చేసే వ్యక్తి.. చెత్తమాటలు.. చెత్త ప్రవర్తన.. బాబాయిని గొడ్డలితో చంపించి గుండెపోటు అనలేదా..? నాటకాలాడడంలో ఆరితేరిన వ్యక్తి. ఏపీని మరో పులివెందుల చేయడం మనకు అవసరమా? గొడ్డలి సంస్కృతి మనక్కావాలా? - చంద్రబాబు

విజయనగరం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ చెప్పేవన్నీ అబద్ధాలు.. చేసేవన్నీ మోసాలేనని టీడీపీ అధినేత చంద్రబాబు మండిపడ్డారు. గత ఎన్నికల్లో కోడికత్తి కేసుతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చాడని.. మళ్లీ ఇప్పుడు గులకరాయి డ్రామా ఆడుతున్నాడని విమర్శించారు. ఇలాంటి దగాకోరు వ్యవహారాలను

మిగతా 11వ పేజీలో...

బాండ్ల రద్దుతో మళ్లీ నల్లధనం

ఎన్నికల బాండ్ల వల్ల రాజకీయ పార్టీలకు విరాళాల్లో పారదర్శకత వచ్చింది

రద్దుతో పరిస్థితి మళ్లీ మొదటికి.. దానివల్ల అందరూ బాధపడతారు

400 సీట్లు గెలిస్తే రాజ్యాంగాన్ని మారుస్తారనేది దుష్ప్రచారం

దేశంలో ప్రజాస్వామ్యం ఉంది.. సుప్రీం లీడర్ ఎవరూ ఆవిర్భవించలేరు

ఈడీ, సీబీఐల దుర్వినియోగం ఆరోపణలన్నీ ఓటమికి విపక్షాల సాకులే

ఈసీలో సంస్కరణలు తెచ్చాం.. ప్రతిపక్షానికీ ప్రాతినిధ్యం కల్పించాం

2047 నాటికి భారత్‌ను అగ్రదేశంగా నిలపడమే నా లక్ష్యం

దేశం కోసమే పెద్ద నిర్ణయాలు.. ఎవరూ భయపడాల్సిన పని లేదు

సనాతన ధర్మం మన రాజ్యాంగంలోనూ ఉంది

2

ఏఎన్ఐ ఇంటర్వ్యూలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వ్యాఖ్యలు



ఏఎన్ఐ ప్రతినిధికి ఇంటర్వ్యూ ఇస్తున్న ప్రధాని మోదీ

రెచ్చిపోయిన వైసీపీ రౌడీ మూక

కారులో వెళ్తున్న టీడీపీ నేత కుటుంబంపై దాడి

చాక్కా చింపేసి, టీడీపీ లోగో పీకేసి, బంగారం గుంజుకుని దోపిడీ

2

టీడీపీ బీసీ సెల్ నేత, అతడి భార్య, సోదరికి గాయాలు

తాగేసి.. దారి దోపిడీలకు పాల్పడుతున్న మూక

అధికార పార్టీలో తిరుగుతూ ఎదురే లేదన్న ధీమా

ఆ ముఠాను శిక్షించాలని స్థానికుల డిమాండ్

కోడ్ ఉంటే నాకేంటి!?

ఎన్నికల వేళ విద్యాశాఖ పేరెంట్స్-టీచర్స్ మీటింగ్!

తల్లిదండ్రుల హాజరు 100 శాతం ఉండాల్సిందే..

హెడ్‌మాస్టర్లకు, టీచర్లకు ప్రవీణ్ ప్రకాశ్ సందేశం

12

రూ.200 కోట్లు దానం చేసి.. ఆధ్యాత్మిక మార్గంలోకి

22న గుజరాత్ దంపతుల జైన సన్యాసం

2

ఎన్నికల ప్రలోభాలు.. రోజుకు రూ.100 కోట్లు

44 రోజుల్లో 4,658 కోట్ల సొత్తు సీజ్

దేశ చరిత్రలో ఇదే రికార్డు స్థాయి మొత్తం

మత్తుపదార్థాల విలువే రూ.2,068 కోట్లు

రాజస్థాన్‌లో అత్యధికంగా 778 కోట్లు

వెల్లడించిన కేంద్ర ఎన్నికల సంఘం

కోడ్‌కు ఒక్కరోజు ముందు

రామ్‌కోకు రాసిచ్చారు

జగ్గయ్యపేటలో 267 ఎకరాల్లో సున్నపురాయి నిల్వలు

సిమెంట్ కంపెనీకి సంతర్పణ చేసిన జగన్ సర్కారు


20 ఏళ్లు కాదు.. ఏకంగా 50 ఏళ్లపాటు లీజు

మార్చి 15న రహస్య జీవో

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

సుదీర్ఘకాలంగా ప్రభుత్వానికి, ప్రైవేటు సిమెంట్ కంపెనీకి మధ్య న్యాయపోరాటం జరుగుతోంది. సుప్రీం కోర్టు, హైకోర్టుల్లో కేసులు నడుస్తున్నాయి. ఆ కేసులు తేలేవరకు పోరాటం చేస్తే విజయం ప్రభుత్వానిదా.. కార్పొరేట్ సిమెంట్ కంపెనీదా... అని తేలిపోతుంది. కానీ, కంపెనీ ఒక ప్రతిపాదన చేసిందని, దాని ప్రకారం నడుచుకుందామని ఓ న్యాయ సలహా తీసుకున్న

మిగతా 12వ పేజీలో...



ఎన్నికల వేళ.. పీపీఏ ఆమోదాల మేళా!

7000 మెగావాట్ల విద్యుత్ కొనుగోళ్లకు ఈఆర్‌సీ ఓకే

డిస్కమ్‌ల అప్పు 87,524 కోట్లు.. నష్టాలు 29,546 కోట్లు

రెవెన్యూ లోటు 13,589 కోట్లు.. దీని బాధ్యత సర్కారుదే

విద్యుత్ వాహనాలకు చార్జింగ్ షాక్.. యూనిట్‌కు 6.70

2024-25 నివేదికను వెల్లడించిన ఏపీఈఆర్‌సీ

కేసు కోర్టులో ఉండగా నిర్ణయాలా?: ప్రజాసంఘాలు

అమరావతి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్న వేళ.. రాష్ట్ర విద్యుత్తు నియంత్రణ సంస్థ(ఏపీఈఆర్‌సీ) విద్యుత్తు పంపిణీ సంస్థ(డిస్కమ్)లు చేసుకున్న కొనుగోలు ఒప్పందా(పీపీఏ)ల మేళాను చేపట్టింది. సోలార్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సెకీ)

మిగతా 2వ పేజీలో...

రూ.200 కోట్ల సంపద దానం చేసి..
ఆధ్యాత్మిక మార్గంలోకి

» 22న జైన సన్యాసం తీసుకోనున్న గుజరాత్ దంపతులు



సూరత్, ఏప్రిల్ 15: గుజరాత్‌లోని ఓ సంపన్న కుటుంబానికి చెందిన దంపతులు ఆధ్యాత్మిక మార్గంలోకి వెళ్లాలని నిర్ణయించుకుని, దాదాపు రూ.200 కోట్ల తమ సంపదను దానం చేశారు. హిమ్మత్‌నగర్‌కు చెందిన వ్యాపారవేత్త భవేశ్ భండారి దంపతులకు ఓ కూతురు(19), ఓ కుమారుడు(16) ఉండగా.. 2022లోనే వారు జైన సన్యాసం తీసుకున్నారు. వారి నుంచి ప్రేరణ పొందిన తల్లిదండ్రులు కూడా అదే మార్గంలో వెళ్లాలని నిర్ణయించుకున్నారు. గత ఫిబ్రవరిలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో తమ సంపద మొత్తం దానం చేశారు. ఈ నెల 22న జైన సన్యాసం స్వీకరించనున్నారు. అప్పటి నుంచి వారు రెండు తెల్లటి వస్త్రాలు, ఓ రజోహరన్(చీపురులాంటిది), భిక్షం ఎత్తుకునేందుకు ఓ పాత్రను మాత్రమే కలిగి ఉంటారు. కాళ్లకు చెప్పులు కూడా లేకుండా దేశ పర్యటన చేస్తూ, భిక్షను స్వీకరిస్తూ జీవిస్తారు.

న్యాయ వ్యవస్థను కాపాడుకోవాలి!

» సీజేఐకి 21 మంది సుప్రీం, హైకోర్టు మాజీ జడ్జిల లేఖ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): దేశంలో న్యాయ వ్యవస్థకు సంబంధించి ప్రస్తుత పరిస్థితులు ఆందోళనకరంగా ఉన్నాయని సుప్రీంకోర్టు, హైకోర్టులకు చెందిన మాజీ న్యాయమూర్తులు ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయవ్యవస్థను కాపాడుకోవాల్సిన పరిస్థితులు తలెత్తాయని అభిప్రాయపడ్డారు. ఈ మేరకు సుప్రీంకోర్టుకు చెందిన నలుగురు, హైకోర్టులకు చెందిన 17 మంది విశ్రాంత న్యాయమూర్తులు సీజేఐ జస్టిస్ చంద్రచూడ్‌కు లేఖ రాశారు. "కొందరు స్వార్థ రాజకీయ, వ్యక్తిగత ప్రయోజనాల కోసం న్యాయ వ్యవస్థపై అసత్య ప్రచారం చేస్తున్నారు. న్యాయస్థానాల నిర్ణయాలపై అనవసరపు న్యాయ సమీక్షలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదెంతో ఆందోళనకరం. న్యాయ వ్యవస్థను అనవసర ఒత్తిళ్ల నుంచి రక్షించాల్సిన అవసరం ఉంది" అని కోరారు.

లోక్‌సభ ఎన్నికల్లో టీడీపీ కూటమిదే పైచేయి

(మొదటి పేజీ తరువాయి)

గెలుచుకున్న వైసీపీ.. ఈసారి ఏడు స్థానాలను మాత్రమే గెలుచుకుంటుందని అంచనా వేసింది. లోక్‌సభ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో బీజేపీ, విపక్షాల పనితీరు ఎలా ఉంటుంది.. ఎన్నెన్ని స్థానాలు గెలుస్తాయో వివరించింది. మరోసారి టీడీపీ అధినేత చంద్రబాబే సీఎం అవుతారని కూడా వ్యాఖ్యానించింది. ఇటీవల సీఎన్ఎన్-న్యూస్18, ఇండియాటుడే సర్వేల్లో కూడా టీడీపీ కూటమి సింహభాగం ఎంపీ సీట్లను గెలుస్తుందని తేలిన సంగతి తెలిసిందే.



వైసీపీ రౌడీమూక దాడిలో గాయపడిన టీడీపీ నేత వెంకట్రావు

రెచ్చిపోయిన
వైసీపీ రౌడీమూక

» కారులో వెళ్తున్న టీడీపీ నేత కుటుంబంపై దాడి

» చొక్కా చింపేసి, టీడీపీ లోగో పీకేసి, బంగారం గుంజుకుని దోపిడీ

» టీడీపీ బీసీ సెల్ నేత, అతడి భార్య, సోదరికి గాయాలు

గుంటూరు, ఏప్రిల్ 15: వారసలే రౌడీలు. పైగా అధికార పార్టీలో తిరుగుతున్నారు. రౌడీయిజానికి అధికారం తోడవ్వడంతో వారి ఆగడాలకు అంతే లేకుండా పోతోంది. తాగడం, రోడ్డుపై వెళ్లేవారిని ఆపి తిట్టడం, కొట్టడం, వారి వద్ద ఉన్న వస్తువులు లాక్కోవడం చేస్తూ.. దారి దోపిడీ ముఠాగా తయారయ్యారు. వీరంతా కలిసి ఆదివారం రాత్రి బాగా తాగేసి.. కారులో వెళుతున్న ఓ కుటుంబం పట్ల అత్యంత కర్కశంగా వ్యవహరించారు. ఈ ఘటనలో మాజీ సైనిక ఉద్యోగి, ప్రత్తిపాడు నియోజకవర్గ టీడీపీ బీసీ సెల్ కన్వీనర్ కల్వకూరి వెంకట్రావు, ఆయన భార్య శ్రీలత, ఆయన సోదరి నాగమల్లేశ్వరి గాయపడగా, అతడి తల్లి, కుమార్తె స్వల్పంగా గాయపడ్డారు. గుంటూరు జిల్లా పెదనందిపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఉప్పలపాడులో ఆదివారం రాత్రి చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి పోలీసులు, బాధితుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పెదనందిపాడు మండలం నాగులపాడు ఉపసర్పంచి, మాజీ సైనికుడు కల్వకూరి వెంకట్రావు కొంతకాలంగా బాపట్లలో ఉంటున్నారు. ఆయన ఆదివారం రాత్రి భార్య శ్రీలత, అక్క నాగమల్లేశ్వరి, కుమార్తె, తల్లితో కలిసి కారులో నాగులపాడు వెళ్తున్నారు. రాత్రి సుమారు 9.30 గంటలకు వీరు ప్రయాణిస్తున్న కారు గొట్టిపాడు దాటేసరికి మద్యం మత్తులో బైక్‌పై వస్తున్న యువకుడు రోడ్డుకు అడ్డంగా వాహనాన్ని ఆపాడు. వెంకట్రావు కారు ఆపగా.. ఆ యువకుడు నడిరోడ్డుపై బైక్ స్టాండ్ వేసి వెంకట్రావును బూతులు తిట్టడం ప్రారంభించాడు. అతడు మద్యం తాగి ఉండటంతో.. వాహనం పక్కకు తీస్తే వెళ్లిపోతానని వెంకట్రావు చెప్పారు. అయినా వినిపించుకోకుండా 'ఈ రూట్‌లో ఎలా వెళ్తావో చూస్తా. ఉప్పలపాడు దాటి వెళ్లు.. నీ సంగతి తెలుస్తా' అని హెచ్చరించి వెళ్లిపోయాడు. దీంతో వెంకట్రావు కారులో బయలుదేరి, మిట్టపాలెం చెక్ పోస్ట్ వద్ద కానిస్టేబుల్ సుబ్బారావుకు జరిగిన విషయం చెప్పారు. కానిస్టేబుల్ తన ఫోన్ నంబర్ వెంకటరావుకు ఇచ్చి.. మళ్లీ ఎవరైనా ఇబ్బంది పెడితే ఫోన్ చేయమని చెప్పారు. ఆ తర్వాత వెంకట్రావు ఉప్పలపాడు చర్చికి 50 మీటర్ల దూరంలో ఉండగా.. సుమారు పది మంది యువకులు రోడ్డుపై ద్విచక్ర వాహనాలను పార్కు చేసి, వెంకట్రావు కారు కోసం ఎదురుచూస్తున్నారు. తనపై దాడి చేయడానికి వారు సిద్ధంగా ఉన్నారని గ్రహించిన వెంకట్రావు.. కారును ఆపి కానిస్టేబుల్ సుబ్బారావుకు ఫోన్ చేశారు. అప్పటికే కారును గమనించిన ఆ అల్లరి మూకలు.. కారును చుట్టుముట్టి బీభత్సం సృష్టించారు. కారులో ఉన్న వెంకట్రావుపై దాడి చేశారు. దాడికి దిగిన వారంతా వైసీపీలో చురుగ్గా తిరిగేవారు కావడం.. వెంకట్రావు కారు పసుపు రంగులో ఉండటం, కారు బానెట్‌పై టీడీపీ కండువా ఉండడంతో దుండగులు మరింతగా రెచ్చిపోయారు. అతడి ఫోన్ మీద ఉన్న చంద్రబాబు లోగోను పీకేసి, వెంకట్రావు విచక్షణారహితంగా కొడుతుండటంతో. అడ్డుకునేందుకు వెళ్లిన అతడి భార్య, సోదరిపై దాడి చేశారు. సుమారు అర గంటకుపైగా బీభత్సం సృష్టించారు. ఈలోగా కానిస్టేబుల్ సుబ్బారావు ఘటనా స్థలానికి చేరుకోగా, అప్పటికే వారిలో కొందరు వెళ్లిపోగా, మిగిలినవారు కానిస్టేబుల్‌ను సైతం లెక్కచేయకుండా దాడి కొనసాగించారు. వెంకట్రావు మెడలో ఉన్న బంగారం గొలుసు, లాకెట్‌ను తెంచుకున్నారు. దీంతో కానిస్టేబుల్ వారిని తీవ్రంగా హెచ్చరిస్తూ, తెలిసిన వారిని పిలవడంతో వారు వెనక్కి తగ్గారు. విషయం తెలుసుకున్న పలువురు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు ఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్పటికే ఆ యువకులు కాలనీ వదిలి పరారయ్యారు. గాయపడిన వెంకట్రావు, ఆయన భార్య శ్రీలత, అక్క నాగమల్లేశ్వరిని బాపట్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వెంకట్రావు ఫిర్యాదు మేరకు పెదనందిపాడు పోలీసులు కేసు నమోదు చేశారు.

పోలీసుల అదుపులో నిందితులు: దాడికి పాల్పడిన నిందితులను ఉప్పలపాడుకు చెందిన మనోజ్, అఖిల్ అలియాస్ నాని, రోహిత్, విల్సన్, చందు, లూదర్‌పాల్‌గా గుర్తించారు. వారందరినీ సోమవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఆ యువకుల గురించి స్థానికులను పోలీసులు ఆరా తీయగా.. వారంతా ప్రతిరోజూ మద్యం తాగి.. బైకులపై విన్యాసాలు చేస్తూ, రౌడీయిజం చేస్తూ స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నట్లు తెలిసింది.

బాండ్ల రద్దుతో
మళ్లీ నల్లధనం

» ఎన్నికల బాండ్ల వల్ల రాజకీయ పార్టీలకు విరాళాల్లో పారదర్శకత వచ్చింది



న్యూఢిల్లీ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఎలక్టోరల్ బాండ్ల రద్దు వల్ల దేశంలో మళ్లీ నల్లధనం ప్రవహిస్తుందని ప్రధాని నరేంద్రమోదీ పేర్కొన్నారు. బాండ్ల వల్ల ఎన్నికల విరాళాలకు సంబంధించి పారదర్శకత వచ్చిందని, ఇప్పుడు ఆ పరిస్థితి లేకుండా పోయిందన్నారు. కార్పొరేట్ కంపెనీలను ఈడీ, సీబీఐలతో బెదిరించి బీజేపీకి విరాళాలు ఇప్పించుకున్నారనే ఆరోపణలో నిజం లేదన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏకు 400 సీట్లు లభిస్తే రాజ్యాంగాన్ని మారుస్తుందంటూ విపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని మోదీ మండిపడ్డారు. దేశంలో క్షేత్రస్థాయిలో ప్రజాస్వామ్య వ్యవస్థ వేళ్లూనుకొని ఉందని, అటువంటప్పుడు, ప్రజాస్వామ్యానికే ప్రమాదకారిగా మారే ఓ సుప్రీం లీడర్ ఆవిర్భవించే పరిస్థితే తలెత్తదన్నారు. సోమవారం ఏఎన్ఐ వార్తాసంస్థ ఎడిటర్ స్మితా ప్రకాశ్‌కు ప్రధాని ఇంటర్వ్యూ ఇచ్చారు. బీజేపీ 400 సీట్లు గెలిస్తే దేశ రాజ్యాంగాన్ని మారుస్తుందని ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను ఖండించారు. ప్రతిపక్షాలు కుటిలంగా ఆలోచించి దాన్ని దేశంలో చలామణి చేయాలని అనుకుంటున్నాయన్నారు. ఎన్నికల బాండ్ల వల్ల నిధులు పారదర్శకంగా ఏయే పార్టీలకు అందాయో స్పష్టంగా తెలుస్తుందని, ఎన్నికల బాండ్లు లేకపోతే ఆ పరిస్థితి ఉండదని.. మళ్లీ దేశాన్ని నల్లధనం వైపు తీసుకెళ్లామని ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేట్ కంపెనీలను ఈడీ, సీబీఐలతో బెదిరించి బీజేపీకి విరాళాలు ఇచ్చేలా చేశారన్న ఆరోపణలను ఖండించారు. మొత్తం 3 వేల కంపెనీలు ఎలక్టోరల్ బాండ్లు కొంటే, వాటిలో 26 కంపెనీల మీద మాత్రమే దర్యాప్తు జరిగిందని, సదరు సంస్థలు ఇచ్చిన విరాళాల్లో 37 శాతం మాత్రమే బీజేపీకి వచ్చాయని, 63 శాతం బీజేపీయేతర పార్టీలకు వెళ్లాయని చెప్పారు. కాంగ్రెస్ మేనిఫెస్టోపై స్పందిస్తూ.. అది దేశ ఆర్థికవ్యవస్థను పూర్తిగా దిగజారుస్తుందన్నారు. తొలిసారి ఓటు వేసే యువతీ యువకుల ఆకాంక్షలను అది పూర్తిగా ధ్వంసం చేస్తుందని, 25 ఏళ్లలోపు యువత భవిష్యత్తును నాశనం చేస్తుందని విమర్శించారు. తన హయాంలో యువత జీవితాలు మెరుగుపడ్డాయని, ఆర్థికంగా నష్టం వస్తున్నా డేటాను తక్కువ ధరకు అందిస్తున్నామని, దీనివల్ల యువత డిజిటల్ విప్లవం తీసుకొస్తోందన్నారు. వచ్చే 25 ఏళ్ల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఓటు వేయాలని పిలుపునిచ్చారు.

మోదీనే భారత్.. భారత్ అంటే మోదీనే?

ఏఎన్ఐ: మా కెమెరా బృందాలు ఏ బీజేపీ సభకు, ర్యాలీకి వెళ్లి చూసినా అక్కడి బీజేపీ అభ్యర్థులు, వక్తలు మోదీ గురించే మాట్లాడుతున్నారు. గతంలో ఇందిర హయాంలో 'ఇండియానే ఇందిర. ఇందిరానే ఇండియా' అని కాంగ్రెస్ వాళ్లు చెప్పుకొన్నట్లుగా.. ఇప్పుడు 'మోదీనే భారత్. భారత్ అంటే మోదీనే' అనే పరిస్థితి వచ్చిందనుకోవాలా?

మోదీ: భరతమాత పుత్రుడిగా మోదీని భావిస్తున్నారని నేను అనుకుంటున్నా. మోదీ భరత మాత పుత్రుడు. ఆమెకు సేవ చేస్తున్నాడంతే!

మోదీతో ప్రజాస్వామ్యానికి ముప్పా?

ఏఎన్ఐ: మోదీ ఎంత శక్తిమంతుడైతే దేశంలో ప్రజాస్వామ్యానికి అంత ప్రమాదం అన్న విమర్శపై ఏమంటారు?

మోదీ: దేశంలో 6 లక్షల పంచాయతీలున్నాయి. వాటిని ఎన్నికైన ప్రజాప్రతినిధులు పాలిస్తుంటారు. ఎన్నో రాష్ట్రాలు.. ఎన్నెన్నో పార్టీల ప్రభుత్వాలు అధికారంలో ఉన్నాయి. ఇంత జరుగుతున్నా కూడా భారతదేశంలో ఒక సుప్రీం లీడర్ ఆవిర్భవిస్తున్నాడని ఎవరైనా అంటే అలా అనేవారు అజ్ఞానులని నా అభిప్రాయం.

ఈడీ, సీబీఐ దుర్వినియోగం అబద్ధం

ఈడీ, సీబీఐ వంటి సంస్థలు బీజేపీ చెప్పినట్లు పని చేస్తున్నాయని, ఈవీఎంలను కూడా దుర్వినియోగపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న ప్రతిపక్షాల ఆరోపణలను మోదీ కొట్టివేశారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తమ ఓటమికి ప్రతిపక్షాలు ఈ విధంగా కారణాలను వెతుక్కుంటున్నాయని ఎద్దేవా చేశారు. ఈడీ పెట్టిన కేసుల్లో 3% మాత్రమే రాజకీయ నేతలపై నమోదయ్యాయని, మిగిలిన 97% కేసులు రాజకీయాలకు సంబంధించని వారి మీద ఉన్నాయని స్పష్టం చేశారు. 2014కి ముందు ఈడీ రూ.34 కోట్ల నగదును మాత్రమే స్వాధీనం చేసుకుందని, గత పదేళ్లలో ఈ మొత్తం రూ.2,200 కోట్లకు పెరిగిందన్నారు. గతంలో ఎన్నికల సంఘం (ఈసీ) కమిషనర్ల నియామకాలు పూర్తిగా ప్రధాన మంత్రి విచక్షణ మేరకు జరిగేవని, దానిని మార్చి ప్రతిపక్షానికి కూడా తాము చోటు కల్పించామని మోదీ గుర్తు చేశారు.

ఎన్నికలు కాగానే పెద్ద నిర్ణయాలు

2047 కల్లా దేశాన్ని అగ్రరాజ్యంగా మార్చడమే తన లక్ష్యమని, ఇది మొత్తం దేశ ప్రజల ఆకాంక్ష అని మోదీ తెలిపారు. దీని కోసం ఒక్క నిమిషం కూడా వృథా చేయదలుచుకోలేదని, అందుకనే ఎన్నికలకు ముందు నుంచే దీనిపై పని చేస్తున్నానన్నారు. మూడోసారి అధికారంలోకి రాగానే తొలి 100 రోజుల్లో చేపట్టాల్సిన పనుల గురించి ఇప్పటికే కసరత్తు జరిపామని గుర్తు చేస్తూ, 2019లో కూడా ఎన్నికలకు ముందే ఈ పని చేశామని చెప్పారు. ఎన్నికలైన తొలి వంద రోజుల్లోనే ఆర్టికల్ 370 రద్దు, ట్రిపుల్ తలాక్‌పై నిషేధం వంటి నిర్ణయాలు తీసుకున్నామని గుర్తు చేశారు. ఈసారి కూడా పెద్ద నిర్ణయాలు ఉంటాయని, దేశాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతోనే తాను ఏ నిర్ణయమైనా తీసుకుంటానని, ఎవరూ భయపడనక్కర్లేదని ప్రధాని తెలిపారు. జమిలి ఎన్నికలకు తాము కట్టుబడి ఉన్నామని, దేశంలో మెజార్టీ ప్రజలు ఇందుకు మద్దతుగా ఉన్నారని, అనేక సానుకూల సూచనలు చేశారన్నారు.

సనాతన ధర్మంపై విషం

సనాతన ధర్మానికి వ్యతిరేకంగా డీఎంకే వంటి పార్టీలు మాట్లాడుతున్నాయని, అలాంటి విషం చిమ్మే వారితో కలిసి పనిచేయాల్సినంత అవసరం కాంగ్రెస్‌కు ఏముందని మోదీ ప్రశ్నించారు. రాజ్యాంగాన్ని రూపొందించినప్పుడు ప్రతి పేజీలోనూ సనాతన ధర్మం తాలూకు చిత్రాలను ముద్రించారని, రాజ్యాంగం ప్రకారమే సనాతన ధర్మం ప్రభుత్వంలో భాగమని చెప్పారు. ఉత్తర దక్షిణ భారతాల మధ్య అగాధం ఏమీ లేదని, భారతదేశాన్ని వేర్వేరు ప్రాంతాలుగా చూడటం తెలివిమాలిన పని అని దుయ్యబట్టారు. తాను వివిధ రాష్ట్రాలకు వెళ్లినప్పుడు అక్కడి సంప్రదాయాన్ని అనుసరించి దుస్తులు ధరిస్తే కూడా ప్రతిపక్షాలు విమర్శలు గుప్పించాయని, తన మీద వాటికి ఉన్న ద్వేషాన్ని చూసి ఆశ్చర్యపోయానన్నారు. రామ మందిరాన్ని బీజేపీ రాజకీయ ఆయుధంగా వాడుకోవడం లేదని, ప్రతిపక్షాలే ఆ పని చేశాయని ఆరోపించారు.

ప్రతిపక్షాలకు విశ్వసనీయత లేదు

సమాజంలోని ప్రతి వర్గం అభ్యున్నతికి తమ మేనిఫెస్టో బాటలు వేస్తోందని మోదీ అన్నారు. సోమవారం కేరళలో ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. తిరువనంతపురంలో తలపడే లెఫ్ట్, కాంగ్రెస్ తమిళనాడులోని తిరునల్వేలీలో కలిసి పోటీచేస్తున్నాయని, ఏమాత్రం విశ్వసనీయత లేని విపక్షాలను తిరస్కరించాలని ఆయన కోరారు. అవినీతిపరులంతా కూటమి కట్టి తనను అడ్డుకోవాలని చూస్తున్నారని మోదీ ఆరోపించారు.



కేరళలో ఎన్నికల ప్రచారంలో మోదీ

లోకం తీరు



ఉష్ణోగ్రతలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
నంద్యాల	42.0	26.0
ఏలూరు	41.0	24.0
అనంతపురం	41.0	25.0
తిరుపతి	40.4	25.0
విజయవాడ	40.2	25.8
ఒంగోలు	37.7	27.5

2050 నాటికి ఏటా కోటి మరణాలు!

» ప్రజారోగ్యానికి పెనుముప్పుగా యాంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 15: యాంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఏఎంఆర్) ప్రజారోగ్యానికి పెనుముప్పుగా మారింది. బ్యాక్టీరియల్ వ్యాధులకు వ్యతిరేకంగా యాంటీబయాటిక్‌ను నీరుగార్చే ఏఎంఆర్‌ను రాబోయే దశాబ్దాల్లో ప్రపంచం ఎదుర్కోనున్న అత్యవసర ఆరోగ్య ప్రమాదాల్లో ఒకటిగా ఆరోగ్యరంగ నిపుణులు గుర్తించారు. దీని కారణంగా 2050 నాటికి ఏటా కోటి మంది ప్రాణాలు కోల్పోతారని అంచనా వేస్తున్నారు. అదే సమయంలో జంతువుల్లోనూ ఔషధ నిరోధకత పెరగడం తీవ్రమై, చికిత్స చేయలేని అనారోగ్యానికి దారితీస్తుందని, అల్పాదాయ దేశాల్లో పశువుల ఉత్పత్తిలో 11% తగ్గుదలకు దారితీస్తుందని చెబుతున్నారు. దీని వల్ల జీవనోపాధి, ఆహార భద్రత దెబ్బతింటుందని హెచ్చరిస్తున్నారు. మెరుగైన వ్యాధి నివారణ ద్వారా యాంటీబయాటిక్స్ అవసరాన్ని తగ్గించి యాంటీమైక్రోబియల్ నిరోధక వ్యాప్తిని అదుపు చేసేందుకు శాస్త్రవేత్తలు ప్రయత్నిస్తున్నారు. ప్రజల్లో యాంటీమైక్రోబియల్ నిరోధకత పెరుగుదలను అంతం చేయడమే ఈ శతాబ్దంలో సాధించాల్సిన ముఖ్యమైన ఆరోగ్య విజయాల్లో ఒకటని వారు చెబుతున్నారు.

ఒకే దేశం.. ఒకే నాయకుడు..
ప్రజలను అవమానించడమే!

స్వాతంత్ర్యం వచ్చింది ఆర్ఎస్ఎస్ వలసపాలన కోసం కాదు : రాహుల్



వయనాడ్‌లో రాహుల్ రోడ్ షో

చెన్నై, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): భారతదేశం బ్రిటిష్ పాలకుల నుంచి స్వాతంత్ర్యం పొందింది ఆర్ఎస్ఎస్ భావజాలంతో వలసపాలన సాగించడానికి కాదని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. 'ఒకే దేశం.. ఒకే నాయకుడు, ఒకే దేశం.. ఒకే ఎన్నికలు' తదితర బీజేపీ విధానాలపై విమర్శలు ఎక్కుపెట్టారు. దేశానికి ఒకే నాయకుడు ఉండాలనే బీజేపీ నేతల ఆలోచన ప్రతి భారతీయ యువకుడినీ అవమానించడమేనన్నారు. దేశానికి ఒకరి కంటే ఎక్కువ మంది నాయకులు ఎందుకు ఉండకూడదని రాహుల్ ప్రశ్నించారు. దేశ ప్రజల అభిప్రాయాలను కాంగ్రెస్ వినాలనుకుంటుందని, వారి సంస్కృతి, మతం, భాష, విశ్వాసాలను కాంగ్రెస్ గౌరవిస్తుందని, అయితే, బీజేపీ అధిష్ఠానం మాత్రం తాము చెప్పిందే దేశమంతా అమలవ్వాలనుకుంటోందని విమర్శించారు. కేరళలోని తాను పోటీ చేస్తున్న వయనాడ్ లోక్‌సభ నియోజకవర్గంలో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఓపెన్ టాప్ కారుపై కూర్చొని భారీ రోడ్‌షో జరిపారు. అంతకుముందు హెలికాప్టర్‌లో ఆయన తమిళనాడులోని నీలగిరి జిల్లా పందలూరుకు చేరుకున్నారు. అక్కడ కాలేజీ విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి, రోడ్డు మార్గంలో వయనాడ్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీకి, మోదీకి కేవలం ఒకే దేశం..ఒకే భాష.. ఒకే నాయకుడు కనిపిస్తున్నాయని, ఇది మన దేశ మూల స్వరూపాన్ని అర్థంచేసుకోలేకపోవడమేనని విమర్శించారు. బీజేపీ మేనిఫెస్టోలో పేదల కోసం ఏమీ లేదని విమర్శించారు. 'ఒకే దేశం.. ఒకే ఎన్నికలు' అనే ఎజెండాను దేశంపై రుద్దడానికి బీజేపీ ప్రయత్నిస్తోందన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో యువత, మహిళలు సహా అన్ని వర్గాల ప్రజల కోసం విధానాలు ఉన్నాయని చెప్పారు. కానీ, బీజేపీ మేనిఫెస్టోలో 2036లో ఒలింపిక్స్ నిర్వహణ గురించి ప్రస్తావించారని, కాంగ్రెస్, బీజేపీ మధ్య వ్యత్యాసం ఇదేనన్నారు.

ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీ..

తమిళనాడులోని నీలగిరి జిల్లా పందలూరులో రాహుల్‌గాంధీ హెలిక్యాప్టర్‌ను ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీ చేశారు. సోమవారం ఉదయం పందలూరులో హెలిప్యాడ్ వద్ద రాహుల్ హెలికాప్టర్ దిగారు. అప్పటికే అక్కడ సిద్ధంగా ఉన్న ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు హెలికాప్టర్‌ను చుట్టిముట్టి తనిఖీలు జరిపారు. తనిఖీలకు సహకరించిన రాహుల్.. పక్కనే ఉన్న తేయాకు కార్మికులతో కొద్దిసేపు ముచ్చటించారు.

ఎన్నికల వేళ.. పీపీఏ ఆమోదాల మేళా!

(మొదటి పేజీ తరువాయి)

ద్వారా అదానీ, అజూర్‌లతో చేసుకున్న ఒప్పందాలకు పచ్చజెండా ఊపింది. ఈ మేరకు డిస్కమ్‌లు ప్రతిపాదించిన 2024-25 టారిఫ్‌ను సోమవారం ఏపీఈఆర్సీ ప్రకటించింది. అదేవిధంగా వార్షిక ఆదాయ, వ్యయ నివేదికను విడుదల చేసింది. డిస్కమ్‌లు రూ.87,824 కోట్ల అప్పుల్లోను, రూ.29,546 కోట్ల నష్టాల్లోనూ ఉన్నాయని ఈ నివేదికలో వెల్లడించింది. రాష్ట్ర ఆదాయ, వ్యయ నివేదికలో రూ.13,589 కోట్ల సబ్సిడీ మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని ఈఆర్సీ వెల్లడించింది. వినియోగదారుల నుంచి వసూలు చేసిన చార్జీల నుంచి డిస్కమ్‌లు రూ.1,710 కోట్లను ట్రూడౌన్ చార్జీలుగా గుర్తించాయని, వీటిని రాబడిగా లెక్కించి వినియోగించుకోవచ్చని ఈఆర్సీ పేర్కొంది. విద్యుత్తు సంస్థలు సెకీ ద్వారా అదానీ, అజూర్‌తో చేసుకున్న ఒప్పందం మేరకు 7000 మెగావాట్ల సౌర విద్యుత్తునకు ఈఆర్సీ ఆమోదం తెలిపింది. ఈ ఒప్పందం మేరకు సెకీ ఈ ఏడాది అక్టోబరులో 3000 మెగావాట్లు, వచ్చే ఏడాది అక్టోబరులో మరో 3000 మెగావాట్లు, 2027 అక్టోబరులో మిగిలిన వెయ్యి మెగావాట్ల విద్యుత్తును డిస్కమ్‌లకు సరఫరా చేస్తుందని ఈఆర్సీ వెల్లడించింది. అయితే, ఇవి హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగా ఉంటాయని పేర్కొంది. ఇక, రైల్వేలకు అందిస్తున్న విద్యుత్ విషయంలో యూనిట్‌కు రూ.1 చొప్పున పెంచడం ద్వారా రూ.250 కోట్ల అదనపు రాబడి వస్తుందని ఈఆర్సీ వెల్లడించింది. విద్యుత్తు వాహనాలకు ప్రోత్సాహాన్ని అందిస్తామంటూనే.. విద్యుత్ చార్జింగ్ స్టేషన్లలో యూనిట్‌కు రూ.6.70 చొప్పున వసూలు చేయాలని ఆదేశించింది.

నిపుణుల ఆగ్రహం

ఒప్పందాలకు ఆమోదం తెలపడంపై విద్యుత్తు రంగ నిపుణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డిస్కమ్‌లు సెకీతోనూ, సెంబ్‌కార్ప్‌తోనూ చేసుకున్న ఒప్పందాలకు ఏపీఈఆర్సీ పచ్చజెండా ఊపడంపై విస్మయం వ్యక్తం చేస్తున్నారు. సెకీతో డిస్కమ్‌ల విద్యుత్తు కొనుగోలు ఒప్పందంపై హైకోర్టులో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, టీడీపీ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ వేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యాలపై తీర్పు వెలువడకముందే ఈ నిర్ణయం తీసుకోవడాన్ని తప్పుబడుతున్నారు. డిస్కమ్‌లు ప్రతిపాదించిన రూ.7200 కోట్ల ఇంధన కొనుగోలు సర్దుబాటు చార్జీలు, ట్రూఅప్ చార్జీలపై ఈఆర్సీ నిర్ణయాన్ని ఎందుకు ప్రకటించలేదని నిపుణులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా ఇంధన సర్దుబాటు కోసం యూనిట్‌కు 40పైసల చొప్పున ప్రతి నెలా గృహ విద్యుత్తు చార్జీలతో కలిపి వసూలుపైనా స్పష్టతను ఎందుకు ఇవ్వలేదని ప్రజా సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. డిస్కమ్‌లు ఏఆర్ఆర్ ప్రతిపాదనల సమయంలో రూ.22,234 కోట్ల మేర ప్రభుత్వం నుంచి సబ్సిడీ మొత్తాలు రావాల్సి ఉందని చెప్పడాన్ని విద్యుత్తు రంగ నిపుణుడు ఎం. వేణుగోపాలరావు ప్రశ్నించారు.

ప్రజాభిప్రాయం లేకుండా అనుమతా?: సీపీఐ

రాజస్థాన్‌లోని అదానీ గ్రూప్ ప్లాంట్ల నుంచి 7000 మెగావాట్ల సౌర విద్యుత్తు సరఫరా కోసం రాష్ట్ర ప్రభుత్వం, ఏపీ డిస్కమ్‌లు, సెకీ మధ్య జరిగిన ఒప్పందానికి ఈఆర్సీ సమ్మతి తెలిపిన విధానం సహేతుకంగా లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ తప్పుబట్టారు. సోలార్ పవర్ కొనుగోలు కోసం అదానీ గ్రూప్‌ను ఎంపిక చేసినప్పటి నుంచి పారదర్శకత, జవాబుదారీతనం, ప్రజల భాగస్వామ్యం లేకుండా పోయిందన్నారు. హైకోర్టులో పిటిషన్లు పెండింగ్‌లో ఉండగా సౌర విద్యుత్తు సరఫరా కోసం అదానీ గ్రూప్‌తో ఒప్పందం కుదుర్చుకోవడానికి ఈఆర్సీ సమ్మతి తెలపడం సరికాదన్నారు. ఈ ఒప్పందాన్ని రద్దు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్. బాబూరావు డిమాండ్ చేశారు. ప్రభుత్వాల చేతిలో ఈఆర్సీ పావుగా మారిందని, ఈ ఒప్పందం చెల్లదని స్పష్టం చేశారు.

ఎన్నికల ప్రలోభాలు
రోజుకు 100 కోట్లు

» 45 రోజుల్లో 4,658 కోట్ల నగదు, డ్రగ్స్.. మద్యం, ఇతర వస్తువులు సీజ్

» దేశ చరిత్రలో ఇదే రికార్డు స్థాయి మొత్తం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు తాయిలాలు, నగదు, డ్రగ్స్, మద్యం ఏరులై పారుతున్నాయి. దేశవ్యాప్తంగా ఎన్నికల అధికారులు/ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు జరిపిన దాడులు, చెక్‌పోస్టుల వద్ద తనిఖీల్లో మార్చి1 నుంచి శనివారం వరకు రికార్డుస్థాయిలో రూ.4,658 కోట్ల విలువైన సొత్తు సీజ్ అయ్యింది. గడిచిన 45రోజుల్లో రోజుకు సగటున రూ.100కోట్లకుపైగా సొత్తు పట్టుబడింది. 2019సార్వత్రిక ఎన్నికలప్పుడు సీజ్ అయిన మొత్తం సొత్తు రూ.3,475 కోట్లుగా ఉంది. భారత ఎన్నికల కమిషన్ (ఈసీఐ) సోమవారం ఈ వివరాలు వెల్లడించింది. పట్టుబడ్డ నగదు, బంగారం, ఆభరణాలు, సామగ్రి విషయంలో.. కేవలం ఎన్నికల పంపిణీలు అనికాకుండా.. లెక్కపత్రాలులేకుండా తీసుకువెళ్లేవి కూడా ఉన్నాయి. ఎన్నికల క్రతువు ముగిసేసరికి ఈసారి మరింత నగదు, తాయిలాలు, డ్రగ్స్, మద్యం సీజయ్యే అవకాశాలున్నట్లు ఈసీ అభిప్రాయపడింది. ఎన్నికల ప్రచారంలో రాజకీయ నాయకులకు సహకరించినట్లు ఆరోపణలు వచ్చిన 106 మంది ప్రభుత్వోద్యోగులపై ఈసీ చర్యలు తీసుకుంది. కాగా ఇప్పటి వరకు సీజ్ అయిన మొత్తం సొత్తులో 45% (రూ.2,068 కోట్లు) మాదకద్రవ్యాలు కావడం గమనార్హం..! ఇందులో రూ.485కోట్లు డ్రగ్స్ గుజరాత్‌లో పట్టుబడ్డాయి. రూ.293 కోట్ల విలువైన డ్రగ్స్ సీజ్ అయిన తమిళనాడు రెండోస్థానంలో ఉంది. మొత్తం సొత్తులో నగదు రూ.395.39 కోట్లు కాగా.. మద్యం విలువ రూ.489.31 కోట్లు, విలువైన వస్తువులు (రూ. 562.10 కోట్లు), తాయిలాలు (1,142.49 కోట్లు) ఉన్నట్లు ఈసీ తెలిపింది. ఇప్పటివరకు సీజ్ అయిన రూ.4,658 కోట్లలో అత్యధికంగా రూ.778కోట్ల సొత్తు రాజస్థాన్‌లో పట్టుబడింది. ఈ జాబితాలో ఏపీ (రూ.125.97కోట్లు) 12వ, తెలంగాణ (రూ.121.84కోట్లు)13వ స్థానంలో ఉన్నాయి.

తెలుగు రాష్ట్రాల్లో ఇలా..

ఏపీలో సీజ్ చేసిన మొత్తం సొత్తు(రూ.125.97 కోట్లు)లో నగదు రూ.32.15 కోట్లు.. మద్యం రూ.19.71 కోట్లు, మత్తుపదార్థాలు రూ.4 కోట్లు, విలువైన వస్తువులు రూ.57.14 కోట్లు, తాయిలాలు రూ.12.89 కోట్లున్నట్లు ఈసీ పేర్కొంది. తెలంగాణలో సీజ్ అయిన సొత్తు (రూ.121.84కోట్లు)లో నగదు రూ.49.18 కోట్లు, మద్యం రూ.19.21కోట్లు, డ్రగ్స్ రూ.22.71 కోట్లున్నాయి.

జగన్‌కు ఓటుతో బుద్ధి చెప్పండి

» ఆయన పాలనంతా విధ్వంసమే: బాలకృష్ణ

» కర్నూలు, నందికొట్కూరులో స్వర్ణాంధ్ర సాకార యాత్ర



నందికొట్కూరు పట్టణంలో బాలకృష్ణ రోడ్‌షో

నందికొట్కూరు ఏప్రిల్ 15: కుట్రలు, కుతంత్రాలతో పాలన సాగించిన సీఎం జగన్‌కు ఓటు అనే ఆయుధంతో పోటు పొడవాలని సినీ హీరో, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ప్రజలకు పిలుపునిచ్చారు. గత ఎన్నికల్లో కోడి కత్తి నాటకం, ఆపై బాబాయికి గొడ్డలిపోటుతో అధికారంలోకి వచ్చిన జగన్మోహన్‌రెడ్డి ఈ సారి ఎన్నికల్లో గులకరాయి దెబ్బతో మరోసారి ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చేందుకు డ్రామాలు ఆడుతున్నాడన్నారు. స్వర్ణాంధ్ర సాకార యాత్రలో భాగంగా ఆయన సోమవారం నంద్యాల జిల్లా నందికొట్కూరు, కర్నూలు నగరంలో రోడ్‌షో నిర్వహించారు. బాలయ్యను చూసేందుకు రెండు జిల్లాల నుంచి ప్రజలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. నందికొట్కూరు పట్టణంలోని పటేల్ సెంటర్‌లో ప్రజలను ఉద్దేశించి బాలకృష్ణ మాట్లాడారు. ఒక్క చాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ రాష్ట్రంలో విధ్వంస పాలన సాగించాడన్నారు. బాబాయ్‌ను చంపిన హంతకుడిని కాపాడుతూ మరో చెల్లికి ద్రోహం చేశాడన్నారు. వీరందరికీ సమాధానం చెప్పేందుకు జగన్ సిద్ధమా? అని బాలకృష్ణ సవాల్ విసిరారు. నాడు ఎన్టీరామారావు తీసుకొచ్చిన సంక్షేమ పథకాలను కూడా రద్దు చేసిన నిరంకుశ సీఎం జగన్‌ను ఇంకేమనాలన్నారు. టీడీపీ ప్రభుత్వం రాగానే అంబేడ్కర్ విదేశీ విద్యను కొనసాగిస్తామన్నారు. ప్రతి ఎస్సీ కుటుంబానికి 2 ఎకరాల భూమిని కొనుగోలు చేసి ఇస్తామన్నారు. ముస్లిం మైనారిటీల అభివృద్ధి కోసం నాడు ఎన్టీఆర్ ఉర్దూను రెండో అధికారభాషగా గుర్తించారని బాలకృష్ణ పేర్కొన్నారు. దుల్హన్ పథకం ద్వారా రూ.50 వేలు లక్ష రూపాయలకు పెంచుతామని హామీ ఇచ్చారు. మైనార్టీ కార్పొరేషన్‌కు ప్రత్యేక నిధులు కేటాయిస్తామన్నారు. అమరావతిలో ఇస్లామిక్ సెంటర్ ఏర్పాటుకు 5ఎకరాల భూమి కేటాయిస్తామన్నారు. ముస్లింలకు 3 ఎమ్మెల్సీలు, ఒక రాజ్యసభ, మున్సిపాల్టీల్లో చైర్మన్ పదవులను కేటాయిస్తామన్నారు.



చిత్తూరు జిల్లా కార్వేటినగరంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్ షర్మిల

మోదీకి జగన్ తొత్తు!

- చిన్నాన్న హంతకుడిని పక్కన పెట్టుకు తిరుగుతున్నాడు
- ఈ హత్యా.. గూండా.. రాజకీయాలు మనకు అవసరమా?
- బీజేపీతో బాబుది బహిరంగ పొత్తు.. జగన్‌ది రహస్య పొత్తు
- రాష్ట్రంలో ట్రయాంగిల్ లవ్ స్టోరీ: షర్మిల

చిత్తూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): బీజేపీతో చంద్రబాబుది బహిరంగ పొత్తు అయితే, జగన్‌ది రహస్య పొత్తు అని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల వ్యాఖ్యానించారు. మోదీకి జగన్ తొత్తు అని విమర్శించారు. చిత్తూరు జిల్లాలోని కార్వేటినగరం, పలమనేరు, బంగారుపాళ్యం మండలాల్లో సోమవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జీడీనెల్లూరు, పలమనేరు, పూతలపట్టు నియోజకవర్గాల కాంగ్రెస్ అభ్యర్థులు రమేశ్‌బాబు, శివశంకర్, ఎంఎస్ బాబులను ఆమె ప్రజలకు పరిచయం చేశారు. వీరికి ఓట్లేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'పాలకపక్షం, ప్రతిపక్షం.. ఇద్దరికీ బీజేపీతో పొత్తు కావాలంట. ఇది ట్రయాంగిల్ లవ్ స్టోరీలా ఉంది. మన రాష్ట్రంలో బీజేపీ అంటే బాబు, జగన్, పవన్. ఎవరికి ఓటేసినా మొత్తం బీజేపీ ఖాతాలోనే పడతాయి. అంతమాత్రానికి వారికి ఓట్లెందుకు వేయాలి. బీజేపీ మన రాష్ట్రానికి ఏం చేసింది?' అని షర్మిల ప్రశ్నించారు. 'సొంత చిన్నాన్ననే హత్య చేసిన అవినాశ్‌రెడ్డిని పక్కన పెట్టుకుని తిరుగుతున్నారు జగన్. ఈ హత్యా, గూండా రాజకీయాలు మనకు అవసరమా? వైసీపీ అధికారంలోకి వచ్చి ఐదేళ్లు పూర్తయినా ఇంకా 2.25 లక్షల ఉద్యోగాలు ఖాళీగానే ఉన్నాయి. 23 వేల టీచర్ ఉద్యోగాలు ఖాళీగా ఉంటే, కేవలం 6 వేల ఉద్యోగాలకు దగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చారు. ఐదేళ్లు ఏం చేశారు.. గుడ్డి గుర్రానికి పళ్లు తోమారా? గాడిదలు కాశారా..? జగన్ ఒకవైపు బటన్ నొక్కుతున్నా.. మరోవైపు లూటీ చేస్తున్నారు. కరెంటు చార్జీలు ఏడుసార్లు.. ఆర్టీసీ చార్జీలు ఐదుసార్లు పెంచారు. పెట్రోల్, డీజిల్ ధరలతో పాటు ఇంటి పన్ను కూడా పెంచుకుంటూ పోతున్నారు.. బీజేపీ మెడలు వంచి హోదా తెస్తానని చెప్పిన జగన్, ఇప్పుడు దాని ఊసే లేకుండా చేస్తున్నారు. హోదా కోసం ఒక్క నిజమైన ఉద్యమం కూడా చేయలేదు' అన్నారు.

రాష్ట్రంలో అప్పుల్లేని రైతులున్నారా?

'రాష్ట్రంలో అప్పుల్లేని రైతులు ఎవరైనా ఉన్నారా? మద్దతు ధర ఉందా? కనీసం డ్రిప్ మీద సబ్సిడీ ఉందా? పంట నష్టపరిహారం ఉందా? వైఎస్సార్ హయాంలో వ్యవసాయమంటే పండుగ. రైతును నెత్తిన పెట్టుకున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రూ.2లక్షల వరకు రుణమాఫీ చేస్తుంది. మూతపడిన షుగర్ ఫ్యాక్టరీలన్నింటినీ తెరిపిస్తుంది. రైతు ఎంత ఖర్చు పెడతారో.. దానికి 50శాతం లాభం వేసి కొత్త మద్దతు ధరను కాంగ్రెస్ ప్రకటిస్తుంది. ఉపాధిహామీ కింద కనీస వేతనం రూ.400 ఇస్తాం. ఇల్లు లేని పేద కుటుంబానికి రూ.5 లక్షలతో పక్కా ఇల్లు మంజూరు చేస్తాం. ప్రతి పేదింటికి ఏడాదికి రూ.లక్ష ఇస్తాం. 2.25 లక్షల ఉద్యోగాల భర్తీ ఫైల్ మీద తొలిసంతకం పెడతాం. వృద్ధులకు రూ.4 వేలు, వికలాంగులకు రూ.6 వేలు పెన్షన్ నేరుగా అకౌంట్లలో పడుతుంది' అని షర్మిల హామీలిచ్చారు.

రాముడితో బీజేపీ రాజకీయం చేయదు: పురందేశ్వరి



రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 15: రాముడితో బీజేపీ రాజకీయం చేయదని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి పార్లమెంట్ అభ్యర్థి పురందేశ్వరి అన్నారు. హిందుత్వ అనేది మొదటి నుంచీ తమ పార్టీ అజెండా అని చెప్పారు. రాజమహేంద్రవరంలోని బీజేపీ కార్యాలయంలో సోమవారం ఆమె మీడియా సమావేశంలో మాట్లాడారు. 'హిందుత్వం ఒక మతం కాదు, ఒక జీవన విధానం, ధర్మం. దీనికి బీజేపీ కట్టుబడి ఉంది' అన్నారు. ఒక జాతీయ పార్టీగా దేశంలోని అన్ని వర్గాలకూ న్యాయం చేయాలనే ఉద్దేశంతో మేనిఫెస్టో తీసుకొచ్చామని స్పష్టం చేశారు. 'రాజమండ్రిలోని బ్లేడ్ బ్యాచ్ సంగతి, డ్రగ్స్ విషయంపై కేంద్రం ఏం చేస్తుంది..? రాష్ట్రంలోని రాష్ట్ర ప్రభుత్వం, డీజీపీ చూడాలి' అని ఒక ప్రశ్నకు సమాధానంగా అన్నారు. 'సీఎంపై రాళ్లదాడి జరిగింది. ప్రతిపక్ష నేతపై రాళ్ల దాడి జరిగింది. రాష్ట్రంలో శాంతిభద్రతలను కేంద్రం వచ్చి చేస్తుందా..' అని ప్రశ్నించారు. జమిలి ఎన్నికలకు బీజేపీ కట్టుబడి ఉందన్నారు. ఉమ్మడి పౌరస్మృతిని కూడా నిజం చేయాల్సి ఉందన్నారు. దీనిపై భిన్నాభిప్రాయాలు ఉండొచ్చు కానీ ఇది జాతీయవాదాన్ని పెంపొందిస్తుందని చెప్పారు.

వైసీపీ దొంగ ఓట్లను కట్టడి చేయాలి: బీజేపీ

రాష్ట్రంలో పెద్ద ఎత్తున దొంగ ఓట్లు నమోదు చేయించిన వైసీపీ.. వాటితో ఎన్నికల్లో గెలిచేందుకు చేస్తున్న కుట్రలను ఎన్నికల కమిషన్ అడ్డుకోవాలని ఏపీ బీజేపీ ఎన్నికల సమన్వయకర్త పేరాల చంద్రశేఖర్ కోరారు. విజయవాడలోని బీజేపీ కార్యాలయంలో మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ బాజీతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఓటర్లను మతాల వారీగా విడదీస్తూ అధికార పార్టీ రాజకీయ లబ్ధి కోసం ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. రాష్ట్రంలో ముస్లింలు, క్రైస్తవులు పేదరికంలో మగ్గిపోవడానికి వైసీపీనే కారణమని, అట్టడుగు వర్గాలు స్వయం శక్తితో ఎదిగేందుకు నరేంద్ర మోదీ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. రాష్ట్రంలో డబులింజన్ సర్కార్ వస్తే ప్రజలకు మేలు జరుగుతుందని చెప్పారు.

పిఠాపురమే పవన్ శాశ్వత నివాసం

- ఇక్కడే సొంతిల్లు నిర్మాణం.. ప్రజలకు అందుబాటులో..
- జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగబాబు



పిఠాపురం, ఏప్రిల్ 15: పిఠాపురం నియోజకవర్గం జనసేన అధినేత పవన్ కల్యాణ్ శాశ్వత నివాస స్థలమని, ఇప్పటికే ఇక్కడ సొంత ఇంటిని నిర్మించే పనిలో ఉన్నారని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు తెలిపారు. శాసనసభ సమావేశాలు, కేంద్ర పర్యటనలు, పార్టీ కార్యకలాపాలు, సమావేశాల కోసం మినహా మిగిలిన సమయమంతా నియోజకవర్గంలోనే గడుపుతారని, ప్రజలకు అందుబాటులో ఉంటారని వెల్లడించారు. నియోజకవర్గ ప్రజలు, ఇబ్బందులు తెలుసుకునేందుకు, వినతులు స్వీకరించి వాటి పరిష్కార మార్గాలు చూపేందుకు ప్రత్యేకంగా సిబ్బందిని నియమించుకున్నట్టు వివరించారు. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం కుమారపురంలోని గోకులం గ్రాండ్‌లో సోమవారం మధ్యాహ్నం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాగబాబు మాట్లాడుతూ... దేవాలయాలు, మసీదులు, చర్చిలతో పిఠాపురం మతసామరస్యంతో శాంతికి నిలయంగా ఉందన్నారు. అష్టాదశ శక్తి పీఠాల్లో దశమ శక్తి పీఠం కొలువైఉన్న పవిత్ర ఆధ్యాత్మిక పిఠాపురంలో పవన్ పోటీకి దిగడం అదృష్టంగా భావిస్తున్నట్టు తెలిపారు. పిఠాపురాన్ని దక్షిణ కాశీగా తీర్చిదిద్దుతామన్నారు. పవన్ 15 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నారని, శాసనసభ్యుడిగా అవకాశం కల్పిస్తే చట్టసభల్లో ప్రజాగళం వినిపిస్తారని చెప్పారు. పిఠాపురం నియోజకవర్గమే కాకుండా రాష్ట్రంలో ప్రతి ఇల్లు, ప్రతి కుటుంబం కోసం పనిచేస్తారని చెప్పారు. వైసీపీ పాలనలో అన్నివర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని నాగబాబు తెలిపారు. రాష్ట్రంలో రైతులు, మహిళలు, కార్మికులు, వ్యాపారస్తులు ఎవరూ ఆనందంగా లేరని తెలిపారు. రాష్ట్రంలో 30వేల మంది మహిళలు అదృశ్యమైతే కనీసం ఆ అంశంపై సమీక్ష చేసే సమయం కూడా జగన్‌కు లేదా అని ప్రశ్నించారు. తాము ఎవరికీ నష్టం చేయబోమని, తప్పు చేసిన వారిని మాత్రం వదలబోమని స్పష్టం చేశారు. సమావేశంలో జనసేన స్టార్ క్యాంపెయినర్ సాగర్, పిఠాపురం నియోజకవర్గ జనసేన కోఆర్డినేటర్ మర్రెడ్డి శ్రీనివాస్, నాయకులు కడారి తమ్మయ్యనాయుడు, వెన్నా జగదీశ్, పిల్లా శివశకర్, వెన్నపు చక్రధరరావు, వేములపాటి అజయకుమార్, మహేందరరెడ్డి, శంకరగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జనసేన అభ్యర్థులకు రేపు బీఫారాలు

- అభ్యర్థులంతా విజయవాడ రావాలని ఆదేశం

అమరావతి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): అభ్యర్థులను ప్రకటించడంలో కొంత ఆలస్యమైనప్పటికీ.. బీఫారాలు అందించడంలో జనసేన పార్టీ దూకుడుగా ఉంది. జనసేన పార్టీ పోటీ చేస్తున్న 21 స్థానాల్లో ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించింది. వీరందరికీ బీఫారాలు ఇవ్వాలని పవన్ నిర్ణయించారు. 20 మంది అభ్యర్థులకు ఒకేసారి బీఫారాలు ఇచ్చే కార్యక్రమాన్ని బుధవారం ఉదయం మంగళగిరి పార్టీ కార్యాలయంలో నిర్వహిస్తున్నారు. అభ్యర్థులందరూ పార్టీ కార్యాలయంలో అందుబాటులో ఉండాలని సమాచారం ఇచ్చారు. పవన్ కల్యాణ్ 21 లేదా 22వ తేదీల్లో పిఠాపురంలో నామినేషన్ వేసే అవకాశం ఉంది.

గోడల మధ్య ఇరుక్కుని...

- ఆడుకుంటూ ప్రమాదం బారిన పడిన చిన్నారి
- రెండు గంటలు శ్రమించి రక్షించిన రెస్క్యూ టీం

తాడిపత్రి టౌన్, ఏప్రిల్ 15: అనంతపురం జిల్లా తాడిపత్రి మండలం ఆవులతిప్పాయపల్లి గ్రామానికి చెందిన ఏడేళ్ల చిన్నారి అవంతి ఆడుకుంటూ వెళ్లి రెండుగోడల మధ్య ఇరుక్కుపోయింది. దీంతో ముందుకు వెళ్లలేక.. వెనక్కి రాలేక విలవిల్లాడిపోయింది. చివరికి చిన్నారిని పోలీసులు, ఫైర్ సిబ్బంది సుమారు రెండు గంటలపాటు శ్రమించి రక్షించారు. గ్రామానికి చెందిన గంగరాజు కూతురు అవంతి రెండో తరగతి చదువుతోంది. పాఠశాలకు వెళ్లి వచ్చిన తరువాత సోమవారం సాయంత్రం ఇంటి సమీపంలో ఆడుకుంటూ, ఇరుకుగా ఉన్న రెండుగోడల మధ్యకు దూరి ఇరుక్కుపోయింది. సుమారు అరగంట తర్వాత స్థానికులు గమనించి, తండ్రికి, పోలీసు, అగ్నిమాపకశాఖ అధికారులకు సమాచారం అందించారు. రూరల్ సీఐ లక్ష్మీకాంత్‌రెడ్డి, ఫైర్ అధికారి మోహన్‌బాబు సిబ్బందితో వెంటనే గ్రామానికి వెళ్లారు. చిన్నారిని బయటకు తీసేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. సాధ్యం కాకపోవడంతో గ్యాస్ కట్టర్ ద్వారా గోడను కట్‌చేసి చిన్నారిని బయటకు తీశారు. చిన్నారి క్షేమంగా బయటపడటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.



పోలీసు, ఫైర్ సిబ్బంది సాయంతో బయటపడ్డ అవంతి



తిరోగమనంలో రాష్ట్రం!

నియంతృత్వ పోకడలతో ప్రజాస్వామ్యానికి చేటు

- తల్లిదండ్రుల ఆస్థి బదలాయింపునకు 6 నెలలు హైరానా
- కుమారుడివని నిరూపించుకోవాలని తహశీల్దార్ నోటీసులు
- అడుగడుగునా సర్కారు వైఫల్యం: పీవీ రమేశ్
- రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులు నిర్వీర్యం: వి.లక్ష్మణరెడ్డి
- శాంతిభద్రతల పరిస్థితి దారుణం: హైకోర్టు న్యాయవాది రవితేజ

ప్రభుత్వ అప్పులతో ఆర్థిక అసమానతలు

విజయవాడ (మొగల్రాజపురం), ఏప్రిల్ 15: రాష్ట్ర ప్రభుత్వ విధానాలు తీవ్రమైన అప్పులతో ఆర్థిక అసమానతలు పెంచుతూ ఆంధ్రప్రదేశ్‌ను తిరోగమనం వైపు తీసుకెళ్తున్నాయని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పీవీ రమేశ్ వ్యాఖ్యానించారు. 'ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి' అనే అంశంపై విజయవాడలోని పీబీ సిద్ధార్థ ఆడిటోరియంలో సోమవారం సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ ఆధ్వర్యంలో చర్చాగోష్ఠి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీవీ రమేశ్ మాట్లాడుతూ ప్రపంచం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వెనుక పరిగెడుతుంటే, మనం 19వ శతాబ్దం నాటి విషయాల వద్దే ఆగిపోయామన్నారు. పాలకుల నియంతృత్వ పోకడలు ప్రజాస్వామ్యానికి నష్టం చేస్తున్నాయన్నారు. లాటిన్ అమెరికాలోని కొన్ని దేశాలు నగదు బదిలీ పథకాలు తీసుకొచ్చి నష్టపోయాయని చెప్పారు. ప్రస్తుతం మన రాష్ట్రంలో కూడా బటన్ నొక్కి ప్రజల ఖాతాల్లోకి డబ్బులు పంపే విధానం అమలవుతోందని, దీనివల్ల రాష్ట్రం నష్టపోయే ప్రమాదం ముంచుకొస్తోందన్నారు. అధికారం అడ్డుపెట్టుకుని ప్రభుత్వ, ప్రజల ఆస్తులైన మట్టి, ఇసుక, గనులు దోచుకోవడం బాధాకరమన్నారు. అప్పులు రాష్ట్ర జీడీపీతో సమానంగా ఉండటం ఆందోళన కలిగించే అంశమని చెప్పారు. అందరూ ఓటుహక్కు వినియోగించుకుని మంచి నాయకులను ఎన్నుకోవాలని సూచించారు. రాష్ట్ర విభజన జరిగిన పదేళ్లలో పోలవరం పూర్తి చేయకపోవడం, రాజధాని నిర్మాణం ఆగిపోవడానికి పాలకుల వైఫల్యం కారణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొస్తున్న కొత్త విధానాల వల్ల వ్యవస్థలు పనిచేయలేని దుస్థితికి వచ్చాయని తెలిపారు. 'నా విషయానికి వస్తే.. మా తల్లిదండ్రుల మరణానంతరం వారి పేరిట ఉన్న ఆస్తిని నా పేరిట మార్చుకోడానికి దాదాపు ఆరు నెలల నుంచి నానా హైరానా పడాల్సి వచ్చింది మీరు ఫలానా వారి కుమారుడు అని నిరూపించుకోమని తహసీల్దార్లు, కలెక్టర్లు నోటీసులు ఇస్తున్నారు' అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. పాలకులు కోర్టు తీర్పులను కూడా లెక్కచేయని స్థితికి వచ్చారని, ప్రభుత్వ సలహాదారులు ప్రజాధనం నుంచి లక్షల రూపాయల జీతాలు తీసుకుంటూ రాజకీయ నాయకుల్లా తమ నాయకుడి కోసం పనిచేయడం మంచి పద్ధతి కాదని పేర్కొన్నారు. ఇలాంటి కారణంతోనే 1975లో అలహాబాద్ కోర్టు ఇందిరా గాంధీని ఎన్నికల్లో పోటీకి అనర్హురాలిగా ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రజలు పన్నుల ద్వారా చెల్లిస్తున్న సొమ్ముతో చేపట్టే పథకాలకు వ్యక్తుల పేర్లు పెట్టడం ఏంటని ప్రశ్నించారు. ఒక చేత్తో సంక్షేమ పథకాలను ఇస్తున్నామని చెబుతున్న పాలకులు మద్యం విక్రయాల ద్వారా మళ్లీ వసూలు చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రానికి వస్తున్న మొత్తం ఆదాయం సుమారు రూ.74వేల కోట్లు కాగా, అందులో మద్యం విక్రయాల ద్వారా రూ.22 వేల కోట్లు వస్తోందని చెప్పారు. మనరాష్ట్ర బడ్జెట్ రెండున్నర లక్షల కోట్లకు పైగా ఉందని, అప్పులు చూస్తే ఐదున్నర లక్షల కోట్లు దాటాయని తెలిపారు. చంద్రబాబు రుణమాఫీ అంటే తేలిన లెక్క రూ.80వేల కోట్లు అని, దానికి ఒక్క పైసా కూడా ఇచ్చేది లేదని అప్పటి రిజర్వ్ బ్యాంకు గవర్నర్ చెప్పారని గుర్తు చేసుకున్నారు. అప్పుడు కూడా బటన్ నొక్కే, ఆస్తులు అమ్మే అవకాశాలు ఉన్నా ఆ పని చేయలేదని, ఇతర మార్గాల ద్వారా రైతులను ఆదుకున్నామని తెలిపారు.



చర్చాగోష్ఠిలో మాట్లాడుతున్న పీవీ రమేశ్

విజయవాడకు మళ్లీ కులం రంగు..

హైకోర్టు న్యాయవాది రవితేజ మాట్లాడుతూ రాజకీయ చైతన్యం ఉన్న విజయవాడకు మళ్లీ కులం రంగు పూయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి దారుణంగా ఉందని చెప్పారు. 2022 లెక్కల ప్రకారం మహిళలపై అకృత్యాల విషయంలో రాష్ట్రంలో 25వేల కేసులు నమోదవడం ఆందోళన కలిగించే విషయమన్నారు. రూ.450 కోట్లతో అంబేడ్కర్ విగ్రహం పెట్టి ఇంకో పక్క ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టడం దారుణన్నారు. హైదరాబాద్ యూనివర్సిటీ రాజనీతిశాస్త్ర ఆచార్యుడు కొండవీటి చిన్నయసూరి మాట్లాడుతూ ప్రస్తుత రాజకీయ పార్టీలు ప్రజలను లబ్ధిదారులుగా మార్చి వారి ఓట్లతో అధికారంలోకి వస్తున్నాయని, ఇది ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. రాష్ట్రంలో ప్రతి మనిషి తలపై రూ.2 లక్షల అప్పు ఉందని, రాష్ట్రంలో ఏ రకం ఆర్థిక వ్యవస్థ అమలవుతోందో తెలియడం లేదని చెప్పారు. రాష్ట్ర విభజన తరువాత రాజధాని లేకుండా పోయిందని, అమరావతి కాదని విశాఖపట్నం అన్నారని, అక్కడ కూడా ఏమీ అభివృద్ధి చేయలేదన్నారు. సిటిజన్ ఫర్ డెమోక్రసీ సంయుక్త కార్యదర్శి వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ నేటి ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులను నిర్వీర్యం చేసిందన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో 2.5 శాతం మాత్రమే ప్రాజెక్టులకు ఖర్చు చేశారని, అక్షరాస్యతలో ఏపీ 30వ స్థానంలో ఉందని తెలిపారు. రూ.12లక్షలకోట్ల అప్పులు చేసిన ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలను నిర్లక్ష్యం చేసిందన్నారు. ప్రభుత్వ ఖజానా నుంచి గౌరవ వేతనం పొందుతున్న వలంటీర్లను విధుల నుంచి తప్పించాలని పోరాటాలు చేయాల్సి వచ్చిందన్నారు. వారంతా సేవకుల ముసుగులో అధికార పార్టీకి ప్రచారం చేస్తున్నారని చెప్పారు. ప్రముఖ న్యాయవాది పదిరి రవితేజ మాట్లాడుతూ నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరో నివేదిక ప్రకారం రాష్ట్రంలో 2017లో లక్షా 48వేల నేరాలు నమోదైతే 2022లో రెండు లక్షల నేరాలు నమోదయ్యాయని చెప్పారు. కుల ప్రాతిపదికగా ఓట్లను చీల్చే కార్యక్రమాలు చేస్తున్నారని, రాజధానిని నాశనం చేశారని ఆక్షేపించారు. చర్చాగోష్ఠిలో విజయవాడ మాజీ మేయర్ జంధ్యాల శంకర్, అఖిల భారత పంచాయతీ పరిషత్ (ఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, మానవతా సంస్థ చైర్మన్ పావులూరి రమేశ్ తదితరులు ప్రసంగించారు.

'రెడ్‌బుక్'పై సీఐడీ అదనపు మెమో

- ఏసీబీ కోర్టులో దాఖలు

విజయవాడ, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): యువగళం ముగింపు సభ సందర్భంగా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చేసిన రెడ్‌బుక్ వ్యాఖ్యలపై దాఖలు చేసిన పిటిషన్‌కు అదనంగా మరో మెమోను సీఐడీ దాఖలు చేసింది. విజయవాడలోని ఏసీబీ కోర్టులో సీఐడీ అధికారులు ఈ మెమోను సోమవారం అందజేశారు. గతేడాది డిసెంబరు 29న లోకేశ్ నిర్వహించిన విలేకరుల సమావేశాన్ని ప్రసారం చేసిన ఒక చానల్ క్లిప్పింగ్‌ను పెన్‌డ్రైవ్ ద్వారా కోర్టుకు అందజేశారు. దీనిపై న్యాయవాది గూడపాటి లక్ష్మీనారాయణ అభ్యంతరం వ్యక్తం చేశారు. సీఐడీ అధికారులు ముందుగా దాఖలు చేసిన పిటిషన్‌లో ఈ అంశం లేదని న్యాయాధికారి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కౌంటర్ దాఖలు చేయాలంటూ విచారణను న్యాయాధికారి ఈనెల 30వ తేదీకి వాయిదా వేశారు.

ఆర్థిక సంఘం నిధుల విడుదలకు ఆదేశించండి

- సీఈవోకు సర్పంచుల సంఘం వినతి

అమరావతి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ఆర్థిక సంఘం నిధులు రూ.988 కోట్లను వెంటనే గ్రామ పంచాయతీల పీఎఫ్ఎంఎస్ ఖాతాలో జమ చేసేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనాకు ఏపీ పంచాయితీరాజ్ చాంబర్, ఏపీ పంచాయితీ సర్పంచ్‌ల సంఘం కోరాయి. సోమవారం అమరావతి సచివాలయంలో ఆంధ్రప్రదేశ్ పంచాయతీ సర్పంచ్‌ల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్, ప్రధాన కార్యదర్శి బిర్రు ప్రతాప్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు లక్ష్మీ ముత్యాలు, ప్రధాన కార్యదర్శి రమేశ్ సీఈవోను కలిశారు. గ్రామీణ ప్రజలకు వేసవిలో తాగు నీరు అందించేందుకు సర్పంచుల దగ్గర నిధులు లేవని ఈసీకి తెలిపారు.

ఆ అధికారులను మార్చండి: టీడీపీ

అమరావతి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు, గుంటూరు జిల్లాల్లో ఎన్నికల అధికారుల నియామకంలో నిబంధనలు పాటించలేదని, దీనిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నేత మన్నవ సుబ్బారావు ఈసీకి ఫిర్యాదు చేశారు. సోమవారం ఈమేరకు ఆయన అమరావతి సచివాలయంలో సీఈవో ముఖేష్‌కుమార్ మీనాను కలిసి ఫిర్యాదు చేసిన అనంతరం మీడియాతో మాట్లాడారు. కోదండ రామిరెడ్డి (ఎస్డీసీ, జీఎన్ఎస్ఎస్, తిరుపతి), తిరుపతిలో జనరల్ మేనేజర్ చంద్రమౌళి, భాస్కర్ నాయుడు(స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ప్రొటోకాల్, తిరుపతి) దేవేంద్రరెడ్డి(ఎస్డీసీ, కేఆర్సీసీ, తిరుపతి), ఎంఎస్ మురళీ(స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, లీగల్ సెల్, తిరుపతి కలెక్టర్ కార్యాలయం), భాస్కర్‌రెడ్డి(పల్నాడ్ డీపీవో), శ్రీనివాసరెడ్డి(కుడా ఎండీ), విజయలక్ష్మి(మెప్మా ఎండీ)లను తక్షణమే బదిలీ చేసి స్వేచ్ఛాయుత ఎన్నికలు నిర్వహించాలని సీఈవోను కోరామని చెప్పారు.

'నైరుతి'లో వానలే వానలు..!

- ఈ సీజన్‌లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం
- దీర్ఘకాలిక సగటులో 106% నమోదయ్యే అవకాశం
- ఉత్తర, దక్షిణ, పశ్చిమ, మధ్య భారతంలో అధిక వర్షపాతం
- తూర్పు, ఈశాన్య భారతంలో సాధారణం కంటే తక్కువ..
- భారత వాతావరణ శాఖ తొలిదశ దీర్ఘకాలిక అంచనా

విశాఖపట్నం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కోట్లాది మంది రైతులకు భారత వాతావరణ శాఖ తీపి కబురు అందించింది. దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అయిన వ్యవసాయ రంగానికి ఊతమిచ్చే నైరుతి రుతుపవనాల సీజన్ (జూన్ నుంచి సెప్టెంబరు)లో ఈ ఏడాది సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదు కానుందని తెలిపింది. దీర్ఘకాలిక సగటులో 106 శాతం వర్షపాతం నమోదవుతుందని పేర్కొంది. నాలుగు నెలల నైరుతి రుతువనాల సీజన్‌కు సంబంధించి భారత వాతావరణ శాఖ (ఐఎండీ) సోమవారం తొలిదశ దీర్ఘకాలిక అంచనా బులెటిన్‌ను విడుదల చేసింది. జూన్ నుంచి సెప్టెంబరు వరకు నాలుగు నెలల దీర్ఘకాలిక సగటు (1971 నుంచి 2020 వరకు 87 సెంటీమీటర్లు)లో 106 శాతం (ఐదు శాతం అటు ఇటుగా) నమోదవుతుందని అంచనా వేసింది. దేశంలో దక్షిణ, మధ్య పశ్చిమ, ఉత్తర భారతంలో అనేక ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షాలు కురుస్తాయని, తూర్పు భారతంలో ఒడిశా, పశ్చిమబెంగాల్, జార్ఖండ్‌తోపాటు ఈ రాష్ట్రాలకు ఆనుకుని దక్షిణ ఛత్తీస్‌గఢ్, విదర్భ, మధ్యప్రదేశ్‌లోని తూర్పు ప్రాంతం, ఈశాన్య భారతంలో అనేక ప్రాంతాలు, జమ్ము కశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్‌లో సాధారణం కంటే తక్కువగా వర్షాలు కురుస్తాయని, రైస్ బెల్ట్‌గా పిలిచే గంగా మైదానంలో వర్షాలు తక్కువగా కురుస్తాయని ఐఎండీ నివేదిక స్పష్టం చేసింది. కాగా.. తాజా నివేదికపై సవరించిన బులెటిన్‌ను వచ్చే నెల చివరి వారంలో విడుదల చేయనుంది.

బలహీనపడిన ఎల్‌నినో

ఎల్‌నినో ప్రభావంతో గతేడాది నైరుతి సీజన్‌లో 868.6 మిల్లీమీటర్లకు గాను 820 మి.మీ. వర్షపాతం నమోదుతో అనేక ప్రాంతాల్లో పంటల దిగుబడి తగ్గింది. జలాశయాల్లో నీటి మట్టాలు గణనీయంగా పడిపోవడంతో పరిస్థితులు ఆందోళనకరంగా మారాయి. అయితే మధ్య పసిఫిక్ మహాసముద్రంలో గతేడాది చివరిలో సూపర్ ఎల్‌నినో ఈ ఏడాది తొలి రెండు నెలల వరకు సాగి తర్వాత క్రమేపీ బలహీనపడింది. తాజా మోడళ్ల మేరకు మధ్యపసిఫిక్ సముద్రంలో ఎల్‌నినో బలహీనపడిందని, వచ్చే నెలాఖరుకల్లా తటస్థ పరిస్థితులు ఏర్పడతాయని, నైరుతి సీజన్ రెండో భాగం (ఆగస్టు-సెప్టెంబరు)లో లానినా వస్తుందని అంచనా వేస్తున్నారు. ఇంకా హిందూమహాసముద్రంలో తటస్థంగా ఉన్న ఇండియన్ ఓషన్ డైపోల్ (ఐవోడీ) రుతుపవనాల సీజన్ చివరికల్లా పాజిటివ్‌గా మారనుంది. గత మూడు నెలల కాలంలో ఉత్తరార్ధ గోళంలో మంచు సాధారణం కంటే తక్కువగా కురిసింది. ఎల్‌నినో బలహీనపడడం, ఐవోడీ తటస్థం నుంచి పాజిటివ్ దిశగా మారడం, యురేషియాపై మంచు కవచం తక్కువగా ఉండడం వంటివి నైరుతి రుతుపవనాల సీజన్‌కు సానుకూలంగా పేర్కొంటున్నారు. కాగా, ఎల్‌నినో తర్వాత వచ్చే లానినా సంవత్సరాల్లో నైరుతి రుతుపవనాల సీజన్‌లో మంచి వర్షాలు కురుస్తాయని ఐఎండీ అంచనా వేసింది. వాతావరణ శాఖ వద్ద ఉన్న వివరాల మేరకు 1951 నుంచి 2023 వరకు తొమ్మిది పర్యాయాలు ఎల్‌నినో తర్వాత లానినా ఏర్పడిన సంవత్సరాల్లో సాధారణానికి మించి వర్షపాతం నమోదైంది. ఇదిలావుండగా నైరుతి సీజన్‌లో సాధారణ వర్షపాతం నమోదవుతుందని ప్రైవేటు వాతావరణ సంస్థ స్కైమెట్ వారం క్రితమే తొలి అంచనా నివేదిక విడుదల చేసింది.

ఎక్కువ వర్షపాతానికే అవకాశాలెక్కువ..

ఈ ఏడాది సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదుకు అవకాశాలు అధికంగా ఉండగా, లోటు వర్షపాతానికి అతి తక్కువ అవకాశాలున్నాయి. వర్షాలకు సంబంధించి అంచనా నివేదిక (ఫోర్‌కాస్ట్ ప్రాబబిలిటీ) ప్రకారం సాధారణం కంటే అత్యంత ఎక్కువ వంర్షపాతం నమోదయ్యేందుకు 30 శాతం, సాధారణం కంటే ఎక్కువగా 31 శాతం, సాధారణ వర్షపాతం నమోదయ్యే అవకాశం 29 శాతం ఉంది. సాధారణం కంటే తక్కువ నమోదయ్యే అవకాశం 8 శాతం, లోటు వర్షపాతం నమోదయ్యే అవకాశం కేవలం 2 శాతంగా ఉందని ఐఎండీ విశ్లేషించింది. క్లైమటాలజీకల్ ప్రాబబిలిటీ ప్రకారమైతే సాధారణ వర్షపాతం నమోదయ్యే అవకాశం 33 శాతం, సాధారణం కంటే తక్కువ నమోదుకు 17 శాతం, లోటు వర్షపాతం నమోదుకు 16 శాతం, సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదుకు 16 శాతం, అతిగా వర్షాలు కురిసేందుకు 17 శాతం అవకాశం ఉందని వివరించింది.

శ్రీకాకుళం మినహా రాష్ట్రంలో మంచి వర్షాలు

గతేడాది తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు ఎదుర్కొన్న రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో ఈ ఏడాది మంచి వర్షాలు కురవనున్నాయి. ఒడిశాకు ఆనుకుని శ్రీకాకుళం జిల్లాలో ఎక్కువ ప్రాంతం తప్ప రాష్ట్రంలో కోస్తా, రాయలసీమల్లోని అన్ని ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదుకానుంది. నైరుతి సీజన్‌లో ఒడిశా, దక్షిణ ఛత్తీస్‌గఢ్‌లో వర్షాభావ పరిస్థితులు కొనసాగుతాయని, బహుశా ఆ ప్రభావం శ్రీకాకుళం జిల్లాపై పడుతుందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. కాగా, నైరుతి రుతుపవనాల సీజన్‌లో వర్షాలకు బంగాళాఖాతం అత్యంత కీలకం. సీజన్‌లో బంగాళాఖాతంలో ఏర్పడే అల్పపీడనాలు/వాయుగుండాలు ఒడిశా, పశ్చిమబెంగాల్ మీదుగా తూర్పు, మధ్య భారతం అక్కడ నుంచి వాయవ్య భారతం వైపుగా పయనించడంతో వర్షాలు కురుస్తాయి. అయితే ఈ ఏడాది నైరుతి సీజన్‌లో ఒడిశా, పశ్చిమబెంగాల్, జార్ఖండ్, మధ్యప్రదేశ్‌లో తూర్పు భాగం, దక్షిణ ఛత్తీస్‌గఢ్‌లలో సాధారణం కంటే తక్కువగా వర్షపాతం నమోదు కానుందని ఐఎండీ తాజా బులెటిన్ స్పష్టం చేయడంపై వాతావరణ నిపుణులు అనేక సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. అంటే ఈ ఏడాది నైరుతి సీజన్‌లో బంగాళాఖాతం బలహీనం కానుందా..? అల్పపీడనాలు/వాయుగుండాల పరంపర తక్కువగా ఉంటుందా..? లేక బంగాళాఖాతంలో మాన్‌సూన్ తీవ్రత తగ్గుతుందా..? అన్న సందేహాలు వస్తున్నాయని పేర్కొంటున్నారు. ఒకవేళ అల్పపీడనాలు, వాయుగుండాలు బంగాళాఖాతం ముఖ ద్వారం గుండా ఉత్తరాది వైపు పయనిస్తాయా? అని సందేహం వ్యక్తంచేశారు. కాగా తాజా బులెటిన్ పరిశీలిస్తే.. ఈ ఏడాది అరేబియా సముద్రం మరింత బలపడి పశ్చిమ భారతం, దానికి ఆనుకుని మధ్య దక్షిణ భారతంలో వర్షాలకు అవకాశాలు ఉన్నాయని విశ్లేషిస్తున్నారు.

వడగాడ్పులతో జనం బెంబేలు

అమరావతి, విశాఖపట్నం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అనేక ప్రాంతాలు సోమవారం ఎండతో ఉడికిపోయాయి. వడగాడ్పులతో ప్రజలు ఠారెత్తిపోయారు. ప్రధానంగా ఉత్తర కోస్తాలో గాడ్పుల ప్రభావం ఎక్కువగా ఉంది. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు, పాలకొండ, వీరఘట్టంలో 43.9 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఉత్తర కోస్తాలో అక్కడక్కడా తేలికపాటి జల్లులు కురిశాయి. మంగళవారం మన్యం, శ్రీకాకుళం, విజయనగరం, అల్లూరి, అనకాపల్లి, తూర్పుగోదావరి, ఏలూరు జిల్లాల్లోని 63 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు వీచే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. అలాగే శ్రీకాకుళం నుంచి పల్నాడు వరకు 130 మండలాల్లో ఓ మోస్తరు వడగాడ్పులు ఉంటాయని పేర్కొంది. ఉత్తర కోస్తాలో వడగాడ్పులు వీస్తాయని, రాయలసీమ, దక్షిణకోస్తాలో వేడి వాతావరణం కొనసాగుతుందని వాతావరణ శాఖ తెలిపింది.

ఎన్డీయే కూటమిని గెలిపించండి

- ముస్లింలకు ఎంఏ షరీఫ్ పిలుపు

అమరావతి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ముస్లింలకు తీరని అన్యాయం చేసిన జగన్‌రెడ్డికి ఈ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాల్సిన బాధ్యత ముస్లిం మైనార్టీలపై ఉందని శాసన మండలి మాజీ చైర్మన్ ఎంఏ షరీఫ్ అన్నారు. ముస్లింలకు అన్నివిధాలా అండగా నిలిచే ఎన్డీయే కూటమికి ఓటేసి గెలిపించాలని అన్నారు. సోమవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ముస్లిం మైనార్టీ నాయకులు భేటీ అయ్యారు. ఐదేళ్లుగా ముస్లింలు పడుతున్న బాధలు తొలగాలంటే ఎన్డీయే కూటమికి మద్దతు పలకాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా షరీఫ్ మాట్లాడుతూ జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ముస్లిం మైనార్టీలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. టీడీపీ అమలు చేసిన సంక్షేమ పథకాలను నిలిపివేసి, ముస్లింలను అణగదొక్కే ప్రయత్నం చేశాడన్నారు. వక్ఫ్ భూముల్ని వైసీపీ నేతలు కబ్జా చేశారని, ఇమామ్, మౌజన్‌లకు గౌరవ వేతనం ఇవ్వలేదని చెప్పారు. ముస్లింమైనార్టీలంతా ఏకమై జగన్‌రెడ్డి ప్రభుత్వాన్ని గద్దె దించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు.

జగన్‌ను చిత్తుగా ఓడిస్తాం: నిరుద్యోగ జేఏసీ

అమరావతి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): జాబ్ క్యాలెండర్ పేరుతో నిరుద్యోగులకు జగన్ చేసిన గాయం మర్చిపోలేదని, ఈ ఎన్నికల్లో వైసీపీని చిత్తు చిత్తుగా ఓడిస్తామని నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ షేక్ సిద్ధిక్ హెచ్చరించారు. గుడివాడ వైసీపీ బహిరంగ సభలో చంద్రబాబును ఉద్దేశించి సీఎం జగన్ చేసిన వ్యాఖ్యలపై సిద్ధిక్ స్పందిస్తూ.. 'అయ్యా ముఖ్యమంత్రి గారూ! ఏటా జాబ్ క్యాలెండర్. 2.30 లక్షల ఉద్యోగాల భర్తీ. ఏటా 6,500 పోలీసు ఉద్యోగాలు. మెగా డీఎస్సీ పేరుతో దగా చేసింది నువ్వు. అందుకే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓడించాం. ఈ ఎన్నికల్లో కూడా వైసీపీని చిత్తు చిత్తుగా ఓడిస్తాం' అని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఐసీఏఐతో పన్నుల శాఖ ఒప్పందం

అమరావతి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ)తో రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ రెండేళ్ల కాలపరిమితితో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందంలో భాగంగా ఐసీఏఐ నాలెడ్జ్ పార్టనర్‌గా వ్యవహరిస్తూ పన్నుల శాఖలోని సిబ్బందికి శిక్షణ, సాంకేతిక సహాయం, మానవ వనరుల అభివృద్ధి, పరిశోధన, విధాన నిర్ణయాల్లో సలహాలు అందజేస్తుందని పన్నుల శాఖ అధికారులు తెలిపారు. రాష్ట్ర పన్నుల శాఖ కార్యాలయంలో సోమవారం వర్చువల్‌గా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఐసీఏఐ తరఫున సెక్రటరీ జయకుమార్ బాత్ర, జీఎస్టీ, పరోక్ష పన్నుల కమిటీ చైర్మన్ సుశీల్ కుమార్ గోయెల్, వైస్ చైర్మన్ రాజేంద్ర కుమార్, గుంటూరు బ్రాంచ్ ప్రెసిడెంట్ అమరనాథ్, వైస్ ప్రెసిడెంట్ రఘు, మాజీ ప్రెసిడెంట్ రవితేజ, రాష్ట్ర పన్నుల శాఖ తరఫున చీఫ్ కమిషనర్ గిరిజా శంకర్, కమిషనర్ డి.రమేశ్, విజయవాడ రీజనల్ ఆఫీసర్ కృష్ణ మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కారుపై ఎర్రిస్వామి మృతదేహం

బైకును ఢీకొట్టి.. మృతదేహంతో ముందుకు..

- 18 కి.మీ. వరకు నడుస్తున్న కారుపైనే మృతదేహం
- అనంతలో ఇన్నోవా డ్రైవర్ ఘాతుకం

ఆత్మకూరు ఏప్రిల్ 15: ఇన్నోవా కారులో అతివేగంగా వెళుతూ ఓ బైకును ఢీకొట్టాడు. ఆ ఉదుటుకు ద్విచక్రవాహనంపై ఉన్న వ్యక్తి ఎగిరి ఇన్నోవాపై పడి ప్రాణాలు కోల్పోయాడు. దీన్ని పట్టించుకోకుండా కారును డ్రైవర్ అలాగే 18 కిలోమీటర్ల దూరం ముందుకు దూసుకుపోయాడు. ఈ దారుణ ఘటన అనంతపురం జిల్లాలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. మృతిచెందిన వ్యక్తిని జిన్నే ఎర్రిస్వామి(35)గా గుర్తించారు. పోలీసుల కథనం మేరకు.. కూడేరు మండలం చోళసముద్రానికి చెందిన జిన్నే ఎర్రిస్వామి(35)కి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆయన అనంతపురంలో మెకానిక్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అత్తవారి ఊరు సిద్ధరాంపురానికి వచ్చిన ఆయన, ఆదివారం రాత్రి తిరుగు ప్రయాణమయ్యాడు. ఆత్మకూరు మండలం వై.కొత్తపల్లి వద్దకు చేరుకోగానే అనంతపురం వైపు నుంచి వేగంగా దూసుకువచ్చిన ఇన్నోవా.. ఎర్రిస్వామి బైకును ఢీకొట్టింది. దీంతో ఎర్రిస్వామి ఎగిరి ఇన్నోవాపై పడ్డాడు. అయినా తన వాహనాన్ని ఆపకుండా డ్రైవర్ ముందుకు వెళ్లిపోయాడు. ఈ ప్రమాదాన్ని గమనించిన మరో వాహనదారుడు.. ఇన్నోవాను వెంబడించి ఓవర్‌టేక్ చేశాడు. బెళుగుప్ప మండలం హనిమిరెడ్డిపల్లికి వేగంగా చేరుకుని.. స్థానికులను అప్రమత్తం చేశాడు. అక్కడున్న గొర్రెల కాపరులు, స్థానికులు రోడ్డుపైకి వచ్చి.. ఇన్నోవా రాగానే కేకలు వేశారు. దీంతో భయపడిన డ్రైవర్.. ఇన్నోవాను నిలిపి పారిపోయాడు. ఆత్మకూరు పోలీసులు ప్రమాదానికి కారణమైన వాహనాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇన్నోవా కర్ణాటకకు చెందినదని, రికార్డుల్లో ఉన్న ఓనర్‌ను సంప్రదిస్తే.. తాను కారును షోరూమ్ వారికి అమ్మేశానని తెలిపాడని పోలీసులు చెప్పారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌ను పట్టుకుంటామన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

చెల్లుకు చెల్లు!

ముప్పైమూడేళ్ళ తరువాత ఇజ్రాయెల్‌మీద నేరుగా దాడిచేసిన మొదటి సార్వభౌమ దేశంగా ఇరాన్ ఆదివారం రికార్డులకు ఎక్కింది. వందలాది క్షిపణులు, డ్రోన్లు ఇజ్రాయెల్‌మీద పంపి పక్షంరోజుల క్రితం తాను చేసిన శపథాన్ని నిలబెట్టుకుంది. అసలే లేవనివి, చివరిదాకా సాగనివి, పేలనివి, మార్గమధ్యంలోనే కూలినవి పోను గట్టిగా ఓ డజను క్షిపణులు కూడా ఇజ్రాయెల్‌ను తాకలేదని వార్తలు వచ్చాయి. పదేళ్ళబాలిక గాయపడిందని, సైనికులు, యుద్ధవిమానాలు లేని ఓ చిన్న మిలటరీబేస్ ధ్వంసమైందని తప్ప, పెద్దగా విధ్వంసం జరిగినట్టు దాఖలాలులేవు. ఇన్నేళ్ళకు, అంత తెగించి, ఇంతభారీగా చేసిన దాడి చివరకు ఇలా పరిణమించడం ఆశ్చర్యం. ఇజ్రాయెల్ ఆయుధసంపత్తి, దాని ఆత్మరక్షణ సామర్థ్యం, అగ్రరాజ్యాలు దానికి ఇప్పటికే అందించిన, అందిస్తున్న ఆర్థిక, సాంకేతిక సహాయం ఎంత హెచ్చుస్థాయిదో ఇరాన్‌కు తెలియనిదేమీ కాదు. ఆగర్భశత్రువుమీద కక్షతీర్చుకొనే తమ లక్ష్యం నెరవేరిందని, ఆపరేషన్ ముగిసిందని ఇరాన్ వెంటనే ప్రకటించేయడం చూసినప్పుడు, ఇది ప్రతీకాత్మక దాడేకానీ, నిజంగా ప్రతీకారం కాదేమోనని చాలామందికి అనుమానం కలిగింది.

అమెరికా, బ్రిటన్, జోర్డన్ తదితర దేశాల సాయంతో ఈ దాడిని ఇజ్రాయెల్ విజయవంతంగా తిప్పికొట్టింది. అగ్రరాజ్యాల సమస్త రక్షణ వ్యవస్థలు చక్కని సమన్వయంతో పనిచేశాయి. ఈనెల ఒకటిన సిరియా రాజధాని డమాస్కస్‌లోని ఇరాన్ కాన్సులేట్ భవనంమీద క్షిపణి దాడిచేసి, రివల్యూషనరీ గార్డ్స్ అత్యున్నతస్థాయి కమాండర్లతో సహా పన్నెండుమందిని ఇజ్రాయెల్ చంపివేయడం, ప్రతీకారం తీర్చుకొని తీరుతానని ఇరాన్ హెచ్చరించడం తెలిసినవే. గాజాయుద్ధం అత్యంత అమానవీయమైన స్థాయికి చేరుకున్న ప్రస్తుతస్థితిలో, తనకు జరిగిన ఈ అవమానానికి ఇరాన్ ఈమారు కచ్చితంగా ప్రతీకారం తీర్చుకుంటుందని చాలామంది విశ్వసించారు. ప్రతీకార దాడికి ఇరాన్ సన్నాహాలు ఆరంభించిదంటూ అమెరికానుంచి ఇజ్రాయెల్‌కు పదిరోజుల క్రితమే సమాచారం అందడంతో పాటు, ఇజ్రాయెల్‌ను కాపాడటంకోసం అగ్రరాజ్యాలు తమ ఆయుధ సంపత్తిని పశ్చిమాసియాకు హడావుడిగా తరలించిన విషయం తెలిసిందే. ఇక, తమ పొరుగుదేశాలకు ఈ దాడికి సంబంధించి డెబ్బయ్‌రెండు గంటల ముందస్తు సమాచారాన్ని అందచేశామని ఇరాన్ రక్షణమంత్రి తెలియచేశారు కూడా. ఈ ప్రతీకారదాడి అనూహ్యమైనది కాకపోవడంతో ఇజ్రాయెల్, దానిమిత్రదేశాలకు ఆత్మరక్షణకు తగినంత సమయం లభించింది.

ఎంత రెచ్చగొట్టినా, ఇరాన్ నేరుగా ఇజ్రాయెల్‌మీద దాడికిదిగదన్న భ్రమలు ఈ ఘటనతో తొలగిపోయాయి. జరిగినదానికి ఆగ్రహంతో ఇజ్రాయెల్ కచ్చితంగా ఇరాన్‌మీద విరుచుపడుతుందని కొందరి నమ్మకం. ప్రతీకారం తథ్యమని ఇజ్రాయెల్, సహకారం ఖాయమని అమెరికా బయటకు ప్రకటిస్తున్నప్పటికీ, ఇరాన్‌తో కయ్యానికి దిగినపక్షంలో తాను ఏ మాత్రం రక్షించబోనని ఇజ్రాయెల్‌కు అమెరికా తేల్చేసింది. అమెరికా పాలకుడుగా ఎవరున్నా ఇజ్రాయెల్ పక్షాన నిలవడం తప్పదు కానీ, నెతన్యాహూను గుడ్డిగా వెనకేసుకొస్తూ, గాజాయుద్ధాన్ని అమెరికా యథేచ్ఛగా అనుమతించడం బైడెన్‌కు స్వదేశంలో చెడ్డపేరుతెస్తోంది. సంప్రదాయ డెమోక్రాట్ ఓటుబ్యాంకులోనే అసమ్మతి పెరుగుతోంది. ఈ నేపథ్యంలో, ఇరాన్ దాడికి ఇజ్రాయెల్ ప్రతీకారం తీర్చుకున్న పక్షంలో అది పశ్చిమాసియాకు మాత్రమే పరిమితం కాదు. అమెరికా దిగితే తానూ రంగప్రవేశం చేస్తానని రష్యా అంటోంది. గాజాయుద్ధం ప్రపంచాన్ని చుట్టుముడుతుందన్న భయాలు నిజమవుతాయి. ఈ నేపథ్యంలో ఇజ్రాయెల్‌కు ముకుతాడు వేయాల్సిన అవసరం, బాధ్యత అమెరికాకు ఉన్నాయి. ఇరాన్ దాడి నిజానికి సంపూర్ణంగా విఫలమైనప్పటికీ, స్వదేశంతోపాటు చాలా ఇస్లామిక్ దేశాల ప్రజలకు అది ఆత్మసంతృప్తిని మిగల్చింది. గాజాలో మారణహోమానికి పాల్పడుతున్న ఇజ్రాయెల్‌కు ఆ మాత్రం గుణపాఠం చెప్పినందుకు వారంతా సంతోషిస్తున్నారు. చెల్లుకు చెల్లు ఇక చాలు అని ఇరాన్ కూడా అంటోంది. కానీ, నెతన్యాహూ అధికారకూటమిలోని పార్టీలన్నీ ప్రతీకారం పేరిట ఆవేశంతో ఊగిపోతున్నాయని వార్తలు వస్తున్నాయి. ఆర్నెల్ల యుద్ధంలో ముప్పైమూడువేలమంది పాలస్తీనియన్లను ఊచకోతకోయడం, గాజాను నేలమట్టంచేయడం వినా నెతన్యాహూ సాధించిందేమీ లేదు. బందీలను విడిపించలేదు, హమాస్ నాయకత్వం నాశనం కాలేదు, యుద్ధం లక్ష్యాలన్నవేవీ నెరవేరలేదు. హమాస్ దాడికి ప్రతీకారం పేరిట గాజాలో సాగిస్తున్న మారణకాండకు స్వస్తిచెప్పి కాలువెనక్కుతీసుకొనేందుకు ఇజ్రాయెల్ ఇప్పటికైనా సిద్ధపడాలి.

జనసంకల్పమే మోదీ గ్యారంటీ

ప్రజలు తిరస్కరించిన రాజకీయ పార్టీలలో ప్రధానమైనది కాంగ్రెస్. గత రెండు ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఘోరంగా ఓడించారు. కాంగ్రెస్ ఇప్పుడు దేశంలో కేవలం రెండు రాష్ట్రాలకు పరిమితమైన పార్టీ. 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ బీజేపీని ముఖాముఖి 190 స్థానాల్లో ఎదుర్కొన్నది. బీజేపీ 175 స్థానాల్లో విజయం సాధించగా కేవలం 15 స్థానాల్లో మాత్రమే బొటాబొటి ఓట్ల ఆధిక్యతతో కాంగ్రెస్ గెలిచింది. దాదాపు 224 లోక్‌సభ స్థానాల్లో బీజేపీ 50 నుంచి 70 శాతం వరకు ఓట్లు సాధించింది. ఈ గణాంక వివరాలను చూస్తే ఏమి అర్థమవుతుంది? కాంగ్రెస్ పార్టీ బీజేపీ దరిదాపుల్లో కూడా రాలేదని స్పష్టమవుతుంది. అలాంటి పార్టీ ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టోకు ఏమి విలువ ఉంటుంది? దాదాపు 6 దశాబ్దాల పాటు ఈ దేశాన్ని ఏలినప్పటికీ కోట్లాది ప్రజలను దారిద్ర్యం నుంచి విముక్తి కలిగించలేకపోయిన పార్టీ ఇప్పుడు సామాజిక న్యాయం చేస్తామని ప్రగల్భాలు పలుకుతోంది. కుటుంబ వారసులు, అవినీతిపరులు, అక్రమార్జనపరులు, పదవికోసం నానా గడ్డి కరిచేవారున్న కాంగ్రెస్ పార్టీ ఈ దేశంలో ఆరుదశాబ్దాల పాటు ప్రజలను కులాలుగా, మతాలుగా చీల్చి పబ్బం గడుపుకుంది. అలాంటి పార్టీ చేసే వాగ్దానాలను ప్రజలు పట్టించుకునే అవకాశమే లేదు.



■ వై. సత్యకుమార్

సత్యకాలమ్

భారతీయ జనతా పార్టీకి ఇలాంటి ఓటు బ్యాంకు రాజకీయాలు చేయాల్సిన అవసరం లేదు. ఎందుకంటే బీజేపీ ఎన్నికల మేనిఫెస్టోకు ఉన్న విశ్వసనీయత వేరు. ఎన్నికల ప్రణాళిక అనేది బీజేపీకి ఒక సైద్ధాంతిక పత్రం. ప్రజలను గౌరవించే ప్రమాణ పత్రం. ఒక దృఢ సంకల్పం. అందుకే రానున్న అయిదు సంవత్సరాల్లో బీజేపీ తాను అమలు చేసే కార్యక్రమాలను ఎన్నికల ముందు ప్రజలకు సంకల్పపత్రం రూపంలో తెలిపింది. సంకల్పం అంటే హామీలకు మించింది. రానున్న అయిదు సంవత్సరాల్లో ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్‌ను మార్చేందుకు బీజేపీ కంకణం కట్టుకుంది. అవినీతిపై పోరును మరింత తీవ్రతరం చేస్తామని ప్రకటించింది. రాబోయే తరం కోసం సంస్కరణలను అమలు చేసి వివిధ రంగాల్లో అభివృద్ధిని కొత్త పుంతలు తొక్కిస్తామని స్పష్టం చేసింది. అనేక ప్రజా అనుకూల నిర్ణయాలను తీసుకుంటానని తెలిపింది. 2047 కల్లా భారత్‌ను అగ్రరాజ్యంగా మార్చేందుకు ఒక్క క్షణం వృథా చేయకుండా అధికారంలోకి వచ్చిన వెంటనే చర్యలు ప్రారంభిస్తామని తెలిపింది. వివిధ వర్గాలకు మోదీ గ్యారంటీ పేరుతో తాము తీసుకోబోయే చర్యలనన్నీ ఈ మేనిఫెస్టోలో ప్రకటించింది.

బీజేపీ తాను వాగ్దానం చేసిన వాటిలో అనేకం అమలు చేసింది. కశ్మీర్‌ను భారతదేశం నుంచి విడదీసి ప్రత్యేక ప్రతిపత్తి కల్పించిన ఆర్టికల్ 370ను రద్దుచేసి కశ్మీర్‌ను మన దేశంలో అంతర్భాగం చేస్తామని బీజేపీ కొన్ని దశాబ్దాలుగా చెబుతూ వస్తోంది. పూర్తి మెజారిటీతో అధికారంలోకి వచ్చిన తర్వాత బీజేపీ ఆర్టికల్ 370ను రద్దు చేసింది. ఉమ్మడి పౌర స్మృతి దిశగా చర్యలు ప్రారంభించి ట్రిపుల్ తలాఖ్‌ను రద్దుచేసింది. అయోధ్యలో శ్రీరాముడు జన్మించిన చోటే రామ మందిరం నిర్మించి తీరతామని బీజేపీ ఎప్పుడో వాగ్దానం చేసింది. ఆ కల నెరవేరి ఈ ఏడాది జనవరిలోనే అయోధ్యలో భవ్యమైన రామ మందిరం వెలిసింది. ఉగ్రవాదం, నక్సలిజంపై బీజేపీ ఏ మాత్రం సహించని వైఖరిని అవలంబించినందువల్లే ఇవాళ దేశం ఈ దుష్టశక్తులనుంచి ఊపిరి పీల్చుకుంటోంది. కాలం చెల్లిన చట్టాలను రద్దు చేసి దేశాభివృద్ధికి తగ్గ అధునాతన చట్టాలను ప్రవేశపెట్టింది. బ్రిటిష్ కాలపు వలస పాలనను ప్రతిబింబించే నేర శిక్షాస్మృతి స్థానంలో సమగ్రమైన భారతీయ నేర సంహితను ప్రవేశపెట్టింది. ఆర్థికంగా బలహీనంగా ఉన్న 5 దేశాల్లో ఒకటిగా ఉన్న భారత్ ఇప్పుడు ఆర్థికంగా బలోపేతమైన 5 దేశాల్లో ఒకటిగా మారింది. మోదీ హయాంలో 25 కోట్లమంది పేదలు దారిద్ర్య రేఖను దాటిపోయారు. రైతులు, మహిళలు, మత్స్యకారులు, వీధి వ్యాపారులు, చిన్న వ్యాపార సంస్థలు, ఎస్సీ, ఎస్టీ, ఆదివాసీల జీవితాల్లో చెప్పుకోదగ్గ మార్పులు కనపడుతున్నాయి. గత పది సంవత్సరాల్లో రైతులకు కనీస మద్దతు ధరలు భారీ ఎత్తున పెరిగాయి. అంతర్జాతీయ ధరలతో నిమిత్తం లేకుండా ఎరువులు చవక ధరల్లో లభిస్తున్నాయి. ఇవన్నీ బీజేపీ తన ఎన్నికల మేనిఫెస్టోల్లో ప్రకటించి మరీ అమలు చేసింది. మోదీ ప్రభుత్వం గత పదేళ్లుగా తీసుకుంటున్న చర్యలను వేగవంతం చేసేందుకే ఈ మేనిఫెస్టోను రూపొందించారు. పదేళ్ల క్రితం మోదీ అధికారంలోకి వచ్చిన సమయంలో దేశమంతా నిరాశా నిస్పృహలు నెలకొనివున్నాయి. మోదీ తొలి హయాంలో ఈ నిరాశా నిస్పృహలు తొలగిపోయి దేశం ఆర్థికంగా బలోపేతం కాగలదనే విశ్వాసం బలపడింది. గత అయిదేళ్లలో ఈ విశ్వాసం ఆత్మవిశ్వాసంగా మారింది. దేశంలో నిరంతరం సంక్షేమ పథకాలు కొనసాగుతాయని, మౌలిక సదుపాయాల నిర్మాణం, అభివృద్ధి వేగంగా అమలవుతాయని, యువకులు, మహిళలు, మధ్యతరగతి, అణగారిన వర్గాలకు అవకాశాలు పెరుగుతూనే ఉంటాయని ఒక స్పష్టత వచ్చింది. ఆధునిక భారతానికి అనుగుణంగా అన్ని వర్గాల ప్రజలకూ ఒకే పౌర స్మృతి కొనసాగుతుందని, స్త్రీపురుషుల మధ్య సమానత్వం ఏర్పడుతుందని ఆశాభావం కలిగింది. ప్రతి ఏడాది దేశంలో ఎక్కడో ఒక చోట ఎన్నికలు జరిగి వేల కోట్లు ఖర్చయ్యే దుస్థితి పోయి ప్రతి ఐదేళ్లకూ ఒకేసారి దేశమంతటా అన్ని స్థాయిల్లో జమిలి ఎన్నికలు జరుగుతాయని అందరికీ స్పష్టమైపోయింది.



ఎన్నికల ప్రణాళిక అనేది బీజేపీకి ఒక సైద్ధాంతిక పత్రం. ప్రజలను గౌరవించే ప్రమాణ పత్రం. ఒక దృఢ సంకల్పం. అందుకే రానున్న అయిదు సంవత్సరాల్లో బీజేపీ తాను అమలు చేసే కార్యక్రమాలను ఎన్నికల ముందు ప్రజలకు సంకల్ప పత్రం రూపంలో తెలిపింది. వివిధ వర్గాలకు మోదీ గ్యారంటీ పేరుతో తాము తీసుకోబోయే చర్యలనన్నీ ఈ మేనిఫెస్టోలో ప్రకటించింది. బీజేపీ సంకల్పం అంటే ప్రజల సంకల్పం. మోదీ గ్యారంటీ అంటే జనం ఆత్మవిశ్వాసం.

ఈ పదేళ్లుగా ప్రధాని మోదీ పనితీరు ఆధారంగానే బీజేపీ ఇవాళ అత్యంత ఆత్మవిశ్వాసంతో తన సంకల్ప పత్రాన్ని ప్రజల ముందు ప్రకటించింది. వచ్చే పాతికేళ్లలోపు దేశంలో మార్పులు ఏమి జరుగబోతాయో ప్రకటించింది. గ్రామాల్లో పెద్ద ఎత్తున వ్యవసాయ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను అమలు చేసేందుకు 'కృషి మౌలిక సదుపాయాల మిషన్'ను ప్రకటించింది. వృద్ధులకు ఉచితంగా, నాణ్యమైన వైద్య సదుపాయాలు కల్పించేందుకు ఆయుష్మాన్ భారత్ యోజనను విస్తరిస్తామని తెలిపింది. 2029 వరకు దేశంలో 80 కోట్ల మంది భారతీయులకు ఉచితంగా ఆహార ధాన్యాల సరఫరా కొనసాగుతుందని తెలిపింది. దేశంలోని అన్ని ప్రధాన నగరాలకు పైప్ ద్వారా గ్యాస్‌ను అందిస్తామని తెలిపింది. ముద్రా రుణాలను రూ.20 లక్షల మేరకు రెట్టింపు చేస్తామని ప్రకటించింది పేద కుటుంబాలకు పిఎం సూర్య ఘర్ ముఫ్తి బిజ్లీ యోజన క్రింద ఉచిత విద్యుత్ కూడా అందిస్తామని తెలిపింది.

కాంగ్రెస్ పార్టీలో కొందరు తమను తాము మేధావులు అనుకునేవారు ప్రజలను భ్రమింపచేసేందుకు అందమైన పదాలతో వాగ్దానాలను రూపొందించి మేనిఫెస్టోలో చేరుస్తారు. బీజేపీలో అలా జరగదు. బీజేపీ తన మేనిఫెస్టో కోసం ప్రజలనుంచి సూచనలు కోరింది. దాదాపు 11 లక్షల మంది ప్రజలు తమ సూచనలు చేశారు. 4 లక్షల మంది నమో ఆప్ ద్వారా తమ ఆలోచనలను పంచుకున్నారు. వీటన్నిటినీ దాదాపు 50 మందికి పైగా బీజేపీ కేంద్ర మంత్రులు, పార్టీ నేతలు రెండు నెలల పాటు క్రోడీకరించి సంకల్ప్ పత్రాన్ని రూపొందించారు. అందుకే బీజేపీ సంకల్పం అంటే ప్రజల సంకల్పం. మోదీ గ్యారంటీ అంటే జనం ఆత్మవిశ్వాసం.

(బీజేపీ జాతీయ కార్యదర్శి)

దక్షిణాదికి పొంచి ఉన్న ప్రమాదం!

దేశంలోని ఉత్తర–దక్షిణ తేడాలు అందరికీ తెలిసినవే. భాష, సంస్కృతుల్లో ఇవి కొట్టొచ్చినట్లు కనపడతాయి. రవాణా సౌకర్యాలు మెరుగుపడి రాకపోకలు పెరిగిన తర్వాత అవి ఇంకా బాగా తెలిసొచ్చాయి. ఈ తేడాలు ఆధారంగానే ద్రవిడవాదం తలెత్తింది. భాషల తులనాత్మక పరిశీలనను దేశ చరిత్రలో కీలక ఘట్టంగా చెప్పుకోవాలి. ఉత్తర, దక్షిణ భాషల విభిన్నత అప్పుడే బాగా తెలిసింది. ఈ రెండింటి పుట్టుక వేరనీ అప్పుడే స్పష్టమైంది. సంప్రదాయ పండితుల ఆలోచనలు వీటికి పూర్తి విరుద్ధంగా ఉండేవి. భాషలన్నీ సంస్కృతం నుంచే వచ్చాయని గట్టిగా నమ్మేవారు. సంస్కృత సంప్రదాయాలు, ఆలోచనల ప్రభావం శతాబ్దాల పాటు బలంగా కొనసాగింది. అందుకే దక్షిణాది భాషలకు సొంత మూలాలు ఉన్నాయన్న భావన సంప్రదాయ పండితులకు తట్టలేదు. తట్టినా సంస్కృతాన్ని దైవభాషగా భావించటం వల్ల దాన్ని పట్టించుకోలేదు.

భాషల పరిశీలన వల్ల మరో సంగతి వెల్లడైంది. సంస్కృతానికి కొన్ని యూరోపు భాషలకున్న బంధం బయటపడింది. ఆ బంధం ఇతర విషయాల పరిశోధనకు దారి తీసింది. ఆర్యుల స్థానికత గుట్టును తెలిపింది. వారి వలసల చరిత్ర వెలుగులోకి వచ్చింది.. భారత్‌కు వారెప్పుడు తరలి వచ్చారో స్థూలంగా వెల్లడైంది. ఇవన్నీ ఇప్పుడు అందరికీ తెలిసిన సాధారణ విషయాలు. కానీ ఆర్యులరాక ఒకప్పుడు ఎన్నో సంచలనాలకు కారణమైంది. 100–150 ఏళ్ల క్రితం అది సృష్టించిన ప్రభావం ప్రగాఢమైంది. చరిత్ర పరిశోధనలో తేలిన ప్రతి ఘట్టాన్నీ సమకాలీన అవసరాల కోసం వాడుకోవటం అన్నిచోట్లా జరిగింది. దక్షిణాదిన పలురంగాల్లో ఆనాడు నెలకొన్న బ్రాహ్మణ ఆధిక్యతపై ఆగ్రహంగా ఉన్న వర్గాలకు ఆర్యవలస సిద్ధాంతం అలాగే ఉపకరించింది. బ్రాహ్మణ ఆధిపత్యాన్ని సమర్థించటానికి కావాల్సిన సిద్ధాంతాలు సంస్కృతంలో పుష్కలంగా ఉన్నాయి. దాన్ని వ్యతిరేకించే వర్గాలకు బలమైన సిద్ధాంతం ఒకటి కావాలి. ఎక్కడ నుంచో వచ్చిన ఆర్యులు ఉత్తరాదిలో ఒకనాడు ఉండే ద్రవిడులను తరిమేశారనే సిద్ధాంతం అట్లా బ్రాహ్మణ ఆధిక్యతను ఎదుర్కొనే సాధనంగా పరిణమించింది. ఆ తర్వాత ద్రవిడ దృక్కోణం నుంచి చాలా వ్యాఖ్యానాలు వచ్చాయి. మూలవాసులనూ, ద్రవిడులనూ, వాళ్ల సంస్కృతులనూ, భాషలనూ ఆర్యులు అణచివేశారనే భావనే ఇందులో ప్రధానమైంది. ఈ అణచివేతల్లో నిజానిజాలెంత ఉన్నా ఒకటి మాత్రం చారిత్రక వాస్తవం. ఆర్యుల వలసలపై చరిత్రకారులు, పురావస్తు శాస్త్రవేత్తల మధ్య ఏకాభిప్రాయం ఉంది. హిందుత్వవాదులు మాత్రం దీన్ని అంగీకరించరు. విదేశీగడ్డ నుంచి వచ్చిన వారివల్లే వేద సమాజం ఏర్పడిందని అంగీకరిస్తే హిందూమత స్వదేశీయతకు అర్థం లేకుండా పోతుంది. ఆర్యుల వలసలపై అంగీకారమున్నా ద్రవిడులను దక్షిణాదికి నెట్టివేశారనే ప్రతిపాదనను చరిత్రకారులు ఇప్పుడు అంగీకరించటం లేదు. ఆర్య–ద్రవిడ వైషమ్య దృష్టి నుంచి గతాన్ని చూడటమూ తగ్గిపోయింది. కానీ వందేళ్ల కిందట ఈ దృష్టితోనే దక్షిణాదిలో ఆత్మగౌరవ ఉద్యమాలు ఊపిరులు పోసుకున్నాయి. జ్యోతిరావు పూలే, రామస్వామి నాయకర్ సిద్ధాంతాలు అలా మొగ్గతొడిగినవే.

వీటిని కాసేపు పక్కనపెట్టి సమకాలీన చిత్రాన్ని చూద్దాం. ఒకనాటి ఆర్య–ద్రవిడ వివాదంతో సంబంధం లేకుండా ఉత్తరాది–దక్షిణాది మధ్య ఇప్పుడు కొత్త విభజనలు పొడచూపుతున్నాయా? అని ప్రశ్నించుకుంటే అవుననే జవాబు చెప్పాలి. అభివృద్ధిపరంగా రాష్ట్రాల మధ్యన తలెత్తిన



అమృతకాలంలో కచ్చితంగా జరగాల్సింది నిజమైన వికేంద్రీకరణ. జరుగుతున్నది మాత్రం పక్కా కేంద్రీకరణ. పన్నుల విధింపు అధికారం కేంద్ర ప్రభుత్వ అధికారానికి ఆయువుపట్టు. జీఎస్టీతో ఆ పట్టు మరింతగా పెరిగింది. రాష్ట్రాలకు సొంత వనరులను గణనీయంగా సమీకరించుకునే అధికారమే అసలైన సమాఖ్య అస్తిత్వానికి నిదర్శనం. అధికార కేంద్రీకరణ ఆగకపోతే ప్రస్తుతం ఉత్తరాది–దక్షిణాది మధ్య రేగుతున్న వివాదాలు మరోచోటా కనపడొచ్చు!

వ్యత్యాసాలు, కేంద్ర ప్రభుత్వం చేతిలో విపరీత అధికారాల కేంద్రీకరణ, ఉత్తరాదిని దృష్టిలో పెట్టుకుని రూపొందిస్తున్న విధానాలను దక్షిణాదిపై బలవంతంగా రుద్దటం, దక్షిణాది నుంచి ఉత్తరాదికి భారీగా ఆదాయం తరలి వెళ్లటం, లోక్‌సభలో దక్షిణాది సీట్లు తగ్గిపోయే ప్రమాదం పొంచి ఉండటం లాంటి అంశాలు ప్రధానంగా వీటికి దోహదం చేస్తున్నాయి. 'సౌత్ వర్సస్ నార్త్: ఇండియాస్ గ్రేట్ డివైడ్' పేరుతో ఆర్.ఎస్. నీలకంఠన్ రాసిన పుస్తకం కూడా అదే కోవలోది.

విద్య, ఆరోగ్యాల్లో దక్షిణాది రాష్ట్రాలు ఉత్తరాదితో పోల్చితే పురోగతిని సాధించాయి. ఈ ప్రగతి జనాభా పెరుగుదలను బాగా ప్రభావితం చేసింది. చదువుకున్న మహిళలకు పుట్టే పిల్లల సంఖ్య తక్కువ. కుటుంబ నియంత్రణ పాటింపు ఎక్కువ. సంతాన సాఫల్య రేటూ బాగా తగ్గింది. మరణాల రేటు దిగువకు జననాల రేటు పడిపోతోంది. వృద్ధుల సంఖ్య దక్షిణాదిన పెరుగుతోంది. శిశు మరణాల్లో దక్షిణాది–ఉత్తరాది మధ్య తేడాలు బాగా పెరిగాయి. కాన్పు సమయంలో మరణించే తల్లుల సంఖ్యలోనూ ఇదే పరిస్థితి ఉంది. ఆరోగ్యానికి సంబంధించిన ఏ సూచీలోనైనా ఉత్తరాదిన వెనుకబాటే కన్పిస్తుంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పడకల సంఖ్య, డాక్టర్ల అందుబాటు, టీకాల కార్యక్రమం, అంగన్‌వాడీల్లో సౌకర్యాలు.. ఇలా దేన్ని పరిగణనలోకి తీసుకున్నా ఇదే పరిస్థితి. వీటిని పరిగణించకుండా ఉత్తరాదిని దృష్టిలో పెట్టుకుని కేంద్రం ఆరోగ్యరంగంపై విధానాలను రూపొందిస్తోంది. నేషనల్ హెల్త్ మిషన్‌లో నిర్దేశించిన లక్ష్యాల్లో చాలా వాటిని దక్షిణాది రాష్ట్రాలు ఎప్పుడో దాటేశాయి. కేరళ, తమిళనాడులు సొంత విధానాలతో ఆరోగ్యరంగంలో సాధించిన ప్రగతిని ఇతర రాష్ట్రాలు అనుసరించేలా ప్రోత్సహించాల్సిన కేంద్రం చాలా విషయాలను ఏకపక్షంగా తన చేతుల్లోకి తీసుకుంటోంది. విద్య, వైద్యం అనేవి రాష్ట్ర ప్రభుత్వాలు చూడాల్సిన విషయాలు. స్థానిక అవసరాలకు అనుగుణంగా వైద్యులను తయారుచేసుకునే బాధ్యత కూడా రాష్ట్రాలపైనే ఉంటుంది. నీట్ లాంటి పరీక్షల వల్ల రాష్ట్రాలు అయిష్టంగా వైద్య సీట్లను వదులుకోవాల్సి వస్తోంది. వైద్యరంగంలోనే గాక ఇతర వాటిల్లోనూ దేశమంతటికి ఏక రీతిగా వర్తింపచేసే విధానాల వల్ల చెడే ఎక్కువ జరుగుతోందని నీలకంఠన్ గణాంకాల ఆధారంగా వివరించారు.



■ రాహుల్ కుమార్

ఉన్నత విద్యలోకి యువతీయువకులు ప్రవేశించటంలో కూడా ఉత్తర–దక్షిణాల మధ్య తేడా ఉంది. జాతీయ సగటు 26 శాతాన్ని మించి తమిళనాడు, కేరళ, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటకలు ముందుకు వెళుతున్నాయి. ఆ సగటుకు ఉత్తరాది రాష్ట్రాలు ఇంకా దూరంగానే ఉన్నాయి. పాఠశాల స్థాయిల్లో చదువుమానే పిల్లలు ఉత్తరాదిలో ఎక్కువ. ఇలాంటి విభిన్న పరిస్థితులను అన్ని స్థాయిల్లోనూ కనపడతాయి. వీటిని పట్టించుకోకుండా జాతీయ విద్యా విధానం పేరుతో దేశవ్యాప్త అర్హత పరీక్షలు, బోధనా మాధ్యమంపై ఆదేశికాలు వెలువడుతున్నాయి. ఏదో రూపంలో హిందీని తప్పనిసరిగా నేర్పించే ప్రయత్నాలు మొదలయ్యాయి. అనేక కారణాల వల్ల దక్షిణాదిన ఇంగ్లిషు బోధనా మాధ్యమం బాగా ప్రాచుర్యం పొందింది. ఆ మాధ్యమంలో ప్రాథమిక విద్యను అభ్యసిస్తున్న పిల్లల సంఖ్య దక్షిణాదిలో గణనీయంగా పెరుగుతోంది. కర్ణాటకలో 53శాతం, తమిళనాడులో 91శాతం, కేరళలో 81శాతం ఉభయ తెలుగు రాష్ట్రాల్లో 80 శాతం పిల్లలు ఇలా చదువుతున్నవారే ఉన్నారు.

వ్యవసాయం నుంచి వస్తుతయారీ, సేవల రంగంలోకి అడుగు పెట్టటంలో కూడా దక్షిణాదిలో వేగం పుంజుకుంటోంది. గ్రామీణ కుటుంబాల్లో సైతం వ్యవసాయం మీద ఆధారపడటం తగ్గుతోంది. కర్ణాటకలో గ్రామీణ ప్రాంతంలో 55శాతం, తెలంగాణలో 52శాతం, ఆంధ్రప్రదేశ్‌లో 42శాతం, తమిళనాడులో 35శాతం, కేరళలో 27శాతం కుటుంబాలు గ్రామాల్లో వ్యవసాయంపై ఆధారపడగా.. రాజస్థాన్‌లో 78శాతం, యూపీలో 75 శాతం, మధ్యప్రదేశ్‌లో 71శాతం, ఛత్తీస్‌ఘడ్‌లో 68శాతం కుటుంబాలు దానిపై జీవిస్తున్నాయి.

ఇక పట్టణాల్లో జీవించే వారి సంఖ్య కూడా దక్షిణాదిలో బాగా పెరుగుతోంది. తమిళనాడులో 48శాతం, కేరళలో 48శాతం, కర్ణాటకలో 39శాతం, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 33శాతం (2011 జనాభా లెక్కల ప్రకారం) మంది పట్టణాల్లో జీవిస్తున్నారు. మహారాష్ట్ర, గుజరాత్‌లు మాత్రమే తమిళనాడు, కేరళకు దగ్గర్లో ఉన్నాయి. ఉత్తరప్రదేశ్‌లో 22శాతం, బిహార్‌లో 11శాతం, రాజస్థాన్‌లో 25శాతం మధ్యప్రదేశ్‌లో 28శాతం, హిమాచల్‌లో 10శాతం మంది మాత్రమే పట్టణాల్లో జీవిస్తున్నారు. మహిళా శ్రామికుల వాటా కూడా దక్షిణాదిన ఎక్కువ.

1971 నుంచి 2011 వరకూ జనాభా లెక్కలను తీసుకుంటే ఉత్తరాది–దక్షిణాదిల మధ్య పెరుగుదలల్లో తేడాలు స్పష్టంగా కనపడతాయి. నాలుగు దశాబ్దాల్లో రాజస్థాన్‌లో జనాభా 166 శాతం పెరిగింది. అది కేరళలో 56 శాతం మాత్రమే. బిహార్‌లో 146శాతం పెరిగితే తమిళనాడులో అది 75 శాతమే. జనాభాను తగ్గించుకున్న రాష్ట్రాలకు ఏదోవిధంగా కేంద్రం నుంచి వచ్చే ఆదాయంలో గండి పడటం, 2026లో చేపట్టనున్న నియోజకవర్గాల పునర్ వ్యవస్థీకరణలో లోక్‌సభ సీట్లు తగ్గే ప్రమాదం పొంచి ఉండటం.. దక్షిణాది ముందు ప్రస్తుతం పెనుసవాళ్లుగా మారాయి. దక్షిణాది నుంచి పన్నుల రూపంలో తీసుకునేది ఎంత? ఇచ్చేది ఎంత? అనే ప్రశ్నలు అయిదారేళ్లుగా గట్టిగానే వినిపిస్తున్నాయి. తెలంగాణలో బీఆర్ఎస్ నేతలు వందలసార్లు గణాంకాల ఆధారంగా ఈ విషయంపై విమర్శలు గుప్పించారు. తమిళనాడులోనూ అదే జరుగుతోంది.

ఒక ఓటుకు ఒక విలువ అన్నది ప్రజాస్వామ్యంలో కీలకం. మనకు 15లక్షల ఓటర్లు ఉన్న నియోజకవర్గాలూ ఉన్నాయి. 30 లక్షల ఓటర్లున్నవీ ఉన్నాయి. దీంతో ఒక ఓటుకు ఒకే విలువ అనేదానికి అర్థం లేకుండా పోతుంది. కొత్తగా చేపట్టే జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల పునర్ వ్యవస్థీకరణ అనివార్యం. దాన్ని ఆపలేం. లోక్‌సభ సీట్లు తగ్గితే బలహీనమయ్యే పరిస్థితి దక్షిణాదికి రాకుండా ఉండాలంటే కేంద్రం చేతిలోని అధికారాలను గణనీయంగా తగ్గించటమే మార్గం. రాష్ట్రాలకు కీలక అధికారాలు బదలాయింపు జరిగితే లోక్‌సభలో సీట్ల పెంపు సమస్య కాకపోవచ్చు. అంబేడ్కర్ సూచించినట్లు రాజ్యసభలో చిన్నా పెద్దా తేడా లేకుండా అన్ని రాష్ట్రాలకు సమాన ప్రాతినిధ్యం ఉంటే లోక్‌సభలోని సంఖ్యాధిక్యత సృష్టించే విపరిణామాలను కొంతైనా ఆపే అవకాశం ఉంటుంది. అమెరికా సెనెట్ చాలా వరకూ ఆ పనిని చేసిందని కూడా అంబేడ్కర్ చెప్పారు. అమృతకాలంలో కచ్చితంగా జరగాల్సింది నిజమైన వికేంద్రీకరణ. జరుగుతుంది మాత్రం పక్కా కేంద్రీకరణ. పన్నుల విధింపు అధికారం కేంద్ర ప్రభుత్వ అధికారానికి ఆయువుపట్టు. జీఎస్టీతో ఆ పట్టు మరింతగా పెరిగింది. రాష్ట్రాలకు సొంత వనరులను గణనీయంగా సమీకరించుకునే అధికారమే అసలైన సమాఖ్య అస్తిత్వానికి నిదర్శనం. అధికార కేంద్రీకరణ ఆగకపోతే ప్రస్తుతం ఉత్తరాది–దక్షిణాది మధ్య రేగుతున్న వివాదాలు మరోచోటా కనపడొచ్చు!

(ఆంధ్రజ్యోతి ఎగ్జిక్యూటివ్ ఎడిటర్)

రామాలయ పునరుద్ధరణ కథలో 'రెండవ రామదాసు'

అది 1961. కాసు బ్రహ్మానందరెడ్డి ముఖ్యమంత్రి. ఆయన మంత్రివర్గంలో కల్లూరి చంద్రమౌళి దేవాదాయ శాఖ మంత్రి. బ్రహ్మానందరెడ్డి గారి క్యాబినెట్‌లో రెండు గ్రూపులు ఉండేవి. ఒక దానికి నీలం సంజీవరెడ్డి నాయకత్వం వహిస్తే, రెండవ గ్రూపునకు దామోదరం సంజీవయ్య నాయకత్వం వహించేవారు.

హైదరాబాద్ స్థాయిలో నీలం సంజీవరెడ్డి గ్రూపునకు అల్లూరి సత్యనారాయణ నాయకత్వం వహించేవారు. కల్లూరి చంద్రమౌళి సంజీవయ్య గ్రూపులో ఉండేవారు. ఆయన 1961లో దేవాదాయ శాఖ మంత్రిగా భద్రాచలం వచ్చారు. అప్పటి భక్త రామదాసు 265 ఏళ్ల కింద కట్టిన దేవాలయం శిథిలావస్థలో ఉన్నది. భద్రాచల పురప్రముఖులు, భక్తులు ఆయనను కలసి, ఆలయ పునరుద్ధరణ చేపట్టమని ప్రార్థించారు.

దేవాలయంలో నిధులు లేవు. ఆదాయం కూడా తక్కువ. రాముడు శాంతమూర్తి. వేంకటేశ్వరస్వామికి భయపడినట్లు భక్తులు రాముడికి భయపడరు. తిరుపతి హుండీలో నోట్ల కట్టలు పడితే, భద్రాచలం హుండీలో చిల్లర డబ్బులు పడతాయి. దేవాలయ నిర్మాణం చేయాలంటే చాలా ధనం కావాలి. ప్రభుత్వ ధనం ఖర్చు చేయడానికి వీలులేదు. కాని, భద్రాచల రామాలయ పునర్నిర్మాణం కోసం కల్లూరి చంద్రమౌళి ఒక దృఢ సంకల్పం తీసుకున్నారు. వెంటనే కార్యాచరణకు నడుం బిగించారు.

ఆంధ్ర రాష్ట్ర ప్రజలందరూ రామభక్తులు. తమ ఆరాధ్య దైవం రామునికి ఆలయం పునర్నిర్మించుకోలేరా? చంద్రమౌళి ఒక మంత్రిగా కాక, ఒక రామభక్తునిగా ప్రతి ఊరు, ప్రతి పట్టణం, ప్రతి దేవాలయానికీ తిరిగి, రామాలయ పునరుద్ధరణకు, విరాళాలు వసూలు చేయసాగారు. మీరు వింటే ఆశ్చర్యపోతారు. 1962లో భద్రాచల రామాలయ పునరుద్ధరణకు, ఆంధ్రదేశ ప్రజలు, దేవాలయాలు 22 లక్షల రూపాయల విరాళాలను వితరణగా సమర్పించారు. అంటే ఇప్పటి లెక్కలో 100 కోట్ల రూపాయలు. ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు భద్రాచల రాముడంటే అంత భక్తి!

మరి దేవాలయం తిరిగి కట్టాలి కదా! అది ఆషామాషీ విషయం కాదు. మంత్రి గారు చాలా మంది పండితులతో ఆలోచనలు చేశారు. వారంతా చెప్పిందేమిటంటే మీరు ఆగమ శాస్త్రవేత్తలతో సమావేశం ఏర్పాటుచేసి, దేవాలయం ఏ విధంగా కడితే బాగుంటుంది, గర్భాలయ కొలతలెంత, అర్ధ మంటపము, మహామంటపములు ఎంత ఉండాలి, దేవాలయ గోపురం ఎంత ఉండాలి, వగైరాలు నిర్ధారణ చెయ్యాల్సి ఉంటుంది అని సలహా ఇచ్చారు. ఆ విధంగా చంద్రమౌళి మంత్రి హోదాలో విజయవాడ కనకదుర్గ ఆలయంలో ఆగమ పండితులతో సమావేశమయ్యారు. భద్రాచల రాముడు స్వయంభూ. విగ్రహాన్ని కదిలించడానికి వీలులేదు. రోజూ జరిగే నిత్య పూజలు, అభిషేకాలు నైవేద్యాలకు ఆటంకం కలగడానికి వీలులేదు. అందుకని దేవుని విగ్రహాల చుట్టూ టెంపరరీగా షెల్టరు కట్టి, రోజువారి కార్యక్రమాలను ఆచరించాలి.

భద్రాచల రాముడి మూలవిరాట్టు ఎత్తు రెండు అడుగుల ఒక అంగుళం. కావున గర్భాలయ లోపలి కొలతలు విగ్రహానికి నాల్గింతలు అంటే ఎనిమిది అడుగుల నాలుగు అంగుళాలు ఉండాలి. ఇది ఆగమశాస్త్రంలో నిర్దేశించబడిన నిబద్ధత.

దేవాలయం మొత్తం నిర్మాణం రాతి శిలలతో, శిల్పులతో చోళ సంప్రదాయంలో నిర్మించాలి. అప్పటికే కంచిపుర వాస్తవ్యుడైన గణపతి స్థపతిని పిలిపించి దేవాలయ స్థపతిగా నియమించారు. దేవాలయ కట్టడానికి ముందు పాత దేవాలయాన్ని పడగొట్టాలి కదా. రామదాసు కట్టిన దేవాలయ కొలతలు రికార్డులో నిక్షిప్తపరచడానికి అప్పటి ప్రభుత్వ ఆర్ అండ్ బి డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న ఒక ముస్లిం సూపర్‌వైజరును దేవాలయానికి పిలిపించారు. అయితే ఆయనను అర్చకులు గర్భగుడిలోకి రానీయలేదు. దాంతో ఆయన టేపు ఇచ్చి అర్చకులనే కొలతలు చెప్పమన్నారు. ఇక్కడ చెప్పాల్సిన విషయం ఏమిటంటే టేపు రింగు ఒక అంగుళం ఉంటుంది. ఇది అర్చకులకు తెలియదు. రింగులో వేలు దూర్చి, రామదాసు కట్టిన గర్భాలయం కొలతలు ఏడు అడుగుల పదకొండున్నర అంగుళాలుగా చెప్పారు. ఆ ముస్లిం సూపర్‌వైజరు ఆ కొలతలనే నోటు పుస్తకంలో నోట్ చేసుకున్నారు. తర్వాత శ్రీ సీతా లక్ష్మణ సమేత శ్రీరామ విగ్రహాలు చుట్టూ ఇనుప రేకులతో షెడ్డు ఏర్పాటు చేసి దేవాలయాన్ని కూలగొట్టారు. ఆ ముస్లిం సూపర్‌వైజర్ నోట్ చేసిన కొలత తప్ప భక్త రామదాసు కట్టిన గుడి కొలతలు ఎక్కడా లేవు.

ఆంధ్ర రాష్ట్ర ప్రజలందరూ రామభక్తులు. తమ ఆరాధ్యదైవం రామునికి ఆలయం పునర్నిర్మించుకోలేరా? కల్లూరి చంద్రమౌళి ఒక మంత్రిగా కాక, ఒక రామభక్తునిగా ప్రతి ఊరు, ప్రతి పట్టణం తిరిగి, రామాలయ పునరుద్ధరణకు, విరాళాలు వసూలు చేయసాగారు. 1962లో భద్రాచల రామాలయ పునరుద్ధరణకు, ఆంధ్రదేశ ప్రజలు, దేవాలయాలు 22 లక్షల రూపాయలు విరాళాలను వితరణగా సమర్పించారు. అంటే ఇప్పటి లెక్కలో 100 కోట్ల రూపాయలు.



భద్రాచలంలో గోదావరి ఒడ్డున శిల్పినగరు ఏర్పాటు చేసి 400 మంది శిల్పులకు షెడ్లు వేయించి, దేవాలయం నిర్మాణం ప్రారంభించారు. పర్ణశాల వద్ద ఉన్న బండిరేవు క్వారీని దేవాలయ నిర్మాణానికి ఉపయోగించే శిలలుగా సెలక్టు చేసి, శిల్పినగరులో శిల్పులు, గణపతి స్థపతి ఆధ్వర్యంలో పని ప్రారంభించారు. సంవత్సరం గడిచిపోయింది. దాదాపు నాలుగు లక్షల వరకు వ్యయమైంది. శిల్పులు, వాళ్ల తయారుచేసిన కుడ్యపు శిలలను భద్రగిరి మీదకు తరలించి గుడి కట్టడం మొదలుపెట్టారు.

ఇక్కడ హైదరాబాద్‌లో వేడి మొదలైంది. సంజీవయ్య వర్గీయుడైన చంద్రమౌళికి పేరు రావడం బ్రహ్మానందరెడ్డి వర్గీయులకు కంటగింపు అయింది. వారు వెంటనే ఒక మీటింగు పెట్టి, బ్రాహ్మణ కులస్థుడైన నీలంరాజు వెంకట శేషయ్య, భాట్టం శ్రీరామమూర్తి, ముక్కు శర్మ ఇంకా కొంతమందిని సంప్రదించి, మీ కులస్థుడైన భక్త రామదాసు కట్టించిన రామాలయాన్ని, ఒక శూద్ర కులస్థుడైన (కమ్మ) చంద్రమౌళి కూలగొట్టి మళ్లీ కట్టడమేంటి, మీరందరూ ఏం చేస్తున్నారని ఎగదోశారు. ఇది రాజకీయ ఎత్తుగడ. బ్రాహ్మణ కులస్థులైన కొంతమంది పెద్దలు భద్రాచలం వచ్చి మీటింగులు పెట్టుకుని, ఏదైనా తప్పు దొరుకుతుందా అని ఎంక్వయిరీ చేయసాగారు. అప్పుడు వారికి ఎవరో గిట్టనివారొచ్చి, రామదాసు కట్టిన గుడి కొలతలు మార్చి చంద్రమౌళి సొంత కొలతలతో గుడి కడుతున్నారని, గర్భాలయ కొలత (7'-11 1/2") బదులు (8'-4") పెట్టి కొలతలు మార్చేశాడని ఏగదోశారు. నిప్పు రాజుకుంది.

మరునాడు పేపర్లలో భద్రాచల రామాలయ గర్భాలయ కొలతలు మార్చి కడుతున్నారని, భద్రాచలం నుంచి రాముడు వెళ్లిపోయాడని, గుడి అపవిత్రమవుతున్నదని పెద్ద హెడ్డింగులతో ప్రచురించారు. భద్రాచలంలోని కమర్షియల్ టాక్స్‌లో పనిచేస్తున్న ఒక బ్రాహ్మణునితో శిబిరం వేయించి, నిరాహార దీక్ష ప్రారంభించారు. ఆంధ్రదేశమంతా అట్టుడికిపోయింది. సత్యాగ్రహ శిబిరానికి నలుమూలల నుంచి భక్తులు వచ్చి సత్యాగ్రహంలో పాల్గొనసాగారు. అగ్గి రాజుకుంది. మంటలు రాజధాని హైదరాబాద్ వరకు పాకాయి. ఒక వర్గం వారు అనుకున్న కార్యక్రమం నెరవేరింది.


వెంటనే ముఖ్యమంత్రి బ్రహ్మానందరెడ్డి, చంద్రమౌళిని ఆఫీసుకు పిలిపించుకుని 'ఏమిటీ గందరగోళం, ఈ గొడవ ఢిల్లీ వరకు పోయేట్టున్నది. దీనికి వివరణ కావాలి' అని కోరారు. దానికి చంద్రమౌళి 'అయ్యా ముఖ్యమంత్రిగారు, శిథిలావస్థలో ఉన్న భద్రాచల రామాలయాన్ని పునర్నిర్మించడానికి నేను ప్రభుత్వం మీద భారం పడకుండా భక్తుల విరాళాలతో పని ప్రారంభించాను. ఇందుకు ఆగమ శాస్త్రవేత్తలతో సమావేశం ఏర్పాటుచేసి, శాస్త్ర ప్రకారం నిర్దేశించిన విధంగా దేవాలయ నిర్మాణం జరుగుతోంది. గణపతి స్థపతి 400 మంది శిల్పులతో నిర్మాణం కొనసాగిస్తున్నారు. మీరు ఏ ఎంక్వయిరీ వేసుకున్నా నేను బద్ధుడనై ఉంటాను' అని సమాధానం చెప్పారు. వెంటనే ముఖ్యమంత్రి 'ఈ విషయాన్ని కంచి పీఠాధిపతికి ప్రభుత్వం తరఫున నివేదిస్తాను. ఆయన నిర్ణయానికి మనం బద్ధులమై ఉందాం' అని ముగించారు. వెంటనే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మొత్తం విషయం మీద కంచి పీఠాధిపతికి ఒక సమగ్ర నివేదికను పంపింది. అప్పటికే బ్రాహ్మణ శ్రేష్ఠులందరూ కంచికి చేరుకున్నారు.

అప్పుడు కంచి పీఠాధిపతి చంద్రశేఖర స్వామివారు. ఆయన శాస్త్రాలన్నీ పరిశీలించారు. ఆగమ శాస్త్ర ప్రకారం మూల విరాట్టు ఎత్తుకు నాలుగు రెట్లు అంటే 8'-4" కట్టడం శాస్త్ర సమ్మతం. కాని రామదాసు గారు కట్టిన ఆలయం 7'-11 1/2" కొలతలు అంటున్నారు. ఆయన బాగా ఆలోచించి తన జడ్జిమెంటు ఇచ్చారు. 'భద్రాచల రామాలయం ఇప్పుడు కడుతున్న కొలతల ప్రకారం (8'-4") ఆగమ శాస్త్ర ప్రకారం శాస్త్ర సమ్మతమే. కాని భక్త రామదాసు గారు పెట్టిన కొలతల ప్రకారం కడితే బాగుండేది'. కంచి స్వామివారి ఈ నిర్ణయం కల్లూరి చంద్రమౌళికి శరాఘాతంలా తగిలింది. ముఖ్యమంత్రికి పన్నీరు పోసినట్టయింది. వెంటనే చంద్రమౌళి మంత్రి పదవికి రాజీనామా చేసి, హైదరాబాద్ వెళ్లిపోయి అక్కడ తన పూర్వీకుల ఇంట్లో రాజకీయాలతో తెగతెంపులు చేసుకుని నివసించసాగారు.

కాని ఇక్కడ మనం తెలుసుకోవలసిన విషయం ఒకటి ఉంది. రామదాసు గారు ఆగమశాస్త్ర నిబద్ధతతకు వ్యతిరేకంగా 7'-11 1/2" ప్రకారం దేవాలయం ఎందుకు కట్టారు? అదే వివరిస్తాను. రామదాసు కూడా దేవాలయాన్ని 8'-4" కొలతలతోనే కట్టారు. కాలక్రమంలో హైదరాబాద్ నుంచి వచ్చిన మార్వాడీ భక్తులు, గర్భాలయంలో గోడలకు గ్లేజ్‌డ్ టైల్సు తమ సొంత ఖర్చుతోవేయించారు. అందువల్ల లోపలి కొలతలు తగ్గిపోయాయి. అంతేకాక అర్చకులు టేపులో రింగును 1" కింద లెక్కలోకి తీసుకోలేదు. ఈ వివాదం వల్ల ఒక నిబద్ధత గల రాజకీయవేత్త భక్త రామదాసుగారిలా పదవిని, ప్రతిష్ఠను కోల్పోవలసి వచ్చింది.

నేను భద్రాచలంలో సైటు ఇంజనీరుగా జాయిన్ అయిన సంవత్సరం తర్వాత, హైదరాబాద్‌లో పీవీ నర్సింహారావుగారి చాంబరులో సెక్రటేరియట్‌లో మీటింగు జరిగింది. అప్పుడు పీవీ గారు దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి, కొండా వాసుదేవగారు ఎండోమెంటు కమిషనరు, భద్రాచల ఉద్ధరణ సంఘం అప్పటి కొత్త చైర్మన్ లక్కినేని నర్సయ్యగారితో సహా సభ్యులందరూ హాజరయ్యారు. దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు మాదిరెడ్డి మాధవరావుగారితో సహా నేను కూడా హాజరయ్యాను. దేవాలయ గర్భాలయం 8'-4"తో తయారైంది. దాని లోపల మార్బులు స్టోన్సు తెప్పించి 7'-11 1/2" కొలతలకు లోపల అతికిస్తే సమస్య తీరిపోతుంది. అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అప్పుడు రాజస్థాన్ మక్రానా నుంచి తెల్లని శ్రేష్ఠమైన మార్బుల్ పలకలు తెప్పించి గర్భాలయంలో 7'-11 1/2" కొలతలకు సరిపడా నేను దగ్గరుండి అతికించాను. ఆ విధంగా ఆ వివాదాన్ని అధిగమించాం.

■ కొప్పుల ప్రకాశం



బస్సుల్లేక.. విలవిల

ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల నుంచి గుడివాడ సిద్ధం సభకు 390 బస్సులు

జనాన్ని తరలించటానికి వందల సంఖ్యలో కిరాయికి ఆటోలు

బస్సులతో పాటు ఆటోలు తగినన్ని లేక ప్రయాణికుల ఇక్కట్లు

విజయవాడకు వచ్చే ఉద్యోగులు, చిరు వ్యాపారులకు ఇబ్బందులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ముఖ్యమంత్రి జగన్ సేవలో ఆర్టీసీ బస్సులు తరించటంతో.. ఉమ్మడి కృష్ణా జిల్లా ప్రజలు బస్సులు లేక విలవిల్లాడారు. అత్యవసర పనుల మీద బయటకు రావటం దుర్భరంగా మారింది. ఉద్యోగులు, చిరువ్యాపారులు, ఉపాధి కూలీలు, పనుల కూలీలు, భవన నిర్మాణ రంగ కార్మికులు ఇలా తమ సొంత ప్రాంతాల నుంచి విజయవాడ రావటం దుర్భరంగా మారింది. ఒక పక్క బస్సుయాత్ర పేరుతో ఎక్కడికక్కడ ట్రాఫిక్ ఆపివేయటంతో.. వాహనాలు గంటల కొద్దీ ముందుకు కదలలేని పరిస్థితి నెలకొంది. మరోవైపు బస్సులూ లేవు. కాస్త ముందే బయటకు వచ్చి పనులు ముగించుకుని వెళదామనుకునేవారు ట్రాఫిక్‌లో చిక్కుకుపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దూర ప్రాంతాల నుంచి విజయవాడ బస్‌స్టేషన్‌కు, రైల్వేస్టేషన్‌కు వచ్చిన వారంతా సిటీలోకి ప్రవేశించటానికి బస్సులు లేక నానా ఇబ్బందులు పడ్డారు.

ఆటోలు కూడా కరువే

ఆటోలలో అయినా వెళదామనుకుంటే.. ఆటోలకు కూడా కొరత ఏర్పడింది. వందలాది ఆటోలను కూడా వైసీపీ నేతలు అద్దెకు తీసుకున్నారు. ఆటోలలో జనాలను తరలించటం కోసం భారీ సంఖ్యలో వాటిని అద్దెకు తీసుకోవటం వల్ల ఆటోలకు కూడా కొరత ఏర్పడింది. ఆసియాలో రెండో అతిపెద్దదైన పీఎన్‌బీఎస్‌కు రోజుకు 2 లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. దేశంలోనే రెండో అతిపెద్ద రైల్వే జంక్షన్ అయిన విజయవాడ రైల్వేస్టేషన్‌కు సగటున 3 లక్షల మంది వరకు రాకపోకలు సాగిస్తుంటారు. దాదాపుగా ఐదు లక్షల మంది వరకు ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేర్చవేయటానికి అవసరమైన బస్సులు, ఆటోలు లేకపోవటంతో ప్రయాణికులు నానాఅవస్థలు పడ్డారు. ఎన్టీఆర్ జిల్లా నుంచి మొత్తం 240 బస్సులను గుడివాడ సిద్ధం సభలకు పంపారు. ఇవన్నీ కూడా విజయవాడ నగర పరిధిలోని గవర్నర్‌పేట - 1, గవర్నర్ పేట - 2, విద్యాధరపురం, ఇబ్రహీంపట్నం డిపోల పరిధిలో నడిచే సిటీ బస్సులే కావటం గమనార్హం. దాదాపుగా 80 శాతంపైగా సిటీ బస్సులు జగన్ సభలకు అద్దెకు ఇచ్చారు. కృష్ణాజిల్లాలో కూడా 150 బస్సులను అద్దెకు ఇచ్చారు. ఈ బస్సులు కూడా గన్నవరం, ఉయ్యూరు, గుడివాడ, అవనిగడ్డ, మచిలీపట్నం డిపోలకు చెందిన సిటీ బస్సులనే పంపారు. భారీ సంఖ్యలో సిటీ బస్సులను అద్దెకు ఇవ్వటం వల్ల ఎక్కువగా ప్రయాణించే వారిపై ప్రభావం పడింది.

నేడు కూడా బస్సులకు కొరతే

భీమవరంలో జరిగే సిద్ధం సభకు కూడా ఉమ్మడి కృష్ణా జిల్లా నుంచి 390 బస్సులను కేటాయించటం జరిగింది. కాబట్టి మంగళవారం కూడా బస్సులు అందుబాటులో ఉండే అవకాశాలు లేవు. ప్రయాణికుల కష్టాలు కొనసాగనున్నాయి. మంగళవారం రాకపోకలు సాగించేవారు ప్రత్యామ్నాయాలు చూసుకుంటే ఇబ్బంది పడకుండా ఉంటారు.

సీ-విజిల్ ఫిర్యాదుల పరిష్కారం

• కలెక్టర్ ఢిల్లీరావు

- 6లో..

సీఎం జగన్ బస్సుయాత్ర జనానికి నరకయాతన చూపిస్తోంది. అడుగడుగునా ట్రాఫిక్ ఆంక్షలు విధించడం, వాహనాల రాకపోకలను నిలిపివేయడం, దారిపొడవునా కరెంటు కట్ చేయడం లాంటి విన్యాసాలతో జనానికి చుక్కలు చూపిస్తున్నారు. కృష్ణా జిల్లాలో సోమవారం జాతీయ రహదారిపై ట్రాఫిక్ దిగ్బంధనాల మధ్య జగన్ రోడ్డు 'షో' జరిగింది. జాతీయ రహదారిపై రెండో వైపున ట్రాఫిక్ వెళ్లటానికి అవకాశమున్నా.. వాహనాలను ముందుకు సాగనీయకుండా ఉద్దేశపూర్వకంగా అడ్డుకున్నారు. దీంతో జాతీయ రహదారిపై వాహనాలు బారులుతీరాయి. ఆగిపోయిన ట్రాఫిక్ వాహనాలు, తరలించిన జనాల కలయికతో.. రోడ్డు 'షో'ను రక్తికట్టించాలని చూశారు. ఎన్‌హెచ్-16పై కేసరపల్లి నుంచి ఎన్‌హెచ్-216పై గుడివాడ వరకు ట్రాఫిక్ ఆపేసి బస్సు యాత్రను కొనసాగించారు. దీంతో తీవ్ర ట్రాఫిక్ కష్టాలు ఏర్పడ్డాయి.



గన్నవరం నుంచి హనుమాన్‌జంక్షన్ రోడ్డులో భారీగా నిలిచిన ట్రాఫిక్

ఆపషోపాలు!

జగన్ రోడ్డు షోతో జనానికి షాక్

దారి పొడవునా ట్రాఫిక్ నిలిపివేత



గన్నవరంలో రాకపోకలను ఆపేసిన పోలీసులు

- రోడ్డుకు ఒకవైపు బస్సుయాత్ర అయితే.. రెండోవైపు వాహనాలకు ఆటంకాలు
- బస్సుయాత్రకు హైప్ తెచ్చేందుకే ఈ తంతులు
- ఎన్‌హెచ్ - 16, ఎన్‌హెచ్ - 216 హెచ్‌లపై యాత్ర పొడవునా ఇదే షో
- మూడు గంటల పాటు ట్రాఫిక్‌లో చిక్కుకున్న వాహనదారులు, ప్రయాణికులు
- అడ్డొస్తున్నాయన్న పేరుతో సర్వీసు వైర్లు కత్తిరింపు
- జగన్ యాత్ర వెళ్లే గ్రామాల్లో కరెంట్ కోతలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/గన్నవరం/ఉంగుటూరు/హనుమాన్‌జంక్షన్/జంక్షన్ రూరల్) : దేశంలోనే అత్యంత రద్దీ కలిగిన జాతీయ రహదారుల్లో ఒకటైన ఎన్‌హెచ్ - 16 అనేది కోల్‌కతా - చెన్నయ్ ప్రధాన రోడ్డు మార్గం. ఈ మార్గంలో జగన్ బస్సుయాత్ర పేరుతో రోడ్డు షో సాగటం అంటే ట్రాఫిక్‌కు తీవ్ర ఆటంకం ఏర్పడటమే. బస్సుయాత్ర ఒకవైపు సాగుతుంటే.. రెండో వైపున ట్రాఫిక్‌ను నిలిపివేశారు. బస్సుయాత్రకు హైప్ తీసుకురావటం కోసమే ఈ రకంగా ట్రాఫిక్ ఆపేస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ట్రాఫిక్ ఆగిపోవటంతో ఆగిపోయిన బస్సులు, లారీలపై జెండాలు పట్టుకున్న కార్యకర్తలను ఎక్కించి హడావిడి చేయించారు. బస్సుయాత్ర పొడవునా ఈ కార్యక్రమమే నడిచింది. దీంతో ఇదేదో భారీస్థాయిలో జరుగుతున్నట్టుగా బిల్డప్ ఇచ్చినట్టు అయింది. ముఖ్యమంత్రి జగన్ పది గంటలకు కేసరపల్లిలోని బస ప్రదేశం నుంచి బయటకు వస్తారన్నది షెడ్యూల్ అయితే, 9 గంటల నుంచే పోలీసులు రామవర ప్పాడు నుంచి బ్లాక్ చేస్తూ వచ్చారు. జగన్ బయటకు వచ్చే సమయంలో ఎడమవైపున ఒక్కసారిగా వదిలేశారు. కాన్వాయ్ బయటకు వచ్చేటపుడు మళ్లీ ట్రాఫిక్ ఆపేశారు. ముందు వెళ్లిన వాహనాలన్నీ గన్నవరంలో చిక్కుకుపో యాయి. గన్నవరంలో వైసీపీ కార్యకర్తలు రోడ్డుపై ఉండటంతో.. వాహనాలు ముందుకు సాగలేదు. ఒకర కష్టైన వాతావరణాన్ని సృష్టించారు. దాదాపుగా గంటపాటు ఈ హడావిడి కనిపించింది. ఈలోపు విజయవాడ నుంచి తరలించిన జనాలు రావటంతో.. అప్పటికి కానీ ట్రాఫిక్‌ను వదల్లేదు. జగన్ వెళ్లే లేనులో కూడా అంచెలంచెలుగా ట్రాఫిక్ ఆపుతూ, పంపిస్తూ మేనేజ్‌మెంట్ చేశారు. రెండోవైపు అయితే పూర్తిగా ఆపేశారు. రెండో వైపున వాహనాలు బ్లాక్ కావటంతో బస్సులు, కార్లలో ఉన్న ప్రయాణికులు దిగి పోలీసులతో వాగ్వివాదాలకు దిగారు. దీంతో పోలీసులు నిదానంగా వెళ్లటానికి అవకాశం కల్పించారు.

• ట్రాఫిక్ సమస్యతో రోడ్డు ప్రమాదం

జాతీయ రహదారికి రెండోవైపున కార్యకర్తలను నిలువరించకపోవటం వల్ల ప్రమాదం కూడా జరిగింది. గన్నవరం గాంధీచౌక్‌లో వీనస్ సెంటర్ ఎదురుగా బైక్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో బస్సు ముందు టైరు కింద ద్విచక్రవాహనం పడిపోయింది. అదృష్టవశాత్తూ బైక్‌ను నడుపుతున్న వ్యక్తి ప్రాణాల నుంచి బయటపడ్డాడు. చిన్న అవుటపల్లి నుంచి బస్సుయాత్రను సర్వీసు రోడ్డుకు తీసుకున్నా.. హైవేపై వెళ్లే వాహనాలకు అడుగడుగునా అవాంతరాలు కల్పించారు.

• కరెంట్ కట్.. గ్రామాలు విలవిల

జగన్ బస్సుయాత్ర మొదలైన దగ్గర్నుంచి ఆయన రూట్ వెంబడి విద్యుత్‌ను నిలిపివేశారు. బస్సుయాత్ర సాగినంత వరకు కూడా ఆయా గ్రామాల్లో విద్యుత్‌ను నిలుపుదల చేశారు. అసలే ఎండాకాలం కావటంతో గ్రామాల్లోని ప్రజలు విద్యుత్ కోతలతో అలమటించారు. ఇంట్లో ఉన్నా విద్యుత్ లేకపోవటం వల్ల ఫ్యాన్లు, కూలర్లు పనిచేయక వేడి తాపాన్ని అనుభవించలేక నానా ఇబ్బందులు పడ్డారు. గ్రామాల్లో విద్యుత్ సర్వీసు వైర్లు అడ్డుగా ఉన్నాయని.. విద్యుత్ శాఖ అధికారులు కనెక్షన్ వైర్లను కట్ చేశారు. ఈ కారణంగా సాయంత్రం వరకు కూడా కొందరికి కరెంట్ కష్టాలు ఏర్పడ్డాయి. బస్సు యాత్ర వెళ్లిపోయిన తర్వాత లైన్‌మెన్‌ను పిలిపించుకుని సర్వీసు వైర్లను బాగు చేయించుకోవాల్సి వచ్చింది.

విమానాశ్రయ నిర్వాసితులను కలవటానికి ముఖం చాటేసిన సీఎం

విమానాశ్రయ నిర్వాసితులతో భేటీ ఏర్పాటు చేసినా.. వారిని సీఎం కలవలేదు. విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయ విస్తరణ అభివృద్ధి కోసం ఇళ్లను కోల్పోయిన వారికి ఐదేళ్లు అయినా ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీలో భాగంగా ఇళ్ల నిర్మాణానికి ఇస్తామన్న డబ్బులు ఇవ్వలేదు. అద్దె డబ్బులు చెల్లించలేదు. వీటికి సంబంధించి రెండుసార్లు ఉత్తుత్తి జీఓలు ఇచ్చి సరిపెట్టారు. జీఓలను అమలు చేస్తే సమస్య పరిష్కారమౌతుంది. జీఓను అమలు చేయకుండా.. నిర్వాసితులను మభ్యపెట్టడానికి వారితో సమావేశం ఏర్పాటు చేశారు. దీనిపై ఆంధ్రజ్యోతిలో ప్రత్యేక కథనం రావటంతో వారితో చర్చించేందుకు ముఖ్యమంత్రి ఆసక్తి చూపించలేదు. నిర్వాసితులను పిలిచినా.. వారితో మాట్లాడలేదు. షెడ్యూల్ లేటు అయిందన్న కారణంతో భేటీ వీలుపడలేదని, వారి దగ్గర నుంచి వినతిపత్రాలను తీసుకుని సరిపెట్టారు.

ఊకదంపుడు ఉపన్యాసం

సెల్ఫ్ డబ్బా వేదికగా సిద్ధం సభ

- జిల్లాకు కానీ, గుడివాడకు కానీ హామీలు నిల్
- సీఎం ప్రసంగం మొదలుకాక ముందే జనాలు పరార్
- 5 ఎకరాల్లో సభ ఏర్పాట్లు.. 10వేలలోపు జనం

తుస్సుమన్న రోడ్‌షో.. వచ్చింది బస్సులో... వెళ్లింది కాన్వాయ్‌లో

జనంలేక పలచగా కనిపిస్తున్న సిద్ధం సభ



మేమంతా సిద్ధం అంటూ గుడివాడలో సోమవారం ఏర్పాటు చేసిన సభ మొత్తం ఊకదంపుడు ఉపన్యాసానికే పరిమితమైంది. సీఎం జగన్ సుమారు గంటపాటు మాట్లాడినా ఈ ఐదేళ్లలో జిల్లాకు చేసిన అభివృద్ధి ఏమిటో ఒక్క ముక్క చెప్పలేకపోయారు. కనీసం గుడివాడ నియోజకవర్గానికి ఏం చేశారో.. ఏం చేస్తారో చెప్పకుండా పేలవంగా ఆయన ప్రసంగం సాగింది. కేవలం పథకాలను వల్లె వేయడం.. సెల్ఫ్ డబ్బా కొట్టుకోవడం.. చంద్రబాబు, పవన్‌ను తిట్టడానికే ఈయన ప్రసంగంలో అధికభాగం సరిపోయింది.

గుడివాడ, ఏప్రిల్ 15 : సీఎం స్థాయిలో ఉన్న వ్యక్తి నోరు తెరిస్తే అబద్ధాలు వల్లెవేయడం.. అసందర్భ వ్యాఖ్యలు చేయడంతో జగన్ ప్రసంగం పట్ల వైసీపీ శ్రేణుల్లోనే విముఖత వ్యక్తమయ్యేలా చేసింది. ఎన్నికల వేళ సాధారణంగా జిల్లాలో స్థానిక నియోజకవర్గంలో తాము చేసిన అభివృద్ధి చెప్పడం ఏ పార్టీ నాయకుడికైనా ఆనవాయితీ. అలాగే తాము అధికారంలోకి వస్తే జిల్లాలో ఫలాన అభివృద్ధి పనులు చేస్తామనో.. పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేస్తామనో కూడా నాయకులు హామీ ఇస్తుంటారు. ఇలాంటివేవీ జగన్ ప్రసంగంలో కానరాలేదు. ఎప్పటిలాగే ఊకదంపుడు ఉపన్యాసంతో బోరు కొట్టించారు. విచిత్ర విన్యాసాలు, వింతైన హావభావాలతో ఆకట్టుకోవాలన్న ఆయన ప్రయత్నం పెద్దగా ఫలితాన్ని ఇవ్వలేదు.

సభాప్రాంగణం వెలవెల

మేమంతా సిద్ధం సభ సక్సెస్ కాలేదన్నది వైసీపీ శ్రేణుల నుంచే వస్తున్న మాట. లక్షమందితో ఎన్నడూ జరగని విధంగా సిద్ధం సభను నిర్వహిస్తున్నామని వైసీపీ నాయకులు ప్రకటించారు. క్షేత్రస్థాయిలో మాత్రం జన సమీకరణలో విఫలమయ్యారు. స్థానిక నాగవరప్పాడులోని ఇంజినీరింగ్ కళాశాల ఎదురుగా 5 ఎకరాల్లో సిద్ధం సభను నిర్వహించారు. అందులో సీఎం వాహనాలు, పోలీసుల వాహనాల పార్కింగ్, వేదిక, జగన్ ర్యాంప్‌వాక్ స్థలం పోను మిగిలిన 3 ఎకరాల్లో ప్రజల కోసం ఏర్పాట్లు చేశారు. ఇరుకుగా ప్రాంగణాన్ని సిద్ధం చేసుకుని లక్షలాది మంది వచ్చినట్లు బిల్డప్ ఇచ్చే ప్రయత్నం చేశారు. మచిలీపట్నం పార్లమెంటు పరిధిలోని గుడివాడ, పామర్రు, పెడన, పెనమలూరు, అవనిగడ్డ, మచిలీపట్నం నియోజకవర్గాల నుంచి జనాలను తరలించేందుకు ప్రయత్నాలు చేసినా ఆశించిన స్థాయిలో జనాలు రాలేదు. పామర్రులో పెట్టిన ఆర్టీసీ బస్సులు నిండక ఖాళీగా ఉండిపోవడం గమనార్హం. 10 వేలలోపు జనాలు మాత్రమే సిద్ధం సభకు హాజరయ్యారని ఇంటెలిజెన్స్ వర్గాల సమాచారం. జగన్ రాకముందు నుంచే సభాప్రాంగణంలోకి రావాలని ప్రజలను, వైసీపీ కార్యకర్తలను నాయకులు వేడుకుంటూనే ఉన్నారు. అయినా ప్రజల నుంచి స్పందన కరువైంది. జగన్ వచ్చి మైకు అందుకునే సమయానికి ప్రాంగణంలో ఉన్న సగం మంది వెనుదిరిగారు. ఇతర ప్రాంతాల నుంచి మధ్యాహ్నం 2 గంటలకే జనాన్ని తీసుకొచ్చారు. ఎండ వేడిమి తట్టుకోలేక వారు నానా అగచాట్లు పడ్డారు. బస్సుల్లో తీసుకొచ్చి వదిలేశారంటూ నాయకులపై పలువురు ఆగ్రహించడం కనిపించింది. సభకు ముందు నిర్వహించిన రోడ్‌షోలో జనాలే కనిపించలేదు. దీంతో సభ ముగిసిన తర్వాత రోడ్‌షోకు స్వస్తి చెప్పి కాన్వాయ్‌లో జగన్ వెళ్లిపోయారు.




దుకాణంలో తనిఖీ చేస్తున్న సీఐ చంద్రశేఖర్

బంగారు షాపులో చోరీ

• షట్టర్ బద్దలుకొట్టి రూ.కోటి లూటీ

కంచికచర్ల రూరల్, ఏప్రిల్ 15 : కంచికచర్లలో జ్యూయలరీ షాపు షట్టర్ తాళాలు బద్దలుకొట్టిన దొంగలు సుమారు రూ.కోటి వరకు లూటీ చేశారు. ఈ ఘటన ఆదివారం అర్ధరాత్రి పోలీస్‌స్టేషన్‌కు 50 అడుగులు, సీఐ ఆఫీసుకు 100 అడుగుల దూరంలో జరగడం కలకలం రేపుతోంది. కంచికచర్లలో బంగారు షాపులు ఇబ్బడి ముబ్బడిగా వెలవడం వ్యాపారం జోరుగా సాగడంతో దొంగలు పగడ్బందీగా రెక్కి నిర్వహించి చోరీకి పాల్పడినట్టు తెలుస్తోంది. మోటార్ బైక్‌పై వచ్చిన దొంగలు షాపు షట్టర్ తాళాలు పగుల కొట్టి అందులో ఉన్న 350 గ్రాముల బంగారం, 8 కిలోల వెండి, రూ.మూడు లక్షల నగదు దొంగతనం చేశారని షాపు యజమాని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో తెలిపారు. సోమవారం ఉదయం 4.30 గంటలకు బంగారు దుకాణం పక్కన టీ షాపు నడిపే వ్యక్తి బంగారు షాపు తాళాలు పగుల కొట్టి ఉండటాన్ని గమనించి షాపు యజమానికి ఫోన్ చేసి విషయం తెలిపాడు. యజమాని జూలూరు సురేష్‌కుమార్ ఫిర్యాదు నందిగామ ఏసీపీ రవికిరణ్, విజయవాడ క్రైమ్ ఏసీపీ ప్రశాంతిరాయ్, నందిగామ రూరల్ సీఐ చంద్రశేఖర్, ఎస్సైలు చోరీ జరిగిన తీరును సమీక్షించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ చంద్రశేఖర్ తెలిపారు.

వేణుగోపాలస్వామి భూమి టెండర్లు రద్దు చేయాలి



ఎండోమెంట్ డిప్యూటీ కమిషనర్ విజయరాజు సిఫార్సు

వన్‌టౌన్, ఏప్రిల్ 15 : పోరంకిలోని వేణుగోపాల స్వామి ఆలయ నిర్వహణకు చెందిన సర్వే నెంబర్ 420/1లోని 7.75 ఎకరాల భూమి లీజును రద్దు చేయాలని దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ మేడిపల్లి విజయరాజు, దేవదాయ కమిషనర్‌కు నివేదిక సమర్పించారు. ఈనెల 7వ తేదీన ఆంధ్రజ్యోతిలో శరగోపం పేరిట పోరంకి వేణుగోపాలస్వామి, ఆంజనేయస్వామి ఆలయ భూముల వేలం విషయంలో గోల్‌మాల్‌పై కథనం ప్రచురితమైంది. ఈ కథనం మేరకు అదే రోజున స్పందించిన దేవదాయ కమిషనర్ విచారణకు ఆదేశించారు. విచారణాధికారిగా డిప్యూటీ కమిషనర్ విజయరాజును నియమించారు. క్షేత్రస్థాయిలో తొలిరోజున దేవస్థాన

- మిగతా 6లో

కొత్తూరు తాడేపల్లిలో ఘర్షణ

టీడీపీ కార్యకర్తలపై వైసీపీ మూక దాడి

- ఐదుగురికి గాయాలు
- ఏడుగురిపై కేసు నమోదు





దాడిలో గాయపడిన టీడీపీ కార్యకర్తలు

విజయవాడ రూరల్, ఏప్రిల్ 15 : విజయవాడ రూరల్ మండలం కొత్తూరు తాడేపల్లిలో ఆదివారం రాత్రి ఘర్షణ తలెత్తింది. టీడీపీ నేతల నివాసాల వద్దకు వచ్చి కవ్వింపులకు దిగిన వైసీపీ కార్యకర్తలు ఇనుపరాడ్లు, కర్రలతో టీడీపీ కార్యకర్తలపై దాడికి దిగారు. ఈ దాడిలో ఐదుగురు టీడీపీ కార్యకర్తలు గాయాలపాలయ్యారు. వివరాల ప్రకారం.. కొత్తూరు తాడేపల్లిలోని పైలమాలపల్లిలో ఆదివారం రాత్రి వైసీపీ కార్యకర్తలు మద్యం సేవించి గ్రామంలో హల్‌చల్ చేశారు. మోటార్ సైకిళ్లకు సైలెన్సర్లు తీసేసి మాలపల్లిలో చక్కర్లు కొడుతున్న సమయంలో రెండేళ్ల బాలుడికి మోటార్ బైక్ తగిలింది. ఈ విషయమై ఓ వృద్ధురాలు ప్రశ్నించగా వైసీపీ కార్యకర్తలు ఆమెపై దౌర్జన్యానికి దిగారు. దీంతో అక్కడే ఉన్న టీడీపీ కార్యకర్తలు అడ్డుకునేందుకు ప్రయత్నించగా వారిపై ఇనుపరాడ్లు, కర్రలతో వైసీపీ కార్యకర్తలు దాడులు చేశారు. ఈ ఘటనలో టీడీపీ కార్యకర్తలు గారపాటి తిరుపతమ్మ, బొడ్డు పండు, కనపర్తి సత్యం, గారపాటి రమేష్‌బాబు, జి.అవినాష్ తీవ్ర గాయాలపాలయ్యారు. దాడి చేసిన వైసీపీ కార్యకర్తలు అక్కడి నుంచి పరారయ్యారు. దీంతో బాధితులు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన వైసీపీ కార్యకర్తలు చప్పిడి రవివర్మ, చప్పిడి శివనాగరాజు, చిగురుపల్లి ఆంజనేయులు, జిల్లా బత్తుల మహేష్, సుఖపోగి శ్యామ్‌కుమార్, చప్పిడి కోటయ్య, చిగురుపల్లి బాబి తదితరులపై కేసు నమోదు చేశారు.


గన్నవరం సగర సంఘం సమావేశంలో మాట్లాడుతున్న యార్లగడ్డ వెంకట్రావు

అండగా ఉంటా.. ఆశీర్వదించండి

▸ యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరం, ఏప్రిల్ 15 : అందరికీ అండగా ఉంటా.. ఆశీర్వదించండి. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ అన్నారు. బుద్ధవరం శివారు రాజీవ్‌నగర్ కాలనీలో సోమవారం సగర ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ, సగర్లు సామాజికంగా ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక భవన నిర్మాణ కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని చెప్పారు. గతంలో టీడీపీ ప్రభుత్వం సగర్ల సంక్షేమానికి పెద్దపీట వేసిందని గుర్తుచేశారు. బడుగు బలహీన వర్గాలను హక్కున చేర్చుకున్నది టీడీపీనేనన్నారు. వైసీపీ పాలనలో దాడులు, విధ్వంసం తప్ప అభివృద్ధి లేదన్నారు. యువకులకు ఉపాధి అవకాశం నియోజకవర్గంలోనే కల్పిస్తామని, తాగు, సాగునీటి ఇబ్బందులు తొలగిస్తానని చెప్పారు. రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సగర సాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు వీర శ్రీనివాసరావు, జిల్లా తాడిశెట్టి వీరాస్వామి, గండికోట సీతయ్య, కర్నాటి నాగార్జునరావు, నక్కా వెంకటేశ్వరరావు, కె.వెంకటయ్య, నక్కా సుబ్బారావు, తాడిపర్తి నాగప్రసాద్, తాడిశెట్టి శ్రీను, నక్కా బుజ్జి, దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. తొలుత భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. వెంకట్రావును గజమాలతో సత్కరించారు.

అన్ని రంగాలను వైసీపీ దెబ్బ తీసింది : వసంత

జి.కొండూరు, ఏప్రిల్ 15 : వైసీపీ ప్రభుత్వం అన్ని రంగాలను దెబ్బ తీసిందని బీజేపీ, జనసేన బలపర్చిన మైలవరం టీడీపీ కూటమి అభ్యర్థి వసంత వెంకట కృష్ణ ప్రసాద్ అన్నారు. సోమవారం ఆయన చెవుటూరు, వెంకటాపురంలో రచ్చబండ ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ సోదరుల అభ్యున్నతికి సంబంధించి 27 సంక్షేమ పథకాలను వైసీపీ రద్దు చేసిందన్నారు. విదేశీ విద్యకు ఉన్న అంబేడ్కర్ పేరును మార్చి జగనన్న విదేశీ విద్య అని పెట్టుకోవడమే కాక విద్యార్థులకు సాయం ఆపేశారని ధ్వజమెత్తారు. విద్యుత్ చార్జీలు పెంచడంతో ఏపీకి పరిశ్రమలు రాలేదన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు సైతం పెంచారన్నారు. చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయకపోవడంతో ఈప్రాంత రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. అమరావతిని సైతం నాశనం చేశారని మండి పడ్డారు. ఐదేళ్ల నరకరానికి సంక్షోభానికి సమస్యలకు ప్రజలు చెక్ పెట్టే సమయం వచ్చిందన్నారు. మహా కూటమి అధికారంలోకి వస్తేనే అన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందించగల సత్తా చంద్రబాబు నాయుడుకే ఉందన్నారు. కార్యక్రమంలో జంపాల సీతారామయ్య, చెన్నుబోయిన చిట్టిబాబు, ఉయ్యూరు వెంకట నరసింహారావు, పజ్జూరు రవికుమార్, లంక రామకృష్ణ, పంటాపంచల నరసింహారావు, ఆరే లక్ష్మీకుమార్, యరమల సంజీవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


చెవుటూరులో మాట్లాడుతున్న వసంత


రుద్రపాకలో ప్రచారం నిర్వహిస్తున్న వెనిగండ్ల రాము, పిన్నమనేని

టీడీపీతోనే గ్రామాల అభివృద్ధి : వెనిగండ్ల

నందివాడ (రుద్రపాక), ఏప్రిల్ 15 : గ్రామాలు అభివృద్ధి చెందాలంటే తెలుగు దేశం పార్టీ అధికారంలోకి రావాలని గుడివాడ నియోజకవర్గ టీడీపీ కూటమి అభ్యర్థి వెనిగండ్ల రాము అన్నారు. సోమవారం మండలంలోని రుద్రపాకలో మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, గుడివాడ అర్బన్ బ్యాంక్ చైర్మన్ పిన్నమనేని పూర్ణ వీరయ్య చౌదరి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. గ్రామంలో రాముకు ఘన స్వాగతం లభించింది. ఇంటింటికి తిరిగి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ, గ్రామాలలో అభివృద్ధి పనులు కుంటుపడ్డాయని, అభివృద్ధి శూన్యమన్నారు. ఎన్నికలలో తెలుగుదేశం ప్రభుత్వానికి ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పాలడుగు నానారావు, ధర్మపాల్, సర్పంచ్ జంగం రాజు, మేక రాయుడు, పొట్లూరి శేషగిరిరావు, జాస్తి సాంబశివరావు, పొలిమేట్ల జాన్ అంబేడ్కర్ నూరిబాబు, స్వామి, శివరాజు, వెంకటేశ్వరరావు, పందు విజయ్, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సభకు ఆహ్వానం పలుకుతూ ఆహ్వాన పత్రికలు అందజేస్తున్న కూటమి నేతలు

బాబు ప్రజాగళం సభకు విస్తృత ఏర్పాట్లు

పెడన, ఏప్రిల్ 15 : ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈనెల 17న పెడన పట్టణంలోని బస్టాండ్ సెంటర్‌లో నిర్వహించనున్న ప్రజాగళం బహిరంగ సభ ఏర్పాట్లను టీడీపీ కూటమి అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డు వేణుగోపాలరావులు సోమవారం పర్యవేక్షించారు. ఈ సభలో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు, జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్‌లు ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారని కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని 23 వార్డుల్లో ఇంటింటికీ వెళ్లి సభకు హాజరు కావాలని కోరుతూ ఆహ్వానపత్రికలు పంచిపెట్టారు. పట్టణంలో చంద్రబాబునాయుడు, పవన్‌కళ్యాణ్‌ల సభలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకుగాను పోలీసులు 500 మందితో గట్టి బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎస్‌ఐ సూర్యశ్రీనివాస్ సోమవారం సిబ్బందితో ప్రధాన రహదారులకు ఇరువైపులా ఉన్న భవనాలు, చెట్లను పరిశీలించారు. ప్రతి భవనంపైన ముగ్గురు పోలీసులను ఉంచాలని నిర్ణయించారు.

నేడు 4వ తరగతి విద్యార్థులకు
స్టేట్ లెర్నింగ్ అచీవ్‌మెంట్ సర్వే



మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 15 : కృష్ణా జిల్లాలో 142 పాఠశాలల్లో మంగళవారం 4వ తరగతి విద్యార్థులకు స్టేట్ లెర్నింగ్ అచీవ్‌మెంట్ సర్వేలో భాగంగా పరీక్షలు నిర్వహించనున్నట్టు డీఈవో తాహెరా సుల్తానా తెలిపారు. సోమవారం కృష్ణవేణి ఐటీఐలో జిల్లాలోని వివిధ మండల విద్యాశాఖాధికారులతో జరిగిన సమావేశంలో డీఈవో మాట్లాడారు. జిల్లాలో వివిధ యాజమాన్యాలకు చెందిన 142 పాఠశాలల్లో 3229 మంది 4వ తరగతి విద్యార్థినీ విద్యార్థులకు తెలుగు, ఆంగ్లం, గణితంలలో 90 నిమిషాల సేపు పరీక్ష నిర్వహిస్తారన్నారు. మూడు సబ్జెక్టుల్లో రెండు సబ్జెక్టుల్లో విద్యార్థులు పరీక్షలు రాయాలన్నారు. విద్యార్థుల బోధనాభ్యసన సామర్థ్యాలను బేరీజు వేసేందుకు ఈ పరీక్షలకు 142 మంది ఫీల్డ్ ఇన్విజిలేటర్లు, ఎంఈవోలను నియమించారు. కార్యక్రమంలో జిల్లా సీఈ బోర్డు సెక్రటరీ షేక్ జాన్‌సాహెబ్, ఎంఈవోలు పాల్గొన్నారు. వేసవి ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నందున విద్యార్థులకు తగిన తాగునీరందించాలన్నారు. ఈనెల 23 నుంచి పాఠశాలలకు వేసవి సెలవులు ఇస్తున్నారన్నారు. జూన్ 6న పాఠశాలలు పునఃప్రారంభమవుతాయన్నారు.

జగన్ బస్సు.. జనం కస్సు బుస్సు!

సీఎం సిద్ధం సభ కోసం..

అధికార పార్టీ నేతల అత్యుత్సాహం

▸ విద్యుత్ కోతలతో జనం విలవిల

▸ బస్సుల్లేక ప్రయాణికుల అవస్థలు

▸ పోలీసుల ముందస్తు అరెస్టులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఏప్రిల్ 15 : ఒక వైపు నిప్పుల కొలిమిలా ఎండ.. మరోవైపు జగన్ బస్సు యాత్ర కోసం ప్రభుత్వ పెద్దలు, అధికారులు, పోలీసు యంత్రాంగం అత్యుత్సాహం మధ్య జనం అల్లాడుతున్నారు. సీఎం బస్సు యాత్ర ఉందని ఎక్కడికక్కడ విద్యుత్‌ను గంటల తరబడి నిలిపివేయడంతో గ్రామాల్లో ప్రజలు నరకం చూశారు. సీఎం బస్సు యాత్ర సోమవారం పెరికీడు, కానుమోలు, ఆరుగొలను మీదుగా గుడివాడ వెళ్లింది. ఈ సందర్భంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు విద్యుత్‌ను నిలుపుదల చేశారు. అసలే ఎండ వేడితో ప్రజలు అల్లాడుతుంటే సీఎం పర్యటన పేరుతో గంటల తరబడి విద్యుత్ కోతలపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.


ఎ.సీతారాంపురం కూడలి వద్ద.. కానరాని జనం..


జగన్ బస్సు యాత్ర సందర్భంగా గన్నవరంలో రోడ్డుపై విద్యుత్ వైర్లు తొలగిస్తున్న సిబ్బంది

గుడివాడ వైపు బస్సుల్లేవు..

జగన్ బస్సు యాత్ర కారణంగా గుడివాడవైపు బస్సులను సోమవారం మధ్యాహ్నం నుంచి నిలుపుదల చేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విజయవాడ వెళ్లి అక్కడ నుంచి గుడివాడ వెళ్లాలంటూ ఆర్టీసీ సిబ్బంది సూచించడం.. రాత్రి వరకూ ఇదే పరిస్థితి కొనసాగటంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

గన్నవరంలో గరం.. గరం

గన్నవరం : సీఎం జగన్మోహన్‌రెడ్డి బస్సు యాత్రకు జనాన్ని తరలించేందుకు వైసీపీ నేతలు నానా పాట్లు పడుతున్నారు. గన్నవరం నియోజకవర్గంతో పాటు నూజివీడు, విజయవాడ నుంచి ప్రజల్ని తరలించేందుకు రూ.300 నగదు, బైక్‌కు రూ.100 పెట్రోల్, బిర్యానీ పొట్లాలు, క్వార్టర్ మందు ఆఫర్లు ఇచ్చారు. వృద్ధులు, ఓట్లు లేని వారిని కూడా యాత్రకు తీసుకొచ్చారు. మండుటెండలో ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గన్నవరంలో షాపులను మూయించారు. బస్సు యాత్ర వెళ్లే వరకు విద్యుత్ నిలిపివేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విజయవాడ వెళ్లే బస్సు కింద యువకుడు ద్విచక్ర వాహనంతో పడిపోగా డ్రైవర్ అప్రమత్తతతో పెద్ద ప్రమాదం తప్పింది. పలుచోట్ల వైసీపీ కార్యకర్తలు ఘర్షణ పడ్డారు. భవనాలపై ఎవరూ ఎక్కకుండా పోలీసులు ప్రజలను అడ్డుకున్నారు.

బస్సుల్లేక ప్రయాణికుల అవస్థలు

అవనిగడ్డ : సీఎం జగన్మోహన్‌రెడ్డి సిద్ధం సభను పురస్కరించుకుని ఆర్టీసీ సర్వీసులను రద్దు చేసి బస్సులను గుడివాడకు తరలించటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా తెల్లవారుజామున 2.30 గంటలకు విజయవాడ రైల్వే స్టేషన్‌కు వెళ్లే బస్సును రద్దు చేయటంతో ప్రయాణికులు బస్టాండ్ వద్ద పడిగాపులు కాసే పరిస్థితి ఏర్పడింది. దీనికి తోడు అన్ని రోడ్లలోని బస్సులను రద్దు చేయటంతో నాగాయలంక, కోడూరు మండలాల నుంచి తీర ప్రాంత మత్స్యకార గ్రామాలకు వెళ్లే ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. మత్స్యకార గ్రామాల ప్రజలు కేవలం ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణం చేయాలన్న కట్టుబాటును ఖచ్చితంగా పాటిస్తుంటారు. అలాంటి గ్రామాలకు వెళ్లే సర్వీసులను రద్దు చేసి సీఎం జగన్ సభకు తరలించటంతో తమ గ్రామాలకు వెళ్లేందుకు ఆటోలు కూడా లేక ఇబ్బందులు పడుతున్నామని, గడిచిన రెండు నెలల కాలంగా సిద్ధం సభల కోసం తమ గ్రామాలకు వచ్చే బస్సులను రద్దు చేసి సభకు తరలించారని, ఎక్కువ సర్వీసులు ఉండే సర్వీసులను రద్దు చేస్తే ప్రత్యామ్నాయ అవకాశాలు ఉంటాయని, గ్రామాలకు సర్వీసులను రద్దు చేయటం దారుణమని తీర ప్రాంత గ్రామాల ప్రజలు వాపోతున్నారు.


ఉయ్యూరు బస్టాండ్‌లో ప్రయాణికుల పడిగాపులు

ఉయ్యూరు : ఉయ్యూరు ఆర్టీసీ డిపోతో పాటు ఇతర డిపోల బస్సులన్నీ సోమవారం గుడివాడ జగన్మోహన్‌రెడ్డి సభకు తరలి వెళ్లడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఉయ్యూరు డిపోలో 50 బస్సులకుగాను 7 బస్సులు మరమ్మతులకు గ్యారేజిలో ఉండగా 42 బస్సులు గుడివాడకు వెళ్లగా ఒక బస్సు మాత్రం డిపోలో ఉంచారు. స్థానిక డిపో బస్సులే కాక ఇతర డిపోల నుంచి వచ్చే బస్సులు కూడా లేకపోవడంతో బస్టాండ్, బస్టాపులో ప్రయాణికులు పడిగాపులు కాచారు. ఎంతసేపు వేచి చూసినా బస్సులు రాకపోవడంతో అధిక చార్జీ చెల్లించి ఆటోలను ఆశ్రయించారు. మంగళవారం కూడా బస్సులు భీమవరంలో జరిగే జగన్మోహన్ రెడ్డి సభకు కేటాయించినట్లు డిపో అధికారులు తెలిపారు.


కంకిపాడులో ఉదయం 8 గంటలకే జన సమీకరణకు ఏర్పాటు చేసిన బస్సులు

ఉదయం 8 గంటలకే ఆర్టీసీ బస్సులు..

కంకిపాడు : అధికార పార్టీ నాయకులు అత్యుత్సాహం ప్రదర్శించారు. ఉదయం 8 గంటలకే సుమారు 40 ఆర్టీసీ బస్సులు కంకిపాడు పోలీసు స్టేషన్ సెంటర్‌కు చేరుకున్నాయి. దీంతో వివిధ ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వివరాల్లోకి వెళ్తే రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి సోమవారం గుడివాడలో సాయంత్రం 6 గంటల సమయంలో నేను సిద్ధం కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. దీంతో ఈ బహిరంగ సభకు మండలంలోకి వివిధ గ్రామాల నుంచి సుమారు 40 ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేశారు. ఉదయం 8 గంటలకే ఆర్టీసీ బస్సులు కంకిపాడులోని పోలీసు స్టేషన్ అంటే రైతు బజారు వద్దకు చేరుకున్నాయి. మధ్యాహ్నం 2 గంటల సమయంలో కంకిపాడులోని వివిధ గ్రామాలకు అవి పయనమయ్యాయి. 8 గంటల నుంచి భారీ సంఖ్యలో ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయడంతో సాధారణ ప్రయాణీకులు బస్సులు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రయాణీకులు బస్సుల కోసం వేచి చూసి అవిలేక ఆటోలను ఆశ్రయించారు.

ముందస్తు అరెస్టులు



గుడివాడ : ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన తరువాత కూడా పోలీసులు తమ ప్రతాపం చూపుతూనే ఉన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సిద్ధం సభకు సీఎం జగన్ వస్తున్నారన్న కారణంతో సోమవారం ఉదయం సీపీఎం నాయకులు, టిడ్కో కాలనీ కమిటీ సభ్యులను పోలీసులు గృహనిర్బంధం చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే గృహనిర్బంధాలు చేస్తున్నట్టు పోలీసులు తెలపడంతో సీపీఎం నాయకులు బీవీ శ్రీనివాస్, టిడ్కో కాలనీ అభివృద్ధి కమిటీ కార్యదర్శి అరుణలు ఆక్షేపణ తెలిపారు. సీఎం గుడివాడ నుంచి వెళ్లే వరకు తమ అదుపులోనే ఉండాలని పోలీసులు ఆదేశించి వారి ఇంటి ముందు బందోబస్తును ఏర్పాటు చేశారు.

జగన్‌కు అభ్యర్థుల పాదాక్రాంతం..!

గుడివాడ : జగన్ సభలో మచిలీపట్నం పార్లమెంట్ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖర్‌తో పాటు అసెంబ్లీ అభ్యర్థుల పరిచయ కార్యక్రమంలో మచిలీపట్నం, పెడన, పామర్రు అభ్యర్థులు పేర్ని కృష్ణమూర్తి(కిట్టు), ఉప్పాల రాము, కైలే అనీల్‌కుమార్‌లు జగన్‌కు పాదాభివందనం చేశారు. అవనిగడ్డ అభ్యర్థి సింహాద్రి రమేశ్ సగం వంగి నమస్కారం చేశారు. ఈ పరిణామంతో అక్కడే ఉన్న వైసీపీ శ్రేణులు అవాక్కయారు.

సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టులపై..
దృష్టి సారించండి

▸ కృష్ణా కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల సమయంలో సోషల్ మీడియాలో వచ్చే అభ్యంతరకర, అసభ్యకరమైన పోస్టింగ్‌లపై అధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో మీడియా సర్టిఫికేషన్, మానిటరింగ్ కమిటీ(ఎంసీఎంసీ) సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇప్పటివరకు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో వచ్చిన ప్రకటనలు, పెయిడ్ ఆర్టికల్స్‌పై వివరాలు సేకరించారు. గుర్తింపు పొందిన రాజకీయపార్టీల ప్రచార ప్రకటనలపై అధికారులకు పలు సూచనలు చేశారు. గ్రూప్‌ల్లో వచ్చే అసభ్యకరమైన పోస్టులను వాటిని సంబంధిత నియోకవర్గాల రిటర్నింగ్ అధికారులు సైబర్‌క్రైం టీమ్‌లకు పంపాలన్నారు. సినిమా హాళ్లలో, కేబుల్ టీవీలలో, బల్క్‌ఎస్ఎంఎస్‌లు, వాయిస్ మెస్సేజ్‌ల రూపంలో రాజకీయపార్టీ నాయకులు చేయబోయే ప్రచారానికి ముందస్తుగానే ఎంసీఎంసీ ద్వారా అనుమతులు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీఆర్వో కె.చంద్రశేఖరరావు, సమాచార శాఖ డీడీ ఎం.వెంకటేశ్వరప్రసాద్, ఎంసీఎంసీ కమిటీసభ్యులు పాల్గొన్నారు.


ఎంసీఎంసీ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

కనీస సౌకర్యాలు కల్పించండి

మే 13న విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది ఇబ్బందులు పడకుండా పోలింగ్ కేంద్రాల వద్ద కనీస సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ బాలాజీ అధికారులకు సూచించారు. పోలింగ్ ముందురోజే మే 12వతేదీ సాయంత్రానికి అధికారులు, సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు చేరుకుంటారన్నారు. అక్కడ తాగునీరు, విద్యుత్ సౌకర్యం, భోజనవసతి, టాయిలెట్లు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. 13వతేదీ ఉదయం 7గంటలనుంచే పోలింగ్ ప్రారంభమవుతుందన్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందుబిళ్లలు, అందుబాటులో ఉంచాలని ఐసీడీఎస్ అధికారులకు కలెక్టర్ సూచించారు.

అధికారులు బాధ్యతగా ఉండాలి

పామర్రు : వచ్చేనెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పేర్కొన్నారు. స్థానిక కంచర్ల రామారావు జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో సోమవారం నియోజకవర్గ మాస్టర్‌ట్రైనర్స్‌తో పీవో, ఏపీవోలకు జరుగుతున్న తొలివిడత శిక్షణ తరగతులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ, పీవోలు, ఏపీవోలు శిక్షణ అంశాలపై ఎక్కడా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలన్నారు. మాక్ పోలింగ్‌తో పాటు ఈవీఎం, వీవీప్యాడ్ల విషయంలో అప్రమత్తంగా వ్యహరించాలన్నారు. ఏవైనా ఇబ్బందులు ఎదురైతే తక్షణమే రిటర్నింగ్ అధికారిని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఐదుమండలాల తహసిల్దార్లు మాస్టర్‌ట్రైనీలు, టెక్నికల్ సిబ్బంది పాల్గొన్నారు.

సీ-విజిల్ ఫిర్యాదుల పరిష్కారం

▸ ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

కృష్ణలంక, ఏప్రిల్ 15 : జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ) అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు సీ విజిల్ ద్వారా 526 ఫిర్యాదులు రాగా అన్నింటిని క్షుణంగా పరిశీలించి పరిష్కరించినట్లు జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓటర్ హెల్ప్‌లైన్, నేషనల్ గ్రీవెన్స్ సర్వీసెస్ పోర్టల్ (ఎన్‌జీఎస్‌పీ) తదితర మార్గాల ద్వారా మొత్తం 1,331 ఫిర్యాదులు రాగా 1,303 ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియ పూర్తయిందని, మిగిలినవి పురోగతిలో వున్నాయని వివరించారు. ఓటర్ హెల్ప్‌లైన్ (1950) ద్వారా 211 ఫిర్యాదులు రాగా 211 ఫిర్యాదుల పరిష్కారం పూర్తయిందన్నారు. ఎన్‌జీఎస్‌పీ ద్వారా 407 ఫిర్యాదులు రాగా 403 ఫిర్యాదులను పరిష్కరించినట్లు తెలిపారు. అదే విధంగా వాట్సాప్ నంబర్ (9154970454) ద్వారా 31 ఫిర్యాదులు రాగా 27 ఫిర్యాదులు, కాల్‌సెంటర్ (0866-2570051) ద్వారా 22 ఫిర్యాదులు రాగా 22 ఫిర్యాదులను పరిష్కరించినట్లు తెలిపారు. కంప్లయింట్ మేనేజ్‌మెంట్ సిస్టం (సీఎంఎస్) ద్వారా 58 ఫిర్యాదులు రాగా 48 ఫిర్యాదులను, సీఈఓ మెయిల్స్ ద్వారా 13 ఫిర్యాదులు రాగా 9 ఫిర్యాదులను పరిష్కరించినట్లు తెలిపారు. 63 ప్రతికూల వార్తలకు సంబంధించి 57 అంశాలను పరిష్కరించినట్లు తెలిపారు. ప్రతి ఫిర్యాదుపైనా ప్రత్యేకంగా దృష్టిసారించి నాణ్యతతో పరిష్కరిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు, ఇతర అధికారులు

అధికారులతో కలెక్టర్ సమీక్ష

ఈనెల 18న నోటిఫికేషన్ విడుదల కానున్న నేపథ్యంలో కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఎన్నికల నిర్వహణకు సంబంధించిన వివిధ అంశాలపై కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో సోమవారం సమీక్ష నిర్వహించారు. నామినేషన్ల ప్రక్రియ నిర్వహణకు చేయాల్సిన ఏర్పాట్లు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ) అమలు సరళి, ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూం కార్యకలాపాలు, వివిధ మార్గాల ద్వారా వస్తున్న ఫిర్యాదులు-వాటి పరిష్కారం, ఎన్నికల పరిశీలకులకు చేయాల్సిన ఏర్పాట్లు, ఎన్నికల సీజర్ మేనేజ్‌మెంట్ వ్యవస్థ అమలు, ఎన్నికల సిబ్బంది శిక్షణ కార్యక్రమాలు తదితరాలపై చర్చించి సూచనలు చేశారు. ఈ సమావేశంలో డీఆర్‌వో వి.శ్రీనివాసరావు, కలెక్టరేట్ ఏవో సీహెచ్.నాగలక్ష్మి, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ ఎం.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రూ.7.06 కోట్ల విలువైన నగదు, మద్యం, ఇతర వస్తువుల సీజ్

▸ ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

కృష్ణలంక, ఏప్రిల్ 15 : ఎన్టీఆర్ జిల్లాలో ఇప్పటివరకు రూ.7.06 కోట్ల విలువైన నగదు, మద్యం, మత్తుపదార్థాలు, విలువైన వస్తువులు, ఉచితాలు తదితరాలను సీజ్ చేసినట్టు కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.3.16 కోట్ల నగదుతో పాటు రూ.94.16 లక్షల 19,583 లీటర్ల మద్యం, రూ.12.20 లక్షల 1,84,201 గ్రాముల మత్తుపదార్థాలు, రూ.2.32 కోట్ల విలువైన 7,758 గ్రాముల విలువైన లోహాలు, రూ.6.43 లక్షల విలువైన 132 ఉచితాలను సీజ్ చేసినట్టు తెలిపారు.

బాల్య వివాహాల నియంత్రణకు పటిష్ట చర్యలు

▸ జేసీ సంపత్‌కుమార్

కృష్ణలంక, ఏప్రిల్ 15 : జిల్లాలో బాల్య వివాహాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవడం జరిగిందని జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్‌రైట్స్ ఉన్నతాధికారులకు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల జాయింట్ కలెక్టర్లు, మహిళాభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ అధికారులతో సోమవారం నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్‌రైట్స్ సంస్థ వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్షించారు. నగరంలోని జాయింట్ కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జేసీ డాక్టర్ సంపత్‌కుమార్ వీడియో కాన్ఫరెన్సు ద్వారా మాట్లాడుతూ జిల్లాలో బాల్యవివాహాలు నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకొంటున్నామన్నారు. గత మూడు నెలల్లో 25 బాల్య వివాహాలు (చైల్డ్‌మ్యారేజ్) జరగకుండా నియంత్రించడం జరిగిందని, వీటిలో రెండు బాల్యవివాహాలపై కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. బాల్య వివాహ నిషేధచట్టంపై అన్నిశాఖల సమన్వయంతో జిల్లావ్యాప్తంగా అవగాహన సదస్సులు నిర్వహించడం జరిగిందన్నారు. పాఠశాలలో చదువుకొంటున్న విద్యార్థులు డ్రాప్ అవుట్ కాకుండా అన్ని చర్యలు తీసుకొంటున్నామని, డ్రాప్ అవుట్ అయిన విద్యార్థులను గుర్తించి తిరిగి స్కూల్ నందు రీజాయిన్ చేయించడం జరిగిందని జేసీ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్త్రీ శిశు సంక్షేమశాఖ ప్రాజెక్ట్ డైరక్టర్ జి.ఉమాదేవి, లైన్ డిపార్ట్మెంట్ జిల్లా అధికారులు, డీసీపీఓ రాజేశ్వరరావు, జాన్సన్ వున్నారు.

వేణుగోపాలస్వామి భూమి టెండర్లు రద్దు చేయాలి

(5వ పేజీ తరువాయి)

ఈవో సుబ్బారెడ్డి, ఆలయ సిబ్బందిని విచారించారు. ఈనెల 8న ఆయన క్షేత్రస్థాయిలో సంబంధిత భూములను కూడా పరిశీలించారు. అనంతరం దేవదాయ కమిషనర్‌కు 8 పేజీల నివేదిక సమర్పించారు. తాను స్వయంగా ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌తో కలిసి విజయవాడ బందర్‌రోడ్డుకు కేవలం 400 మీటర్ల దూరంలో ఉన్న సంబంధిత 7.75 ఎకరాల భూమిని పరిశీలించినట్టు విజయరాజు తెలిపారు. అందులో లీజుదారుడు మొక్కజొన్న, అరటి పంటలను వేసి ఉన్నట్టుగా పేర్కొన్నారు. ఈ క్రమంలో ఈ భూమిని తక్కువ కాలానికి (3 సంవత్సరాలకు) లీజుకు ఇవ్వడం సరికాదని, దీనిని వాణిజ్య పరంగా 11 సంవత్సరాలకుగాను లీజుకు ఇవ్వాలని బిట్‌లు బిట్‌లుగా వీడదీసి లీజుకు ఇస్తే ఆదాయం కూడా వస్తుందని విజయరాజు తన నివేదికలో స్పష్టం చేశారు. ప్రస్తుతమిచ్చిన లీజును రద్దు చేయాల్సిందిగా కోరుతూ సిఫారసు చేశారు. ఇదే క్రమంలో మంగలిమాన్యం, జంగాల మాన్యం, అర్చక నిర్వహణ నిమిత్తం కేటాయించిన భూముల విషయంలో కూడా చర్యలు తీసుకోవాలని విజయరాజు సిఫారసు చేశారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	128, 137, 148
చికెన్ విత్ స్కిన్	244
చికెన్ స్కిన్‌లెస్	254



నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.04

త్రిశక్తిపీఠంలో గన్నేరు పూలతో పుష్పార్చన

కృష్ణలంక, ఏప్రిల్ 15 : క్రోధి నామ సంవత్సరం వసంత నవరాత్రుల ఏడో రోజైన సోమవారం త్రిశక్తిపీఠంలోని అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు భక్తులు 25 కిలోల గన్నేరు పూలతో విశేష పుష్పార్చన నిర్వహించారు. ముందుగా ఉత్సవ విగ్రహాలకు పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ కమిటీ కార్యదర్శి జగదీష్‌కుమార్, ఆలయ ఆధ్యాత్మిక సలహాదారు భారతుల వి జయ్‌కిరణ్, సూపరింటెండెంట్ అచ్యుత మధుసూదనరావు పాల్గొన్నారు.





పూరీలు వేస్తున్న వెంకట్, కార్తీక్, ప్రచారంలో జానకీ లక్ష్మి, ధనలక్ష్మి, ప్రచారంలో సుజనా చౌదరి

జోరందుకున్న కూటమి అభ్యర్థుల ప్రచారం

వన్‌టౌన్, ఏప్రిల్ 15: పశ్చిమలో బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరి, పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కేశినేని శివనాథ్(చిన్ని)ల ప్రచారం జోరుగా సాగుతుంది. ఇద్దరు అభ్యర్థుల తరఫున కుటుంబ సభ్యులు కూడా ప్రచార రంగంలో దిగారు.

కూటమి అభ్యర్థులను గెలిపించాలి

54వ డివిజన్‌లో సోమవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో విజయవాడ పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి కేశినేని శివనాథ్ కుమారుడు వెంకట్, పశ్చిమ బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరి కుమారుడు యలమంచిలి కార్తీక్‌లు పాల్గొన్నారు. తొలుత పంజాసెంటర్‌లో ఉన్న మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పంజా సెంటర్ నుంచి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు, ఇంటింటికీ వెళ్లడంతో పాటు రోడ్లపై ఉన్న వ్యాపారస్తులను కలిశారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఓ టిఫిన్ బండి వద్ద పూరీలు వేసి ఎన్‌డీఏ ప్రభుత్వం ఏర్పడిన తరువాత సామాన్య చిరు వ్యాపారుల సమస్యలను తీరస్తామని తెలిపారు. కూటమి అభ్యర్థులను గెలిపించాలన్నారు. నాయకులు ఫతావుల్లా తాజుద్దీన్‌చ మౌనిక, కరీముల్లా, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

● 40వ వార్డులో కేశినేని శివనాథ్ సతీమణి జానకీ లక్ష్మి, సుజనా చౌదరి సోదరి సిరిపురపు ధనలక్ష్మిలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పెట్రోల్ బంకు నుంచి ప్రచారం ప్రారంభించారు. భవానీపురం కరకట్ట ప్రాంతం, బాల భాస్కర్‌నగర్, అల్లుడిపేటలలో కొనసాగింది. ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి వస్తే అమలులోకి రానున్న సంక్షేమ పథకాలు తదితరాలను వివరించారు. ఎంపీగా కేశినేని శివనాథ్‌ని, పశ్చిమ ఎమ్మెల్యేగా సుజనాచౌదరిని గెలిపించా లన్నారు. డివిజన్ నాయకులు పీవీ సుబ్బారావు, జి. గణేష్, సురేష్, కే. శ్రీనివాసరావు, సీహెచ్ నాగరాజు, ఎం నారాయణ, వెంకటేశ్వర్లు, దుర్గారావు, శివాజీ, ఆదినారాయణ పాల్గొన్నారు.

● ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వస్తేనే అభివృద్ధి, సంక్షేమం జరుగుతుందని పశ్చిమ బీజేపీ అభ్యర్థి సుజనాచౌదరి అన్నారు. 39వ డివిజన్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో డివిజన్ టీడీపీ అధ్యక్షుడు రేగళ్ల లక్ష్మణ్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. విద్యాధరపురం సంజయ్‌గాంధీ కాలనీ, సిమెంట్ రోడ్డు కామకోటినగర్లలో ఆయన పర్యటించారు. కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

అభివృద్ధి కోసమే కూటమి ఏర్పాటు

తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి గద్దె రామ్మోహన్

భారతీనగర్, ఏప్రిల్ 15: రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసమే టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు కలిసి కూటమిగా ఏర్పడి ఎన్నికల్లో పోటీ చేస్తున్నాయని టీడీపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి గద్దె రామ్మోహన్ అన్నారు. తూర్పు పరిధి 3వ డివిజన్‌లోని కామినేని నగర్ కాలనీవాసులతో, పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్, తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి గద్దె రామ్మోహన్ సోమవారం ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సమావేశంలో జనసేన, బీజేపీ నాయకులతో పాటు టీడీపీ నాయకులు, కాలనీ పెద్దలు పాల్గొన్నారు. వచ్చే ఎన్నికల్లో జనసేన, బీజేపీ బలపరిచిన తూర్పు అభ్యర్థిగా తనను, ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని గద్దె రామ్మోహన్ కోరారు. ఈ సందర్భంగా గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ చంద్రబాబునాయుడుపై రాళ్లదాడి జరిగితే హాస్యాస్పదంగా మాట్లాడిన వైసీపీ నాయకులు, మరి ఇప్పుడు జగన్మోహన్‌రెడ్డిపై ఆకతాయి చిన్న రాయి విసిరితే ఎందుకు ఇంత రాద్ధాంతం చేస్తున్నారని ప్రశ్నించారు.



మాట్లాడుతున్న కేశినేని శివనాథ్, గద్దె రామ్మోహన్

కేశినేని శివనాథ్ మాట్లాడుతూ ప్రజలకు ఎప్పుడు ఏ అవసరం వచ్చినా నేరుగా గద్దె రామ్మోహన్ దగ్గరకు, తన దగ్గరకు రావచ్చునని అన్నారు. గద్దె అనురాధ, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కె.పట్టాభి, బొప్పన భవకుమార్, మమ్మనేని ప్రసాద్ మాట్లాడారు. తాడి బాబు రావు, యలమంచలి రాజేంద్రప్రసాద్, ఏసు, యలమంచిలి రాజా, గుండమాల రాజశేఖర్, పేరేపి ఈశ్వర్ పాల్గొన్నారు.

61వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం

పాయకాపురం, ఏప్రిల్ 15 : స్థానిక 61వ డివిజన్‌లో టీడీపీ నేతలు సోమవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు ఇంటింటికీ వెళ్లి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే వైసీపీ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి తెలుగుదేశం పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

చంద్రబాబుతోనే అమరావతి అభివృద్ధి

● జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ



బాడవపేట ప్రచారంలో గద్దె అనురాధ

పటమట, ఏప్రిల్ 15 : వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు నాయుడుని గెలిపించుకుని అమరావతిని రాజధానిగా అభివృద్ధి చేసుకుందామని జెడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ గద్దె అనురాధ పిలుపునిచ్చారు. తూర్పు పరిధి 9వ డివిజన్ నారా చంద్రబాబునాయుడు కాలనీలో సోమవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యేగా గద్దె రామ్మోహన్‌రావు, ఎంపీగా కేశినేని శివనాథ్‌లకు సైకిల్ గుర్తుపై ఓట్లేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. గద్దె అనురాధ మాట్లాడుతూ చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్రంలో ప్రతి వర్గం సంతోషంగా ఉంటుందన్నారు. కార్పొరేటర్ చెన్నుపాటి క్రాంతి, యలమంచిలి దేవేంద్ర, అన్నాబత్తుని బాబీ, కడియాల భవానీ, మొటపర్తి లక్ష్మి, జె. సుష్మ, శైకం సుధీర్, లక్ష్మి నరసింహారావు, శేషయ్యలు పాల్గొన్నారు.

మొగల్రాజపురం: 7వ డివిజన్ బాడవ పేట ఏరియాలో సోమవారం గద్దె అనురాధ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జనసేన, బీజేపీ బలపరచిన పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే అభ్యర్థి గద్దె రామ్మోహన్‌కు సైకిల్ గుర్తు మీద ఓటేసి గెలిపించాలని కోరారు. అనంతరం మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రాగానే టిడ్కో ఇళ్లు ఇప్పించి మీ మీద పడ్డ ఇంటి అద్దె భారం తగ్గిస్తామని హామీ ఇచ్చారు. ఎస్సీ సెల్ నాయకుడు సొంగా సంజయ్ వర్మ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ప్రసూతి ఆసుపత్రి నిర్మాణానికి గద్దె రామ్మోహన్ ప్రయత్నం చేయగా తరువాత వచ్చిన ప్రభుత్వం ఆపేసిందని చెప్పారు. పటమట సతీష్ చంద్ర, పోతం శెట్టి నాగేశ్వరరావు, గుమ్మడి గురుప్రసాద్, దోమకొండ అశోక్, అన్నే రాయలు, కొండపల్లి లక్ష్మణరావు, దోమకొండ జ్యోతి, దయాల శిరీషా గాంధీ, నాగుమోతు రాజా, నందిగం రమాదేవి, బెనర్జీ, కలగట్ల చిన్న, కూరపాటి దిలీప్ తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

పాయకాపురం, ఏప్రిల్ 15: విద్యుత్ లైన్లకు, ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతుల కారణంగా పాయకాపురం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కార్యనిర్వాహక ఇంజనీర్ బీవీ సుధాకర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వాంబేకాలనీ, దేవినేని గాంధీపురం, పైపులరోడ్డు, వైఎస్సార్ పార్క్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి 10 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. **లబ్బీపేట:** న్యూ బ్రిడ్జి సెక్షన్, న్యూ బ్రిడ్జి విద్యుత్ ఉపకేంద్రం, 11కేవీ టెలిఫోన్ ఎక్సేంజ్ ఫీడర్ పరిధిలో మంగళవారం ఉదయం 8గంటల నుంచి 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజనీర్ బీవీ సుధాకర్ తెలిపారు. పకీరుగూడెం, ప్రగతినగర్, శ్రీరాం నగర్, చంద్రమౌళి పురం, ఎంజీ రోడ్ బెంజి సర్కిల్ ప్రాంతం, మైత్రీయ వీధి ప్రాంతాల్లో కరెంట్ ఉండదని తెలిపారు.

నిబద్ధత కలిగిన ప్రజానాయకుడు సుబ్బరాజు

వన్‌టౌన్, ఏప్రిల్ 15: చివరి వరకు ప్రజలు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేసిన నిబద్ధత కలిగిన ప్రజానాయకుడు కె.సుబ్బరాజు అని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ కొనియాడారు. సోమవారం వన్‌టౌన్‌లోని లెనిన్ భవన్‌లో సీపీఐ నగర మాజీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే కె.సుబ్బరాజు 3వ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రవీంద్రనాథ్, సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు సుబ్బరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రవీంద్రనాథ్ మాట్లాడుతూ సుబ్బరాజు ఉద్యమ జీవితం అందరికీ ఆదర్శమని చెప్పారు. జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ సుబ్బరాజు స్ఫూర్తితో పశ్చిమలో విజయం సాధించేందుకు ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పాతరాజరాజేశ్వరి పేట: కాకర్లపూడి సుబ్బరాజు మూడవ వర్ధంతి కార్యక్రమాన్ని 34వ డివిజన్, కేదారేశ్వరపేటలో సోమవారం చేపట్టారు. ముందుగా సుబ్బరాజు చిత్రపటానికి పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంలో మాజీ కార్పొరేటర్ బుట్టి రాయప్ప మాట్లాడుతూ క్రమశిక్షణ, నిజాయితీకి మారుపేరుగా కార్యకర్తలకు ఆదర్శంగా నిలిచారని అన్నారు. నాయకులు కాళ్ల చిన్నప్ప, దొడ్డా కుమార్, కాళ్ల విజయ్, సిహెచ్ మారయ్య, కోమల్, థామస్, జి. ప్రసాద్ పాల్గొన్నారు.



సుబ్బరాజుకు నివాళులర్పిస్తున్న రవీంద్రనాథ్, కోటేశ్వరరావు

విజేతలకు బహుమతుల ప్రదానం

చిట్టినగర్, ఏప్రిల్ 15: ఇంటర్నేషనల్ టాలెంట్ సర్చ్ ఒలింపియాడ్స్ (ఐఎన్‌టీఎస్‌వో) సెకండ్ లెవల్‌లో గెలుపొందిన విద్యార్థులకు చిట్టినగర్ చైతన్య స్కూల్ ఆవరణలో సోమవారం అభినందన సభ నిర్వహించి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కె. సునీత మాట్లాడుతూ ఈ పోటీల్లో తమ స్కూల్ నుంచి సుమారు 185 విద్యార్థులు పాల్గొన్నారన్నారు. వారిలో ఒకరు ట్యాబ్, ముగ్గురు స్మార్ట్ వాచ్‌లు, 14 మంది గోల్డ్ మెడల్ గెలుపొందారన్నారు. జీఎం మురళీకృష్ణ, ఆర్ఐ రాజేష్, కో-ఆర్డినేటర్, సురేష్‌బాబు, ఇన్‌చార్జి ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డైరెక్టర్ విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ కల్పన

జాతీయ కామర్స్ ఫెస్ట్ పోస్టర్ ఆవిష్కరణ

లబ్బీపేట, ఏప్రిల్ 15: సిద్ధార్థ మహిళా కళాశాలలో మంగళవారం కళాశాల వాణిజ్య విభాగం ఆధ్వర్యంలో నిర్వహించనున్న లక్ష్య -2024 జాతీయ కామర్స్ ఫెస్ట్ కార్యక్రమం పోస్టర్‌ను సోమవారం కళాశాల డైరెక్టర్ టి.విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ ఎస్.కల్పన తదితరులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కామర్స్ విభాగాధిపతి టి.రమాదేవి మాట్లాడుతూ ఈ కార్యక్రమం విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను, అంతర్గత నైపుణ్యాన్ని వెలికితీయడంతో పాటు వారిలో పోటీతత్వాన్ని పెంపొందించడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ ఫెస్ట్‌లో పలు రకాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.

అడ్వాన్స్‌డ్ మెకానికల్ ఇంజనీరింగ్ అప్లికేషన్స్‌పై సదస్సు



జ్యోతి వెలిగించి సదస్సును ప్రారంభిస్తున్న డాక్టర్ రవిశంకర్

పటమట, ఏప్రిల్ 15 : నగరంలోని ఆంధ్రా లయోల ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం అడ్వాన్స్‌డ్ మెకానికల్ ఇంజనీరింగ్ అప్లికేషన్స్ అనే అంశంపై అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. ఐఐటీ తిరుపతి ఆచార్యులు డాక్టర్ రవిశంకర్ బయో మిషనింగ్ అనే అంశంపై ప్రారంభోప న్యాసం చేశారు. మెకానికల్ ఇంజనీరింగ్‌లో ఆధునికతపై అవగాహన కల్పించారు. వరంగల్ నిట్ అధ్యాపకులు డాక్టర్ రవి కుమార్ త్రీడీ ప్రింటింగ్‌పై విశదీకరించారు. వివిధ కళాశాలల ప్రతినిధులు వారి వారి పరిశోధన పత్రాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఫాదర్ డాక్టర్ జోజిరెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్ ఫాదర్ బాలస్వామి, ప్రిన్సిపాల్ డాక్టర్ మహేష్, మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ గీతారాణిలు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

అజిత్‌సింగ్‌నగర్, ఏప్రిల్ 15 : అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి చెందిన ఘటనపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం గద్దె వెంకట రామయ్యనగర్ ప్రాంతానికి చెందిన గునుపూడి రాజేష్ అలియాస్ రాజు(32) గత కొంత కాలంగా మద్యానికి బానిసై ఇంటికి వెళ్లడం లేదు.

ఆదివారం రామకృష్ణాపురం శ్రీదేవి బార్ సమీపంలో రాజు నిర్జీవంగా పడి ఉన్నాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అనుమానాస్పద మృతిగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దళిత ద్రోహి జగన్‌రెడ్డి : కేశినేని శ్రీదేవి



మహిళలకు కరపత్రాన్ని అందజేస్తున్న కేశినేని శ్రీదేవి

పాతరాజరాజేశ్వరి పేట, ఏప్రిల్ 15 : రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు మింగేసిన దళిత ద్రోహి జగన్ మోహన్‌రెడ్డి విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని) సోదరి కేశినేని శ్రీదేవి అన్నారు. స్థానిక 35వ డివిజన్‌లో సోమవారం ఇంటింటి ఎన్నికల ప్రచారం చేపట్టారు. డివిజన్‌లోని పప్పులమిల్లు సెంటర్ నుంచి నాడార్ వీధి, పీటర్ వీధి, డేవిడ్ వీధి, ఆర్‌సీఎం చర్చి వీధి, పాల బజార్ వీధి వరకు ఇంటింటికి తిరిగి పార్టీ కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంలో కేశినేని శ్రీదేవి మాట్లాడుతూ రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి సుజనా చౌదరి, విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని) లను గెలిపించాలని కోరారు. మహిళా నాయకురాలు చెన్నుపాటి ఉషారాణి, బొడ్డు నాగలక్ష్మి, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటర్ స్కూల్ పెయింటింగ్ పోటీలు

గవర్నర్‌పేట, ఏప్రిల్ 15: వరల్డ్ ఆర్ట్ డేను పురస్కరించుకుని నలంద విద్యానికేతన్‌లో సోమవారం ఇంటర్ స్కూల్ పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. నలంద విద్యానికేతన్ విద్యార్థులు తయారు చేసిన పెయింటింగ్‌లు, నగరంలోని వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులు తయారు చేసిన చిత్ర ప్రదర్శన జరిగింది. విద్యానికేతన్ స్కూల్ ప్రిన్సిపాల్ మాదల పద్మజ ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ప్రదర్శనను నిర్వహించినట్లు తెలిపారు. బహుమతులు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ పద్మజ అభినందించారు.

జనశిక్షణా సంస్థాన్‌లో వేసవి శిక్షణా తరగతులు

మొగల్రాజపురం, ఏప్రిల్ 15: జనశిక్షణా సంస్థాన్‌లో వేసవి శిక్షణా తరగతులను సంస్థ ఛైర్‌పర్సన్ నాగళ్ల విద్యాఖన్నా సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండు గ్రూపులుగా నిర్వహించే ఈ కార్యక్రమంలో మొదటి గ్రూపులో ఫ్యాబ్రిక్ పెయింటింగ్, ఫ్లవర్ మేకింగ్ మెహందీ, డెకరేటివ్ ఆర్టికల్స్, రెండో గ్రూపులో వాషింగ్ మెషిన్ లిక్విడ్ డిటర్జెంట్స్, ఇన్‌స్టంట్ ఫుడ్ ఐటం మేకింగ్, చాక్లెట్ మేకింగ్, నాచురల్ హెయిర్ ఆయిల్ షాంపూ మేకింగ్ కోర్సులు ఉంటాయన్నారు. శిక్షకులు, శిక్షణార్థులు పాల్గొన్నారు.

50వ డివిజన్‌లో కోటేశ్వరరావు ప్రచారం

చిట్టినగర్, ఏప్రిల్ 15: 50వ డివిజన్‌లో సోమవారం సీపీఐ అభ్యర్థి జీ.కోటేశ్వరరావు ప్రచార కార్యక్రమం నిర్వహించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, రాష్ట్రంలో వైసీపీ రెండు పార్టీలు రాష్ట్రానికి ద్రోహం చేశాయన్నారు. హోదా ఇస్తామని బీజేపీ, తెస్తామని వైసీపీ రెండు రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేశాయన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కుమార్తె కనిపించడం లేదని ఫిర్యాదు

అజిత్‌సింగ్‌నగర్, ఏప్రిల్ 15 : కుమార్తె కనిపించడం లేదని ఓ మహిళ సోమవారం అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాల ప్రకారం అయోధ్యానగర్‌కు చెందిన యువతి(19) ఆదివారం ఉదయం ఆసుపత్రికి వెళ్తున్నానని చెప్పి వెళ్లింది. రాత్రి ఎంతకి రాకపోవడంతో స్నేహితులు, బంధువుల ఇళ్లల్లో ఆరా తీసిన కుటుంబ సభ్యులకు యువతి ఆచూకీ లభ్యం కాలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భార్య కనిపించడం లేదని...

భార్య కనిపించడం లేదని ఓ వ్యక్తి సోమవారం అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాల ప్రకారం డంపింగ్ యార్డ్ ప్రాంతానికి చెందిన వ్యక్తి భార్య (21) ఈనెల 13న మధ్యాహ్నం ఎవరికీ చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. చుట్టు పక్కల ప్రాంతాలు, బస్టాండ్, రేల్వేస్టేషన్ తదితర ప్రాంతాలు వెతికిన కుటుంబ సభ్యులకు వివాహిత ఆచూకీ తెలీకపోవడంతో అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి
నవ్య చిత్రజ్యోతి
మంగళవారం • 16 ఏప్రిల్ 2024
cinema@andhrajyothy.com


ఘనంగా తమిళ దర్శకుడు
శంకర్ కుమార్తె వివాహం



ప్రముఖ దర్శకుడు ఎస్.శంకర్ - ఈశ్వరీ శంకర్‌ల కుమార్తె ఐశ్వర్య వివాహం తరుణ్ కార్తికేయన్‌తో జరిగింది. సోమవారం చెన్నైలో జరిగిన ఈ వివాహ వేడుకలో తమిళనాడు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎం.కె స్టాలిన్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అలాగే చలన చిత్ర ప్రముఖులు రజినీకాంత్, కమల్ హాసన్, సూర్య, కార్తి, విక్రమ్, విశాల్, అర్జున్, కీర్తి సురేశ్, దర్శకులు భారతీరాజా, మణిరత్నం - సుహాసిని దంపతులు, కె.భాగ్యరాజ్, పి.వాసు, కేఎస్ రవికుమార్, హరి, విష్ణువర్ధన్, విఘ్నేష్ శివన్ - నయనతార దంపతులు, నిర్మాతలు ఆర్బీ చౌదరి, జయంతిలాల్ గడ, ఏఎం రత్నం, దిల్ రాజు, ఐసరి కె.గణేశ్ తదితరులు హాజరయ్యారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

కలిసి నటించాలని ఎదురుచూస్తున్నా...



'వార్-2' చిత్రంతో ఎన్టీఆర్ బాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్న సంగతి తెలిసిందే. ఇటీవలే ఈ చిత్రం షూటింగ్ కోసం ఎన్టీఆర్ ముంబయి వెళ్లారు. తాజాగా, నటి ఊర్వశీ రౌతేలా తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో తారక్‌తో దిగిన ఫొటోను అభిమానులతో పంచుకుని.. ఆయనను ప్రశంసలతో ముంచెత్తారు. "ఎన్టీఆర్‌ను కలవడం ఎంతో ఆనందంగా ఉంది. ఆయన ఎంతో క్రమశిక్షణ, వినమ్రత, నిజాయితీ, ముక్కుసూటితనం కలిగిన వ్యక్తి. భవిష్యత్తులో ఎన్టీఆర్‌తో కలసి నటించాలని ఎదురుచూస్తున్నా" అని పేర్కొన్నారు.

పుష్ప 2 కు బాలీవుడ్ దర్శకుడి ప్రశంసలు



'ఇప్పుడే 'పుష్ప 2' టీజర్ చూశా. అద్భుతంగా ఉంది. పుష్పరాజ్‌గా అల్లు అర్జున్ నటన నాకు బాగా నచ్చింది. ఆ సినిమా కోసం ఆత్రుతగా ఎదురు చూస్తున్నా'.. ఈ మాటలు అన్నది ఎవరో తెలుసా. బాలీవుడ్ దర్శకుడు అనిల్ శర్మ. 'గదర్ 2' చిత్రంతో సూపర్ హిట్ సాధించిన ఈ దర్శకుడు తన ప్రశంసలను కొనసాగిస్తూ 'గత ఏడాది ఆగస్టు 15న నా చిత్రం 'గదర్ 2' విడుదలై మంచి విజయం సాధించింది. ఈ ఏడాది అదే రోజున 'పుష్ప 2' రిలీజ్ అవుతోంది. ఇది కూడా తప్పకుండా హిట్ అవుతుంది. తెలుగు చిత్ర పరిశ్రమకు, ఈ సినిమా టీమ్‌కు నా అభినందనలు' అన్నారు.

ఐఫా వేదికపై శ్రీలీల మెరుపులు



చైల్డ్ ఆర్టిస్ట్‌గా సినీ రంగప్రవేశం చేసి అనతికాలంలోనే అగ్ర హీరోలతో జతకట్టే స్థాయికి చేరారు నటి శ్రీలీల. 'పెళ్లి సందడి', 'ధమాకా', 'స్కంద' 'గుంటూరు కారం', 'ఎక్స్‌ట్రార్డినరీ మ్యాన్' వంటి చిత్రాలతో వరుసగా సందడి చేసిన ఈ భామ జోరు ఇటీవల బాగా తగ్గింది. నటిగా కంటే మంచి డాన్సర్‌గా ఎక్కువ పేరు తెచ్చుకున్న ఈ నాజూకు భామకు ఇప్పుడు ఒక మంచి అవకాశం వచ్చింది. అయితే అది సినిమాలో కాదు. దుబాయ్‌లో సెప్టెంబరులో జరిగే ఐఫా ఉత్సవాలలో డాన్స్ పెర్ఫార్మెన్స్ ఇవ్వనున్నారు శ్రీలీల. మంచి డ్యాన్సర్‌గా పేరొందిన ఈ నటి ఐఫా వేదికపై తన మెరుపులతో ప్రేక్షకులను రంజింపచేయనున్నారు. అలాగే ఇటీవలే పెళ్లి చేసుకున్న రకుల్ ప్రీత్‌సింగ్ కూడా తన నృత్యంతో ప్రేక్షకుల మతిపోగొట్టడానికి సిద్ధమవుతున్నారు. ఇలా ఈ ఇద్దరు భామలు ఐఫా వేదికకు సరికొత్త అందం ఇవ్వనున్నారు. ఈ వేడుకలో రాక్‌స్టార్ దేవిశ్రీ ప్రసాద్ కూడా భాగం కానున్నారు. రెండు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవంలో.. తెలుగు వేడుకలకి దగ్గుబాటి రానా ..మిగతా విభాగాలకు అకుల్ బాలాజీ, విజయ్ రాఘవేంద్ర వాఖ్యాతలుగా వ్యవహరించనున్నారు.

క్రికెట్‌లో సెంచరీ కొడితే ఆ ఆటగాడికి చెప్పలేనంత క్రేజ్.. ఫ్యాన్స్, మీడియా అతన్ని ఆకాశానికి ఎత్తేస్తాయి. అలాగే ఓ సినిమా రూ. వంద కోట్లు కలెక్ట్ చేస్తే ఆ చిత్ర బృందానికి వచ్చే కిక్కే వేరు. క్రికెట్‌లో ఆటగాడు సెంచరీ కొట్టాలంటే అది అతని ఒక్కడితోనే అయ్యే పని. కానీ సినిమా విషయం అలా కాదు. అది రూ.. వంద కోట్ల మైలురాయి చేరాలంటే దాని వెనుక చిత్ర బృందం కఠోర శ్రమ దాగి ఉంటుంది. ఈ ఏడాదిలో ఇప్పటివరకూ గడిచిన వంద రోజుల్లో ఈ డ్రీమ్ టార్గెట్‌ను అందుకున్న దక్షిణాది సినిమాల వివరాలు ఇవీ.



100 రోజులు... రూ. వంద కోట్లు

కలెక్షన్ల సునామీ 'హను-మాన్'

కలెక్షన్ల సునామీ సృష్టించాలంటే పెద్ద హీరోల చిత్రాలే అయ్యుండాలనేది తెలుగులో ట్రేడ్ వర్గాల నమ్మకం. అందుకోసమే ఓ సినిమా రూ. వంద కోట్లు సాధించడం కోసం ఏవేవో లెక్కలు వేసుకుంటూ ఉంటారు మేకర్స్. కానీ ఒక్కసారిగా అందరి అంచనాలను తలకిందులు చేస్తూ..టాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద వంద కోట్లు సాధించాలంటే భారీ తారాగణం, క్రేజీ కాంబినేషన్స్ అవసరం లేదని, కంటెంట్ బలంగా ఉండాలని నిరూపించిన సినిమా 'హను-మాన్'. ఎటువంటి స్టార్ కాస్టింగ్ లేకుండా కేవలం రూ. 40 బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా సుమారు రూ. 330 కోట్లు కలెక్ట్ చేసి పాన్ ఇండియా స్థాయిలో తెలుగు సినిమా సత్తా చాటింది. ఒక్క హిట్‌తో ఎన్నో రికార్డ్స్‌తో పాటు అనేక టాలీవుడ్ సెంటిమెంట్స్‌ను కూడా బ్రేక్ చేసింది. తేజ సజ్జా, అమృత అయ్యర్ హీరో హీరోయిన్లుగా నటించిన ఈ చిత్రానికి ప్రశాంత్ వర్మ దర్శకుడు. అతనికి సినిమాటిక్ యూనివర్స్‌లో ఇది మొదటి చిత్రం. ఈ చిత్రానికి కొనసాగింపుగా 'జై హనుమాన్' చిత్రం వస్తోంది. ఇందులో హనుమంతుడి, రాముడి పాత్రలకు స్టార్ హీరోలను ఎంచుకుంటామని చిత్ర బృందం ప్రకటించింది. ఆ నటుల పేర్లలో మెగాస్టార్ చిరంజీవి, మహేశ్‌బాబు పేర్లు కూడా వినిపించడం విశేషం. వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదలవుతున్న ఈ సినిమా మరెన్ని రికార్డులు తిరగరాస్తుందో చూడాలి.



ఫ్యాన్స్‌ను ఖుషీ చేసిన కాంబో

మహేశ్‌బాబు, త్రివిక్రమ్ కలయికలో వచ్చిన మొదటి చిత్రం 'అతడు'. ఇప్పటికీ ఎవరూ ఈ చిత్రం చేసిన మ్యాజిక్‌ను మర్చిపోలేదు. ఆ తర్వాత వీరి కలయికలో వచ్చిన 'ఖలేజా' అంతగా ఆకట్టుకోకపోయినా..సరికొత్త మహేశ్‌బాబును ప్రేక్షకులకు పరిచయం చేసింది. దాదాపు 15 ఏళ్ల విరామం తర్వాత వీరి కలయికలో వచ్చిన మూడో చిత్రం 'గుంటూరు కారం'. భారీ బడ్జెట్‌తో సంక్రాంతికి రిలీజైన ఈ చిత్రం బాక్సాఫీస్ దగ్గర రూ. 171 కోట్లు కలెక్ట్ చేసింది. మహేశ్, త్రివిక్రమ్ కాంబో నుంచి ఎటువంటి ఎంటర్టైన్‌మెంట్‌ను ఆశిస్తారో సరిగ్గా అలాంటి వినోదాన్నే పంచిన ఈ చిత్రం, మహేశ్ అభిమానులను ఖుషీ చేసింది.



సీక్వెల్‌తో టిల్లు మ్యాజిక్

'డీజే టిల్లు'గా సిద్ధు జొన్నలగడ్డ చేసిన హంగామా అంతా ఇంతా కాదు. కుర్రకారును విపరీతంగా ఆకట్టుకుని బ్లాక్‌బస్టర్‌గా నిలిచిందీ చిత్రం. రిలీజై రెండేళ్లయినా ఇప్పటికీ ఈ చిత్రంలోని డైలాగ్స్, పాటలు వినిపిస్తూనే ఉన్నాయి. అలా ఎంటర్టైన్‌మెంట్‌కు కేరాఫ్ అడ్రస్‌గా నిల్చిపోయింది టిల్లు పాత్ర. 'అట్లుందది మనతోని' అని మొదటి పార్ట్ అందించిన వినోదానికి కొనసాగింపుగా వచ్చిన రెండో భాగం 'టిల్లు స్క్వేర్'. సిద్ధు మార్క్ డైలాగ్స్ మేనరిజమ్స్‌తో పాటు అనుపమ గ్లామర్ ఈ సినిమాకు స్పెషల్ అస్సెట్‌గా నిలిచాయి. రీసెంట్‌గా విడుదలైన ఈ చిత్రం ఇప్పటికే రూ. వంద కోట్ల కలెక్షన్‌ను సాధించిందని ట్రేడ్ పండితులు అంటున్నారు.



చరిత్ర సృష్టించిన 'మంజుమ్మెల్ బాయ్స్'

ఇక మలయాళ చిత్రాల విషయానికి వస్తే.. అక్కడి లేటెస్ట్ సెన్సేషన్ 'మంజుమ్మెల్ బాయ్స్'. మలయాళ బాక్సాఫీస్ వద్ద 200 కోట్లు కలెక్ట్ చేసిన మొట్టమొదటి సినిమాగా నిలిచి సరికొత్త చరిత్ర సృష్టించింది. తమిళనాడులోని గుణ కేవ్స్‌లో జరిగిన ఓ వాస్తవ సంఘటన స్ఫూర్తితో చిదంబరం ఎస్ పొదువల్ దీనిని తెరకెక్కించారు. విమర్శకుల ప్రశంసలతో పాటు ఇండస్ట్రీ ప్రముఖుల మనసులనూ ఈ చిత్రం గెలుచుకుంది. ఇటీవలే ఈ చిత్రం తెలుగు డబ్బింగ్ విడుదలై హిట్ టాక్‌తో దూసుకుపోతోంది.



'ప్రేమలు'

దిగ్గజ దర్శకుడు రాజమౌళి దగ్గర అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసిన గిరీశ్ ఏ డి 'ప్రేమలు' చిత్రాన్ని తెరకెక్కించారు. మలయాళం బాక్సాఫీస్ దగ్గర రొమాంటిక్ కామెడీగా విడుదలైన ఈ చిత్రం సూపర్‌హిట్ టాక్‌ను తెచ్చుకుని దాదాపు రూ. 130 కోట్ల వసూళ్లు రాబట్టింది. ఈ సినిమా కథలోని కీలక భాగం హైదరాబాద్‌లో జరగడంతో ఈ సినిమాను తెలుగులోనూ డబ్ చేశారు. రాజమౌళి తనయుడు ఎస్ ఎస్ కార్తికేయ ఈ చిత్రానికి సమర్పకుడిగా వ్యవహించారు. ఇందులో రీనూ రాయ్ పాత్రలో నటించిన నటి మమితా బైజు ఓవర్‌నైట్ స్టార్‌గా.. కుర్రకారు లేటెస్ట్ క్రష్‌గా మారింది. తెలుగు నిర్మాతల దృష్టి ఆమెపై పడింది.



సర్వైవల్ థ్రిల్లర్‌కు కాసుల పంట

పృథ్వీరాజ్ సుకుమారన్ నటించిన సర్వైవల్ థ్రిల్లర్ 'ది గోట్ లైఫ్: ఆడు జీవితం'. బ్లెస్సీ దర్శకత్వం వహించారు. 2008లో మలయాళం బెస్ట్ సెల్లర్‌గా నిలిచిన రచయిత బెన్యామిన్ 'ఆడుజీవితం' పుస్తకం ఆధారంగా ఈ సినిమా తెరకెక్కించారు. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద దాదాపు రూ. 130 కోట్లను రాబట్టింది.

'కెప్టెన్ మిల్లర్' హవా...



తమిళంలో కూడా రూ. వంద కోట్లు సాధించిన చిత్రం ఒకటి ఉంది. అది 'కెప్టెన్ మిల్లర్'. సినిమా సినిమాకు తను ఎంచుకునే పాత్రల్లో వైవిధ్యం ప్రదర్శించే నటుడు ధనుష్ నటించిన లేటెస్ట్ చిత్రం ఇది. సంక్రాంతికి తమిళనాట విడుదలైన ఈ చిత్రం రూ. 104 కోట్లు కలెక్ట్ చేసింది. అరుణ్ మాథేశ్వరన్ ఈ పీరియాడిక్ యాక్షన్ అడ్వెంచర్‌కు దర్శకత్వం వహించారు. 1930లో బ్రిటీష్ ప్రభుత్వంపై తిరుగుబాటు చేసిన ఓ తెగకు నాయకుడిగా ధనుశ్ ఇందులో నటించారు.

నవ్వించడానికి సిద్ధం



'అల్లరి' నరేశ్ తన తాజా చిత్రం 'ఆ ఒక్కటీ అడక్కు'తో ఆకట్టుకోవడానికి సిద్ధమయ్యారు. మల్లి అంకం దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ చిత్రాన్ని రాజీవ్ చిలక నిర్మించారు. వేసవి సెలవుల సందర్భంగా ఈ నాన్‌స్టాప్ ఎంటర్‌టైనర్‌ను మే 3న విడుదల చేయనున్నట్లు నిర్మాత ప్రకటించారు. ఏషియన్ సురేశ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ సినిమాను విడుదల చేస్తోంది. చాలా రోజుల తర్వాత మళ్లీ నరేశ్ పూర్తి స్థాయిలో ఫన్ క్యారెక్టర్ పోషించడంతో ఈ సినిమా కోసం అంతా ఎదురు చూస్తున్నారు. ఫరియా అబ్దుల్లా హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాకు రచన: అబ్బూరి రవి, సంగీతం: గోపీసుందర్, ఛాయాగ్రహణం: సూర్య, సహ నిర్మాత: భరత్ లక్ష్మీపతి.

తెలుగులో తొలిసారి!



తెలుగులో సెటైరికల్ ఫిల్మ్స్ కొన్ని వచ్చాయి కానీ పొలిటికల్ సెటైరికల్ ఫిల్మ్స్ తక్కువ అనే చెప్పాలి. అందుకే ఈ తరహా కాన్సెప్ట్ ఎన్నుకొని ప్రేక్షకులను నవ్వించడానికి 'లక్ష్మీ కటాక్షం' చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా నుంచి డైలాగ్ పోస్టర్‌ను విడుదల చేశారు. సాధారణంగా రాజకీయ నాయకులు ఒక ఓటుకి ఇంత అని డబ్బు నిర్ణయిస్తుంటారు. కానీ ఈ డైలాగ్ పోస్టర్‌లో ఓటరే తన రేటుని నిర్ణయించడం విశేషం. ఇటువంటి కాన్సెప్ట్ తెలుగులో రావడం ఇదే తొలిసారి. ప్రస్తుతం జరుగుతున్న రాజకీయ పరిణామాలను ప్రతిబింబించేలా ఈ పోస్టర్ ఉంది. సూర్య దర్శకత్వంలో యు. శ్రీనివాసుల రెడ్డి నిర్మించిన ఈ చిత్రంలో సాయికుమార్ ముఖ్య పాత్ర పోషించారు. వినయ్, అరుణ్, దీప్తి వర్మ ఇతర ముఖ్య తారాగణం. తాడిపత్రి నేపథ్యంగా చిత్ర కథ ఉంటుందనీ, త్వరలో సరదాగా ఉండే టీజర్, ట్రైలర్‌ను విడుదల చేస్తామని దర్శకనిర్మాతలు చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: అభిషేక్ రుఫూస్, ఛాయాగ్రహణం: నాని ఐనవల్లి, నిర్మాతలు: యు.శ్రీనివాసుల రెడ్డి, బి.నాగేశ్వర రెడ్డి, వహీద్ షేక్, కె. పురుషోత్తం రెడ్డి.

ఇది చిన్న సినిమా కాదు.. కంటెంట్ ఉన్న చిత్రం



'బిగ్ బాస్' ఫేం అర్జున్ అంబటి హీరోగా, కిశోరి ధాత్రిక్ హీరోయిన్‌గా నటించిన 'తెప్ప సముద్రం' చిత్రం ఈ నెల 19న విడుదల కానుంది. సతీశ్ రాపోలు దర్శకుడు. నీరుకంటి మంజులా రాఘవేందర్ గౌడ్ నిర్మాత. ఆదివారం రాత్రి ప్రసాద్ ప్రీవ్యూ థియేటర్‌లో జరిగిన ప్రీ రిలీజ్ కార్యక్రమంలో శాసన సభ్యుడు పైడి రాకేశ్ రెడ్డి సినిమాలోని మొదటి పాటను విడుదల చేశారు. ట్రైలర్‌ను జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచార్య రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత రాఘవేంద్ర గౌడ్ మాట్లాడుతూ 'ఒక సినిమా ప్రేక్షకుల ముందుకు రావాలంటే ఎందరో కష్టపడాలి. నేను చిరంజీవిగారి అభిమానిని. ఆయన స్ఫూర్తితోనే పరిశ్రమలోకి వచ్చాను. ప్రతి ఒక్కరూ ఎంజాయ్ చేసే విధంగా ఈ సినిమా ఉంటుంది.' అన్నారు. అర్జున్ అంబటి మాట్లాడుతూ 'చిన్న సినిమా అనగానే నిర్మాతకు, దర్శకుడికి ఎన్నో రకాల ఇబ్బందులు ఎదురవుతుంటాయి. మా నాన్న, పెద నాన్న డిస్ట్రిబ్యూటర్స్ కాబట్టి ఆ వేదన నాకు తెలుసు. ప్రతి ఒక్కరూ చిన్న సినిమాను బతికించాలని కోరుతున్నా. ఈ సినిమా 90 శాతం షూటింగ్ పోచంపల్లిలో జరిగింది' అని చెప్పారు. 'తెప్ప సముద్రంలో చిన్న పిల్లల మీద జరిగే అఘాయిత్యాలే కాకుండా కొన్ని ప్రత్యేక అంశాలు కూడా ఇందులో ఉన్నాయి. అవి థియేటర్‌లో చూస్తేనే బాగుంటుంది. ఇది చిన్న సినిమా కాదు.. కంటెంట్ ఉన్న చిత్రం' అని దర్శకుడు సతీశ్ చెప్పారు.

గుడ్ ఫుడ్

ప్రొటీన్ తింటున్నారా?

పోషకాల్లో మాంసకృత్తులే కీలకం. శక్తిని సమకూర్చి శరీర జీవక్రియల సామర్థ్యాన్ని పెంచడంలో, వ్యాధులను అరికట్టేలా రోగనిరోధకశక్తిని బలపరచడంలో ప్రొటీన్లు కీలక పాత్ర పోషిస్తూ ఉంటాయి. ఇలాంటి అత్యవసరమైన ప్రొటీన్లకు దైనందిన ఆహారంలో చోటు కల్పించమెలాగో తెలుసుకుందాం!

ప్రతి కిలో శరీర బరువుకూ 0.8 నుంచి ఒక గ్రాము ప్రొటీన్ తీసుకోవడం అవసరం. ఉదాహరణకు మన శరీర బరువు 68 నుంచి 70 కిలోలు ఉంటే, రోజుకు 55 నుంచి 68 గ్రాముల ప్రొటీన్ తీసుకోవాలి. మరి ఇంత పెద్ద మొత్తంలో ప్రొటీన్ అందాలంటే ఏం చేయాలి? ఏం తినాలి?



- **అలవాటు:** ప్రొటీన్ తినడం దైనందిన అలవాటు కావాలి. ఉదయం అల్పాహారంగా లేదా వ్యాయామం తర్వాత ప్రొటీన్ షేక్ తాగుతూ ఉండాలి.
- **తొలి ప్రాధాన్యం:** ఆహారంలో ప్రొటీన్‌కు ప్రాధాన్యమివ్వాలి. కడుపు నిండేలోగా ప్రొటీన్‌తో కూడిన పదార్థాలను తినేయాలి.
- **నట్స్:** సలాడ్స్, ఓట్‌మీల్, వేపుళ్లు, ఉప్మా, దోశల్లాంటి వాటిలో నట్స్ చల్లుకుని తింటూ ఉండాలి.
- **లేత మాంసం:** చికెన్ బ్రెస్ట్ లాంటి తక్కువ క్యాలరీలు, ఎక్కువ ప్రొటీన్లు దొరికే లేత మాంసం తినాలి.
- **బ్రౌన్ రైస్:** తెల్ల బియ్యానికి బదులు బ్రౌన్ రైస్ ఎంచుకోవాలి.
- **బీన్స్:** పీచు, విలువైన పోషకాలు, ప్రొటీన్ సమృద్ధిగా దొరికే బీన్స్ ఎక్కువగా వాడుకోవాలి.

ఇలాంటి చిన్న చిన్న మార్పులు చేసుకోగలిగితే, ప్రొటీన్ ఇన్‌టేక్ పెరిగి ఆరోగ్యం భేషుగ్గా ఉంటుంది.

అవగాహన

ఇంటర్నల్ బ్రా ఇలా...

బ్రా ఫ్రీ లైఫ్‌ను ఇష్టపడని మహిళలు ఉండరు. ఒరుసుకుపోతూ, అసౌకర్యంగా ఉండే బ్రాసరీల నుంచి విముక్తి పొందేలా, శరీరంలోనే అమర్చే వీలుండే బ్రాసరీలు త్వరలో మహిళల ఇబ్బందులను పరిష్కరించబోతున్నాయి. ఆ అంతర్గత బ్రాసరీలే 'ఇంటర్నల్ బ్రా'లు.

మెష్, లేదా పంది చర్మాన్ని ఉపయోగించి, రొమ్ములను పైకి లిఫ్ట్ చేసి ఉంచే 'ఇంటర్నల్ బ్రా సర్జరీలు' తాజాగా యుకె, అమెరికాల్లో ఊపందుకున్నాయి. గురుత్వాకర్షణ, బరువు వల్ల కిందకు సాగిపోతూ అందవిహీనంగా కనిపించే రొమ్ములను మహిళలు ఇంతకు ముందు బ్రెస్ట్ లిఫ్ట్, బ్రెస్ట్ రిడక్షన్ సర్జరీలతో, సపోర్టివ్ బ్రాసరీలతో ఆకర్షణీయంగా సరిదిద్దుకునే వాళ్లు. అయితే తాజాగా ఎలాంటి బ్రాసరీలు, బ్రెస్ట్ లిఫ్ట్‌లతో పని లేకుండా, రొమ్ములు కిందకు జారే వీలు లేకుండా, వాటికి పట్టును అందించే ఇంటర్నల్ బ్రా సర్జరీలను వైద్యులు కనుగొన్నారు. పుష్ అప్ బ్రాలను తలపించే ఈ సర్జరీల్లో రొమ్ముల అడుగు భాగంలో మెష్‌ను అమరుస్తారు. పాలీ 4 హైడ్రాక్సీబ్యుటరేట్ అనే సింథటిక్ పదార్థంతో తయారయ్యే మెష్, కాలక్రమేణా శరీరంలో కలిసిపోయే స్వభావాన్ని కలిగి ఉండడం విశేషం. ఇలా కరిగిపోయేలోపు, ఛాతీ గోడలో ఆరోగ్యకరమైన



కణజాలంవృద్ధి చెంది, మెష్ స్థానాన్ని భర్తీ చేయడంతో పాటు రొమ్ములకు సహజసిద్ధ ఆసరాను అందిస్తాయి. దాంతో రొమ్ములు కిందకు జారిపోకుండా ఉంటాయి. ఇంటర్నల్ బ్రా సర్జరీల కోసం వైద్యులు పందులు లేదా మృత కళేబరాలకు చెందిన సజీవ కణజాలం నుంచి 'అసెల్యులర్ డెర్మల్ మేట్రిక్స్'ను సేకరించి, రసాయనాలతో శుద్ధి చేసి రొమ్ముల అడుగు భాగంలో అమరుస్తూ ఉంటారు. అయితే వీటిలో ఏ సర్జరీ చేయించుకున్నప్పటికీ, సర్జరీ తర్వాత బ్రాసరీలను వాడవలసిన అవసరం ఉండదని కొందరు వైద్యులు అంటుంటే, రొమ్ముల మీద గురుత్వాకర్షణ ప్రభావం ఉంటూనే ఉంటుంది కాబట్టి సర్జరీ తర్వాత కూడా తప్పనిసరిగా బ్రాసరీలను వాడుకోవాలనీ ఇంకొందరు వైద్యులు చెప్తున్నారు. ఏది ఏమైనప్పటికీ, దీర్ఘకాల ఫలితాలను పరిశీలించిన

బేరియాట్రిక్ సర్జరీ



అధిక బరువు ఆరోగ్యాన్ని కుదేలు చేయడం మొదలుపెట్టినప్పుడు, అత్యవసరంగా బరువు తగ్గించుకోక తప్పదు. అందుకోసం అక్కరకొస్తున్న బేరియాట్రిక్ సర్జరీలు ఇప్పుడు మరింత సులభతరంగా మారాయి. అత్యాధునిక సాంకేతికత అందుబాటులోకి రావడంతో మునుపటికి మించిన ఫలితాలు సాధ్యపడుతున్నాయి అంటున్నారు వైద్యులు.

బరువు తగ్గించే సర్జరీలు

స్లీవ్, బైపాస్ అనే బేరియాట్రిక్ సర్జరీల్లో దేన్ని ఎంచుకోవాలనేది వ్యక్తి బిఎమ్ఐ, ఆరోగ్య పరిస్థితుల మీద ఆధారపడి ఉంటుంది. కానీ అధిక బరువు తగ్గించడమే ప్రధాన ఉద్దేశం కాబట్టి, బైపాస్ చేయవలసిన అవసరం ఉన్న వాళ్లకు కూడా స్లీవ్ సర్జరీలతో సరిపెట్టే పరిస్థితి ఇంతకు ముందు ఉండేది. ఇందుకు వైద్యుల అవగాహనా లోపం, సర్జరీ వెసులుబాట్లు లేకపోవడం లాంటి ఎన్నో కారణాలున్నాయి. కానీ నిజానికి బేరియాట్రిక్ సర్జరీ నూరు శాతం ఫలితాన్నివ్వాలంటే, బిఎమ్ఐకి తగిన సర్జరీని ఎంచుకోవడంతో పాటు, అత్యాధునిక చికిత్సా విధానాలను వినియోగించుకోగలగాలి. ఈ క్రమంలో వేర్వేరు రకాల బేరియాట్రిక్ బైపాస్ సర్జరీలు తాజాగా అందుబాటులోకొచ్చాయి.



రెండో సర్జరీ వరకూ రాకుండా..

ఈ దశకు రాకుండా ఉండాలంటే మొదటి సర్జరీ సక్రమమైనదై ఉండాలి. వ్యక్తి బిఎమ్ఐతో సంబంధం లేకుండా స్లీవ్ సర్జరీతో సరిపెట్టేస్తే, భవిష్యత్తులో రీ డు సర్జరీ అవసరం రావచ్చు. బైపాస్ సర్జరీ సమయాన్ని తట్టుకోలేని వాళ్లు, అవయవాల మార్పిడి చేయించుకోవలసిన అవసరం ఉన్న కొందరికి, స్లీవ్ సర్జరీ మినహా పేగుల బైపాస్ చేసే పరిస్థితి ఉండకపోవచ్చు. కానీ కొందరికి తగిన సర్జరీ బైపాస్ ఒక్కటే అయి ఉండవచ్చు. ఇంకొందరికి స్లీవ్, బైపాస్... రెండు సర్జరీల అవసం ఉండవచ్చు. కాబట్టి ఎవరికి ఏ సర్జరీ తగినదో కచ్చితంగా అంచనా వేయగలిగే అనుభవం, అర్హత వైద్యులు కలిగి ఉండాలి. అందుకోసం అనుభవజ్ఞులైన వైద్యులనే బేరియాట్రిక్ సర్జరీల కోసం ఎంచుకోవాలి. రోగిని, సర్జరీని ఎంచుకునే విధానం, సర్జరీ చేసే విధానం, సర్జరీ తర్వాత రోగిని మేనేజ్ చేయడం... ఇలా బేరియాట్రిక్ సర్జరీ ఫలితం నాలుగు అంశాల మీద ఆధాపడి ఉంటుంది.



రొబొటిక్స్‌తో సురక్షితమైన సర్జరీ


బిఎమ్ఐ 50కి మించిన, సూపర్ ఒబేస్ ఉన్న వాళ్ల బరువును హ్యాండిల్ చేయడం చాలా కష్టం. మితిమీరిన ఊబకాయం వల్ల వైద్యులకూ, రోగులకూ సర్జరీ అసౌకర్యంగా మారుతుంది. కొన్ని సందర్భాల్లో సర్జరీలో ఉపయోగించే సన్నని ల్యాప్రోస్కోపీ పరికరాలు వంగిపోయి, మరొక సర్జరీకి పనికిరాకుండా పోవచ్చు. కొందరికి సర్జరీ క్లిష్టం కావచ్చు. ఫలితంగా సర్జరీలో గాయాల తీవ్రత, సర్జరీ తర్వాత కోలుకునే సమయం ఎక్కువగా ఉండవచ్చు. ఈ పరిస్థితిని అధిగమించేలా తాజాగా రొబోటిక్స్ అందుబాటులోకొచ్చాయి. రొబొటిక్ ఆర్మ్స్ దృఢంగా ఉంటాయి, హైడెఫెనిషన్ వల్ల సూక్ష్మ రక్తనాళాలను కూడా వైద్యులు స్పష్టంగా చూడగలుగుతారు. ఫలితంగా సర్జరీలో రక్తస్రావం తగ్గడంతో పాటు రోగులు కూడా సర్జరీ నుంచి త్వరగా కోలుకోగలుగుతున్నారు.

బేరియాట్రిక్ బైపాస్‌లో...

ఆరు మీటర్ల చిన్న పేగులో ఒకటి నుంచి రెండు మీటర్ల పొడవు మేర పేగులోకి ఆహారం వెళ్లకుండా నియంత్రించే ప్రక్రియే బేరియాట్రిక్ బైపాస్. ఇంతకు ముందు ఈ ప్రక్రియ కొంత క్లిష్టంగా ఉండేది. రెండు దశల్లో రెండు చోట్ల జాయింట్లతో ఈ ప్రక్రియ సాగేది. కానీ ఇప్పుడు మిని గ్యాస్ట్రిక్ బైపాస్, స్లీవ్ జిజినల్ బైపాస్... ఇలా కొత్త ప్రక్రియల్లో బైపాస్ సర్జరీలు జరుగుతున్నాయి. వైద్యులు ఈ సర్జరీలను ఒకే జాయింట్‌తో ముగించగలుగుతున్నారు. అలా ఈ తరహా కొత్త బైపాస్ సర్జరీలను చేసే సులభతరమైన ప్రక్రియలు తాజాగా అందుబాటులోకొచ్చాయి.

బైపాస్‌తో ప్రయోజనం

స్లీవ్ సర్జరీ కంటే బైపాస్ సర్జరీల్లో ఫలితం ఎక్కువగా ఉంటుంది. స్లీవ్ చేయించుకున్న వాళ్ల కంటే బైపాస్ చేయించుకున్న వాళ్లలో వెయిట్ లాస్ ఎక్కువగా ఉండడమే కాకుండా, వెయిట్ లాస్ ఎక్కువ కాలం కొనసాగుతుంది. అలాగే స్లీవ్ సర్జరీ తర్వాత, మళ్లీ బరువు పెరిగి, రెండోసారి సర్జరీ చేసే పరిస్థితి ఉంటూ ఉంటుంది. కానీ బైపాస్ చేయించుకున్న వాళ్లు తిరిగి బరువు పెరిగే అవకాశం ఉండదు. దాంతో రెండోసారి సర్జరీ అవసరం పడదు. పైగా సర్జరీ చేయించుకున్న మూడో రోజే ఆస్పత్రి



నుంచి డిశ్చార్జ్ అయిపోవడం తాజా సర్జరీలతో ఉన్న మరొక సౌలభ్యం. అలాగే సర్జరీ జరిగిన పది రోజుల నుంచే మునుపటి జీవనశైలిని కొనసాగించవచ్చు.

సర్జరీ తర్వాత ఇలా...

సర్జరీ ఫలితం, ప్రభావం 50 శాతమే! మిగతా 50 శాతం వ్యక్తిగత ప్రయత్నం మీదే ఆధారపడి ఉంటుంది. సర్జరీ తర్వాత న్యూట్రిషనిస్టులు సూచించిన ఆహారం, సూచించిన పరిమాణాల్లోనే తీసుకోవాలి. అలాగే సూచించిన ఆహార నియమాలను జీవితాంతం కొనసాగించాలి. సర్జరీతో తగ్గిన బరువు భవిష్యత్తులో పెరగకుండా ఉండాలంటే వైద్యులు సూచించిన నియమాలను తూచతప్పకుండా పాటించాలి. అలాగే క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. అలాగే వైద్యులు ఏర్పాటుచేసే కౌన్సెలింగ్ సెషన్లు, సపోర్టివ్ మీటింగ్స్‌కు కూడా హాజరవుతూ ఉండాలి. ఆ మీటింగ్స్‌లో అనుమానాలను నివృత్తి చేసుకోవడమే కాకుండా అవగాహన కూడా ఏర్పరుచుకునే అవకాశం ఉంటుంది.

డాక్టర్ కోన లక్ష్మీ కుమారి,
సీనియర్ సర్జికల్ గ్యాస్ట్రో ఎంటెరాలజిస్ట్ అండ్ బేరియాట్రిక్ సర్జన్,
యశోద హాస్పిటల్స్,
సోమాజిగూడ, హైదరాబాద్



బేరియాట్రిక్ సర్జరీ నూరు శాతం ఫలితాన్నివ్వాలంటే, బిఎమ్ఐకి తగిన సర్జరీని ఎంచుకోవడంతో పాటు, అత్యాధునిక చికిత్సా విధానాలను వినియోగించుకోగలగాలి.

ఆయుర్వేదం



వీటిని ఆపకూడదు

శరీర సహజసిద్ధ కోరికలను అణచుకోవడం వల్ల, వ్యాధులు దరి చేరతాయని ఆయుర్వేదం నమ్ముతోంది. కాబట్టి ఈ కింది శరీర జీవక్రియలు, స్వభావాలను కట్టడి చేయవలసిన అవసరం లేదని ఆయుర్వేదం పేర్కొంటోంది.

- **ఆవలింత:** నలుగురిలో ఉన్నప్పుడు ఆవలించడానికి సంశయిస్తూ ఉంటాం. కానీ ఆవులింతలను ఆపుకోవడం వల్ల, చెవులు, కళ్లు, ముక్కు, గొంతు సంబంధ రుగ్మతలు దరి చేరతాయి.
- **తుమ్ములు:** తుమ్ములను బలవంతంగా ఆపుకోవడం వల్ల దగ్గు, ఎక్కిళ్లు, ఆకలి మందగించడం, ఛాతీలో నొప్పి వేధిస్తాయి.
- **మలవిసర్జన:** దీన్ని ఆపుకుంటే, తలనొప్పి, అజీర్తి, పొట్టలో నొప్పి, వాయువులు వేధిస్తాయి.
- **మూత్రవిసర్జన:** ఎక్కువ సమయం పాటు ఆపుకోవడం వల్ల, మూత్రవిసర్జన కష్టం కావచ్చు. మూత్రపిండాల్లో రాళ్లు, మూత్రనాళ ఇన్‌ఫెక్షన్లు తలెత్తవచ్చు.
- **కన్నీళ్లు:** అజీర్తి సమస్యలు, మానసిక సమస్యలు, ఛాతీలో నొప్పి మొదలవుతాయి.
- **ఆకలి, దప్పిక:** పోషకాహార లోపం, డీహైడ్రేషన్.

అలాగే ఎలాగైతే కోరికలను కట్టడి చేయడం వల్ల అనారోగ్యాలు వేధిస్తాయో, మితిమీరిన కోరికలకు కళ్లెం వేయకపోవడం వల్ల కూడా కొన్ని ఆరోగ్య సమస్యలు బాధిస్తాయి. కాబట్టి అతి అనర్థదాయకమనే విషయాన్ని గుర్తు పెట్టుకుని అసహజంగా వేధించే కోరికల మీద కన్నేసి ఉంచి, అప్రమత్తంగా వ్యవహరిస్తూ, అవసరాన్ని బట్టి వైద్య సహాయం తీసుకోవాలి.

కేన్సర్ కేర్

కేన్సర్ ముప్పు తప్పాలంటే..

భారతదేశం ప్రపంచ మధుమేహుల రాజధానిగా మారిందనే విషయం మనందరికీ తెలిసిందే! తాజాగా మన దేశం కేన్సర్, అధిక రక్తపోటు, హృద్రోగాలు, మానసిక వ్యాధుల క్యాపిటల్‌గా మారబోతోందనే నివేదికలు కూడా వెలువడుతున్నాయి. కారణాలు, నివారణ మార్గాల గురించి లోతుగా పరిశీలిస్తే.....

2020 నాటికి మన దేశంలో 14 లక్షల మంది ప్రజలు కేన్సర్‌తో బాధపడుతూ ఉన్నారు. 2025 నాటికి ఈ సంఖ్య 15.7 లక్షలకు చేరుకుంటుందని ఒక అంచనా. రొమ్ము, గర్భాశయ ముఖద్వారం కేన్సర్లు భారతీయ మహిళలను వేధిస్తుంటే, ఊపిరితిత్తులు, ప్రోస్టేట్, నోటి కేన్సర్లు పురుషులను బలి తీసుకుంటున్నాయి. తాజా డాటా ప్రకారం, తొలి దశలోనే రొమ్ము కేన్సర్‌ను గుర్తించిన దాదాపు 98 శాతం మంది భారతీయ మహిళలు, ఐదేళ్ల సర్వైవల్ రేటును సాధించగలుగుతున్నారు. దీన్ని బట్టి ముందస్తు స్ర్కీనింగ్, పర్యవేక్షణల ప్రాధాన్యాన్ని మనం అర్థం చేసుకోవచ్చు.

కేన్సర్ వృద్ధి ఎందుకు?

సాధారణ కణాలు బహుళ దశ ప్రక్రియలో భాగంగా కణితి కణాలుగా పరిణామం వల్ల కేన్సర్ అభివృద్ధి చెందుతుంది. ఈ ప్రక్రియలో భాగంగా కేన్సర్ ముందరి స్థితి నుంచి మాలిగ్నెన్సీగా కణ పరిణామం జరుగుతుంది. అయితే ఇలా ఆరోగ్యకరమైన కణాలు కేన్సర్ కణాలుగా మారడానికి కారణాలు, వ్యక్తుల జన్యు మేకప్‌తో పాటు మూడు రకాల బాహ్య అంశాలు దోహదపడుతూ ఉంటాయి. అవేంటంటే....

- అల్ట్రావయొలెట్, అయొనైజింగ్ రేడియేషన్ లాంటి భౌతిక కేన్సర్ కారకాలు
- యాస్‌బెస్టాస్, పొగాకు, మద్యం, అఫ్లోటాక్సిన్ (ఆహార కలుషితం), ఆర్సెనిక్ (నీటి కలుషితం) లాంటి రసాయనిక కేన్సర్ కారకాలు
- నిర్దిష్ట వైరస్‌లు, బ్యాక్టీరియా లేదా పరాన్న జీవుల వల్ల సోకే ఇన్‌ఫెక్షన్లు లాంటి జీవసంబంధ కేన్సర్ కారకాలు



నియంత్రణ మన చేతుల్లోనే....

ప్రపంచ ఆరోగ్య సంస్థ, కేన్సర్ సోకే అవకాశాలను నియంత్రించే కొన్ని ముందు జాగ్రత్తలను సూచిస్తోంది. అవేంటంటే...

- ధూమపానానికి దూరంగా ఉండాలి
- మద్యం మానేయాలి లేదా తగ్గించాలి
- హెచ్‌పివి (హ్యూమన్ పాపిలోమా వైరస్), హెపటైటిస్ బి టీకాలు వేయించుకోవాలి
- అతినీలలోహిత రేడియేషన్‌కు దూరంగా ఉండాలి.
- డయాగ్నొస్టిక్ సెంటర్లలో, ఆరోగ్య సంరక్షణ కేంద్రాల్లో సురక్షితమైన, సరైన రేడియేషన్‌ను ఉపయోగించాలి
- అయొనైజింగ్ రేడియేషన్‌కు దూరంగా ఉండాలి
- బయటి గాలి కాలుష్యం, లోపలి గాలి కాలుష్యాలకు దూరంగా ఉండాలి. మరీ ముఖ్యంగా ఇళ్లు, స్కూళ్లు, ఆఫీసుల్లో ర్యాడాన్ వాయువుతో పాటు, యురేనియం సహజసిద్ధ క్షయం కారణంగా ఉత్పత్తయ్యే అణుధార్మిక వాయువులకు బహిర్గతం కాకుండా చూసుకోవాలి.

కొవ్వును కరిగించాలి

ఒకరి నుంచి మరొకరికి సంక్రమించని వ్యాధుల్లో ఒకటైన ఒబేసిటీ తీవ్రత పెరిగింది. అనారోగ్యకరమైన నడుము, పిరుదులు, పొత్తికడుపు కొవ్వుల నిష్పత్తి ఎక్కువ శాతం మందిలో కనిపిస్తోంది. 90 శాతం మంది మహిళలు, 80 శాతం మంది పురుషులు సూచించిన నడుము, పిరుదుల నిష్పత్తిని మించి పోయి అధిక బరువుతో బాధపడుతున్నట్టు నివేదికలు చెప్తున్నాయి. ఫలితంగా మరీ ముఖ్యంగా యువతలో అధిక రక్తపోటు, మధుమేహం, కేన్సర్లు పెరిగిపోతున్నాయి. మన దేశంలోని 66 శాతం జనాభా ప్రీ హైపర్‌టెన్సివ్ స్థితితో బాధపడుతున్నట్టు, ప్రతి ముగ్గురిలో ఒకరు ప్రీడయాబెటిస్ స్థితికి చేరుకుంటున్నట్టు, 45 ఏళ్ల కంటే తక్కువ వయసులో ఉన్నవాళ్లలో 20 శాతం మంది ఇప్పటికే ప్రిడయాబెటిస్‌తో బాధపడుతున్నట్టు నివేదికల్లో వెల్లడైంది.

ఈ నియమాలు పాటించాలి

- ప్రాసెస్ చేసిన పదార్థాలు తినడం మానేయాలి
- కొవ్వులు, తీపి పరిమితం చేయాలి
- క్రమం తప్పకుండా వారంలో కనీసం ఐదు రోజుల పాటు 40 నిమిషాలకు తగ్గకుండా వ్యాయామం చేయాలి
- జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలి
- కృత్రిమ రంగులు, నిల్వ పదార్థాలు జోడించిన పదార్థాలకు దూరంగా ఉండాలి
- కుటుంబంలో కేన్సర్ ఉంటే, ముందస్తు స్ర్కీనింగ్ పరీక్షలు చేయించుకుంటూ ఉండాలి
- ఒత్తిడి, ఆందోళనలను తగ్గించుకుని, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని కొనసాగించాలి

హెల్త్ వెల్త్



కొబ్బరి పువ్వు తింటున్నారా?

కొబ్బరి పువ్వు తినడానికి రుచిగా ఉండడమే కాకుండా, ఎన్నో ఆరోగ్యకరమైన పోషకాలను కూడా కలిగి ఉంటుంది. అవేంటంటే..

- కొబ్బరి పువ్వులోని పొటాషియం కొలెస్ట్రాల్ మోతాదును తగ్గించి, గుండె జబ్బుల నుంచి రక్షణ కల్పిస్తుంది
- డీహైడ్రేషన్‌కు గురి కాకుండా శరీరాన్ని చల్లబరుస్తుంది
- దీన్లో విలువైన విటమిన్లు, ఖనిజ లవణాలు ఉంటాయి. కాబట్టి రోగనిరోధకశక్తి పెరుగుతుంది
- దీన్లోని యాంటీఆక్సిడెంట్లు ఇన్‌ఫెక్షన్ల నుంచి రక్షణ కల్పిస్తాయి
- దీన్లోని అధిక పీచు జీర్ణశక్తిని పెంచి, మలబద్ధకాన్ని వదిలిస్తుంది
- పోషకభరితమైన కొబ్బరిపువ్వు అరటిపండులా తక్షణ శక్తిని కూడా కూడా అందిస్తుంది.

మూడో పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగినా

బ్రిక్స్, జీ-20 దేశాలతో పోల్చినా భారత్ అత్యంత పేద దేశం

మనది పేద దేశమే



వడ్డీ రేట్లు తగ్గించాలని అప్పట్లో ఆర్‌బీఐపై ప్రణబ్ ముఖర్జీ, చిదంబరం ఒత్తిడి

కేంద్ర బ్యాంక్ స్వయం ప్రతిపత్తి మేడిపండే.. ఆర్‌బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు

హైదరాబాద్/న్యూఢిల్లీ: భారత ఆర్థిక వ్యవస్థ 2029 నాటికి ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగినా, మనం సంబరపడి పోవాల్సిన అవసరం లేదని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు స్పష్టం చేశారు. అప్పటికీ మన దేశం పేద దేశంగానే ఉంటుందన్నారు. తన తాజా పుస్తకం 'జస్ట్ ఏ మెర్సినరీ? నోట్స్ ఫ్రమ్ మై లైఫ్ అండ్ కెరీర్' విడుదల సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన ఈ అభిప్రాయం వ్యక్తం చేశారు. సౌదీ అరేబియా సంపన్న దేశంగా మారినా.. అభివృద్ధి చెందిన దేశంగా మారని విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు.

'భారత్ మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగడం సాధ్యమని నేను కూడా భావిస్తున్నా. అయితే అది సంబరాలు జరుపుకోవాల్సిన సమయం కాదు. ఎందుకంటే మన జనాభా 140 కోట్లు. మనం మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగడానికి జనాభా కూడా ఒక కారణం. అయితే మనం అప్పటికీ పేద దేశంగానే ఉంటామనే విషయాన్ని మర్చిపోకూడదు' అని అన్నారు.

అభివృద్ధి ఫలాలు అందాలి..

దేశ అభివృద్ధి ఫలాలు అందరికీ అందినప్పుడే ఆ అభివృద్ధికి సార్థకత ఉంటుందని ఆర్‌బీఐ మాజీ గవర్నర్ స్పష్టం చేశారు. ప్రస్తుతం 4 లక్షల కోట్ల డాలర్ల జీడీపీతో భారత్ ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉందన్నారు. అయినా తలసరి ఆదాయపరంగా చూస్తే మన దేశం ప్రపంచంలో 139వ స్థానంలో ఉన్న విషయాన్ని గుర్తు చేశారు. బ్రిక్స్, జీ-20 దేశాలతో పోల్చినా భారత్ ఇప్పటికీ అత్యంత పేద దేశమన్నారు.

సమన్యాయం, బలమైన ప్రభుత్వం, జవాబుదారీతనం, స్వయం ప్రతిపత్తి ఉన్న సంస్థలతోనే మన దేశం ప్రధాని మోదీ ఆశిస్తున్న విధంగా 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా ఎదగగలదని సుబ్బారావు స్పష్టం చేశారు.

యూపీఏ హయాంలో ఒత్తిళ్లు నిజమే..

యూపీఏ హయాంలోనూ ఆర్‌బీఐపై ఒత్తిళ్లు వచ్చాయని సుబ్బారావు తన పుస్తకంలో వెల్లడించారు. ఆర్థిక వ్యవస్థ బాగుందని ప్రజల్లో సెంటిమెంట్ పెంచుకునేందుకు అప్పట్లో కేంద్ర ఆర్థిక మంత్రులుగా పని చేసిన ప్రణబ్ ముఖర్జీ, చిదంబరం వడ్డీ రేట్లు తగ్గించి, వృద్ధి రేటు బాగుందని చెప్పాలని తమపై ఒత్తిళ్లు తెచ్చినట్టు సుబ్బారావు వెల్లడించారు. ఆయన తన తాజా పుస్తకంలో ఈ విషయం పేర్కొన్నారు. ఆర్‌బీఐ స్వయం ప్రతిపత్తి ప్రాముఖ్యత పైనా ఆనాటి ప్రభుత్వ పెద్దలకు పెద్దగా అవగాహన లేదని సుబ్బారావు స్పష్టం చేశారు. లేమన్ బ్రదర్స్ దివాలాకు కొద్ది రోజుల ముందు 2008 సెప్టెంబరు 5న ఆర్‌బీఐ గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించక ముందు సుబ్బారావు 2007-08లో కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ కార్యదర్శిగా కూడా పని చేశారు.

ఇద్దరివీ భిన్న వైఖరులు..

ఆర్‌బీఐపై ఒత్తిడి తేవడంలో ప్రణబ్ ముఖర్జీ, చిదంబరం పద్ధతులు వేర్వేరుగా ఉండేవని సుబ్బారావు తన పుస్తకంలో వెల్లడించారు. ప్రణబ్ ముఖర్జీ.. ఆర్థిక మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారుల ద్వారా తన వాదన వినిపిస్తే, చిదంబరం.. ఒక లాయర్‌లా తనతో వాదించడంతో పాటు విలేకరుల సమావేశాల ద్వారా తన వైఖరి వెల్లడించేవారని తెలిపారు. ఒక దశలో అప్పటి ఆర్థిక మంత్రిత్వ శాఖ కార్యదర్శి అరవింద్ మాయారామ్ తనతో జరిగిన భేటీలో 'ప్రపంచవ్యాప్తంగా కేంద్ర బ్యాంకులు ఆయా ప్రభుత్వ కనుసన్నల్లో పని చేస్తున్నాయి. మన దేశంలో మాత్రం అందుకు భిన్నంగా జరుగుతోంది' అని తన అసంతృప్తి వ్యక్తం చేసినట్టు సుబ్బారావు వెల్లడించారు. ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా తన హయాంలో ఆర్‌బీఐ పూర్తి స్వయం ప్రతిపత్తితోనే పని చేసిందన్నారు. వృద్ధి రేటు, రిటైల్ ద్రవ్యోల్బణంపై అంచనాలు తప్పితే ఆర్‌బీఐ విశ్వసనీయత కూడా దెబ్బతినే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. కేంద్ర బ్యాంకులపై ప్రభుత్వాల ఒత్తిళ్లు భారత్‌కే పరిమితం కాదని, సంపన్న దేశాల్లోనూ ఉంటాయని తెలిపారు.

అంబుజా సిమెంట్స్ చేతికి మై హోమ్ సిమెంట్ గ్రైండింగ్ యూనిట్

డీల్ విలువ రూ.414 కోట్లు

న్యూఢిల్లీ: తమిళనాడు, కేరళ తీర ప్రాంతాల సిమెంట్ మార్కెట్లో అదానీ గ్రూప్ తన స్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకుంటోంది. ఇందులో భాగంగా తమిళనాడులోని ట్యుటికోరిన్ రేవుకు సమీపంలో ఉన్న మై హోమ్ సిమెంట్ గ్రైండింగ్ యూనిట్‌ను రూ.413.75 కోట్లకు కొనుగోలు చేసింది. అదానీ గ్రూప్ నిర్వహణలోని అంబుజా సిమెంట్స్ ద్వారా ఈ కొనుగోలు ఒప్పందం జరిగింది. దీంతో 15 లక్షల టన్నుల వార్షిక సిమెంట్ గ్రైండింగ్ ఉత్పత్తి సామర్థ్యం అదానీ గ్రూప్ చేతికి వచ్చినట్టయింది. ఇందుకు అవసరమైన నిధులను అంతర్గత వనరుల ద్వారా సమకూర్చుకుంటామని అంబుజా సిమెంట్స్ తెలిపింది. మైహోమ్ సిమెంట్ గ్రైండింగ్ యూనిట్‌తో పాటు ఈ ప్లాంట్ ఉద్యోగులు, డీలర్ల నెట్‌వర్క్ కూడా అదానీ గ్రూప్ పరం కానున్నాయి.

పీఎఫ్‌సీ నుంచి వేదాంతకు రూ.3,918 కోట్ల రుణం

న్యూఢిల్లీ: అనిల్ అగర్వాల్ నాయకత్వంలోని వేదాంత లిమిటెడ్ కంపెనీకి పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ (పీఎఫ్‌సీ) నుంచి రూ.3,918 కోట్ల టర్మ్ లోన్ లభించింది. ఈ రుణాన్ని వేదాంత 11 ఏళ్లలో తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. ఈ రుణాన్ని ఆంధ్రప్రదేశ్, నెల్లూరులోని 1,000 మెగావాట్ల సామర్థ్యం గల మీనాక్షీ ఎనర్జీ లిమిటెడ్ థర్మల్ విద్యుత్ కేంద్రం, చత్తీస్‌గఢ్‌లోని 1,200 మెగావాట్ల థర్మల్ పవర్ ప్లాంట్ల పునరుద్ధరణ కోసం వినియోగిస్తారు. దివాలా ప్రక్రియలో ఉన్న ఈ రెండు కంపెనీలను వేదాంత గ్రూప్ గత ఏడాది కొనుగోలు చేసింది.

ఎగుమతుల్లో క్షీణత

న్యూఢిల్లీ: భారత వస్తు సేవల ఎగుమతులు మార్చి నెలలో 4,168 కోట్ల డాలర్లకు దిగి వచ్చాయి. కాగా మార్చి 31వ తేదీతో ముగిసిన అర్థిక సంవత్సరంలో ఎగుమతులు 3.11% దిగజారి 43,706 కోట్ల డాలర్లకు పరిమితమయ్యాయి. ప్రధానంగా భౌగోళిక, రాజకీయ సంఘటనలు ఎగుమతులపై ప్రభావం చూపాయి. దిగుమతులు కూడా మార్చి నెలలో 5.98% తగ్గి 5,728 కోట్ల డాలర్లకు దిగజారగా ఏడాది మొత్తం మీద 5.41% క్షీణించి 67,724 కోట్ల డాలర్లకు దిగజారాయి. మార్చిలో వాణిజ్య లోటు 156 కోట్ల డాలర్లుగా నమోదు కాగా 2023-24 ఆర్థిక సంవత్సరానికి 24,017 కోట్ల డాలర్లకు చేరింది. తాము విదేశీ వాణిజ్యం తాజా పరిస్థితిని పరిశీలిస్తున్నామని, అవసరమైన సమయంలో తగు చర్య తీసుకుంటామని వాణిజ్య శాఖ కార్యదర్శి సునీల్ బర్త్వాల్ అన్నారు. ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందు వల్ల మరింత వివరణ ఇవ్వలేకపోతున్నామని తెలిపింది. ప్రధానంగా ఎలక్ట్రానిక్ వస్తువులు; ఔషధాలు, ఫార్మాస్యూటికల్స్; ఇంజనీరింగ్ వస్తువులు, ఇనుప ఖనిజం, కాటన్ యార్న్, చేనేత ఉత్పత్తులు, సిరామిక్, గ్లాస్ వేర్ ఉత్పత్తులు ఎగుమతుల రంగానికి మద్దతు ఇచ్చాయి.

ఓలా ఎలక్ట్రిక్ స్కూటర్ ధర తగ్గింపు

న్యూఢిల్లీ/ముంబై: ఓలా ఎలక్ట్రిక్ తమ ఎంట్రీ స్థాయి విద్యుత్ స్కూటర్ ఎస్1ఎక్స్ ధర వేరియెంట్‌ను బట్టి రూ.5,000 నుంచి రూ.10,000 వరకు తగ్గించింది. ఈ ధరల తగ్గింపు తక్షణం వర్తిస్తుంది. దీంతో ఇది సాంప్రదాయిక స్కూటర్ల ధరకు చేరువలో అందుబాటులోకి వచ్చింది. కంపెనీ ఈ ఏడాది ఫిబ్రవరిలో రూ.79,999 నుంచి రూ.1,09,999 ధర శ్రేణిలో కొత్త ఎస్1ఎక్స్ స్కూటర్‌ను మూడు వేరియెంట్లలో విడుదల చేసింది. వచ్చే వారం నుంచి కొత్త ధరకు ఈ స్కూటర్లు అందుబాటులోకి వస్తాయి. తాజా నిర్ణయం ప్రకారం 4 కిలోవాట్ బ్యాటరీ గల ఎస్1ఎక్స్ స్కూటర్ రూ.99,999కే అందుబాటులో ఉంటుంది. గతంలో ప్రకటించిన దీని ధర రూ.1,09,999. అలాగే 3 కిలోవాట్ల సామర్థ్యం గల ఎస్1ఎక్స్ వేరియెంట్ ధర రూ.89,999 నుంచి రూ.84,999కి తగ్గుతుంది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	73,150 ▲	67,050 ▲	89,500 ▲
ముంబై	72,813 ▼	66,697 ▼	83,452 ▼



ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

16వ తేదీ

హైదరాబాద్	400	విజయవాడ	404
చిత్తూరు	483	విశాఖపట్నం	419
గోదావరి	404	వరంగల్	402
		డజను గుడ్లు రూ.60	



ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	126	గోదావరి	127
వరంగల్	126	విజయవాడ	127
కరీంనగర్	126	గుంటూరు	127
మహబూబ్‌నగర్	126	ఒంగోలు	127
కర్నూలు	126	చిత్తూరు	129
విశాఖపట్నం	114		

● ఆర్యా ఓమ్నిటాక్ తన ప్రొఫెషనల్, కమర్షియల్ రేడియో సర్వీస్ కార్యకలాపాలను 2030 నాటికి 100 నగరాలకు విస్తరించాలని నిర్ణయించింది. ఎంటర్‌ప్రైజెస్, సెక్యూరిటీ ఫోర్సెస్‌కు పీఆర్‌టీఎస్ (పబ్లిక్ మొబైల్ రేడియో ట్రంకింగ్ సర్వీసెస్), సీఎంఆర్‌టీఎస్ (క్యాప్టివ్ మొబైల్ రేడియో ట్రంకింగ్ సర్వీసెస్), బ్రాడ్‌బ్యాండ్ పుష్-టు-టాక్ డివైసెస్ సేవలను కంపెనీ అందిస్తోంది. కాగా తన మోటో‌ట్రాబో పోర్టుఫోలియో విక్రయాల కోసం మోటరోలా సొల్యూషన్స్‌తో ప్రత్యేక భాగస్వామ్య ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ద్వారా సెల్యులార్ నెట్‌వర్క్స్‌పై పనిచేసే వాకీ-టాకీ వంటి కమర్షియల్ రేడియో యూనిట్స్‌ను విక్రయించే అవకాశం కంపెనీకి లభిస్తుంది.

● అమెరికా, ఫ్లోరిడాలోని టాంపా బే కమ్యూనిటీలో పిల్లల ఆరోగ్య సంరక్షణ కోసం టాంపాకు చెందిన పగిడిపాటి కుటుంబం నుంచి 5 కోట్ల డాలర్ల విరాళం అందుకున్నట్లు సెయింట్ జోసెఫ్ చిల్డ్రన్స్ హాస్పిటల్ ఫౌండేషన్ ప్రకటించింది. అమెరికాకు వచ్చి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా టాంపాకు చెందిన వ్యాపారవేత్త సిద్ పగిడిపాటి, ఆయన సోదరుడు రాహుల్, సోదరి సృజని.. ఈ విరాళాన్ని అందించారు. టాంపా బే చరిత్రలో ఇదే అతిపెద్ద విరాళం కావటం విశేషం. వీరు ఇచ్చిన విరాళంతో కొత్తగా ఏర్పాటు చేయనున్న పగిడిపాటి చిల్డ్రన్స్ హాస్పిటల్స్ 2030 నాటికి అందుబాటులోకి వస్తుందని సెయింట్ జోసెఫ్ హాస్పిటల్ వెల్లడించింది.

మార్కెట్లపై పశ్చిమాసియా దెబ్బ

- సెన్సెక్స్ 845 పాయింట్లు డౌన్
- రూ.5 లక్షల కోట్ల సంపద ఆవిరి



ముంబై: పశ్చిమాసియా సంక్షోభం మరోసారి తీవ్ర రూపం దాల్చడంతో సోమవారం ఈక్విటీ మార్కెట్‌ను భారీ నష్టాల బాటలో నడిపించింది. ప్రపంచ మార్కెట్ల బలహీన సంకేతాలు కూడా ఇన్వెస్టర్ సెంటిమెంట్‌ను దెబ్బ తీశాయి. విదేశీ నిధులు తరలిపోవడం, అమెరికాలో ద్రవ్యోల్బణం అంచనాలకు మించి ఉండడం కూడా సెంటిమెంట్‌ను తీవ్రంగా ప్రభావితం చేశాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 845.12 పాయింట్ల నష్టంతో రెండు వారాల కనిష్ఠ స్థాయి 73,399.78 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో సూచీ 929.74 పాయింట్లు నష్టపోయి 73,315.16 వరకు దిగజారింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా 246.90 పాయింట్ల నష్టంతో 22,272.50 వద్ద స్థిరపడింది. సూచీలు నష్టపోవడం ఇది వరుసగా రెండో సెషన్. ఈ రెండు సెషన్లలో సెన్సెక్స్ 1,638 పాయింట్లు, నిఫ్టీ 481 పాయింట్లు నష్టపోయాయి. సోమవారం నాటి భారీ పతనంతో బీఎస్ఈలో లిస్టింగ్ అయిన కంపెనీల మార్కెట్ విలువ రూ.5,18,953.97 కోట్ల మేరకు దిగజారి రూ.3,94,48,097.94 కోట్లకు (4.73 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది.

ఐపీఓకి దీపక్ బిల్డర్స్: ఇంజనీరింగ్, నిర్మాణ రంగంలోని దీపక్ బిల్డర్స్ అండ్ ఇంజనీర్స్ ఇండియా లిమిటెడ్ ఐపీఓ జారీకి అనుమతి కోరుతూ సెబీకి దరఖాస్తు చేసింది. ఇష్యూలో భాగంగా 1.2 కోట్ల తాజా ఈక్విటీ షేర్లు జారీ చేస్తారు. 24 లక్షల ఈక్విటీ షేర్లను ప్రమోటర్లు ఓఎఫ్ఎస్ విధానంలో విక్రయిస్తారు. ఇష్యూ ద్వారా సేకరించే నిధులు రుణభారం తగ్గించుకోవడంతో పాటు వర్కింగ్ క్యాపిటల్ అవసరాలకు వినియోగించుకోనున్నట్టు తెలిపింది.

ఆస్టర్ డీఎం హెల్త్‌కేర్ దూకుడు: కంపెనీ డైరెక్టర్ల బోర్డు ఒక్కో షేరుపై రూ.118 డివిడెండ్ ఇవ్వడానికి ఆమోదం తెలపడంతో ఆస్టర్ డీఎం హెల్త్‌కేర్ షేరు 7.50 శాతం మేర లాభపడింది. ఈ షేరు బీఎస్ఈలో 7.13 శాతం లాభంతో రూ.522.75 వద్ద ముగియగా ఎన్ఎస్ఈలో 7.53 శాతం లాభంతో రూ.525 వద్ద ముగిసింది. బీఎస్ఈలో ఇంట్రాడేలో 14.41 శాతం మేరకు దూసుకుపోయి రూ.558.30 వద్ద 52 వారాల గరిష్ఠ స్థాయిని నమోదు చేసింది.

బంగారం మరో రూ.300 అప్: ఢిల్లీ మార్కెట్లో బంగారం ధరల్లో ర్యాలీ కొనసాగుతూనే ఉంది. సోమవారం 10 గ్రాముల బంగారం రూ.300 పెరిగి రూ.73,050 పలికింది. వెండి ధర కూడా రూ.500 పెరిగి కిలో రూ.85,700 పలికింది. అంతర్జాతీయ విపణిలో కామెక్స్‌లో స్పాట్ బంగారం ధర ఔన్సు 12 డాలర్లు పెరిగి 2,355 డాలర్లు పలికింది. వెండి కూడా ఔన్సు 28.25 డాలర్లు పలికింది.

నేటి మ్యాచ్ రాత్రి 7.30 గం.
కోల్‌కతా X రాజస్థాన్

ఇప్పటికి వీరే..



పరుగులు	వికెట్లు
విరాట్ కోహ్లి (బెంగళూరు)	చాహల్ (రాజస్థాన్)
361 పరుగులు	11 వికెట్లు

స్కోరుబోర్డు

సన్‌రైజర్స్: అభిషేక్ (సి) ఫెర్గూసన్ (బి) టోప్లే 34, హెడ్ (సి) డుప్లెసి (బి) ఫెర్గూసన్ 102, క్లాసెన్ (సి) వైశాఖ్ (బి) ఫెర్గూసన్ 67, మార్‌క్రమ్ (నాటౌట్) 32, సమద్ (నాటౌట్) 37, ఎక్స్‌ట్రాలు: **15; మొత్తం: 20 ఓవర్లలో 287/3; వికెట్ల పతనం:** 1-108, 2-165, 3-231; **బౌలింగ్:** జాక్స్ 3-0-32-0, టోప్లే 4-0-68-1, యష్ దయాల్ 4-0-51-0, ఫెర్గూసన్ 4-0-52-2, వైశాఖ్ 4-0-64-0, లోమ్రోర్ 1-0-18-0.

బెంగళూరు: కోహ్లి (బి) మార్కండే 42, డుప్లెసి (సి) క్లాసెన్ (బి) కమిన్స్ 62, జాక్స్ (రనౌట్) 7, పటీదార్ (సి) నితీశ్ (బి) మార్కండే 9, సౌరవ్ (ఎల్బీ) కమిన్స్ 0, దినేశ్ కార్తీక్ (సి) క్లాసెన్ (బి) నటరాజన్ 83, లోమ్రోర్ (బి) కమిన్స్ 19, రావత్ (నాటౌట్) 25, వైశాఖ్ (నాటౌట్) 1, ఎక్స్‌ట్రాలు: **14; మొత్తం: 20 ఓవర్లలో 262/7; వికెట్ల పతనం:** 1-80, 2-100, 3-111, 4-121, 5-122, 6-181, 7-244; **బౌలింగ్:** అభిషేక్ 1-0-10-0, భువనేశ్వర్ 4-0-60-0, షాబాజ్ 1-0-18-0, నటరాజన్ 4-0-47-1, కమిన్స్ 4-0-43-3, మార్కండే 4-0-46-2, ఉనాద్కట్ 2-0-37-0.

1 ఐపీఎల్‌లో అత్యధిక స్కోరు నమోదు చేసిన టీమ్‌గా సన్‌రైజర్స్



సమద్ (10 బంతుల్లో 37 నాటౌట్)

ఐపీఎల్ ఇన్నింగ్స్‌లో అత్యధిక సిక్సర్లు (22) బాదిన జట్టుగా సన్‌రైజర్స్

2 టీ20ల్లో రెండో అత్యధిక స్కోరు (287/3) నమోదు చేసిన సన్‌రైజర్స్. నేపాల్ (314/3) టాప్‌లో ఉంది.

చరిత్ర తిరగరాస్తూ..

ఐపీఎల్ అత్యధిక స్కోరు రికార్డు బద్దలు

సన్‌రైజర్స్ 287/3

హైదరాబాదుడు

హెడ్ మెరుపు శతకం
క్లాసెన్, సమద్ తుఫాన్ ఇన్నింగ్స్
262/7తో పోరాడి ఓడిన బెంగళూరు
దినేశ్ కార్తీక్ శ్రమ వృథా

'చరిత్ర సృష్టించాలన్నా మేమే.. తిరగరాయాలన్నా మేమే..' అన్నట్టుగా తాజా సీజన్‌లో సన్‌రైజర్స్ చెలరేగుతోంది. మారిన జెర్సీ మహిమో.. కొత్త ఆటగాళ్ల చేరిక మాయో కానీ మైదానంలో సరికొత్త రికార్డులను నెలకొల్పుతోంది. ఐపీఎల్‌లో అత్యధిక స్కోరు (277/3) బాది ఇరవై రోజులైనా కాలేదు.. ఈసారి బెంగళూరుపై విరుచుకుపడి ఏకంగా 287 రన్స్‌తో సంచలనం సృష్టించింది. వీర బాదుడుకు పర్యాయపదంగా ట్రావిస్ హెడ్, క్లాసెన్, సమద్ త్రయం విధ్వంసానికి చిన్నస్వామిలో పరుగుల కుంభవృష్టి కురిసింది. బంతి పడిందే ఆలస్యం అందరి చూపూ స్టాండ్స్ వైపే.. వీలైతే స్టేడియంపైన కూడా ఉండేలా బ్యాట్‌తో వీరంగం ఆడారు. అటు ఆర్‌సీబీకి మెరుపు ఆరంభం దక్కినా మిడిలార్డర్ తడబాటుతో.. దినేశ్ కార్తీక్ ఎంత పోరాడినా ఫలితం లేకపోయింది.

549 ఈ మ్యాచ్‌లో నమోదైన మొత్తం పరుగులు. ఒక టీ20 మ్యాచ్‌లో ఇన్ని రన్స్ సాధించడం ఇదే తొలిసారి.



ట్రావిస్ హెడ్ (41 బంతుల్లో 9 ఫోర్లు, 8 సిక్సర్లతో 102)



దినేశ్ కార్తీక్ (35 బంతుల్లో 5 ఫోర్లు, 7 సిక్సర్లతో 83)

1 చేజింగ్‌లో 250+ పరుగులు చేసిన తొలి ఐపీఎల్ జట్టుగా బెంగళూరు

బెంగళూరు: సన్‌రైజర్స్ హైదరాబాద్ ఐపీఎల్‌లో రికార్డులను బద్దలుకొడుతోంది. అసాధ్యమనుకున్న స్కోర్లను అలవోకగా సాధేస్తూ ప్రత్యర్థి జట్లకు వణుకు పుట్టిస్తోంది. ట్రావిస్ హెడ్ (41 బంతుల్లో 9 ఫోర్లు, 8 సిక్సర్లతో 102) మెరుపు శతకానికి క్లాసెన్ (31 బంతుల్లో 2 ఫోర్లు, 7 సిక్సర్లతో 67), అబ్దుల్ సమద్ (10 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సర్లతో 37 నాటౌట్) బాదుడు తోడవడంతో ఆకాశమే హద్దుగా చెలరేగింది. అయితే రికార్డు ఛేదనలో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు సైతం పోరాడినా ఫలితం లేకపోయింది. దీంతో సన్‌రైజర్స్ 25 పరుగుల తేడాతో నెగ్గింది. రైజర్స్‌కిది హ్యాట్రిక్ గెలుపు కాగా, ఆర్‌సీబీకి వరుసగా ఐదో ఓటమి. సోమవారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా సన్‌రైజర్స్ 20 ఓవర్లలో 3 వికెట్లకు 287 పరుగుల రికార్డు స్కోరు సాధించింది. మార్‌క్రమ్ (17 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లతో 32 నాటౌట్), అభిషేక్ (34) ఆకట్టుకున్నారు. ఫెర్గూసన్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఛేదనలో బెంగళూరు 20 ఓవర్లలో 7 262/7 స్కోరు చేసింది. దినేశ్ కార్తీక్ (35 బంతుల్లో 5 ఫోర్లు, 7 సిక్సర్లతో 83), డుప్లెసి (28 బంతుల్లో 7 ఫోర్లు, 4 సిక్సర్లతో 62), విరాట్ (20 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సర్లతో 42) పోరాటం చూపారు. కమిన్స్ 3, మార్కండే 2 వికెట్లు తీశారు. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా హెడ్ నిలిచాడు.

దినేశ్ కార్తీక్ పోరాటం: అతి భారీ ఛేదనలో ఆర్‌సీబీ ఓపెనర్లు డుప్లెసి, విరాట్ జట్టుకు కావాల్సిన విధంగానే ఆడారు. అయితే మధ్యలో వికెట్ల పతనం వీరి లయకు బ్రేక్ వేసింది. ఆ తర్వాత దినేశ్ కార్తీక్ ఎంతగా పోరాడినా లక్ష్యం భారీగా ఉండడంతో ఫలితం లేకపోయింది. రెండో ఓవర్‌లో విరాట్ 4,6తో వేగం పెంచగా, డుప్లెసి తర్వాతి ఓవర్‌లో 4,6,6తో 18 రన్స్ అందించాడు. ఇదే జోరుతో పవర్‌ప్లేలో జట్టు 79 పరుగులు సాధించింది. ఐపీఎల్‌లో ఆర్‌సీబీకిదే అత్యధికం. ఇంతవరకు పోటీలో ఉన్నట్టుగానే కనిపించింది. కానీ ఏడో ఓవర్‌లో విరాట్‌ను మార్కండే బౌల్డ్ చేయడంతో తొలి వికెట్‌కు 80 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అంతే.. తర్వాతి మూడు ఓవర్లలోనే విల్ జాక్స్ (7) రనౌట్‌తో పాటు పటీదార్ (9), డుప్లెసి, సౌరవ్ చౌహాన్ (0)ల వికెట్లు కోల్పోవడంతో 122/5 స్కోరుతో జట్టు ఓటమి దిశగా పయనించింది. కానీ, దినేశ్ కార్తీక్ పట్టు వదల్లేదు. 13వ ఓవర్‌లో మహిపాల్ లోమ్రోర్ (19) 6,6.. దినేశ్ 6,4తో 25 పరుగులు వచ్చాయి. తర్వాతి ఓవర్‌లోనూ దినేశ్ 4,4,6,4తో 21 రన్స్ రాబట్టాడు. అటు లోమ్రోర్‌ను కమిన్స్ అవుట్ చేయడమే కాకుండా పరుగులను కట్టడి చేయడంతో రన్‌రేట్ 25కి పైగా పెరిగింది. దినేశ్ 19వ ఓవర్‌లో 6,4 బాది అవుటయ్యాడు. ఇక అప్పటిదాకా నిదానంగా ఆడిన రావత్ (25 నాటౌట్) ఆఖరి ఓవర్‌లో 4 ఫోర్లతో 18 రన్స్ రాబట్టి ఓటమి అంతరాన్ని తగ్గించాడు.

రైజర్స్ బ్యాటర్ల ఊచకోత: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన సన్‌రైజర్స్ ఇన్నింగ్స్ వాయువేగంతో సాగింది. ఓపెనర్ హెడ్ బాదుడుకు చిన్నస్వామి స్టేడియం మరింత చిన్నదిగా మారినట్టనిపించింది. క్లాసెన్, సమద్ సైతం బ్యాట్లు ఝుళిపించడంతో రికార్డు స్కోరు నమోదైంది. బెంగళూరు బౌలర్లకు ముచ్చెమటలు పట్టిస్తూ ఆరంభంలోనే హెడ్ చెలరేగిన విధానంతో రైజర్స్ అలవోకగా రన్స్ కొల్లగొట్టింది. పవర్‌ప్లేలోనే హెడ్ అర్ధసెంచరీ పూర్తి కాగా జట్టు స్కోరు కూడా 7.1 ఓవర్‌లోనే 100 పరుగులకు చేరింది. రెండో ఓవర్‌లోనే 20 పరుగులు వచ్చాయి. ఐదో ఓవర్‌లో 6,6,4తో 18 రన్స్. ఆరో ఓవర్‌లో 6,6,4తో 20 రన్స్ రాబట్టడంతో పవర్‌ప్లేలో జట్టు 76 పరుగులు చేసింది. ఆ తర్వాత హెడ్ మరింతగా చెలరేగాడు. ఏడో ఓవర్‌లోనే అతను మరోసారి 4,6,6తో 21 రన్స్ అందించాడు. తొమ్మిదో ఓవర్‌లో అభిషేక్‌ను టోప్లే అవుట్ చేసినా.. అప్పటికే 49 బంతుల్లో 108 పరుగుల భాగస్వామ్యం సమకూరింది. వికెట్ తీసిన ఆనందాన్ని ప్రత్యర్థికి దూరం చేస్తూ మధ్య ఓవర్లలో క్లాసెన్ రెచ్చిపోయాడు. అటు హెడ్ తన బాదుడుతో 39 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసి 13వ ఓవర్‌లో అవుటయ్యాడు. ఆ తర్వాత బాధ్యతను తీసుకున్న క్లాసెన్ భారీ సిక్సర్లతో హోరెత్తించాడు. 17వ ఓవర్‌లో అతడు బాదిన సిక్సర్ ఏకంగా 106మీ. ఎత్తులో వెళ్లి స్టేడియంపైన పడింది. అతడి ధాటికి 15 ఓవర్లలోనే స్కోరు 200 దాటింది. 17వ ఓవర్‌లో క్లాసెన్ నిష్క్రమించగా, మూడో వికెట్‌కు మార్‌క్రమ్‌తో కలిసి 66 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. చివరి మూడు ఓవర్లలోనైనా ఆర్‌సీబీకి ఉపశమనం కలుగలేదు. అబ్దుల్ సమద్ జూలు విదుల్చుతూ 19వ ఓవర్‌లో 4,4,6,6,4తో 25 పరుగులు పిండుకున్నాడు. ఇక ఆఖరి ఓవర్‌లో మార్‌క్రమ్ 4,6.. సమద్ 6తో ఐపీఎల్‌లో రైజర్స్ తమ టాప్ స్కోరును తిరగరాసింది.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.ర‌రే
రాజస్థాన్	6	5	1	0	10	0.767
కోల్‌కతా	5	4	1	0	8	1.688
చెన్నై	6	4	2	0	8	0.726
హైదరాబాద్	6	4	2	0	8	0.502
లఖ్‌నవూ	6	3	3	0	6	0.038
గుజరాత్	6	3	3	0	6	-0.637
పంజాబ్	6	2	4	0	4	-0.218
ముంబై	6	2	4	0	4	-0.234
ఢిల్లీ	6	2	4	0	4	-0.975
బెంగళూరు	7	1	6	0	2	-1.185

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.ర‌రే: నెట్ రన్‌రేట్

ఒలింపిక్ జ్యోతి ప్రజ్వలన నేడు

ఏథెన్స్: మరో 100 రోజుల్లో పారిస్‌లో విశ్వక్రీడా సంరంభానికి తెరలేవనుంది. సంప్రదాయం ప్రకారం విశ్వ క్రీడలు పుట్టిన ఒలింపియాలో మంగళవారం జరిగే జ్యోతి ప్రజ్వలనతో మెగా ఈవెంట్‌కు కౌంట్ డౌన్ ఆరంభం కానుంది. ఇక్కడ వెలిగించిన టార్చ్‌ను పారిస్ క్రీడల నిర్వాహకులకు అందజేయనున్నారు. గ్రీస్‌లో 11 రోజులపాటు టార్చ్ రిలేను నిర్వహించిన అనంతరం.. ఈనెల 27న ఒలింపిక్ జ్యోతి పడవలో విశ్వక్రీడల వేదికైన పారిస్‌కు పయనం కానుంది.

పోలీసు కస్టడీలో స్లేటర్



క్వీన్స్‌లాండ్: ఆస్ట్రేలియా మాజీ బ్యాటర్, వ్యాఖ్యాత మైకేల్ స్లేటర్ చిక్కుల్లో పడ్డాడు. అతడిపై ఏకంగా 19 కేసులు నమోదు కావడంతో స్థానిక పోలీసులు రిమాండ్‌కు తరలించారు. గతేడాది డిసెంబరు నుంచి ఈ ఏడాది ఏప్రిల్ 12 వరకు గృహహింస, మహిళలను వెంబడించడం, భయభ్రాంతులకు గురిచేయడం, భౌతిక దాడికి దిగడం, దొంగతనాలు.. ఇలా పలురకాల కేసులు 54 ఏళ్ల స్లేటర్‌పై నమోదయ్యాయి. దీంతో గత శుక్రవారమే స్లేటర్‌ను అరెస్ట్ చేశారు. పలుసార్లు కోర్టు ఆదేశాలను ధిక్కరిస్తూ బెయిల్ నియమాలను కూడా ఉల్లంఘించాడు. 2004లో స్లేటర్ క్రికెట్ నుంచి తప్పుకొన్నాక కామెంటేటర్‌గా స్థిరపడ్డాడు.

శోభన, సజనకు పిలుపు

బంగ్లాతో టీ20 సిరీస్‌కు భారత మహిళల జట్టు

న్యూఢిల్లీ: ఇటీవల మహిళల ప్రీమియర్ లీగ్‌లో రాణించిన స్పిన్నర్ ఆశా శోభన, హార్డ్ హిట్టర్ సజన సజీవన్ తొలిసారి జాతీయ జట్టులో చోటు దక్కించుకున్నారు. బంగ్లాదేశ్‌తో ఈనెల 28 నుంచి జరిగే ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో తలపడే భారత మహిళల జట్టును సోమవారం ప్రకటించారు. హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్ కాగా, స్మృతి మంధాన వైస్‌గా వ్యవహరించనుంది. ఏప్రిల్ 28న తొలి టీ20, 30న రెండోది, మే 2న మూడోది, 6న నాలుగోది, ఐదోమ్యాచ్ మే 9న జరుగుతాయి.

బోపన్న చేజారిన 'టాప్'

న్యూఢిల్లీ: టెన్నిస్ ఆటగాడు రోహన్ బోపన్న డబుల్స్‌లో తన టాప్‌ర్యాంక్‌ను చేజార్చుకున్నాడు. సోమవారం ప్రకటించిన ర్యాంకింగ్స్‌లో.. బోపన్న తన డబుల్స్ సహచరుడు మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా)కు అగ్రస్థానం కోల్పోయాడు. మాథ్యూ నెం.1 ర్యాంక్ దక్కించుకోగా, బోపన్న రెండో స్థానం లో నిలిచాడు. ఇక సింగిల్స్‌లో సుమిత్ నగాల్ 80వ ర్యాంకుతో కెరీర్‌లో అత్యుత్తమంగా నిలిచాడు.

థాయ్‌లాండ్‌తో పురుషులు

కెనడాతో మహిళల ఢీ
థామస్, ఉబెర్ కప్ షెడ్యూల్

చెంగ్డూ (చైనా): థామస్, ఉబెర్ కప్ బ్యాడ్మింటన్ టీమ్ చాంపియన్‌షిప్స్ డ్రా సోమవారం విడుదలైంది. టోర్నీ ఈనెల 28 నుంచి మే ఐదు వరకు చెంగ్డూలో జరగనుంది. థామస్, ఉబెర్ కప్‌ల్లోని నాలుగేసి గ్రూపుల నుంచి రెండేసి జట్లు క్వార్టర్‌ఫైనల్‌కు చేరుకుంటాయి.

థామస్ కప్ షెడ్యూల్: **ఏప్రిల్ 27:** భారత్ x థాయ్‌లాండ్ (మ. 3.30 నుంచి), **ఏప్రిల్ 29:** భారత్ x ఇంగ్లండ్ (ఉ. 7 నుంచి), **మే 1:** భారత్ x ఇండోనేసియా (సా. 5 నుంచి)

ఉబెర్ కప్: ఏప్రిల్ 27: భారత్ x కెనడా (ఉ.10.30 నుంచి), **ఏప్రిల్ 28:** భారత్ x సింగపూర్ (ఉ. 6 నుంచి), **ఏప్రిల్ 30:** భారత్ x చైనా (ఉ. 7 నుంచి).

రెండో సీడ్‌కు విదిత్ చెక్

క్యాండిడేట్స్ చెస్ టోర్నీ

టొరంటో: ప్రతిష్ఠాత్మక క్యాండిడేట్స్ చెస్ టోర్నీ తొమ్మిదో రౌండ్‌లో భారత గ్రాండ్ మాస్టర్ విదిత్ గుజ్‌రాతీ అద్భుతంగా పుంజుకొన్నాడు. గత గేమ్‌లో ఓటమి పాలైన అతడు ఈ రౌండ్‌లో రెండో సీడ్ హికారు నకమురాకు షాకిచ్చాడు. ఇద్దరు భారత టీనేజ్ ఆటగాళ్లు ప్రజ్ఞానంద-గుకేష్ మధ్య జరిగిన గేమ్ ఫలితం తేలకుండా ముగిసింది. గుకేష్ (5.5), నెపోమ్నియాచి (5.5) అగ్రస్థానంలో కొనసాగుతున్నారు. ప్రజ్ఞానంద (5) మూడో స్థానంలో నిలిచాడు. గుజరాతీ (4) సంయుక్తంగా నాలుగోస్థానంలో కొనసాగుతున్నాడు. మహిళల విభాగంలో హంపి (4) తన గేమ్‌ను డ్రా చేసుకోగా, వైశాలి (2.5) పరాజయం పాలైంది.



సీఎం జగన్‌పై రాయి దాడి గురించి ఎన్నికల ప్రధానాధికారి ఎంకే మీనాకు వివరిస్తున్న విజయవాడ పోలీసు కమిషనర్ కాంతి రాణా

సీఎంపై దాడి కేసు దర్యాప్తులో వేగం పెంచండి

- ఇటువంటి ఘటనలు జరక్కుండా చూడండి
- పోలీసు అధికారులతో సీఈవో సమీక్ష

అమరావతి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): సీఎం జగన్మోహన్‌రెడ్డిపై రాయితో దాడి చేసిన ఘటనకు సంబంధించిన కేసు దర్యాప్తును వేగవంతం చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా విజయవాడ సీపీ కాంతి రాణా టాటా, ఐజీ రవిప్రకాశ్‌లను ఆదేశించారు. ఈ ఘటనకు సంబంధించి సోమవారం అమరావతి సచివాలయంలో ఆయన అధికారులతో సమీక్షించారు. కేసు వివరాలు, దర్యాప్తు పురోగతి గురించి తెలుసుకున్నారు. దర్యాప్తును మరింత వేగవంతం చేసి సమగ్ర నివేదికను సాధ్యమైనంత త్వరగా అందజేయాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి, ఇతర ప్రముఖ వ్యక్తుల పర్యటనల్లో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకతను ఆయన నొక్కి చెప్పారు. ఇందుకు ఎలాంటి చర్యలు తీసుకున్నారనే అంశంపై ఆరా తీశారు. ఈ దుర్ఘటనకు సంబంధించిన పూర్వాపరాలు, దర్యాప్తు ప్రగతిని వీడియో విజువల్స్, ఫొటోల ద్వారా సీపీ కాంతి రాణా టాటా.. సీఈవో ముఖేష్ కుమార్ మీనాకు వివరించారు.

సమాచారం ఇస్తే రూ.2 లక్షల నజరానా

- గులకరాయి ఘటనపై పోలీసుల ప్రకటన

విజయవాడ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : సీఎం జగన్‌పై గులకరాయి దాడి ఘటనలో నిందితుల సమాచారం ఇచ్చిన వారికి పోలీసు శాఖ రూ.2 లక్షల పారితోషికం ప్రకటించింది. పోలీసు కమిషనర్ టి.కాంతిరాణా దీనిపై సోమవారం ప్రకటన విడుదల చేశారు. నిందితులను పట్టుకోవడానికి ఉపయోగపడే కచ్చితమైన సమాచారం, వీడియో క్లిప్‌లను అందించాలని విజ్ఞప్తి చేశారు. నిందితులను ప్రత్యక్షంగా చూసినవారు నేరుగా తమకు సమాచారం ఇవ్వొచ్చని పేర్కొన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ సమాచారాన్ని రూరల్ డీసీపీ కంచి శ్రీనివాసరావు (9490619342), టాస్క్‌ఫోర్స్ ఏడీసీపీ ఆర్.శ్రీహరిబాబు (9440627089) నెంబర్లకు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

సజ్జల డైరెక్షన్‌లోనే గులకరాయి డ్రామా

- అధికారం కోసం జగన్ ఎంతకైనా తెగిస్తారు
- అందుకే విజయమ్మ విదేశాలకు పారిపోయారు: చింతమనేని

అమరావతి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): సజ్జల డైరెక్షన్, స్ర్కీన్‌ప్లేలోనే జగన్‌పై గులకరాయి దాడి డ్రామా జరిగిందని మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆరోపించారు. జగన్‌కు ఓటమి భయం పట్టుకుందని, అందుకే కోడికత్తి డ్రామాకు సీక్వెల్‌గా గులకరాయి డ్రామాకు తెరలేపారన్నారు. అందుకే సీఎం ప్రచారం కన్నా ముందు కరెంట్ పోయిందని, సాక్షి లైవ్ ఆగిపోయిందన్నారు. రాళ్ల దాడి జరుగుతుంటే పోలీసు, నిఘా వ్యవస్థలు ఏం చేస్తున్నాయని ప్రశ్నించారు. దాడి చేసిన వ్యక్తిని ఎందుకు అరెస్టు చేయలేదని, ఆ రాయి ఏమైందని ప్రశ్నించారు. సోమవారం టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ బస్సు యాత్రలో భాగంగా అభిమానులు జగన్‌కు దండ వేస్తుంటే జగన్ కణతపై బైండింగ్ వైర్ గీచుకుని రక్తం వచ్చి ఉంటుందని, అందుకే జగన్‌కు కోపం వచ్చిందన్నారు. కోపంతో ఉన్న జగన్ పక్కనే ఉన్న వెలంపల్లిని మోచేత్తో గుద్దాడని అందరూ చెప్పుకుంటున్నారని తెలిపారు. అధికార దాహం కోసం జగన్ ఎంతకైనా తెగబడతారని, కుటుంబ సభ్యులనైనా ఖూనీ చేయిస్తారని విమర్శించారు. ఇప్పుడు మళ్లీ ఎవరి ప్రాణాలు పోతాయోనని జగన్ కుటుంబ సభ్యులు భయపడుతున్నారని, అందుకే విజయమ్మ విదేశాలకు పారిపోయిందన్నారు.

కోడికత్తి పోయి గులకరాయి డ్రామా: పంచుమర్తి

కోడికత్తి డ్రామా అయిపోయిందని.. ఇప్పుడు గులకరాయి డ్రామా మొదలు పెట్టారని టీడీపీ ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధ ఎద్దేవా చేశారు. సీఎం జగన్‌కు అంతమంది సెక్యూరిటీ ఉండి దాడి జరుగుతుంటే ఎందుకు ఆపలేదని నిలదీశారు. ఇదంతా వైసీపీ డ్రామాలో భాగమేనని, వైసీపీ డ్రామాలను ప్రజలు నమ్మరని అనూరాధ పేర్కొన్నారు.

గులకరాయి నాటకంలో వెలంపల్లి బఫూన్: డూండీ రాకేశ్

గులకరాయి డ్రామా ఆడి వెలంపల్లి బఫూన్ అయ్యారని టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం అధ్యక్షుడు డూండి రాకేష్ విమర్శించారు. వెలంపల్లి విజయవాడ పులకేశిగా మారారన్నారు.

జగన్‌పై దాడి పోలీసుల వైఫల్యమే: అశోక్‌బాబు

పోలీసు భద్రతా వైఫల్యమే జగన్‌పై రాయి దాడికి కారణమని టీడీపీ ఎమ్మెల్సీ అశోక్‌బాబు ఆరోపించారు. జగన్‌పై జరిగిన దాడి హత్యాయత్నం అనుకుంటే నాడు చంద్రబాబుపై జరిగిన రాళ్ల దాడి హత్యాయత్నం కాదా? అని నిలదీశారు.

గులకరాయితో జగన్ కొత్త నాటకం: గోరంట్ల

రాజమహేంద్రవరం సిటీ/రూరల్, ఏప్రిల్ 15: రాబోయే ఎన్నికల్లో ఓటమి తప్పదని గ్రహించిన సీఎం జగన్.. ప్రజల నుంచి సానుభూతి పొందేందుకు కపట నాటకాలు ఆడుతున్నాడని టీడీపీ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ఆరోపించారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తలకు డమ్మీ కట్టుతో బుచ్చయ్య వినూత్నంగా నిరసన తెలిపారు. కోడి కత్తి డ్రామాతో సానుభూతి పొంది అధికారాన్ని చేపట్టిన జగన్.. ఇప్పుడు కొత్తగా గులకరాయి డ్రామా మొదలు పెట్టారన్నారు. జగన్ సభలో వేలాది మంది పోలీసులు ఉన్నారాయి సరిగా జగన్ కంటి మీద తగలడం వెనుక రహస్యం ఏమిటని ప్రశ్నించారు. ఇదంతా బూటకమని, జగన్ ముందస్తు కార్యచరణలో భాగమేనని గోరంట్ల ఆరోపించారు.

సీబీఐ విచారణ జరపాలి: కనకమేడల

న్యూఢిల్లీ, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): సీఎం జగన్‌పై రాయి విసిరిన ఘటనపై సీబీఐ లేదా ఎన్ఐఏతో విచారణ జరిపించాలని టీడీపీ మాజీ ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్ డిమాండ్ చేశారు. రాయి ఘటనకు వ్యూహకర్త సజ్జల అని ఆరోపించారు.

ఎవరైనా తమపై తామే దాడి చేయించుకుంటారా?

- సీఎంపై దాడి జరిగితే డ్రామా అంటారా: సజ్జల

అమరావతి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): 'ఎవరైనా వారిపై వారే రాయి దాడి చేయించుకుంటారా.. కత్తితో పొడిపించుకుంటారా' అని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి ప్రశ్నించారు. ఇలా రాయిదాడి చేయించుకోవడానికి.. కత్తితో పొడిపించుకునేందుకు టీడీపీ నేతలు సిద్ధమేనా అని నిలదీశారు. సీఎం జగన్‌పై జరిగిన రాయిదాడి నింద తమపై ఎక్కడ వస్తుందోనని ప్రతిపక్షం భయపడుతోందని అన్నారు.

'వర్సిటీ'ల ఉద్యోగులకు జీతాలేవీ?

- ఖజానా ఖాళీ కావడమే కారణం?

అమరావతి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వ్యవసాయ, ఉద్యాన, పశువైద్య, మత్స్య విశ్వవిద్యాలయాల పరిధిలో పని చేస్తున్న ఉద్యోగులందరికీ జీతాలు పెండింగ్ పడ్డాయి. ఏప్రిల్ 15 వచ్చినా మార్చి నెల జీతం ఇవ్వలేదు. రిటైరైన ఉద్యోగులకు పెన్షన్ సొమ్ము కూడా పడలేదు. కాంట్రాక్ట్ సిబ్బందికైతే రెండు నెలల నుంచి వేతనాలు అందలేదు. రాష్ట్ర ప్రభుత్వ ఖజానా ఖాళీ కావడమే ఇందుకు కారణమని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. కానీ అరకొర వేతనాలతో పని చేసే తమకు రెండు నెలలు డబ్బులు లేకపోతే.. ఎంత ఇబ్బంది పడతామో ప్రభుత్వానికి అర్థం కావట్లేదని కాంట్రాక్ట్ సిబ్బంది మండి పడుతున్నారు. విశ్వవిద్యాలయాల్లో బోధన, బోధనేతర సిబ్బందితో పాటు ఏపీ ఆప్కాస్‌లో నమోదైన ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలిస్తున్నట్లు ప్రభుత్వ పెద్దలు గొప్పలు చెబుతున్నారు. కానీ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి కూడా వేతనాలు ఆలస్యం కావడంతో వారంతా ఆందోళన చెందుతున్నారు. రూ.18-21 వేలకు పని చేసే తమకు కూడా వేతనాలు ఆలస్యం చేయడం పై నిరసన వ్యక్తం చేస్తున్నారు. పశువైద్య విశ్వవిద్యాలయ ఉద్యోగులకు గత నెల 20న జీతభత్యాలు, పెన్షన్ల కోసం రూ.23.61కోట్ల విడుదలకు పరిపాలనా అనుమతి ఇచ్చినా.. నిధుల్ని వెనక్కి తీసుకున్నారని తెలిసింది.

ఎలా జరిగిందని మీరు అనుకొంటున్నారు?

గులకరాయి ఘటనపై కూటమి నేతలను ఆరా తీసిన గవర్నర్

వండి వార్చిన నాటకమని బదులిచ్చిన నేతలు

అమరావతి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి జగన్మోహన రెడ్డిపై గులకరాయి దాడి ఘటనపై రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు ప్రతిపక్ష కూటమి నేతలకు మధ్య సోమవారం ఆసక్తికర సంభాషణ జరిగింది. ఈ ఘటనపై సీబీఐ దర్యాప్తు జరపాలని కోరుతూ కూటమి నేతలు సోమవారం సాయంత్రం విజయవాడ రాజ్ భవన్‌లో గవర్నర్‌ను కలిశారు. ఈ ఘటన ఎలా జరిగిందని అనుకొంటున్నారని గవర్నర్ వారిని ప్రశ్నించారు. అది నిజంగా జరిగిన దాడి కాదని, వండి వార్చిన నాటకమని అనుకొంటున్నామని వారు బదులిచ్చారు. 'యాత్ర జరుగుతున్నప్పుడు కరెంటుపోతే భద్రతా సిబ్బంది వీఐపీ తలపై చెయ్యి పెట్టి ఆయనను బలవంతంగా కింద కూర్చోబెడతారు. వీఐపీ ఒప్పుకోకపోయినా అలా చేయాలన్నది భద్రతా నియమం. కానీ దాడి జరిగినప్పుడు సెక్యూరిటీ సిబ్బంది కింద కూర్చుంటే ముఖ్యమంత్రి నిలబడి రాయి కోసం ఎదురు చూస్తున్నట్లుంది. ఇదంతా ముందే సిద్ధం చేసి పెట్టుకొన్న డ్రామా. జగన్ టీవీ కెమేరాను ఈ రాయి ఎటు నుంచి వస్తోందో అటే పెట్టి ఎలా ఉంచుతారు? అటు నుంచే వస్తుందని వారికి ఎలా తెలుసు? అదిగో రాయి వస్తోందంటూ లైవ్‌లో వర్ణిస్తూ కెమేరాను చూపించడం ఎలా సాధ్యం? అందుకే దీనిని నాటకం అని అంటున్నాం" అని టీడీపీ ప్రధాన కార్యదర్శి వర్ల రామయ్య...ఆయనకు చెప్పారు. ఈ ఘటనకు సంబంధించి నమోదైన ఎఫ్ఐఆర్‌పై కూడా గవర్నర్ ఒక సందేహం లేవనెత్తినట్లు సమాచారం. "మీరు పోలీస్ శాఖలో పనిచేశారు కదా... ఒక ఘటనకు సంబంధించి ..నేరపూరిత చర్యకు సంబంధించిన సెక్షన్లు ముందే ఎఫ్ఐఆర్‌లో నమోదు చేస్తారా లేక విచారణ పూర్తయిన తర్వాత పెడతారా' అని ఆయన అడిగారు. గులకరాయి ఘటనలో పోలీసులు 307 సెక్షన్‌ను ఎఫ్ఐఆర్‌లో నమోదు చేయడంపై టీడీపీ నేతలు లేవనెత్తిన అభ్యంతరంపై ఆయన ఈ ప్రశ్న వేశారు. 'ఎఫ్ఐఆర్‌లో ప్రాథమికంగా ఘటన గురించి రాస్తారు. పూర్తి విచారణ జరిగిన తర్వాత అందులో తేలిన విషయాలను బట్టి సెక్షన్లు నమోదు చేస్తారు. ఈ ఘటనలో ముందే 307 సెక్షన్ నమోదు చేయడం పోలీసులపై పైనుంచి ఎంత ఒత్తిడి ఉందో చూపిస్తోంది.' అని రామయ్య...గవర్నర్‌కు చెప్పారు.



రాయి దాడిపై సీబీఐతో విచారణ కోరుతూ గవర్నర్‌కు వినతిపత్రం ఇస్తున్న టీడీపీ నేతలు

ఓటమి ఖాయమని తెలిసి...

తన ఓటమి ఖాయమని జగన్ నిర్ధారణకు వచ్చారని, ఏదో రకంగా సానుభూతిని రగిల్చి గెలవాలన్న తాపత్రయంతో ఈ వ్యవహారం నడిపించారని వర్ల రామయ్య విమర్శించారు. "కేసు దర్యాప్తునకు విజయవాడ కమిషనర్ పనికిరారు. ఇక్కడ పోలీసులు చేస్తే కోడి కత్తి శ్రీను మాదిరిగా ఎవరో ఒక అమాయకుడిని పెడతారు. కేసు విచారణను సీబీఐకు ఇవ్వాలని గవర్నర్‌ను కోరాం. ఆయన హావభావాలు కూడా దానికి సుముఖంగానే ఉన్నట్లు మాకు అనిపించాయి. సిట్ కార్యాలయం ఆవరణలో కేసు పేపర్లను ఐపీఎస్ అధికారి కొల్లి రఘురామిరెడ్డి తగలబెట్టించడంపై కూడా ఉన్నత స్థాయి దర్యాప్తు జరిపించాలని గవర్నర్‌ను కోరాం. డీజీపీ, చీఫ్ సెక్రటరీ, నిఘా ఐజీ... జగన్ పంజరంలో చిలకల మాదిరిగా మారిపోయారు.

అదేమన్నా క్యారం బోర్డు కాయినా?

'జగన్‌పై పడిన రాయి ఏమన్నా క్యారం బోర్డు కాయినా? ఒకే రాయి అంత మందికి ఎలా తగులుతుంది? బస్సు యాత్రలో అన్ని చోట్లా జగన్ బస్సు లోపల కూర్చుని ప్రయాణం చేశారు. ఒక్క విజయవాడలోనే బస్సు మీద నిలబడి ప్రయాణం చేశారు. మార్గమధ్యంలో కరెంటు పోతే వెంటనే బస్సులోకి వెళ్ళాలి. పైనే ఎలా నిలబడతారు' అని జనసేన పార్టీ నేత గాదె వెంకటేశ్వరరావు ప్రశ్నించారు. రాయి ఎవరు విసిరారో కూడా జనమే చెప్పాలని పోలీస్ శాఖ కోరడం హాస్యాస్పదంగా ఉందని, ఇక పోలీస్ వ్యవస్థ దేనికోసం ఉందో వారికే తెలియాలని ఆయన వ్యాఖ్యానించారు. ఓడిపోయే ముందు అభాసుపాలు కాకుండా చూసుకోవాలని ఆయన వైసీపీ నేతలకు సూచించారు.

జనంలోంచే రాయి!

(మొదటి పేజీ తరువాయి)

తగిలిన రాయి, మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావుకు తగిలిన రాయి ఒక్కటేనని తేల్చి చెప్పారు. "ఎడమ వైపు నుంచి అరచేతిలో పట్టేంత రాయి వేగంగా వచ్చి జగన్ నుదుటికి తగిలింది. అదే రాయి వెలంపల్లి కంటి భాగం, ముక్కు వద్ద తగిలింది" అని చెప్పారు. ఆగంతకుడు ఈ పనిచేసి ఉంటాడని అనుమానిస్తున్నామన్నారు. విజయవాడలో సోమవారం మీడియాతో ఆయన మాట్లాడారు.

ఏమన్నారంటే..

"సీఎం జగన్ రోడ్ షో అజిత్ సింగ్‌నగర్‌లోని వివేకానంద స్కూల్ దాటి గంగానమ్మ ఆలయం వద్దకు వచ్చేసరికి రోడ్డుపై నుంచే ఒక దుండగుడు రాయి విసిరాడు. సీసీ కెమెరాల ఫుటేజీలు, సెల్‌ఫోన్ల వీడియోలను విశ్లేషించాక ఈ నిర్ధారణకు వచ్చాం. వివేకానంద స్కూల్ అన్ని గదులకు తాళాలు వేసి ఉన్నాయి. భవనంపై కాని స్టేబుళ్లు ఉన్నారు. వివేకానంద స్కూల్ ప్రాంగణం నుంచి పక్కనే ఉన్న మాకినేని స్టేడియంలోకి వెళ్లడానికి గేటు ఉంది. స్కూల్, స్టేడియానికి చెంతనే గంగానమ్మ ఆలయం ఉంది. వీటి మధ్య కొంత ఖాళీ ప్రదేశం ఉంది. అక్కడి నుంచే దాడి జరిగింది. ఆగంతకుడు చేత్తోనే రాయిని విసిరాడు. క్యాట్‌బాల్‌తో ఇలా కొట్టడం సాధ్యం కాదు. మేం సేకరించిన 60 వీడియోలను సాంకేతిక విశ్లేషణ కోసం ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపాం. కొంతమందిపై అనుమానాలు ఉన్నాయి. నేరచరిత్ర ఉన్న అనుమానితులను, ఘటన జరిగిన ప్రాంతంలో ఉన్న వారినీ విచారిస్తున్నాం. త్వరలోనే నిందితులను పట్టుకుంటాం. వారధి నుంచి కేసరపల్లి వరకు 22 కిలోమీటర్ల మేర జగన్ బస్సుయాత్ర సాగింది. యాత్ర సాగే ప్రాంతాల్లో మొత్తం 1,480 మందితో బందోబస్తు ఏర్పాటు చేశాం. జగన్‌కు గజమాలలు వేసే ప్రాంతాలు, ఆయన బస్సు టాప్ పైకిఎక్కే ప్రాంతాల్లో 800 మందిని బందోబస్తుకు నియమించాం. ఇదికాకుండా 40 రోప్ పార్టీలను ఏర్పాటు చేశాం. ఒక్కో పార్టీలో పదిమంది ఉంటారు. మంగళగిరిలోని ఏపీఎస్పీ ఆరో బెటాలియన్ నుంచి పది ప్లటూన్లు బందోబస్తులో ఉన్నాయి. రోడ్ షో సాగే ప్రాంతాల్లో భద్రతా కారణాలతో మేమే విద్యుత్ సరఫరాను నిలుపుదల చేయించాం. శిఖామణి సెంటర్, డాబాకొట్లు సెంటర్లలో విద్యుత్, కేబుల్, ఇంటర్నెట్ తీగలు ఉన్నాయి. వాటిలో కొన్నింటిని తొలగించాం. విద్యుత్ తీగలను మేం తొలగించలేం కాబట్టి సరఫరాను నిలుపుదల చేయించాం. ప్రతిపక్ష నేతల పర్యటనలు ఉన్నా ఈ విధంగానే చేస్తాం" అని రాణా వివరించారు.

'రోత' ప్రచారమే!

సీఎం జగన్‌పై జరిగిన రాయి దాడి ఘటనపై ఆయన రోత మీడియాలో పదే పదే ప్రసారం చేసిన వీడియోలో పసలేదని, ఇదంతా రోత ప్రచారమేనని సీపీ రాణా ఇచ్చిన వివరణతో స్పష్టమైంది. బస్సు యాత్ర సాగుతున్న ప్రాంతానికి ఎడమ పక్కన ఉన్న భవనంపై నుంచి రాయి దూసుకువచ్చి, జగన్‌కు తగిలిందంటూ.. ఓ వీడియోను రోత మీడియా పదేపదే ప్రసారం చేసింది. అయితే.. ఏ భవనంపై నుంచి రాయి రాలేదని.. అది జనంలో నుంచే వచ్చిందని కమిషనర్ రాణా స్పష్టం చేయడంతో జగన్ రోత మీడియా బండారం బట్టబయలైనట్లయింది.

అందుకే హత్యాయత్నం కేసు

"ఫిర్యాదు వచ్చిన దాని ప్రకారం ఐపీసీ 307 కేసు నమోదు చేశాం. దీంతో ఘటన జరిగినప్పుడు ఉన్న పరిస్థితులు, ఆ రాయి తగలరాని చోట కణత భాగంలో తగిలితే జరిగే ప్రమాదాన్ని పరిగణనలోకి తీసుకుని హత్యాయత్నం కేసు నమోదు చేశాం" అని చెప్పారు. నందిగామలో ప్రతిపక్ష నేత చంద్రబాబుపై రాయితో దాడి జరిగినప్పుడు బాధితులకు నోటీసులు ఇచ్చినా స్పందించలేదన్నారు. తామే బాధితుడి వద్దకు వెళ్లి వాంగ్మూలం నమోదు చేశామన్నారు. సీఎంపై రాయి దాడి కేసు విచారణకు వేసిన సిట్‌లో ఇద్దరు డీసీపీలు, ఇద్దరు ఏడీసీపీలు, నలుగురు ఏసీపీలు, నలుగురు ఇన్‌స్పెక్టర్లు సహా మొత్తం 40 మంది ఉంటారని వివరించారు.

బాధ్యులతోనే విచారణా?

జగన్ గులకరాయి ఘటనపై ఆ నలుగురిని విచారించాలి!

- డీజీపీ, నిఘా బాస్, సీపీ, సీఎం భద్రతాధికారి పాత్ర ఏమిటో తేలాలి: పవన్

అమరావతి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): సీఎం జగన్‌పై జరిగిన గులకరాయి దాడి విషయంలో బాధ్యత వహించాల్సిన అధికారులతోనే ఈ ఘటనపై విచారణ ఎలా చేయిస్తారని జనసేన అధినేత పవన్ కల్యాణ్ 'ఎక్స్'లో ప్రశ్నించారు. "వీవీఐపీ కేటగిరీలో ఉన్నారనే కదా సదరు పాలకుడు ఏ ప్రభుత్వ కార్యక్రమానికి వెళ్లినా పరదాలు కట్టి, చెట్లు కొట్టేస్తున్నారు. అన్నీ పట్టపగలే నిర్వహించారు కాదా. మరి ఏ ఉద్దేశంతో విజయవాడ నగరంలో విద్యుత్ కూడా నిలిపివేసి చీకట్లో యాత్ర చేయించారు" అని అధికారులను ఉద్దేశించి పవన్ నిలదీశారు. గులకరాయి దాడి విషయంలో రాష్ట్ర పోలీసు యంత్రాంగానికి బాస్ అయిన డీజీపీ, ఇంటెలిజెన్స్ చీఫ్, విజయవాడ పోలీస్ కమిషనర్, ముఖ్యమంత్రి భద్రతాధికారుల పాత్ర గురించి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సెక్యూరిటీ వాళ్లు తీసుకున్న భద్రత చర్యల్లో లోపాలు ఏవిటి? ఇంటెలిజెన్స్ వైఫల్యం ఏమిటనేది తేలాలన్నారు. ముందుగా సదరు అధికారులను తక్షణం బదిలీ చేసి, సచ్ఛీలత కలిగిన అధికారులకు విచారణ బాధ్యత అప్పగిస్తేనే గులకరాయి విసిరిన చేయి, ఆ చేయి వెనుక ఉన్న శక్తులు బయటపడతారని అన్నారు. అప్పుడే సూత్రధారులు, పాత్రధారులెవరో తేలుతుందన్నారు.

జగన్‌రెడ్డీ.. ఎన్నాళ్లీ నాటకాలు?



(మొదటిపేజీ తరువాయి)

ప్రజలు నమ్మరని అన్నారు. ప్రజాగళంలో భాగంగా సోమవారం విజయనగరం జిల్లా రాజాం, శ్రీకాకుళం జిల్లా పలాసల్లో జరిగిన భారీ బహిరంగ సభల్లో ఆయన ప్రసంగించారు. గత ఐదేళ్లలో రాష్ట్రంలోని ఒక్కో ప్రాంతాన్ని దోచుకునేందుకు జగన్‌రెడ్డి ఒక్కొక్కరికి అవకాశం ఇచ్చాడని.. ఉత్తరాంధ్రను విజయసాయిరెడ్డి, వైవీ సుబ్బారెడ్డికి దత్తత ఇచ్చారని ధ్వజమెత్తారు. విశాఖను చెరబట్టారని.. భూకబ్జాలు, సెటిల్‌మెంట్లు చేసి 46 వేల కోట్లకు పైగా దోచుకున్నారని అన్నారు. ఉత్తరాంధ్రలో వారి పెత్తనం ఏమిటని నిలదీశారు. 'విశాఖను ఆర్థిక రాజధాని చేయాలన్న సంకల్పంతో నేను ఎన్నో బృహత్తర కార్యక్రమాలు చేపట్టా. జగన్ వచ్చాక విశాఖను ఆర్థిక రాజధాని కాకుండా.. గంజాయి, డ్రగ్స్ రాజధానిగా తయారు చేశారు. దీనివల్ల ఎన్నో కుటుంబాలు, ఎంతో మంది జీవితాలు దుర్భరంగా మారాయి' అని వాపోయారు. 8 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులకు జగన్ పీఆర్సీ ఇవ్వలేదని.. తాను వస్తే వారి బకాయిలన్నీ ఇచ్చేస్తానని చెప్పారు. ఇంకా ఏమన్నారంటే..

ఎన్నిసార్లు మోసం చేస్తావ్?

మొన్నటివరకు కోడికత్తి డ్రామా. బాబాయిని గొడ్డలితో లేపేయించి.. ఆ నేరం నాపై మోపాలని చూశారు. ఇప్పుడేమో గులకరాయి డ్రామా.. ఎన్నాళ్లిలా నాటకాలాడతావ్! ఎన్నిసార్లు ప్రజలను మోసం చేస్తావ్.. నీ డ్రామాలను, మోసాలను నమ్మే స్థితిలో వారు లేరు.. ఎప్పుడు ఎన్నికలు వస్తాయా.. నిన్ను ఇంటికి పంపుదామా అని ఎదురుచూస్తున్నారు. నీ ప్రభుత్వంలో నీకే భద్రత లేదు. నువ్వు ముఖ్యమంత్రివి. కానిస్టేబుల్ నుంచి డీజీపీ వరకూ నీ కనుసన్నల్లోనే పనిచేస్తున్నారు. నీ చుట్టూ భద్రతా వలయం ఉంది. అయినా నీపై గులకరాయి పడింది. సీఎం రోడ్‌షోలో కరెంటు పోవడం హాస్యాస్పదంగా ఉంది. నేనొచ్చి కరెంటు ఆపేశానా? నా గవర్నమెంటు ఉందా? ప్రభుత్వం నీదా.. నాదా..? గులకరాయి తగిలిన తర్వాత బస్సులోకి వెళ్లకుండా బస్సు మీదే డ్రామాలేంటి? నీ కాన్వాయ్‌లో అంబులెన్స్ ఉండగా బస్సులో అందరూ చూస్తుండగా చికిత్స చేయించుకోవడమేంటి? చికిత్స అనంతరం హాస్పిటల్‌లో వైద్యసిబ్బందితో ఫొటో పోజులేంటి? రాయి పడింది.. ఐదు నిమిషాల్లోనే బస్సు ముందు ప్లకార్డులు. ఈ డ్రామామాస్టారు డ్రామాలైపోయాయి. ఇదంతా సింపతీ కోసం నువ్వాడుతున్న నాటకమని ప్రజలు గుర్తించారు.

> గులకరాయి వ్యవహారం సింపతీ కోసం జగన్ ఆడుతున్న నాటకమని ప్రజలు గుర్తించారు. నీ కాన్వాయ్‌లో అంబులెన్స్ ఉండగా బస్సులో అందరూ చూస్తుండగా చికిత్స చేయించుకోవడమేంటి? చికిత్స అనంతరం హాస్పిటల్‌లో వైద్యసిబ్బందితో ఫొటో పోజులేంటి?
> - చంద్రబాబు

ఊడిగం చేస్తారా.. స్వేచ్ఛ కావాలా?

అధికారంలోకి వచ్చిన వెంటనే 25 వేల కానిస్టేబుల్ పోస్టులను భర్తీ చేస్తాం. వలంటీర్లకు జీతం రూ.10 వేలకు పెంచుతాం. వైసీపీకి ఊడిగం చేస్తారో.. మేం కల్పించే స్వేచ్ఛ కావాలో మీరే నిర్ణయించుకోండి. సామాజిక పింఛన్‌ను రూ.4 వేలకు పెంచుతా. జూన్ 4న ఎన్నికల ఫలితాలు వచ్చిన వెంటనే.. మార్చి, ఏప్రిల్, మే నెలలకు సంబంధించిన పెరిగిన మొత్తాన్ని జూన్‌లో అందిస్తా. విభిన్న ప్రతిభావంతులకు రూ.6 వేలు చేస్తాం. జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన ఇంటి పట్టాలకు సంబంధించి స్థలం ఉంటే వారికి ప్రభుత్వం నుంచి సాయం అందించి, ఇంటి నిర్మాణానికి సహకరిస్తాం. మా కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే రెండు సెంట్ల స్థలాన్ని నిరుపేదలకు అందిస్తాం. ఇళ్లు కట్టుకునేందుకూ ఆర్థిక సాయం చేస్తాం. మెగా డీఎస్సీ నిర్వహిస్తాం. తొలి సంతకం దానిపైనే.



రాజాం ప్రజాగళం సభకు హాజరైన జనం, సభలో అభిమాని బహూకరించిన నాగలితో టీడీపీ అధినేత చంద్రబాబు

30 బీసీ పథకాలు రద్దు..

సామాజిక న్యాయం అంటూ జగన్ ఉదరగొడుతున్నాడు. సీఎం అయ్యాక బీసీలకు టీడీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 30 పథకాలకు పైగా రద్దు చేశాడు. ఉత్తరాంధ్రను అన్ని విధాలుగా అభివృద్ధి చేసి, మిగతా ప్రాంతాలతో సమానంగా ముందుకు తీసుకెళ్లే లక్ష్యంతో భోగాపురం ఎయిర్‌పోర్టును సంకల్పించాం. దీని నిర్మాణ బాధ్యతను కూడా రాజాంలో పుట్టి, పెరిగిన గ్రంధి మల్లికార్జునరావు(జీఎంఆర్)కే అప్పగించాం.అధికారంలోకి రాగానే జగన్ ఎయిర్‌పోర్టుపై రివర్స్‌లో ఆలోచన చేసి కాలయాపన చేశాడు. అప్పటి నుంచే పనులు కొనసాగించి ఉంటే ఇప్పటికే విమానాశ్రయం అందుబాటులోకి వచ్చేది. .

దొంగలు పడ్డారు.. రాష్ట్రాన్ని కాపాడుకోవాలి

రాష్ట్రంలో దొంగలు పడ్డారు.. సమష్టిగా కాపాడుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. ఓ పెద్ద సైకో.. అంతటా చిన్న సైకోలను తయారు చేశాడు. ఐదేళ్లు కష్టపడి నిర్మించిన రాష్ట్రాన్ని వైసీపీ సర్వనాశనం చేసింది.. జనసైనికులు, బీజేపీ కార్యకర్తలు, టీడీపీ సైన్యం దానిని తరిమేందుకు సిద్ధంగా ఉన్నారు. ఎన్డీయే ఎంపీ అభ్యర్థిగా రామ్మోహన్‌నాయుడు, పలాస ఎమ్మెల్యే అభ్యర్థిగా గౌతు శిరీష పోటీచేస్తున్నారు. ఉత్తరాంధ్ర ముద్దుబిడ్డ దివంగత నేత ఎర్రన్నాయుడు లేని లోటు రామ్మోహన్ తీర్చుతున్నాడు. స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న మనవరాలు శిరీష. పవన్ కల్యాణ్ సూపర్‌స్టార్. ఆయన్ను వైసీపీ తీవ్రంగా అవమానించింది. ఆ పార్టీని గద్దెదింపే వరకు పోరాటం ఆపననే పట్టుదలతో ఉన్నారు.

ఎంత దోచుకున్నాడో..

ఈ జె..గన్ రెడ్డి పథకాల పేరుతో ఎంత ఇచ్చాడు.. ఎంత కాజేశాడు? మద్యం, విద్యుత్, పెట్రోలు, డీజిల్, పప్పు, నూనె, బియ్యం, ఇసుక, సిమెంటు, స్టీలు, రిజిస్ట్రేషన్ చార్జీలు పెంపు, చెత్తమీద పన్ను, ఇంటి పన్నుల పేరుతో ఎంత దోచుకున్నాడో లెక్కవేయండి. ఒక్కో కుటుంబంపై సుమారు పదిలక్షల అప్పులు చేసి దోచుకున్నాడు. కొత్తగా భూ పరిరక్షణ చట్టం తెచ్చాడు. ఆ చట్టంతో మీ భూమికి రక్షణలేదు. అంతా జగన్‌రెడ్డి దగ్గరే ఉంటుంది.

దేవుడి దయతో తగలాల్సిన చోట

తగల్లేదు



- దుష్టచతుష్టయం కుట్రలకు అదరను
- గుడివాడలో 'మేమంతా సిద్ధం'లో జగన్

(విజయవాడ/మచిలీపట్నం/ఏలూరు-ఆంధ్రజ్యోతి)

"నా నుదుటిపై వారు చేసిన గాయం పెద్దదేమీ కాదు. దేవుడి దయతో ఆ రాయి ఇక్కడ తగల్లేదు (కంటిని చూపుతూ), ఇక్కడ తగల్లేదు (కణత భాగాన్ని చూపుతూ).. అంటే దేవుడు మీ బిడ్డ విషయంలో మరింత పెద్ద స్క్రిప్టు రాశాడని అర్థం. ఈ స్థాయికి వారు దిగజారారు అంటే అర్థమేంటి? విజయానికి మనం అంత చేరువలో ఉన్నామని, వారు అంత దూరంగా ఉన్నారని అర్థం" అంటూ తనపై జరిగిన గులకరాయి దాడిపై సీఎం జగన్ తొలిసారి స్పందించారు. గుడివాడలో సోమవారం సాయంత్రం జరిగిన మేమంతా సిద్ధం సభలో ఆయన మాట్లాడారు. రాయి దాడి నెపాన్ని మొత్తం చంద్రబాబుపై వేసేందుకు ఆయన ప్రయత్నించారు. గాయపరచడం, కుట్రలు చేయడం చంద్రబాబు నైజం అని, దుష్టచతుష్టయం కుట్రలకు అదరబోనంటూ వ్యాఖ్యలు చేశారు. ఇప్పటివరకు పేదల భవిష్యత్తు కోసం తాను 130 సార్లు బటన్లు నొక్కానని, తన కోసం 2 సార్లు బటన్లు నొక్కాలని కోరారు. చంద్రబాబు, మీడియా, పవన్ కల్యాణ్ కలిసి తనపై దాడి చేస్తున్నారని విమర్శించారు. 58 నెలల తన పాలనలో ఎంతో చేశానని చెప్పుకొనే ప్రయత్నం చేశారు. వలంటీర్ వ్యవస్థ, గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు తెచ్చిన ఘనత తనదేనంటూ చెప్పుకొచ్చారు. ఫైబర్ గ్రిడ్, డిజిటల్ లైబ్రరీలు అంటూ టీడీపీ హయాంలో ప్రారంభించిన వాటినీ తన ఖాతాలో వేసుకున్నారు. వ్యవసాయానికి పగటిపూటే 9 గంటల పాటు విద్యుత్‌ను ఇస్తున్నామని, ఆక్వా రైతులకు రూ.1.50కే విద్యుత్ ఇస్తున్నామంటూ చెప్పుకొచ్చారు. ఇన్ని తీసుకొచ్చాము కాబట్టే ప్రజలంతా జగన్ జగన్ అని అనుకుంటున్నారని తనకు తానే గొప్పలు చెప్పుకోవడం గమనార్హం.

కనిపించని జన స్పందన

గుడివాడ సభకు జనాన్ని తరలించడానికి రాజమండ్రి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులు సోమవారం ఉదయం 8 గంటలకే పామర్రు చేరుకున్నాయి. సాయంత్రం 4.13 గంటలు దాటినా బస్సుల్లో ఎవరు ఎక్కడానికి ఆసక్తి చూపించలేదు. దీంతో బస్సుడ్రైవర్లు మండే ఎండలో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కనీసం తమకు తాగునీరు గానీ, భోజనాలు గానీ అందించే నాథుడే లేకుండా పోయాడని ఆర్టీసీ సిబ్బంది స్థానికుల వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. చల్లపల్లి నుంచి వస్తున్న రేపల్లె డిపోకు చెందిన బస్సుల్లో కనీసం నలుగురైనా లేకుండానే పామర్రు సెంటర్ మీదుగా గుడివాడ తరలించారు. మరోవైపు జగన్ ఎక్కడ పర్యటిస్తే అక్కడ జనం తిప్పలు పడాల్సిందే. జాతీయ రహదారిపై హనుమాన్ జంక్షన్ నుంచి కైకరం మధ్య 51 కి.మీ మేర ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కృష్ణా జిల్లా నుంచి మేమంతా సిద్ధం జగన్ బస్సుయాత్ర సోమవారం రాత్రి 7.30 సమయంలో హనుమాన్ జంక్షన్ దాటి ఏలూరు జిల్లాలోకి ప్రవేశించింది. జంక్షన్‌లోనే అర్ధగంటకుపైగా రాజమండ్రి, తణుకు, రావులపాలెం, ఏలూరువైపు వాహనాలను నిలిపివేశారు. కలపర్రు తర్వాత ఆశ్రం నుంచి గుండుగొలను వరకు కాన్వాయ్ ముందుకు సాగినా నిలిపివేసిన వాహనాలను ఎక్కడా కదలనివ్వకుండానే పోలీసులు జాగ్రత్త పడ్డారు. దీంతో వాహనాల్లో ఉన్నవారంతా నానా తిప్పలు పడ్డారు. సీఎం పర్యటించిన ప్రాంతాల్లో ఎక్కడా జనం కనిపించలేదు. ఏలూరు జిల్లాసరిహద్దులో అడుగిడినప్పటి నుంచి కలపర్రు చేరుకునే లోపు సీఎం కాన్వాయ్ వేగంగా ప్రయాణించింది. కలపర్రు టోల్‌గేటు వద్ద కొన్ని నిమిషాల పాటు సీఎం కాన్వాయ్ ఆగింది. ముఖ్యమంత్రి జగన్ బస్సులోనే ఉండగా, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ, మరికొందరు గుమ్మడికాయతో దిష్టితీశారు. ఆ తరువాత బస్సులోకి వెళ్లి జగన్‌కు రక్షాబంధన్ కట్టడం, ఆ వెనువెంటనే సీఎం బస్సుపైకి వచ్చి అందరికి అభివాదం చేసి మళ్లీలోపలికి వెళ్ళిపోయారు. గుండుగొలను, భీమడోలు, జంక్షన్‌లో జనం కనిపించలేదు. పూళ్ళ, కైకరం, నారాయణపురం జంక్షన్‌లో మాత్రం వివిధ ప్రాంతాల నుంచి కొంతమంది జనాన్ని తరలించారు. గ్రామాల నుంచి హైవే వద్దకు చేరుకున్న వారంతా గంటల తరబడి ఎదురుచూశారు. పోలీసులు మాత్రం ఎవరినీ కదలకుండా చేయడం వారిలో అసంతృప్తి కలిగించింది. జగన్ సోమవారం రాత్రి కైకరంలోనే రాత్రి బసకు సిద్ధపడ్డారు.

బైనాక్యులర్లతో నిఘా..

గులకరాయి దాడి తర్వాత బస్సుయాత్రకు ఒకరోజు విరామం ప్రకటించిన సీఎం సోమవారం కృష్ణాజిల్లా గన్నవరం మండలం కేసరపల్లి నుంచి యాత్ర పునఃప్రారంభించారు. జగన్‌పై జరిగిన దాడి నేపథ్యంలో బస్సు పైభాగంలో నలుగురు బైనాక్యులర్లు పట్టుకున్న వ్యక్తులను ఏర్పాటు చేశారు. యాత్ర పొడవునా వీరంతా బైనాక్యులర్లతో ఎత్తయిన భవనాలు, చెట్లు, జనాలు, సెంట్రల్ డివైడర్లు, బస్సుకు ముందు, వెనుక, రెండు పక్కలా ఉన్న పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలించారు. ఈ బైనాక్యులర్లు పట్టుకున్న వారిని పోలీసు యంత్రాంగం ఏర్పాటు చేసిందా, పార్టీ ఏర్పాటు చేసుకుందా అనే దానిపై స్పష్టత రావాలి. సోమవారం నాటి యాత్రలో కూడా భద్రతా వైఫల్యం అడుగ డుగునా కనిపించింది. బస్సు యాత్ర సాగే ప్రాంతాల్లో గన్నవరం, హనుమాన్ జంక్షన్ వంటి ప్రాంతాల్లో తప్ప పెద్దగా పోలీసులను భవనాలపై పర్యవేక్షణకు నియమించలేదు. ఒకటి రెండు భవనాలపైనే పోలీసులు కనిపించారు.

ముమ్మాటికీ అవినాశే!



వివేకా హత్య ముమ్మాటికీ అవినాశ్ రెడ్డి పనే. ఇందుకు అన్ని ఆధారాలూ ఉన్నాయి. ఇవిగో సాక్ష్యాలు మీ ముందు పెడుతున్నా. ఇంతకంటే ఇంకేం కావాలి? హంతకులను కాపాడుతున్న ముఖ్యమంత్రి జగన్ చేతిలో అధికారం ఉండకూడదు.

వివేకా హత్యకు ముందురోజు 14-3-2019న ఉదయం నుంచి అర్ధరాత్రి వరకూ వైఎస్ అవినాశ్ ఇంటి వద్ద ఏ2 నిందితుడు సునీల్ యాదవ్ ఉన్నట్టు గూగుల్ టేక్ అవుట్‌లో నిర్ధారణ అయింది.

వివేకా హత్య జరిగిన రోజు అంటే.. 15-3-2019 తెల్లవారుజామున 1:37 గంటల నుంచి 2 గంటలా 19 నిమిషాల మధ్య ఏ1 నిందితుడు గంగిరెడ్డి, అవినాశ్ మధ్య ఫోన్స్ నడిచాయి. ఆ సమయంలోనే వివేకా హత్య జరిగింది. లైవ్ అప్‌డేట్స్ వారికి తెలుసు.

వివేకా హత్య జరిగిన తరువాత 2019 మార్చి 15 తేదీ తెల్లవారుజామున 2 గంటల నుంచి 4 గంటల మధ్యలో అవినాశ్ నంబరు నుంచి చాలా కాల్స్ బయటికి వెళ్లాయి. ఆ కాల్స్ ఎవరికి వెళ్లాయో అవినాశ్ ప్రజలకు చెప్పాలి.

2019 మార్చి 15వ తేదీ తెల్లవారుజామున 3 గంటలా 15 నిమిషాల సమయంలో ఏ3 గజ్జల ఉమాశంకర్ రెడ్డి వివేకా ఇంటి వైపు నుంచి అవినాశ్ రెడ్డి ఇంటి వైపు పరిగెత్తారని సీబీఐ విచారణలో నిర్ధారించారు. (ఆ ఫుటేజీని మీడియాకు చూపారు)

వివేకా చేతి వేళ్లను నరికేశారు. నుదుటిమీద, తలవెనుక గొడ్డలి పోట్లు ఉన్నాయి. ఈ దృశ్యాలు చూసిన ఎవరికైనా గుండెపోటు అనిపిస్తుందా? ఇంట్లో నుంచి వివేకా మృతదేహాన్ని బయటికి తెచ్చే సమయంలో భాస్కర్ రెడ్డి, అవినాశ్ రెడ్డి అక్కడే ఉన్నారు. ఉదయం 7:44 గంటలకు సాక్షి చానల్‌లో 'గుండెపోటుతో వివేకా మృతి' అని ప్రసారం చేశారు. దీనిపై సాక్షి చైర్మన్‌ను విచారించాలి.

- వివేకా కుమార్తె సునీత

(మొదటి పేజీ తరువాయి)

చూపిస్తున్నాయని, అందుకు బలమైన సాక్ష్యాలు ఉన్నాయన్నారు. గూగుల్ టేక్ అవుట్ ప్రకారం వివేకా హత్యకు ముందు రోజు నిందితుడు సునీల్ యాదవ్ అవినాశ్ రెడ్డి ఇంట్లో ఉన్నాడని వెల్లడించారు. హత్య జరిగిన రోజు రాత్రి మరో నిందితుడు ఎర్రగంగిరెడ్డి, అవినాశ్ మధ్య ఫోన్ కాల్స్ సాగినట్టు సీబీఐ విచారణలో గుర్తించిందని తెలిపారు. వివేకా, భాస్కర్ రెడ్డి (అవినాశ్ తండ్రి) కుటుంబాల మధ్య పదేళ్లుగా రాజకీయ విభేదాలు ఉన్నాయని, వివేకా ఉన్నంత కాలం రాజకీయంగా ఎదగలేమని, ఆయన్ను అడ్డు తొలగిస్తేనే రాజకీయ భవిష్యత్తు ఉంటుందని హత్య చేయించారని ఆరోపించారు. పథకం పన్ని, అతికిరాతకంగా హత్య చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం హైదరాబాద్‌లో సునీత మీడియాతో మాట్లాడారు. తన తండ్రి హత్యకు దారితీసిన పరిస్థితులను కళ్లకు కట్టినట్టు వివరిస్తూ కన్నీటి పర్యంతమయ్యారు. 'జస్టిస్ ఫర్ వివేకా.. సూత్రధారులెవరు..?' పేరిట పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరాలను వెల్లడించారు. హత్య జరిగినపుడు జగన్ చానల్‌లో ప్రసారమైన వార్తలను, ఆ రోజు అవినాశ్ మీడియాతో మాట్లాడిన వీడియోను, వివేకా మృతదేహంపై ఉన్న గాయాల వీడియోలను ప్రదర్శించారు. వివేకా హత్య రోజు రాత్రి జరిగిన సంఘటనలను వివరించారు.

రాజకీయంగా అడ్డు ఉన్నారనే..

'వైఎస్ రాజశేఖరరెడ్డి చనిపోయాక పులివెందులలో భాస్కర్ రెడ్డి కుటుంబం రాజకీయంగా ఎదగడానికి వివేకానంద రెడ్డి అడ్డు ఉన్నారు. వివేకాకు ఉన్న పరపతి ముందు వారి ఆటలు సాగవని, రాజకీయంగా ఎదగలేమనే అసూయతో ఆయన్ను హత్య చేయించారని సీబీఐ సేకరించిన వివరాల ప్రకారం నేను భావిస్తున్నాను. వివేకా హత్యకు రెండు రోజుల ముందు, హత్య రోజు, ఆ తరువాత జరిగిన పరిణామాలు తెలుగు ప్రజలకు తెలియాలి. నిందితులు ఎవరూ తెలియదని అవినాశ్ చెప్పడం విడ్డూరంగా ఉంది (ఆయనతో ముద్దాయిలు దిగిన ఫొటోలను బయటపెట్టారు). సీబీఐ సేకరించిన ఆధారాల ప్రకారం వేళ్లన్నీ అవినాశ్ రెడ్డి వైపే చూపుతున్నాయి. అన్యాయం జరిగిందని తెలిసినా ప్రభుత్వ పెద్దలే కాపాడుతున్నారు. నాన్నను హత్య చేసే ముందు రోజు, హత్య జరిగిన తరువాత నిందితులంతా అవినాశ్‌తో ఆయన ఇంట్లోనే ఉన్నారని గూగుల్ టేక్ అకౌట్ వివరాలు చెబుతున్నాయి. వివేకాను దారుణంగా చంపారు. చేతి వేళ్లను నరికేశారు. నుదుటి మీద, తలవెనుక గొడ్డలిపోట్లు ఉన్నాయి. నాన్న చేతులు నరికి ఆయనే లేఖ రాసినట్లు చూపారు. సీబీఐ ఇచ్చిన వీడియోలు చూస్తే ఏడుపు ఆగడం లేదు. ఇంత స్పష్టమైన ఆధారాలు ఉన్నా గుండెపోటు, రక్తపు వాంతులు అని హంతకులు ప్రచారం చేశారు. నెత్తుటి మడుగులో వివేకా మృతదేహం ఉంటే.. సాక్షి టీవీ గుండెపోటు అని ప్రసారం చేసింది. గుండెపోటు అని ప్రచారం చేసిన సాక్షి చైర్మన్‌ను విచారించాలి. ఆ దృశ్యాలు చూసిన ఎవరికైనా అది గుండెపోటు అని అనిపిస్తుందా? ముఖ్యమంత్రి హోదాలో ఉండి హంతకులను కాపాడుతున్న జగన్ చేతిలో అధికారం ఉండకూడదు. నాకు జరిగిన అన్యాయాన్ని నా సోదరుడిగా కాకపోయినా సీఎం హోదాలో ఉన్న వ్యక్తికి వివరించాలని అపాయింట్ మెంట్ కోసం లేఖలు రాసినా ఆయన స్పందించలేదు. ఇదేనా సీఎం బాధ్యత?' అని సునీత నిలదీశారు.

కాల్ డేటాలో వివరాలు

'15-2-2019న అవినాశ్ రెడ్డి తీసుకున్న ఒక స్క్రీన్‌షాట్‌ను పరిశీలిస్తే అందులో ఆయన ఫోన్ నుంచి ఎవరెవరికి కాల్స్ వెళ్లాయనేది స్పష్టంగా కనిపిస్తోంది. 9989067352 అనే నంబరు అవినాశ్ పేరుమీద స్క్రీన్‌షాట్‌లో ఉంది. ఆ నంబరు నుంచి ఉమాశంకర్ రెడ్డికి పలు దఫాలు కాల్ చేసినట్లు నమోదై ఉంది' అని సునీత తెలిపారు. 22-2-2019న ఉమాశంకర్ రెడ్డి మాట్లాడిన ఆడియో క్లిప్‌ను సునీత మీడియాకు వినిపించారు. ఉమాశంకర్ రాత్రి వేళ అవినాశ్ రెడ్డి ఇంటి వద్ద మాట్లాడారు. 'బావా ఇంటికి పోతున్నా. ఒకవేళ నువ్వు రాత్రికి వచ్చినా నేను రాలేను. నువ్వు ఏమాటా చెప్పడం లేదు. ఉండు అని చెప్పడం లే. పోరా అని కానీ చెప్పడంలే. ఏమి చేయాలో నాకు తెలియడం లే' అంటూ సాగిన సంభాషణ క్లిప్‌ను సునీత బయట పెట్టారు. వివేకా పీఏ ఎంవీ కృష్ణారెడ్డి, శివశంకర్ రెడ్డి మధ్య 14-2-2019న జరిగిన ఫోన్ కాల్స్‌ను ఆమె ప్రస్తావించారు.

భాస్కర్ రెడ్డి ఫోన్ స్విచాఫ్

వైఎస్ భాస్కర్ రెడ్డి ఎప్పుడూ తన ఫోన్ స్విచ్ ఆఫ్ చేయరని, అలాంటి వ్యక్తి 14-3-2019 రాత్రి (వివేకా హత్యకు ముందు రోజు) 8:20 గంటల నుంచి 16-3-2019 ఉదయం వరకు ఫోన్ ఎందుకు స్విచ్ ఆఫ్ చేశారని సునీత ప్రశ్నించారు. 2019 మార్చి 15వ తేదీ తెల్లవారుజామునే వివేకా హత్య జరిగిందని తెలిపారు. హత్య గురించి తమకు ఏమీ తెలియని భాస్కర్ రెడ్డి, అవినాశ్ చెప్పడం పచ్చి అబద్ధమని చెప్పారు.

అవినాశ్ ఇంట్లో సునీల్

నిందితులు ఎవరూ తనకు తెలియదని అవినాశ్ రెడ్డి బుకాయించినా.. గూగుల్ టేక్ అవుట్ వాస్తవాలను బయట పెట్టిందని సునీత తెలిపారు. వివేకా హత్యకు ముందు రోజు 14-3-2019న వైఎస్ అవినాశ్ ఇంటి వద్ద సునీల్ యాదవ్ ఎందుకు ఉన్నారని ప్రశ్నించారు. 14-3-2019న ఉదయం 6 గంటలకు, 8:25 గంటలకు, ఉదయం 11 గంటలకు అవినాశ్ ఇంటి దగ్గర, 12:44 గంటల సమయంలో అవినాశ్ ఇంటి లోపల, సాయంత్రం 4, 5, 6 గంటల సమయంలో అవినాశ్ ఇంట్లోనే సునీల్ ఉన్నారని గూగుల్ టేక్ అవుట్ నిర్ధారించిందన్నారు. వివేకా హత్యకు ముందురోజు సాయంత్రం 6 గంటల సమయంలో గంగిరెడ్డి, సునీల్ యాదవ్ మాట్లాడుకున్న కాల్ డేటా చూపారు. గంగిరెడ్డి మాట్లాడే సమయంలో సునీల్ అవినాశ్ రెడ్డి ఇంట్లోనే ఉన్నాడని, హత్య జరిగిన రోజు రాత్రి అంటే 15-3-2019 తెల్లవారుజామున 1:15 గంటల సమయంలో కూడా సునీల్‌యాదవ్ అవినాశ్ ఇంట్లోనే ఉన్నారని పేర్కొన్నారు.

ఇప్పుడు నాది ఒంటరి పోరాటం కాదు

తన తండ్రి మృతి చెందాక ఐదేళ్లపాటు న్యాయం కోసం తాను ఒంటరిగానే పోరాటం చేశానని సునీత పేర్కొన్నారు. ఇప్పుడు తనకు రెండు తెలుగు రాష్ట్రాల ప్రజల నుంచి మద్దతు వస్తోందని, తాను ఒంటరిని కాదని తెలిపారు. సీబీఐ నుంచి తనకు 4 టెరాబైట్స్ డేటా వచ్చిందని, దాన్ని పూర్తిగా చూడలేదని.. అందులో నుంచి కొంత సమాచారమే ఇప్పటి వరకు తాను చూసినట్లు తెలిపారు. తన తండ్రి హత్యకు సంబంధించిన దృశ్యాలను ఇప్పటికీ తాను చూడలేకపోతున్నానని కన్నీటి పర్యంతం అయ్యారు. న్యాయం చేయాల్సిన ప్రభుత్వమే తన కేమీ పట్టనట్లు వ్యవహరిస్తే అమాయకులు తమకు జరిగిన అన్యాయాన్ని ఎవరికి చెప్పుకోవాలని ప్రశ్నించారు.

సాక్షి చైర్మన్‌పై చర్యలేవీ?

తన తండ్రి హత్య తరువాత.. మొదటి సారి సాక్షి చానల్‌లో గుండెపోటుతో మృతి అని ప్రసారం చేశారని.. అందుకు బాధ్యులైన చైర్మన్‌పై సీబీఐ విచారణ చేయాలని సునీత కోరారు. సాక్షి చానల్‌కు గుండెపోటు అని సమాచారం ఎవరు ఇచ్చారు? ఎందుకు ప్రసారం చేశారో వాస్తవాలు బయటికి తెలపాలని డిమాండ్ చేశారు. వివేకా హత్య జరిగిన గది నుంచే సాక్షికి సమాచారం వెళ్లిందన్నారు. సాక్షి ఓనర్‌కు వివేకా హత్యకు సంబంధించిన లైవ్ అప్‌డేట్స్ ఎవరు ఇచ్చారో విచారణ చేయాలని కోరారు.

లేఖలు రాసినా సీఎం స్పందించలేదు

తనకు జరిగిన అన్యాయం వివరించి, తనకు న్యాయం చేయాలని కోరేందుకు సీఎంగా ఉన్న జగన్‌ను కలవాలని అపాయింట్‌మెంట్ కోరుతూ లేఖలు రాస్తే కనీసం స్పందించలేదని సునీత తెలిపారు. తనకు సోదరుడిగా కాకుండా.. రాష్ట్ర ముఖ్యమంత్రిగా తన వేదనను వివరించాలని అపాయింట్‌మెంట్ కోరినా తనకు సీఎంవో నుంచి సమాధానమే రాలేదన్నారు. ఎన్ని లేఖలు రాసినా స్పందన లేదన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తి బాధ్యత ఇదేనా అని ప్రశ్నించారు. తనపై రాయి విసిరారని ప్రచారం చేసుకునే సీఎం.. తనను కాపాడుకోలేని వ్యక్తి.. రాష్ట్రాన్ని ఏం కాపాడతారని ఎద్దేవా చేశారు. సీఎం జగన్‌కు, బీజేపీతో అవినాభావ సంబంధం ఉందన్నారు. జగన్‌కు ఏదైనా సమస్య వస్తే ఢిల్లీపెద్దలు పరిష్కరిస్తారనే నమ్మకం ఉందన్నారు. తన సమస్య వివరించేందుకు, న్యాయం కోసం ఏ పార్టీ అధినేతనైనా కలుస్తానన్నారు. తనకు న్యాయం చేస్తారని తాను భావిస్తే టీడీపీ అధినేత చంద్రబాబును కలిసి వివరిస్తానన్నారు. కొందరు అధికార పెద్దల ఒత్తిడి వల్లే సీబీఐ విచారణ ఆగుతూ, సాగుతోందన్నారు.

ఇవీ వాస్తవాలు

వివేకా హత్య దృశ్యాలను చూస్తే ఆయనది గుండెపోటు అని ఎవరికైనా అనిపిస్తుందా అని సునీత ప్రశ్నించారు. 'హత్య చేశాక.. అక్కడ ఉన్న రక్తం మరకలను ఉదయం 7 గంటల సమయంలో శుభ్రం చేయించారు. 15-3-2019 ఉదయం అవినాశ్ నుంచి శివశంకర్ రెడ్డికి కాల్ వెళ్లింది. గంగిరెడ్డి, అవినాశ్ మాట్లాడుకున్నారు. ఎంవీ కృష్ణారెడ్డి- శివశంకర్ రెడ్డి మాట్లాడుకున్నారు. వివేకా హత్య వీడియోను సాక్షి విలేకరి తీసి భాస్కర్ రెడ్డికి పంపారు. 2019 మార్చి 15వ తేదీ ఉదయం 7:44 గంటలకు సాక్షి చానల్‌లో 'గుండెపోటుతో వివేకా మృతి' అని ప్రసారం చేశారు. ఉదయం 10 గంటలా 6 నిమిషాల సమయంలో విజయసాయి రెడ్డి మాట్లాడుతూ గుండెపోటుతో వివేకా మరణించడం బాధాకరమని చెప్పారు. 10:31 గంటల సమయంలో వివేకా పీఏ కృష్ణారెడ్డి వివేకా తలపై గాయాలు ఉన్నాయని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ తరువాత అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేశారు. అదే రోజు 11 గంటల సమయంలో మీడియా ముందుకు వచ్చిన అవినాశ్.. పెదనాన్న మరణం తనను తీవ్ర కలతకు గురిచేసిందని మాట్లాడారు. రక్తపు వాంతులతో చనిపోయి ఉంటారని భావించామని.. తలపై ఉన్న గాయాలు చూశాక హత్య చేశారనే అనుమానాలు కలుగుతున్నాయని అవినాశ్ చెప్పారు' అని సునీత ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.





అవినాశ్‌రెడ్డితో వివేకా కేసులో నిందితులుగా ఉన్న ఏ1 ఎర్రగంగిరెడ్డి, ఏ2 సునీల్ యాదవ్, ఏ3 గజ్జల ఉమాశంకర్ రెడ్డి

నిందితులతో అవినాశ్‌కు సంబంధాలు

హత్య తరువాత విలేకరులతో మాట్లాడిన అవినాశ్ రెడ్డి... వివేకా కేసులో నిందితులుగా ఉన్న ఏ1 ఎర్రగంగిరెడ్డి, ఏ2 సునీల్ యాదవ్, ఏ3 గజ్జల ఉమాశంకర్ రెడ్డి, ఏ4 దస్తగిరి (వివేకా డ్రైవర్, 2018లో డ్రైవర్‌గా తొలగించారు) తనకు తెలియదని ఎలా చెబుతారని సునీత ప్రశ్నించారు. అవినాశ్‌తో నిందితులు కలిసి ఉన్న ఫొటోలను మీడియాకు చూపారు. గంగిరెడ్డికి నాలుగు దశాబ్దాలుగా వైఎస్, అవినాశ్ కుటుంబాలతో పరిచయం ఉందని చెప్పారు. సునీల్ యాదవ్, అతని తమ్ముడు కిరణ్ యాదవ్‌తోనూ అవినాశ్ రెడ్డికి పరిచయం ఉందన్నారు. 3-9-2018న సునీల్‌యాదవ్, కిరణ్‌యాదవ్, అవినాశ్ కలిసి ఉన్న ఫొటోలను స్థానిక పోలీసుల నుంచి సీబీఐ సేకరించిందని తెలిపారు. 7-11-2018న కిరణ్‌యాదవ్.. భారతి బంధువు అర్జున్ రెడ్డితో కలిసి ఉన్నాడని, మరో బంధువు అభిషేక్ రెడ్డితోనూ పరిచయాలు ఉన్నాయన్నారు. 2019 జనవరిలో వీరు కలసి ఉన్న ఫొటోలను సీబీఐ సేకరించిందని తెలిపారు. 23-2-2019న కిరణ్ యాదవ్ వైఎస్ భాస్కర్ రెడ్డిని కలిశాడని వివరించారు. అవినాశ్ రెడ్డి, ఉమాశంకర్ రెడ్డి, జగదీశ్ రెడ్డి, గంగిరెడ్డి చాలా సన్నిహితంగా ఉంటారని తెలిపారు. గూగుల్ టేకౌట్ ద్వారా సీబీఐ సేకరించిన ఆధారాలను పరిశీలిస్తే వేళ్లన్నీ అవినాశ్ రెడ్డి వైపే చూపుతున్నాయన్నారు.

మేనత్తను ఆ దేవుడు కూడా క్షమించడు

చిన్న తనంలోనే భర్తను కోల్పోయిన తన మేనత్త అయిదుగురు అన్నదమ్ములకు ఒకటే ఆడపడుచు అని.. ఆమెను అతి గారాబంగా పెంచారని సునీత వివరించారు. తన సొంత అన్నను హత్య చేస్తే చలనం లేని ఆమె.. హంతకులవైపు ప్రేమను చూపుతూ వారికి వంత పాడటం ద్వారా తన అన్నపై చాలా ప్రేమ చూపుతోందని ఎద్దేవా చేశారు. పాపుల వైపు నిలబడిన తన మేనత్తను ఆ దేవుడు కూడా క్షమించడని పేర్కొన్నారు. ఆడపిల్లలు బయటికి రాకూడదని చెబుతున్న తన మేనత్త.. జగన్ కోసం షర్మిల 3,200 కిలోమీటర్ల పాదయాత్ర చేసే సమయంలో బయటకు వద్దు అని ఎందుకు ఆపలేకపోయిందని ప్రశ్నించారు.

అవినాశ్-గంగిరెడ్డి ఫోన్‌కాల్స్

ఐపీడీఆర్ (ఇంటర్నెట్ ప్రొటోకాల్ డిటైల్ రికార్డ్స్) ద్వారా వివేకా హత్య కేసు నిందితులు తమ ఫోన్లను, డేటాను ఎందుకు వాడారనే వివరాలను సీబీఐ సేకరించిందని సునీత తెలిపారు. ఆ వివరాల ప్రకారం వాట్సాప్ కాల్స్ హత్య జరిగిన రోజు, హత్యకు ముందు ఎవరెవరి మధ్య సంభాషణలు జరిగాయో సీబీఐ సేకరించిందన్నారు. 'వివేకా హత్య జరిగిన రాత్రి అంటే 15-3-2019న తెల్లవారుజామున 1:37 గంటలా 8 సెకన్ల సమయంలో ఎర్ర గంగిరెడ్డి తన ఫోన్ 9440281444 నుంచి అవినాశ్ రెడ్డి నంబరు 9989067352కు కాల్ చేశారని గుర్తించారు. గంగిరెడ్డి నుంచి అవినాశ్ ఫోన్‌కు తెల్లవారుజామున 1 గంటా 37 నిమిషాలా 9 సెకన్ల సమయంలో కాల్ వచ్చినట్లు రికార్డు అయింది. అదే రోజున తెల్లవారుజామున 2 గంటలా 14 నిమిషాలా 55 సెకన్లకు అవినాశ్‌కు ఫోన్ చేయగా.. ఆయన ఫోన్‌లో 2 గంటలా 14 నిమిషాలా 59 సెకన్ల సమయం రికార్డు అయింది. అవినాశ్ ఫోన్ నుంచి గంగిరెడ్డికి 2 గంటలా 19 నిమిషాల సమయంలో ఫోన్ వెళ్లింది. అదే సమయంలో వివేకా హత్య జరిగింది. దాని లైవ్ అప్‌డేట్స్ వారికి తెలుసు. వివేకా హత్యకు ముందు అర్ధరాత్రి వరకు అవినాశ్ రెడ్డి ఇంట్లో సునీల్ యాదవ్ ఉన్నాడు. అవినాశ్ నుంచి అతను ఇన్‌స్ట్రక్షన్స్ తీసుకున్నాడు' అని సునీత వివరించారు.

ఆర్టీసీ సొమ్ముకు ఎసరు!

(మొదటి పేజీ తరువాయి)

గ్యారెంటీ ఇచ్చేందుకు ఆర్థికశాఖ సిద్ధమైంది. ఇందు కోసం ఆర్టీసీ నిధులను మళ్లించబోతోంది. ఈ ప్రక్రియ ప్రస్తుతం చివరి దశలో ఉంది. రేపోమాపో సంతకాలు కూడా జరిగిపోయే అవకాశాలున్నాయి. వాస్తవానికి మార్చి 4న తమకు రూ.7,000 కోట్ల రుణం తెచ్చుకోవడానికి గ్యారెంటీ కావాలని విద్యుత్‌శాఖ.. ఆర్థిక శాఖను లిఖితపూర్వకంగా కోరింది. అప్పటి నుంచి పెద్దగా కదలిక లేని ఆ ఫైలు.. నాలుగు రోజులుగా చకచకా కదులుతోంది. ప్రస్తుతం ఈ కార్పొరేషన్‌లో రూ.3,500 కోట్ల నుంచి రూ.4,000 కోట్ల వరకు ఫండ్ ఉందని సమాచారం. పీఎఫ్ నిధులు వడ్డీతో కలుపుకొని దాదాపు రూ.2,000 కోట్లు, సీపీఎస్ ఫండ్ రూ.400-500 కోట్లు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు రూ.600 కోట్లు, ఎస్సార్‌బీఎస్, ఎస్‌బీఎస్ నిధులు రూ.600 కోట్ల వరకు ఆ సంస్థలో ఉన్నట్లు తెలుస్తోంది. ఒకవేళ ఎండీసీ ద్వారా విదేశీ అప్పు తెచ్చుకోలేకపోతే, ప్రత్యామ్నాయంగా పీఎఫ్‌సీ చేత బాండ్లు జారీ చేయించి ఆర్టీసీ నుంచి, ఇతర కార్పొరేషన్ల నుంచి డబ్బు మళ్లించి ఆ బాండ్లు కొని.. ఆ ఉద్యోగుల డబ్బు వాడుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది.

'ఆంధ్రజ్యోతి' కథనాలతో మారిన ప్లాను

ఎండీసీలో వాటాల అమ్మకం ద్వారా రూ.14,000 కోట్ల అప్పు తేవాలని జగన్ ప్రభుత్వం రహస్యంగా పావులు కదిపిన సంగతి తెలిసిందే. ఇందులో మార్చి 1న తెచ్చిన రూ.7,000 కోట్ల విదేశీ రుణానికి మార్చి 15న కేబినెట్ ఆమోదం తీసుకున్నారు. మే 2న ఇంకో రూ.7,000 కోట్ల అప్పు తీసుకురాబోతున్నట్లు ఎన్ఎస్‌డీఎల్ బాండ్స్ వెబ్‌సైట్‌లో అప్‌డేట్ చేశారు. ఇలా ఊరూపేరూ తెలియని ఇన్వెస్టర్‌కు ఎండీసీలో వాటాల అమ్మకం ద్వారా అప్పులు తేవాలన్న ప్రభుత్వ కుట్రపై 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలు ప్రచురించింది. వాటాలు అమ్మాలన్న నిర్ణయాన్ని కేబినెట్ నోట్‌లో దాచడాన్ని కూడా వెలుగులోకి తెచ్చింది. దీంతో జగన్ ప్రభుత్వం ఉలిక్కిపడింది. వెంటనే ప్లాను మార్చింది. కొంతకాలం నుంచి ఆర్థిక శాఖ గ్యారెంటీ కోసం ఎదురుచూస్తున్న ఏపీపీఎఫ్‌సీ ఫైలుపై దృష్టిసారించింది. ఒకవేళ ఎండీసీ బాండ్ల ద్వారా అప్పు తేలేకపోతే.. ప్రత్యామ్నాయంగా పీఎఫ్‌సీ ద్వారా అప్పు తెచ్చుకోవాలనేది ప్లాన్.

బాండ్లు జారీచేసినా కొనేదెవరు?

జగన్ ప్రభుత్వంపై బ్యాంకులకు, మార్కెట్లో ఇన్వెస్టర్లకు నమ్మకం లేదు. అందుకే రుణాల రూపంలో కాకుండా.. మార్కెట్లో బాండ్ల జారీ ద్వారా అప్పుల సమీకరణకే ఆర్థిక శాఖ మొగ్గు చూపుతోంది. అయితే మార్కెట్లో కూడా రాష్ట్రానికి అప్పులిచ్చే ఇన్వెస్టర్లు లేరు. గతేడాది బేవరేజెస్ కార్పొరేషన్ ద్వారా రెండు సార్లు నాన్-కన్వర్టిబుల్ డిబెంచర్లు (ఎన్‌సీడీలు) విడుదల చేయగా.. ఒకసారి ఇష్యూ ఫెయిలైంది. మరోసారి ఇన్వెస్టర్లు ముందుకు రాలేదు. 2018లో సీఆర్‌డీఏ బాండ్ల రేటింగ్‌ను క్రిసిల్ వరుసగా తగ్గిస్తుండడం, 2021లో బేవరేజెస్ కార్పొరేషన్ ద్వారా విడుదల చేసిన బాండ్లు మార్కెట్లో తక్కువ రేటింగ్‌తో ట్రేడవుతుండడంతో ఇన్వెస్టర్లు రాష్ట్రం వైపు కన్నెత్తి చూడడం లేదు. ఇలా రెండుసార్లు బాండ్లు విఫలమైన తర్వాత విద్యుత్ కార్పొరేషన్ల ఉద్యోగుల పీఎఫ్ ఫండ్‌ను మళ్లించి, బేవరేజెస్ కార్పొరేషన్ జారీచేసిన ఎన్‌సీడీలు కొన్నారు. వచ్చిన ఆ డబ్బును ప్రభుత్వం తన అవసరాలకు వాడుకుంది. ఇప్పుడు ఆర్టీసీ నిధులను కూడా ఇలాగే వాడుకునే ఎత్తువేస్తున్నారు.

కోడ్‌కు ఒక్కరోజు ముందు..

రామ్‌కోకు రాసిచ్చారు

(మొదటి పేజీ తరువాయి)

వైసీపీ సర్కారు... ఎన్నికల కోడ్ రావడానికి సరిగ్గా 24 గంటల ముందు రామ్‌కో సిమెంట్ కంపెనీకి తగిన మేలు చేసిపెట్టింది. జగ్గయ్యపేట మండలం జయంతిపురం గ్రామంలో సున్నపురాయి నిల్వలున్న 267.30 ఎకరాల భూమిని ఆ కంపెనీకి కట్టబెట్టింది. 50 ఏళ్లపాటు సుదీర్ఘకాలం లీజు ప్రాతిపదికన ఆ భూములు కట్టబెడుతూ మార్చి 15న గనుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేదితో ఉత్తర్వులు ఇప్పించింది. ఆ మరుసటి రోజు.. అంటే మార్చిన 16వ తేదీ మధ్యాహ్నం మూడు గంటలకు ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. లీజు విధానాలు ఏమిటో, ఏ ప్రాతిపదికన సున్నపురాయి ఉన్న భూములను కట్టబెడుతున్నారో వివరించకుండానే సర్కారు మార్చి 15న జీవో 36ను విడుదల చేసింది. దీన్ని ఇప్పటివరకు బయటి ప్రపంచానికి తెలియకుండా రహస్యంగా ఉంచింది.

ఉమ్మడి కృష్ణా జిల్లా జగ్గయ్యపేట మండలం జయంతిపురంలో రామ్‌కో సిమెంట్ పరిశ్రమ ఉంది. అక్కడ ఆ సంస్థకు సున్నపురాయి నిల్వలున్నాయి. 2008లో మద్రాస్ సిమెంట్స్‌కు జయంతిపురంలో సున్నపురాయి నిల్వలున్న 273.91 ఎకరాల భూమిని మెమో ఆధారంగానే కేటాయించారు. ఇందులో 121.97 ఎకరాలు ప్రభుత్వ భూమి కాగా, 151.94 ఎకరాలు పట్టా భూమి. 2016లో నాటి ప్రభుత్వం ఆ సంస్థకు ఇచ్చిన భూమిని 267.30 ఎకరాలకు పరిమితం చేసింది. కానీ, నాటి మద్రాస్ సిమెంట్స్ తన పేరును రామ్‌కో సిమెంట్స్‌గా మార్చుకుంది. కంపెనీకి ఇచ్చిన లీజులపై 2017లో నాటి ప్రభుత్వం సవరించిన మైనింగ్‌ప్లాన్‌ను ఆమోదించింది. ఆ తర్వాత భూ కేటాయింపులు, ఇతర అంశాలపై విభేదాలు రావడంతో ఆ సంస్థ ఇటు హైకోర్టులో, అటు సుప్రీం కోర్టులో కేసులు వేసింది. ఇప్పటికీ ఆ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. తమ మైనింగ్ అప్లికేషన్‌ను ఆమోదిస్తే సుప్రీం, హైకోర్టుల్లో ఉన్న కేసులను వెనక్కి తీసుకుంటామని రామ్‌కో ప్రతిపాదించింది. దీనిపై సర్కారు న్యాయ సలహా తీసుకుంది. న్యాయ సలహా ఏమొచ్చిందో కానీ, రామ్‌కో సిమెంట్స్ మైనింగ్ ప్లాన్‌ను ఆమోదించాలని అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదించారు. తొలుత ప్రతిపాదించినట్లుగా 20 ఏళ్లు కాదు... ఏకంగా 50 ఏళ్లకు లీజు ప్రతిపాదికన క్యాప్టీవ్ మైనింగ్‌కు అనుమతివ్వాలని అధికారులు ప్రతిపాదించారు. ఇదంతా గతేడాది ఆగస్టు, సెప్టెంబరు మాసాల్లోనే జరిగిపోయింది. కానీ, ఎన్నికల కోడ్ రావడానికి సరిగ్గా 24 గంటల ముందు రామ్‌కోకు 5 ఏళ్లపాటు క్యాప్టీవ్ ప్రతిపాదికన సున్నపురాయి లీజులు ఇస్తూ ఉత్తర్వులు (జీవో-36) ఇచ్చింది.

తెరవెనక ఏం జరిగింది..?

రామ్‌కో సిమెంట్స్‌కు అనుకూలంగా వచ్చిన న్యాయ సలహాను జతచేసి మైనింగ్ ప్లాన్ అనుమతించాలని, 267.30 ఎకరాల్లోని సున్నపురాయి నిల్వలను లీజు ప్రాతిపదికన కేటాయిస్తూ తగిన నిర్ణయం తీసుకోవాలని గనులశాఖ డైరెక్టర్ గతేడాది ఆగస్టు, సెప్టెంబరులో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. అప్పటి నుంచి సర్కారు ఏ నిర్ణయమూ తీసుకోలేదు. కానీ, అనూహ్యంగా కోడ్‌కు ఒకరోజు ముందు గనుల శాఖ ప్రతిపాదనలను ఆమోదించారు. కోడ్ కు ఒక్కరోజు ముందే ఈ నిర్ణయం ఎలా తీసుకున్నారు..? తెరవెనుక ఏం జరిగింది..? అన్న సందేహాలు వినిపిస్తున్నాయి. దీనికోసం ప్రభుత్వ పెద్దలతోపాటు, గనుల శాఖలో ప్రత్యేక అధికారి చక్రం తిప్పినట్లు తెలిసింది.

కోడ్ ఉంటే నాకేంటి!?

- ఎన్నికల వేళ విద్యాశాఖ పేరెంట్స్-టీచర్స్ మీటింగ్!
- హెడ్‌మాస్టర్లకు, టీచర్లకు ప్రవీణ్ ప్రకాశ్ సందేశం

అమరావతి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): విద్యాసంవత్సరం చివరి రోజైన ఏప్రిల్ 23న పేరెంట్స్-టీచర్ మీటింగ్ నిర్వహించాలని విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ హెడ్‌మాస్టర్లు, టీచర్లకు ఆదేశాలిస్తూ ఫోన్ సందేశాలు పంపారు. ఈ సమావేశంలో తల్లిదండ్రుల హాజరు 100 శాతం ఉండాల్సిందేనని కచ్చితంగా చెప్పారు. ఈ రోజు నుంచి 22వతేదీ వరకు ప్రతిరోజూ విద్యార్థుల తల్లిదండ్రులకు ఈ సమావేశం గురించి గుర్తుచేస్తూ ఉంటే 100 శాతం హాజరు సాధ్యపడుతుందని సలహా కూడా ఇచ్చారు. ఈ సమావేశంలో విద్యార్థుల ప్రోగ్రెస్ కార్డులను నేరుగా తల్లిదండ్రులకే అందజేయాలని ఆదేశించారు. అయితే, ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న సమయంలో ఈ తరహా సమావేశాలు కోడ్ ఉల్లంఘన కిందకి వస్తాయి. ప్రభుత్వ పాఠశాలల్లో జరగబోయే సమావేశం కావున, ప్రభుత్వ విధానాల గురించి చర్చకు వచ్చే అవకాశాలే ఉంటాయి. పైగా ఒక్కో పాఠశాలలో వందల మంది విద్యార్థులుంటారు. అంటే ఈ సమావేశాలకు హాజరయ్యే తల్లిదండ్రులు కూడా వందల సంఖ్యలో ఉంటారు. కావున, ఇలాంటి సమావేశాలు నిర్వహించడం పరోక్షంగా అధికారపార్టీకి ప్రచారం కల్పించడమేనన్న విమర్శలు వస్తున్నాయి.

ఉచిత విద్య అంటూ

మోసం చేశారు!

- ప్రైవేట్ స్కూళ్లలో తల్లిదండ్రులే డబ్బులు కట్టారు
- పేద విద్యార్థులకు 'బెస్ట్ అవైలబుల్' స్కూళ్లు ఎక్కడ?
- జగన్ మాటలు నమ్మి నట్టేట మునిగిన విద్యార్థులు
- టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి విజయకుమార్



అమరావతి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు స్కూళ్లలో పేదలకు ఉచిత విద్య అంటూ సీఎం జగన్ దారుణంగా మోసం చేశారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నీలాయపాలెం విజయకుమార్ ఆరోపించారు. సోమవారం టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల ముందు రహస్య జీవోలు వెలుగులోకి వచ్చాయని తెలిపారు. పేపర్లు, పోస్టర్లు, వైసీపీ బ్లూమీడియా, వైసీపీ వెబ్‌సైట్లలో ఉచిత విద్యపై కొట్టిన డంబాలన్నీ మోసం అని తేలిపోయిందన్నారు. బెస్ట్ అవైలబుల్ స్కూళ్లలో చదువు ఉచితమని ఉత్తుత్తి కబుర్లు చెప్పి రెండేళ్లుగా పాఠశాలలకు జగన్ సర్కార్ సొమ్ము లు చెల్లించకపోవడంతో పిల్లలకు తల్లిదండ్రులే ఫీజులు చెల్లించే పరిస్థితి రావడం బాధాకరమన్నారు. జగన్ మాటలు నమ్మి ఉచితమని పాఠశాలల్లో చేరిన విద్యార్థులను వైసీపీ ప్రభుత్వం నిలువునా ముంచిందన్నారు. రెండేళ్లుగా విద్యార్థులకు ఫీజులు చెల్లించకుండా ఇబ్బంది పెట్టిందన్నారు. టీడీపీ ప్రభుత్వంలోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిందన్నారు. బెస్ట్ అవైలబుల్ స్కూళ్లలో విద్యను పూర్తిగా ఉచితం చేసి, మళ్లీ టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పిల్లలకు బకాయిలను చెల్లిస్తుందన్నారు. ఒక ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అందరికీ 'తల్లి వందనం' ఇస్తుందని, వైసీపీలా మోసం చేసే ప్రభుత్వం టీడీపీది కాదని విజయకుమార్ తెలిపారు.

బెదిరింపులు.. వేధింపులు భరించలేకే...

అవినాశ్‌రెడ్డి బెయిల్ రద్దు కోరుతున్నా

- వివేకా హత్య కేసులో అప్రూవర్ దస్తగిరి వాదనలు.. తీర్పు రిజర్వు

హైదరాబాద్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో తాను అప్రూవర్‌గా మారినప్పటి నుంచి వస్తున్న బెదిరింపులు, వేధింపులు భరించలేకే ఈ కేసులో నిందితుడు, ఎంపీ అవినాశ్‌రెడ్డి బెయిల్ రద్దు చేయాలని పిటిషన్ దాఖలు చేశానని తెలంగాణ హైకోర్టుకు దస్తగిరి తెలిపారు. రెండురోజుల క్రితం సైతం తనను బెదిరించారని తెలిపారు. అవినాశ్‌రెడ్డి ముందస్తు బెయిల్ రద్దు చేయాలని కోరారు. ఆయన పిటిషన్‌పై సోమవారం విచారణ చేపట్టిన జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం.. వాదనలు విని తీర్పు రిజర్వు చేస్తున్నట్లు ప్రకటించింది. అంతకుముందు దస్తగిరి తరఫున న్యాయవాది జడ శ్రవణ్‌కుమార్ వాదనలు వినిపించారు. "నా తండ్రిపై దాడి, శివశంకర్‌రెడ్డి కుమారుడు చైతన్య రెడ్డి జైల్లోకి వచ్చి నరికేస్తానని బెదిరించడం వంటి ఘటనలే కాకుండా చాలా సందర్భాల్లో వేధింపులకు పాల్పడుతున్నారు. వీటిని భరించలేకే అవినాశ్‌రెడ్డి బెయిల్ రద్దు కోరుతూ పిటిషన్ దాఖలు చేశాను. 'మా జగనన్న పైనే పోటీచేస్తావా నీ కొడుకు' అంటూ గుర్తుతెలియని వ్యక్తులు నా తండ్రిపై దాడి చేశారు. సీబీఐ అధికారి రాంసింగ్ కొట్టి అప్రూవర్‌గా మార్చాడని మీడియాకు చెప్పాలని చైతన్యరెడ్డి బెదిరించాడు. తమ మాట వినకపోతే నా భార్యపై కేసులు పెట్టి లోపలేస్తామని, కుటుంబంతో సహా అంతం చేస్తాం అని ఒత్తిడి తెచ్చాడు. అవినాశ్‌రెడ్డికి బెయిల్ వచ్చిన తర్వాత నాపై నాలుగు ఎఫ్ఐఆర్‌లు పెట్టారు. చిన్న కేసులో 137 రోజులు జైల్లో ఉంచారు. నిందితులు బయట ఉంటే సాక్షులను ప్రభావితం చేస్తారు. నాకు, నా కుటుంబానికి రక్షణ లేదు. అవినాశ్ రెడ్డి బెయిల్ రద్దు కోరడం తప్ప మరో ప్రత్యామ్నాయం లేదు' అని దస్తగిరి చెప్పారు. వివేకా కుమార్తె సునీతారెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది నళిన్‌కుమార్ వాదనలు వినిపించారు. 'సాక్షులను ప్రభావితం చేసేలా చాలా ఘటనలు జరుగుతున్నాయి. దస్తగిరిపై కిడ్నాప్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టి జైలుకు పంపారు. దస్తగిరి ఏపీ, తెలంగాణ హైకోర్టు సీజేలు, సీబీఐ, ఇతరులకు రాసిన లేఖ పరిశీలించండి. అందులో ఇతర కేసుల్లో దస్తగిరిని అరెస్టు చేసిన పోలీసులు 'వైఎస్ వాళ్లతో ఎందుకు పెట్టుకుంటున్నావు? అప్రూవర్‌గా బలవంతంగా మార్చారని ప్రెస్‌మీట్ పెట్టి చెప్పు' అని పోలీసులే దస్తగిరిని బెదిరించినట్లు ఉంది. రూ.5 కోట్లు ఇస్తాం.. ఇంకా కావాలంటే జగనన్న ఓఎస్డీ కార్యాలయంలో రూ.20 కోట్లు ఇప్పిస్తామని ప్రలోభ పెట్టారు. ఆయన తండ్రిపై దాడి చేశారు. ఫ్రీ అండ్ ఫెయిర్ ట్రయల్ జరిగే పరిస్థితి లేదు. రాజకీయ పలుకుబడితో మొత్తం యంత్రాంగాన్ని అవినాశ్‌రెడ్డి, ఇతర నిందితులు ప్రభావితం చేస్తున్నారు. అవినాశ్‌రెడ్డి బెయిల్ రద్దు చేయాలి" అని కోరారు. సీబీఐ తరఫున సీనియర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అనిల్ తన్వర్ వాదనలు వినిపించారు. "చైతన్యరెడ్డి జైలుకు వెళ్లినట్లు జైలు అధికారులు అంగీకరించారు. 'నీ భార్యను అరెస్ట్ చేయిస్తా'మని దస్తగిరిని బెదిరించారు. ఎంవీ కృష్ణారెడ్డి (వివేకా పీఏ) తరహాలోనే 'నువ్వుకూడా సహకరించా'లని బెదిరించారు. దస్తగిరి అప్రూవర్‌షిప్‌ను ఎంవీ కృష్ణారెడ్డి, భాస్కర్‌రెడ్డి ఇదే హైకోర్టులో సవాల్ చేశారు. కీలక సాక్షి గంగాధర్‌రెడ్డి అనుమానాస్పదంగా చనిపోయాడు. సీఐ...మేజిస్ట్రేట్ ఎదుట 164 స్టేట్‌మెంట్ ఇవ్వలేదు. ఈ మొత్తం పరిస్థితులు సాక్షులను ప్రభావితం చేస్తున్నారనడానికి ఆధారాలు.. అవినాశ్ రెడ్డి బెయిల్ రద్దు చేయండి' అని కోరారు.

అవినాశ్‌పై ఆరోపణలకు ఆధారం లేదు: న్యాయవాది

అవినాశ్‌రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది టీ నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు. 'పిటిషన్ దాఖలు చేసిన దస్తగిరి.. కేవలం రెండు ఘటనలు మాత్రమే ఉదహరిస్తే.. సునీతారెడ్డి, సీబీఐ అంతకుమించి వాదిస్తున్నారు.. వారు అంత ఉత్సాహం ఎందుకుచూపిస్తున్నారు? వారు ఎవరికి మద్దతు పలుకుతున్నారు? గొడ్డలిని స్వయంగా కొనుక్కొచ్చి నరికి చంపానని చెప్తున్న కిరాయి హంతకుడికా? హత్య చేశానని చెప్తున్న హంతకుడికి మద్దతు పలకడం నేరన్యాయ ప్రక్రియలో నేనెప్పుడూ చూడలేదు. ప్రతిపక్ష నేత ఉచ్చులో వివేకా కుమార్తె సునీతారెడ్డి ఉన్నారు. వివేకాకు ఓ ముస్లిం మహిళ ద్వారా ఓ కొడుకు ఉన్నాడు. అదే సునీత భయం. అవినాశ్ రెడ్డి బెయిల్ రద్దు సునీత కోరడంలో తప్పులేదు.. కానీ దస్తగిరికి మద్దతు తెలపడం దారుణం. దస్తగిరి పేర్కొంటున్న ఘటనల్లో అవినాశ్‌రెడ్డి పాత్ర ఉన్నట్లు ఆధారాలు లేవు. అవినాశ్ రెడ్డి బెయిల్ షరతులను ఎక్కడా ఉల్లంఘించలేదు. ఏపీలో ప్రస్తుతం పాలన మొత్తం ఈసీ చేతిలో ఉంది. ప్రభావితం చేశారనడానికి ఆధారాలు లేవు. దస్తగిరి దాఖలు చేసిన బెయిల్ రద్దు పిటిషన్‌ను కొట్టేయండి' అని కోరారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. తీర్పు రిజర్వు చేసినట్లు ప్రకటించింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

ఓటమి భయంతోనే గులకరాయి డ్రామా

● కేశినేని నాని, వెలంపల్లి శ్రీనివాస్‌లే సూత్రధారులు: బొండా ఉమా

పాయకాపురం: ఓటమి భయంతోనే సీఎం జగన్ గులకరాయి డ్రామాకు తెరలేపారని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు ఆరోపించారు. మొగల్రాజపురంలోని ఆయన నివాసం లో సోమవారం విలేకర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ సీఎం బస్సుయాత్రలో జగన్‌పై దాడి కుట్రకు అసలు సూత్రధారులు కేశినేని నాని, వెలంపల్లి శ్రీనివాస్ అని సమాచారం ఉందన్నారు. పశ్చిమకు చెందిన రౌడీ షీటర్ బంకా శివతో దాడి చేయించినట్టు చెప్పారు. కేశినేని నాని, వెలంపల్లి శ్రీనివాస్ కాల్ డేటా బయటకు తీస్తే అసలు నిర్దోషులు ఎవరో తెలిసిపోతుందన్నారు. వైసీపీ నేతలు సానుభూతి కోసమే తమ అధినేత చంద్రబాబు, తనపై ఆరోపణలు చేస్తున్నారన్నారు. సీఎం జగన్‌పై దాడి కేసు విచారణ సీబీఐకి అప్పగించాలని, సీబీఐ విచారణ కోరుతూ సాయంత్రం గవర్నర్‌ను కలవనున్నట్టు తెలిపారు.

సమాజ్‌వాదీ పార్టీ మ్యానిఫెస్టో విడుదల

ధర్నాచౌక్: సమాజ్‌వాదీ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోను ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పాశం వెంకటేశ్వర్లు గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ని 85 శాతం జనాభా కలిగిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు దశాబ్దాలుగా సామాజిక, ఆర్థిక, రాజకీయ సమానత్వానికి నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా వర్గాల ఆందోళన, ఆక్రందన, ఆకాంక్షలకు తమ పార్టీ మ్యానిఫెస్టో ప్రతిబింబిస్తోందన్నారు. 38 ఎమ్మెల్యే అభ్యర్థులతో తొలి జాబితాను ప్రకటించారు. పార్టీ జాతీయ కార్యదర్శి జగదీష్ యాదవ్ పాల్గొన్నారు.

దేశ పౌరగ్రంథాలయాల కమిటీ సభ్యురాలిగా శారద

పటమట: భారతదేశ ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ నేతృత్వంలో ఏర్పాటు చేసిన డెవలప్‌మెంట్ ప్లాన్ ఫర్ పబ్లిక్ లైబ్రరీస్ ఇన్ ఇండియా విజన్ 2047 కమిటీ సభ్యురాలిగా రాష్ట్ర గ్రంథాలయ సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ రావి శారదను కేంద్రప్రభుత్వం నామినేట్ చేసినట్టు కమిటీ డైరెక్టర్ జనరల్ ఆచార్య బీవీ శర్మ తెలిపినట్టు ఏపీ గ్రంథాలయ సంఘ ఉపాధ్యక్షుడు వేములపల్లి కేశవరావు ఒక ప్రకటనలో తెలిపారు. రావిశారద 4 దశాబ్దాలుగా ఏపీ గ్రంథాలయ సంస్థ ప్రధాన కార్యదర్శిగా, సంఘ పక్షాన వెలువడుతున్న గ్రంథాలయ సర్వస్వం మాస పత్రిక సంపాదకురాలిగా, పాతూరి నాగభూషణం గ్రంథాలయ శిక్షణాలయం ప్రిన్సిపాల్‌గా సర్వోత్తమ గ్రంథాలయం సంఘం కార్యదర్శిగా రాష్ట్రంలో పౌర గ్రంథాలయ రంగ అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారని, అనేక జాతీయ, రాష్ట్ర గ్రంథాలయ మహాసభల ను నిర్వహించడమే కాకుండా పౌరగ్రంథాలయ రంగంలో తనకంటూ గుర్తింపును సాధించారన్నారు.

నేడు గౌడల ఆత్మీయ సమావేశం

విద్యాధరపురం: సింగ్‌నగర్‌లోని షాదీఖానాలో మంగళవారం ఉదయం గౌడ సామాజిక వర్గాల ఆత్మీయ సమావేశం జరగనుంది. ఈమేరకు ఎన్టీఆర్ భవన్‌లో సోమవారం జరిగిన గౌడ, శ్రీ శయన, శెట్టి బలిజ, యాత ఆత్మీయ సమావేశంలో వాల్‌పోస్టర్‌ను పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కేశినేని శివ నాథ్ (చిన్ని) ఆవిష్కరించారు. సింగ్‌నగర్‌లోని షాదీఖానాలో మంగళవారం జరగనున్న గౌడ సామాజిక వర్గాల ఆత్మీయ సమావేశానికి ముఖ్య అతిథిగా చిన్నిని రావాలని గౌడసంఘ నేతలు కోరారు. నేతలు లుక్కా సాయిరాం ప్రసాద్ గౌడ్, బి తిరుపతి గౌడ్, పలగాని శివ, పిరియ సోమేశ్వరరావు, అమర్నాథ్ గౌడ్, పుచ్చా వైకుంఠం పాల్గొన్నారు.

మద్యం తాగి బైక్‌లపై యువకుల ర్యాలీలు

● ప్రశ్నించిన మహిళ, మరో ముగ్గురిపై దాడి

● అధికార పార్టీ ఎంపీ అనుచరులమంటూ బెదిరింపులు

చిట్టినగర్: అంబేడ్కర్ జయంతి అంటూ పలువురు యువకులు మద్యం మత్తులో ఆదివారం సాయంత్రం బైక్‌లపై ర్యాలీలు నిర్వహించి ప్రశ్నించిన వారిపై కర్రలు, ఇనుప రాడ్లులతో దాడులు చేసి నానా యాగీ చేశారు. ఈ ఘటనలో మహిళతోపాటు ముగ్గురికి తలలకు తీవ్ర గాయాలయ్యాయి. కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొత్తూరు తాడేపల్లిలో ఆదివారం సాయంత్రం జరిగిన సంఘటన స్థానికులను తీవ్ర భయాందోళనకు గురిచేసింది. ఆదివారం అంబేడ్కర్ జయంతి కావడంతో కొత్తూరు తాడేపల్లి దళితవాడకు చెందిన పలువురు యువకులు మద్యం తాగి బైక్‌లపై వీధుల్లో ర్యాలీ చేశారు. స్థానికంగా ఉన్న గారపాటి తిరుపతమ్మ వారిని ప్రశ్నించింది. మద్యం మత్తులో బైక్‌లపై వెళుతున్న జిల్లాబత్తుల మహేష్, చప్పిడి శివనాగరాజు, చప్పిడి కోటేశ్వరరావు, చప్పిడి రవివర్మ, చిగురుపల్లి ఆంజనేయులు, చిగురుపల్లి బాబి, సుఖబోగి శ్యాంకుమార్ ఆ మహిళను అసభ్యపదజాలంతో దూషించడమేకాక కర్రలు, ఇనుపరాడ్లులతో తీవ్రంగా దాడి చేశారు. స్థానికులు కలవర్తి సత్యం, ముగ్గురాళ్ల అవినాష్, బొడ్డు విజయ్‌కుమార్ దాడిని అడ్డుకునేందుకు ప్రయత్నించగా వారిపైనా దాడి చేయడంతో మహిళ సహా ముగ్గురి తలలకు తీవ్ర గాయాలైయ్యాయి. మద్యం మత్తులో ఉన్న యువకులు అధికారపార్టీ చెందిన వాళ్ల, ఎంపీ అనుచరులం మమ్మల్నేం చేయలేరంటూ స్థానికులను భయపెట్టినట్లు చెబుతున్నారు.

మంచినీటి సమస్యల పరిష్కారానికి కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు

కృష్ణలంక: జిల్లాలో వేసవి తాగునీటి సమస్యలు పరిష్కరించేందుకు ఆర్‌డబ్ల్యుఎస్ సర్కిల్ పరిధిలో డ్రాట్ సెల్ (కమాండ్ కంట్రోల్ రూం)ను ఏర్పాటు చేసినట్టు ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ డి.వెంకటరమణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిధి లో తాగునీటి సమస్యలపై ప్రజలు ఈ కంట్రోల్ రూంకు ఫిర్యాదు చేసిన వెంటనే తగు చర్యలు చేపట్టి తాగునీటి సమస్యను పరిష్కరిస్తామన్నారు. ప్రతి రోజు ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉండే కంట్రోల్ రూం నెంబర్లు: 91001 21300, 91001 21306, వీటితో పాటు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు 630 49 90363, మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 8 గంటల వరకు 9949206318 ఫోన్ ద్వారా తెలపవచ్చన్నారు. ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కంట్రోల్ రూం పనిచేస్తుందని పర్యవేక్షక ఇంజినీర్, సిబ్బంది అందుబాటులో ఉంటారని, ప్రజలు ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు నేరుగా టెలిఫోన్ ద్వారా తమ ఫిర్యాదు చేయవచ్చన్నారు.

లలితా మహారాజ్ఞికి సుగంధ శోభిత పుష్పార్చన



హారతి సమర్పణలో పాల్గొన్న ఈవో

వన్‌టౌన్, ఏప్రిల్ 15: చైత్రమాస వసంతనవరాత్రోత్సవాల సందర్భంగా దుర్గగుడిలో కనకదుర్గమ్మకు జరుగుతున్న పుష్పార్చనలో భాగంగా 7వ రోజైన సోమవారం లలితా మహారాజ్ఞికి సుందరసుగంధ శోభిత పుష్పాలు సమర్పించారు. శివశక్తి రూపిణి అయిన దుర్గమ్మను ఎర్రతామర పుష్పాలు, ఎర్రగన్నేరులు, సన్నజాజులతో అమ్మవారి లలితా సహస్రనామాన్ని అనుసంధానం చేసి అర్చించారు. సౌభాగ్యం, అష్ట ఐశ్వర్యాలు, అమ్మవారి అనుగ్రహం కలగాలని కోరుతూ సింహాసనేశ్వరికి సువాసనాలు వెదజల్లుతున్న పుష్పాలను సమర్పించి హారతులిచ్చారు. పరమేశ్వరుడి భక్తులు ప్రార్థించి అమ్మవారి ఆశీస్సులను కోరుకున్నారు. ఈవో రామారావు దంపతులు, అధికారులు, వైదిక కమిటీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గమ్మకు రూ.2.76కోట్లకు పైగా కానుకలు

దుర్గగుడిలో సోమవారం హుండీలోని కానుకలను లెక్కించారు. 19రోజులకు అమ్మవారికి రూ.2,76,11,524 కానుకల రూపేణా వచ్చాయి. 478 గ్రాముల బంగారం, 4 కేజీల 830 గ్రాముల వెండిని భక్తులు కానుకల రూపేణా సమర్పించారు. 1451 యూఎస్‌ఏ డాలర్లు, 1 ఓమాన్ రియాన్, 20 యూకే పౌండ్లు, 110 ఇంగ్లాండ్ పౌండ్లు, 10 ఆస్ట్రేలియా డాలర్లు, 85 కెనడా డాలర్లు, 5 యూరోలు, 2 సింగపూర్ డాలర్లు, 110 యూఏఈ దీర్హమ్స్, 0.25 కువైట్ దినార్లు, 7 ఖతార్ రియాల్స్, 8 సౌదీ రియాల్స్, 1 మలేషియా రింగేట్ కానుకల రూపేణా వచ్చాయి. ఈ సమయంలోనే ఈ-హుండీ ద్వారా 70.541 కానుకల రూపేణా చేకూరాయి. ఈవో రామారావు, ఏఈవోలు, అధికారులు, సిబ్బంది, ప్రత్యేక పోలీస్ సిబ్బంది, వన్‌టౌన్ పోలీసులు, భవానీ సేవాదారులు పాల్గొన్నారు.

భక్తులతో ఈవో మాటామంతీ

ఈవో రామారావు సోమవారం అరుదైన రీతిలో సాధారణ భక్తుల క్యూలో ప్రవేశించి తాను కూడా ఒక సాధారణ భక్తుడిలా నడుచుకుంటూ ఆలయంలోకి వచ్చారు. సాధారణ భక్తుల మధ్యలో ఉన్న ఆయన భక్తులను ఆలయంలోని విశేషాలు, ఏర్పాట్ల గురించి ఆరా తీశారు. అమ్మవారి దర్శనానికి తొలిసారి వస్తున్నారా? లేక ఇంతకముందు ఎప్పట్నుంచి వస్తున్నారు? అమ్మవారి దర్శనం ఎలా అవుతుంది? అప్పటికీ, ఇప్పటికీ తేడాలేమైన ఉన్నాయా? ఎంతదూరం నుంచి వస్తున్నారు? ఏ ఊరు నుంచి వస్తున్నారు? ఆలయానికి ఎన్నిసార్లుగా వస్తున్నారు? అంటూ పలు ప్రశ్నలను ఆయన సంధించారు. మౌలికసదుపాయాలపైన, అన్నదాన విభాగంపైన ఆయన అభిప్రాయాలు సేకరించారు.



క్యూలైన్‌లో భక్తులతో మాట్లాడుతున్న ఈవో



పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న బొండా ఉమా

వైసీపీ నిరసన ప్రదర్శనలు ఎన్నికల కోడ్‌కు విరుద్ధం

● నున్న పోలీసులకు ఫిర్యాదు చేసిన బొండా ఉమా

పాయకాపురం, ఏప్రిల్ 15: ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా వైసీపీ సెంట్రల్ నేతలు సోమవారం పలు డివిజన్లలో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. సీఎం జగన్‌పై జరిగిన రాళ్ల దాడిని నిరసిస్తూ వివిధ ప్రాంతాల్లో కొవ్వొత్తుల ర్యాలీలు నిర్వహించి ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారు. స్థానిక 63వ డివిజన్ సుందరయ్యనగర్ ప్రాంతంలో ఏకంగా రోడ్డుపై టెంట్ వేసి నిరసన తెలపడమే కాకుండా సుమారు 100 మంది వైసీపీ నేతలు, కార్యకర్తలు ప్లకార్డులు పట్టుకుని, కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. దీనిపై స్పందించిన టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమా సోమవారం రాత్రి నున్న రూరల్ పోలీసు స్టేషన్ వద్దకు చేరుకుని నిరసనలు, ప్రదర్శనలు నిర్వహించిన వైసీపీ నేతలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే స్టేషన్ సీఐకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ నగరంలో పోలీసు అధికారులు వైసీపీకి తొత్తులుగా మారారని, ఎన్నికల కోడ్ పేరుతో రోడ్లపై టీడీపీ కార్యకర్తలు నలుగురు, ఐదుగురు నిలబడినా తరిమివేస్తున్నారని, అలాంటిది ఇంత పెద్ద ఎత్తున వివిధ డివిజన్లలో వైసీపీ నేతలు ర్యాలీలు నిర్వహిస్తే కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ర్యాలీపై ఫిర్యాదు ఇవ్వడానికి వచ్చిన టీడీపీ నేతలను గంటల తరబడి స్టేషన్ వద్ద నిరీక్షించేలా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణం నార్త్‌జోన్ ఏసీపీ, నున్న స్టేషన్ సీఐలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సదరు విషయమై మంగళవారం ఎన్నికల కమిషన్‌కు ఆధారాలతో సహా ఫిర్యాదు చేస్తామన్నారు.

చిరస్థాయిగా అంబేడ్కర్ స్ఫూర్తి: డీఆర్ఎం



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న డీఆర్ఎం

రైల్వేస్టేషన్, ఏప్రిల్ 15: అంబేడ్కర్ స్ఫూర్తి చిరస్థాయిగా నిలిచిపోతుందని విజయవాడ రైల్వే డివిజన్ మేనేజర్ నరేంద్ర ఏ పాటిల్ అన్నారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా సోమవారం రైల్వే ఆడిటోరియంలో జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ అంబేడ్కర్ వంటి విశిష్ట వ్యక్తిత్వం సామాజిక దృక్పథం, కర్తవ్య నిర్వహణ కలిగిన వ్యక్తులు అరుదన్నారు. ఆయన స్ఫూర్తి చిరకాలం అందరికీ ఉండాలని కోరుకున్నారు. ఏడీఆర్ఎంలు ఈఈ ఎ డ్విన్, కొండా శ్రీనివాసరావు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ ఎం.శౌరిబాల, సీనియర్ డీపీ వో కట్టా ఆనంద్ పాల్గొని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అంబేడ్కర్ జీవితంపై బాబా సాహెబ్ నాటకాన్ని ప్రదర్శించారు. కంటెంట్, స్పెషల్ ఎఫెక్టులతో రూపొందించిన నాటకానికి ఆహూతులు హర్షధ్వానాలు తెలిపారు. షార్ట్‌ఫిలిం ప్రదర్శించారు. వ్యాసరచన, కవిత, చిత్రలేఖనం, ఉపన్యాసం పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఎస్సీ, ఎస్టీ సంఘాలు, కార్మిక సంఘాల ప్రతినిధులు అంబేడ్కర్ గురించి ప్రసంగించారు. సహాయ పర్సనల్ ఆఫీసర్ ఎం.అనిరుధ్ వందన సమర్పణ చేశారు.

గంగపుత్రులకు న్యాయం చేయండి: నేతి

ధర్నాచౌక్: గంగవరం పోర్టు కోసం భూమినిచ్చి ఉపాధి కోల్పోయిన గంగపుత్రుల న్యాయబద్ధమైన కోర్కెలను తీర్చాలని ఏపీ ప్రొఫెషనల్ ఫోరం అధ్యక్షుడు నేతి మహేశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్నందుకు గాను పోర్టును ప్రభుత్వం వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. 2002 నుంచి పోరాడుతున్న బాధితుల సమస్యలు పరిష్కరించే రాజకీయ వ్యవస్థ లేకపోవడం దురదృష్టకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వాటా కూడా ఆదానీకి కట్టబెట్టడంతో వారి సమస్య జఠిలమైందన్నారు. అధికారం చేపట్టిన తర్వాత సీఎం జగన్ రాష్ట్ర ఆస్తులను తన సొంత ఆస్తిలా అమ్ముకుంటున్నారని ధ్వజమెత్తారు. ప్రస్తుతం పోర్టులో ఉద్యోగులు చేస్తున్న పోరాటానికి తమ మద్దతు ఉంటుందన్నారు. కేవీపీఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి అంద్ర మల్యాద్రి మాట్లాడుతూ గంగవరం పోర్టు ఉద్యోగుల న్యాయమైన కోర్కెలు తీర్చాలని లేదంటే అన్ని కార్మిక సంఘాలతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఫోరం నేత బొప్పన రాజశేఖర్ పాల్గొన్నారు.

కార్పొరేటర్ల పాత్ర మరువలేనిది

● ప్రస్తుత, మాజీ కార్పొరేటర్ల ఆత్మీయ సమ్మేళనంలో కేశినేని చిన్ని



మాజీ, ప్రస్తుత కార్పొరేటర్లతో మాట్లాడుతున్న కేశినేని శివనాథ్

విద్యాధరపురం, ఏప్రిల్ 15: టీడీపీ అభివృద్ధిలో ప్రస్తుత, మాజీ కార్పొరేటర్ల పాత్ర మరువలేనిదని, వారి కృషి శ్లాఘనీయమని పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో సోమవారం మాజీ, ప్రస్తుత కార్పొరేటర్లతో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వారిని సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ చంద్రబాబు తాను సీఎంగానే అసెంబ్లీలో చేసిన శపథాన్ని నిజం చేయాలంటే కూటమి అభ్యర్థులను గెలిపించాలన్నారు. భారీ మెజారిటీ సాధనపై ఆయన ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న వారి నుంచి అభిప్రాయాలు సేకరించారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, జాస్తి సాంబశివరావు, మాజీ మేయర్ కోనేరు శ్రీధర్, చెన్నుపాటి గాంధీ, బొప్పన భవకుమార్, కొట్టేటి హనుమంతరావు, హరిబాబు, బాలస్వామి, వెంకటేశ్వరరావు, గుర్రం కనకదుర్గ, నాగోతు నాగమణి, సుకాశి చరిత, పైడిమాల సుభాషిణి, దేవినేని అపర్ణ పాల్గొన్నారు.

టీడీపీలో చేరుతున్న వారికి అభినందనలు

ప్రజా సంక్షేమం, అభివృద్ధిని కాంక్షించి టీడీపీలో చేరుతున్న వారికి కేశినేని శివనాథ్ అభినందనలు తెలిపారు. సోమవారం గురునానక్ కాలనీలోని పార్లమెంట్ నియోజకవర్గ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో వైసీపీ నుంచి పలువురు నేతలు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. వారిని శివనాథ్ సాదరంగా ఆహ్వానించారు. కనకదుర్గ గుడి బోర్డు మాజీ మెంబర్ సీతాబుజ్జి, వైసీపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ పీతా మోహన్‌లతో పాటు అగ్నికుల క్షత్రియ సంఘ నేతలు, సింధ్ సమాజ సభ్యులు, వన్‌టౌన్ ముఠాకార్మిక సంఘం నేతలు పార్టీలో చేరారు. వీరికి శివనాథ్, ఎంఎస్ బేగ్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కొణిజేటి రమేష్, మద్దిరాల అచ్చెన్న, అప్పన్న, గోవింద్, దుర్గారావు, హనుమాన్ ఫుట్‌వేర్ వ్యాపారస్థులు పలువురు చేరారు.

35వ డివిజన్ నుంచి మహిళల చేరిక

35వ డివిజన్ నుంచి మాజీ కార్పొరేటర్ పైడిమాల సుభాషిణి, స్టేట్ క్రిస్టియన్ సెల్ వైస్ ప్రెసిడెంట్ ఇత్తడి విక్టర్ చార్లెస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మహిళలు టీడీపీలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించి టీడీపీ ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలను ఇంటింటికీ చేరువ చేయాలన్నారు.

నగరాభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి: సుజనా

● ఆర్యవైశ్య ఆత్మీయ సమ్మేళనంలో 20 మంది నేతలు బీజేపీలో చేరిక



సుజనా చౌదరి, కేశినేని శివనాథ్‌ను సత్కరిస్తున్న ఆర్యవైశ్య ప్రముఖులు

భవానీపురం, ఏప్రిల్ 15: నగరాభివృద్ధికి శక్తి వంచనలేకుండా కృషి చేస్తానని పశ్చిమ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వై. సుజనా చౌదరి అన్నారు. తనను భారీ మెజార్టీతో గెలిపిస్తే పశ్చిమను మోడల్‌గా అద్భుతంగా తీర్చిదిద్దుతానని భరోసా ఇచ్చారు. 44వ డివిజన్‌లో అధ్యక్షుడు బొడ్డుపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 4 స్థంభాల సెంటర్‌లో సోమవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఎరుకుల బజార్, నాగేంద్రస్వామి గుడి రోడ్డు, చెరువు సెంటర్, మర్రిచెట్టు సెంటర్, అగ్గిపెట్టెల ఫ్యాక్టరీ, సితార సెంటర్ వరకు ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్‌తో కలిసి ప్రజలతో మమేకమయ్యారు. స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల టీడీపీ ఇన్‌చార్జి బుద్దా వెంకన్న, మైనార్టీ నేతలు ఎస్‌కే నాగుల్ మీరా, ఎంఎస్.బేగ్, దుర్గగుడి మాజీ చైర్మన్ పైలా సోమినాయుడు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, పశ్చిమ తెలుగు యువత ఉపాధ్యక్షుడు నాగబాబు, బడుగు గణేష్, ఏడుకొండలు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులు ఖలేజా గల వైశ్యులుగా మారి ఏకాభిప్రాయంతో ఒకేతాటిపైకి వచ్చి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా కేశినేని శివనాథ్‌ను అఖండ మెజార్టీతో గెలిపించాలని సుజనా చౌదరి పిలుపునిచ్చారు. 41వ డివిజన్ దేసు సుబ్బారావు కల్యాణమండపంలో ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ వక్కలగడ్డ భాస్కరరావు ఆధ్వర్యంలో ఆర్యవైశ్య ఆత్మీయ సమ్మేళనం సోమవారం జరిగింది. సుజనా చౌదరి, కేశినేని శివనాథ్‌ను ఆర్యవైశ్య సంఘాల ప్రతినిధులు గజమాలతో సత్కరించారు. సుజనా ఆధ్వర్యంలో వైసీపీ, ఇతర పార్టీల్లోని 20 మంది కొత్తమాసు వెంకట పిచ్చియ్య మాజీ మండలాధ్యక్షుడు దివ్వెల రామాంజనేయులు, తల్లం రామకృష్ణ, ఇమ్మడిశెట్టి శ్రీనివాసరావు, పత్తి నరేంద్ర, పత్తి వంశీ, దేవన వెంకట్, సమ్మెట హరిబాబు బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు.

సభలో ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో జగన్ ఇంటికి పంపించి జేట్యాక్స్‌ను రద్దు చేసుకుందామన్నారు. ఎన్డీఏ అభ్యర్థులను మెజార్టీతో గెలిపిస్తే జీఎస్టీతో పాటు జె.టాక్స్ (జగన్ ట్యాక్సు) నుంచి విముక్తి కలిగిస్తామన్నారు. వక్కలగడ్డ భాస్కరరావు, శ్రీకాంత్, కొణిజేటి రమేష్, సుబ్బరాయుడు, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణ రావు, మైనార్టీ నేత ఎంఎస్.బేగ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ పాల్గొన్నారు.

ఐరన్‌యార్డులోని ముఠా కార్మికుల సమస్యలను పరిష్కారాన్ని శతవిధాలా కృషి చేస్తానని పశ్చిమ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి యలమంచిలి సుజనా చౌదరి భరోసా ఇచ్చారు.



షో రూంను ప్రారంభిస్తున్న ప్రతినిధులు

నగరంలో 'సత్యా' ప్రారంభం

విజయవాడ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): చెన్నై కేంద్రంగా ఎలక్ట్రానిక్స్ రంగంలోకి అడుగుపెట్టిన సత్యా ఇప్పుడు నగరవాసులకు అందుబాటులోకి వచ్చింది. బందరు రోడ్డులోని సిరీస్ కంపెనీకి ఎదురుగా సత్యా షో రూంను సోమవారం ప్రారంభించారు. సత్యా ఎలక్ట్రానిక్స్ సంస్థ ఎండీ జాన్సన్, ఫాదర్ ప్రకాశ్ పాల్గొన్నారు.

పైపులరోడ్డు ఆంజనేయ స్వామి ఆలయంలో శ్రీరామ నవమి ఉత్సవాలు

అజిత్‌సింగ్‌నగర్, ఏప్రిల్ 15: అజిత్‌సింగ్‌నగర్ పైపుల రోడ్డు సెంటర్‌లోని శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవస్థానంలో ఈనెల 17 నుంచి 21 వరకు శ్రీరామ నవమి ఉత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ కార్యవర్గ అధ్యక్షుడు కాలనాధభట్ట వీరభద్రశాస్త్రి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. నవమి నాడు ఉదయం 9 గంటలకు అంకురార్పణతో సీతారామ కల్యాణం వైభవంగా నిర్వహించనున్నట్టు తెలిపారు. భక్తులు పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

నారా లోకేష్‌ను కలిసిన ఎంఎస్ బేగ్



వన్‌టౌన్, ఏప్రిల్ 15: టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా నియామకమైన పశ్చిమ సీనియర్ టీడీపీ నేత ఎంఎస్ బేగ్ సోమవారం టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్‌ను కలిసి ధన్యవాదాలు తెలిపారు. తనను పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శిగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఇదే సమయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురామ్, ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని)కి కూడా బేగ్ ధన్యవాదాలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి పార్టీ కల్పించిన ఈ పదవిని సద్వినియోగపరచుకుని వచ్చే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రావడానికి, కూటమి అభ్యర్థుల విజయానికి తన తోడ్పాటును అందిస్తానన్నారు.

బీబీఏ కార్యవర్గానికి సత్కారం

విజయవాడ కల్చరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): బెజవాడ బార్ అసోసియేషన్‌కు నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను అక్కినేని ఫౌండేషన్ ఆఫ్ ఇండియా, తెలుగు కళావాహిని, పోలవరపు కోటేశ్వరరావు సాంస్కృతి కళా సమితి, శ్రీ కళాభారతి సంస్థలు సంయుక్తంగా కౌతా పూర్ణానంద సత్రంలో సంగీత విభావరి నిర్వహించాయి. అనంతరం బార్ అసోసియేషన్ కార్యవర్గ ప్రతినిధులను సత్కరించారు. చింతకాల చిట్టిబాబు, చీదేళ్ల నాగేశ్వరరావు, సింగంశెట్టి చంద్రశేఖర్ పాల్గొన్నారు.



ఆలపిస్తున్న గాయకులు (పైన), నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

అలరించిన స్వర సంగమం

విజయవాడ కల్చరల్, ఏప్రిల్ 15: స్వరలయ, ఆర్య మీడియా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన స్వర సంగమం ప్రేక్షకులను అలరించింది. గాంధీనగరంలోని హనుమంతరాయ గ్రంథాలయంలో నిర్వహించారు. గాయనీ గాయకులు వైఎస్ రామకృష్ణ, అనిల్‌కుమార్, బ్రహ్మానందం, గాయత్రి భరద్వాజ్, శిరీష, కల్యాణి శిరీష, భాగ్యశ్రీ, వాణికుమారి మధురగానం చేశారు. కళాకారుల నృత్యప్రదర్శన సర్వత్రా ఆకట్టుకుంది. పాలడుగు లక్ష్మణరావు, ఎన్.లలిత ప్రసాద్, బీవీఎస్ ప్రకాశ్ కళాకారులను సత్కరించారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పేరుపోగు తదితరులు

చంద్రబాబుకే మాదిగల మద్దతు

● ఏపీ మాదిగ సంఘాల జేఏసీ అధ్యక్షుడు పేరుపోగు

ధర్నాచౌక్, ఏప్రిల్ 15: రాజకీయంగా మాదిగలకు అన్యాయం చేసిన వైఎస్ జగన్‌ను వచ్చే ఎన్నికల్లో ఓడించాలని ఏపీ మాదిగ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ పిలుపునిచ్చారు. మాదిగలకు 15 సీట్లు కేటాయించి సామాజిక న్యాయం పాటించడమే కాకుండా అధికారంలోకి వచ్చిన వెంటనే ఎస్సీ వర్గీకరణ, చేస్తానన్న టీడీపీ అధినేత చంద్రబాబుకు మాదిగల మద్దతు ఉంటుందన్నారు. గాంధీనగర్‌లోని కార్యాలయంలో చంద్రబాబుకు మద్దతుగా కరపత్రాలను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ కూటమి గెలుపు కోసం రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఈ నెల 18 నుంచి ప్రచార యాత్ర చేపడుతున్నట్టు పేర్కొన్నారు. 29 ఎస్సీ రిజర్వు సీట్లలో మాదిగలకు కేవలం 10 సీట్లు మాత్రమే ఇచ్చి జగన్ అవమానించారన్నారు. మాదిగల వ్యతిరేకి జగన్ ఓటమే మాదిగల పంతం కావాలని పిలుపునిచ్చారు. సబ్‌ప్లాన్ నిధులు దారి మళ్లించి, ఎస్సీలకు చెందిన 27 సంక్షేమ పథకాలు రద్దు చేయడమే కాకుండా దళితులపై జరుగుతున్న దాడులపై స్పందించిన జగన్‌కు సామాజిక న్యాయం గురించి మాట్లాడే అర్హత లేదని విమర్శించారు. ఆర్.జె.ప్రకాష్, పొన్నెగంటి రమేష్, కొదబల బెంజిమెన్, వెజెండ్ల సుబ్బారావు, యర్రంశెట్టి ప్రసాద్ రెల్లి, కోటయ్య పాల్గొన్నారు.

25 నుంచి 5 దేశాల ఫిడే రేటింగ్ చెస్ టోర్నీ



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ భారతీధర్ అకాడమీ డైరెక్టర్ నరేష్

విజయవాడ స్పోర్ట్స్, ఏప్రిల్ 15: నగరంలోని స్పార్క్‌చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 25 నుంచి 30 వరకు కానూరులోని షామ్‌రాక్ ఇంటర్నేషనల్ స్కూల్లో మొదటి ఇంటర్నేషనల్ ఫిడే రేటింగ్ చెస్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్టు స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ భారతీధర్ తెలిపారు. స్కూల్ కాన్ఫరెన్స్ హాల్లో టోర్నీ బ్రోచర్లను ఆమె, స్పార్క్ చెస్ అకాడమీ డైరెక్టర్ తాళ్ల నరేష్, కోచ్ రామకృష్ణ, ప్రవీణ్‌తో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. ఇండియా, శ్రీలంక, బంగ్లాదేశ్, జింబాబ్వే, అమెరికాల నుంచి ఇప్పటి వరకు 300 మంది చెస్ క్రీడాకారులు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. 400 మంది బరిలో దిగే అవకాశం ఉందన్నారు. మొత్తం రూ.5లక్షల ప్రైజ్‌మనీని విజేతలకు అందిస్తామన్నారు.

గిరిజనులకు జగన్ ద్రోహం: ధారూనాయక్

అమరావతి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): గిరిజనుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన జగన్.. ఆ గిరిజనులపైనే అక్రమ కేసులు పెట్టి హత్యలు చేయిస్తున్నారని ఎస్టీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ధారూనాయక్ విమర్శించారు. సోమవారం టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గిరిజనుల సంక్షేమాన్ని పట్టించుకోని జగన్‌కు ఓటు అడిగే హక్కు లేదన్నారు.

ఒక్క అల్లరి జరిగినా... ఈసీ ఆఫీసు ముందు నిరాహార దీక్ష



» మమతా బెనర్జీ హెచ్చరిక.. డీఐజీ బదిలీకి నిరసన

కూచ్‌బెహార్, ఏప్రిల్ 15: ఎన్నికల సంఘం బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తోందని పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ విమర్శించారు. రాష్ట్రంలో అల్లర్లు, హింసాత్మక సంఘటన ఒక్కటి జరిగినా ఈసీ కార్యాలయం ముందు నిరాహార దీక్ష చేస్తానని హెచ్చరించారు. బీజేపీ సూచన మేరకే ముర్షిదాబాద్ డీఐజీని బదిలీ చేసిందని ఆరోపించారు. సోమవారం కూచ్ బెహార్, అలియాపూర్‌దౌర్‌లో జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆమె ప్రసంగిస్తూ అల్లర్లను రెచ్చగొట్టేందుకే బీజేపీ పోలీసు అధికారులను బదిలీ చేయిస్తోందని ఆరోపించారు. అవసరమైతే ఎన్నికలు జరిగే 55 రోజుల పాటు దీక్ష చేస్తానన్నారు. "జైలుకు పంపిస్తామన్న బీజేపీ నేతల హెచ్చరికలపైనా మమత మండిపడ్డారు. "ఎలా పోరాడాలో నాకు తెలుసు. వీరికిదాన్ని కాను" అని వ్యాఖ్యానించారు.

ఢిల్లీ మద్యం స్కాంలో చరణ్‌ప్రీత్‌సింగ్ అరెస్టు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 15: ఢిల్లీ మద్యం స్కాంలో వచ్చిన డబ్బును గోవా ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ ప్రచారానికి తరలించిన చరణ్‌ప్రీత్ సింగ్‌ను ఈడీ అరెస్టు చేసింది. ఈ నెల 12నే అతడిని అరెస్టు చేసి.. మరుసటి రోజు ప్రత్యేక కోర్టులో హాజరపరిచింది. ఢిల్లీ మద్యం కేసులో కేజ్రీవాల్, కవిత, మనీశ్ సిసోడియా, పలువురు మద్యం వ్యాపారులు సహా ఈడీ అరెస్టు చేసిన 17వ వ్యక్తి చరణ్‌ప్రీత్. మనీలాండరింగ్ కేసులో తనను ఈడీ అరెస్టు చేయకుండా ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ ఢిల్లీకి చెందిన ఆప్ ఎమ్మెల్యే అమానతుల్లా ఖాన్ చేసిన వినతిని సుప్రీంకోర్టు సోమవారం తిరస్కరించింది.

మథుర మసీదు సర్వేపై సుప్రీం స్టే పొడిగింపు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 15: మథురలో శ్రీకృష్ణ జన్మభూమి దేవాలయాన్ని ఆనుకొని ఉన్న షాహీ ఈద్గా మసీదు ప్రాంగణంలో శాస్త్రీయ సర్వే నిర్వహించకుండా ఇచ్చిన స్టే ఉత్తర్వులను సోమవారం సుప్రీంకోర్టు పొడిగించింది. న్యాయస్థానం పర్యవేక్షణలో సర్వే జరపాలని గతంలో అలహాబాద్ హైకోర్టు ఆదేశాలు ఇవ్వగా దానిని నిలుపుదల చేస్తూ సుప్రీంకోర్టు స్టే ఇచ్చింది. ఆ ఆదేశాలను మళ్లీ పొడిగిస్తూ విచారణను ఆగస్టు నెలకు వాయిదా వేసింది.

సల్మాన్ ఇంటి వద్ద కాల్పులకు అమెరికాలో కుట్ర

ముంబై, ఏప్రిల్ 15: బాలీవుడ్ నటుడు సల్మాన్‌ఖాన్ ఇంటి ఆవరణలో కాల్పులకు అమెరికాలో పథకం రచించినట్లు పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలింది. గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ కుడి భుజంగా భావించే రోహిత్ గోదారా.. బిష్ణోయ్ సోదరుడు అన్మోల్ కోరిక మేరకు ఇద్దరు వ్యక్తులతో కాల్పులు జరిపించినట్లు పోలీసులు చెప్పారు. సల్మాన్ ఇంటి వద్ద కాల్పులు జరిపిన వ్యక్తుల కదలికలు అక్కడి సీసీటీవీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. నిందితుల్లో ఒకరిని విశాల్‌గా గుర్తించిన పోలీసులు.. అతడు లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌లో పనిచేస్తున్నట్లు తెలిపారు. కాల్పుల ఘటనలో దుండగులు ఉపయోగించిన బైక్ యజమానిని పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు. బైక్‌ను కొద్దిరోజుల క్రితమే వేరేవ్యక్తికి అమ్మినట్లు అతడు చెప్పాడు.

ఇండిగో విమానంలో టెన్షన్... టెన్షన్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 15: అయోధ్య నుంచి ఢిల్లీ వెళ్తున్న ఇండిగో విమానంలో ప్రయాణికులకు అత్యంత భయానక అనుభవం ఎదురైంది. దాదాపు రెండు గంటల పాటు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని గడపాల్సి వచ్చింది. ఏప్రిల్ 13న జరిగిన ఈ సంఘటన.. ఓ ప్రయాణికుడు 'ఎక్స్' ద్వారా పంచుకోవడంతో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది."అయోధ్యలో మధ్యాహ్నం 3.25 గంటలకు బయలుదేరిన ఇండిగో విమానం(6ఈ2702) 4.30 గంటలకు ఢిల్లీలో దిగాల్సి వుంది. కానీ, ప్రతికూల వాతావరణం కారణంగా ల్యాండింగ్ వీలుపడటం లేదని, మరో 45 నిమిషాల వరకు సరిపడా ఇంధనం మిగిలి ఉందని 4.15 గంటలకు పైలెట్ ప్రకటించారు. రెండు సార్లు ప్రయత్నించినా ల్యాండింగ్ సాధ్యపడలేదు. చండీగఢ్‌కు మళ్లిస్తున్నట్లు ప్రకటించారు. 115 నిమిషాల తర్వాత విమానం చండీగఢ్‌లో సురక్షితంగా ల్యాండవడంతో ప్రయాణికులంతా ఊపిరి పీల్చుకున్నారు. అయితే దిగే సమయానికి విమానంలో మరో 2 నిమిషాలకు సరిపడా ఇంధనం మాత్రమే మిగిలి ఉంది" అని ఆ ప్రయాణికుడు పేర్కొన్నాడు. ఘటనపై వెంటనే విచారణ చేపట్టాలని డీజీసీఏ, ఇండిగోలకు ట్యాగ్ చేశాడు.

ఆటుపోట్ల మధ్య జగనన్న మెగా కాలనీ!

కొమరగిరి కాలనీని చుట్టుముట్టిన సముద్రపు నీరు

నాడు ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన సీఎం జగన్



కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం కొమరగిరిలో జగనన్న మెగా కాలనీ సమీపంలోకి పోటెత్తిన సముద్రపు నీరు

కొత్తపల్లి, ఏప్రిల్ 15: కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం కొమరగిరిలో 365 ఎకరాల జగనన్న మెగా ఇళ్ల కాలనీకి సముద్రపు నీరు పోటెత్తుతోంది. జగన్ అధికారంలోకి వచ్చాక 2020 డిసెంబరు 25న ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన తొలి మెగా కాలనీ ఇదే. ఇక్కడ కాకినాడ అర్బన్‌కు చెందిన 13500వేల మందికి సీఎం జగన్ స్వయంగా ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. అయితే ఇప్పటికి పూర్తయిన ఇళ్లు కేవలం 180 మాత్రమే!. 5 వేల ఇళ్లు పునాదుల దశలో, 800 ఇళ్లు లింటల్ దశలో, 4వేల ఇళ్లు పునాదుల దశలోనే ఉన్నాయి. మిగిలిన ఇళ్ల నిర్మాణానికి లబ్ధిదారులెవ్వరూ ముందుకు రాలేదు. కాగా, కాకినాడ-ఉప్పాడ బీచ్‌రోడ్డులో సముద్రం నుంచి ఈ కాలనీకి అర కిలోమీటరు లోపే ఉంటుంది. ఈ కాలనీ నుంచి ఉప్పాడ-కాకినాడ బీచ్‌రోడ్డును పరిశీలిస్తే సముద్రమే ఎత్తుగా కనిపిస్తుంటుంది. ఇటీవల సముద్రంలో ఏర్పడిన పోటుకు ఉప్పు నీరంతా ఈ కాలనీ అంచుల వరకు వెళ్లింది. ఆ నీరు వెనక్కి వెళ్లే దారిలేకపోవడంతో చెరువులా దర్శనమిస్తోంది. ఇలా సముద్రంలో ప్రతిరోజూ వచ్చే పోటు, పాట్లకు నీరు ముంచెత్తితే.. ఇక ఇక్కడ ఎలా నివసించాలో అని గృహనిర్మాణదారులు సతమతమవుతున్నారు. ఏటా నవంబరు, డిసెంబరులో ఏర్పడే తుఫాన్ల ధాటికి ఏకంగా కాలనీని ముంచేసినా ఆశ్చర్యం లేదని ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం ఇచ్చే నిధులు ఎటూ చాలకపోవడంతోపాటు.. సముద్రపు పోటు భయం కారణంగానే ఇక్కడ ఇళ్ల నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నట్లు తెలుస్తోంది.

ఓట్ల కోసం 'ఉపాధి' గేలం

రైతుల పొలాల్లో పండ్ల మొక్కల పెంపకానికి నిధులు.. పేద రైతు ఓటర్లకు ఉపాధి నిధుల ఎర

» ఎన్నికల ముందే భారీగా మంజూరుకు రంగం సిద్ధం

» ఉపాధి పథకంలో పనిచేసే కీలక అధికారే సూత్రధారి

» నాలుగేళ్లుగా పేద రైతులను పట్టించుకోని జగన్ సర్కార్

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



ఎప్పుడో ఇచ్చిన ఇళ్ల పట్టాలను ఎన్నికల ముందు మళ్లీ ఇవ్వడం, ఎప్పుడో జగనన్న సురక్ష పథకం ద్వారా ఇచ్చిన కుల ధృవీకరణ పత్రాలను మళ్లీ ఇచ్చి ఎన్నికల్లో లబ్ధి పొందాలనుకోవడం... ఇలా జనాలకు తాము చేసిన పనులను ఎన్నికల ముందు గుర్తు చేయడం కోసం జగన్ సర్కార్ రకరకాల ఫీట్లు వేస్తోంది. ఈ క్రమంలోనే ఉపాధి హామీ పథకం నిధులను పేద రైతుల కోసం ఖర్చు చేసి, వారి ఓట్లను కొల్లగొట్టేందుకు వైసీపీ సర్కార్ ఎత్తులు వేస్తోంది. నాలుగేళ్లుగా ఉపాధి హామీ పథకం నిధులను ఉద్యాన పంటలకు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేసినా సర్కార్ పట్టించుకోలేదు. ఉపాధి పథకంలో మెటీరియల్ నిధులన్నీ జగనన్న కాలనీల చదును పనులకు వాడి కార్యకర్తలకు దోచిపెట్టిన జగన్ సర్కార్... ఇప్పుడు ఆ నిధులతో పేద రైతుల ఓట్లు కొల్లగొట్టేందుకు వ్యూహం పన్నుతోంది. దీనిలో భాగంగా ఉద్యాన పంటలు వేసేందుకు ఉపాధి నిధులు మంజూరు చేస్తామని చెప్తోంది. ఈ విషయంలో గత ప్రభుత్వంలో టీడీపీ నేతలకు వీరవిధేయుడిగా ఉండి, ఈ సర్కార్ వచ్చిన తర్వాత ఓ మంత్రికి భక్తుడి తరహాలో వ్యవహరిస్తున్న ఓ అధికారి పాత్ర కీలకంగా ఉందని చెప్తున్నారు. రైతులకు ఉద్యాన పంటలు వేసుకునేందుకు ఉపాధి నిధులిస్తామని, దరఖాస్తు చేసుకోవాలని ఎన్నికల వేళ అధికారులు పిలుపునిస్తున్నారు. ఉపాధి పథకంలో మంజూరు చేసిన పనులకు ఎన్నికల కోడ్ అడ్డురాదన్న ధీమాతో ఈ ఎత్తులు వేస్తున్నారని అంటున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేలోపు లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటలు వేసుకునేందుకు అనుమతులు మంజూరుచేసి రైతులకు మంజూరు పత్రాలు ఇవ్వాలని యోచిస్తున్నారు. వైసీపీ పెద్దల కళ్లల్లో ఆనందం చూసేందుకు ఆ అధికారి ఈ ఏర్పాట్లు చేస్తున్నారని పలువురు చెబుతున్నారు.

టీడీపీ ప్రభుత్వంలో విస్తృత ప్రయోజనాలు

తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఉపాధి నిధులతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, పేద అగ్రవర్ణ రైతులకు విస్తృత ప్రయోజనాలు కల్పించారు. అప్పట్లో ఎకరా భూమి కలిగిన రైతులు సైతం ఉపాధి పథకం ద్వారా ఉద్యాన పంటలు వేసుకుని బాగా ప్రయోజనం పొందారు. ఒక్కో ఎకరంలో ఉద్యాన పంట వేసుకునేందుకు ఒక్కో రైతుకు రూ.2.50 లక్షల నుంచి రూ.3.50 లక్షల దాకా దక్కాయి. ఉద్యాన పంటలు వేసుకునేందుకు ప్రభుత్వం మొక్కలతోపాటు ఎరువులు, నిర్వహణా వ్యయం ఉపాధి మెటీరియల్ నిధులతో సాగేవి. ముఖ్యంగా రాయలసీమ ప్రాంత ప్రజలకు ఉపాధి పథకం కల్పతరువుగా ఉండేది. అంతేకాకుండా పశువుల మేత పెంచుకునేందుకు ఎకరాకు రూ.30 వేలు ఉపాధి పథకం ద్వారా అందుకున్నారు. దీంతోపాటు సైలేజ్ పిట్స్‌కు రూ.15 వేలు, నాడెప్ పిట్ నిర్మాణానికి రూ.10 వేలు, వర్మీ కంపోస్ట్ పిట్‌కు రూ.21 వేలు, పొలం చుట్టూ ప్లాంటేషన్ కోసం రూ.24 వేలు, ఉద్యాన పంటలు వేసుకునేందుకు ఎకరాకు రూ.1.20 లక్షలు, ఆ పొలంలో ఫార్మ్‌పాండ్ తవ్వేందుకు రూ.40 వేల నుంచి రూ.2 లక్షల వరకు ఉపాధి నిధుల నుంచి ఖర్చు చేశారు. భూమి అభివృద్ధి చేసేందుకు రూ.5 లక్షల వరకు ఉపాధి నిధులను వినియోగించుకోవచ్చు. ఫిష్ సీడింగ్ పాండ్స్‌ను తవ్వుకునేందుకు రూ.5.60 లక్షల వరకు ఖర్చు చేయవచ్చు. బోరుబావుల రీచార్జ్‌కు రూ.18 వేలు, పొలంలో బావి తవ్వుకునేందుకు కూడా నిధులు అందించారు. పశువుల షెడ్ నిర్మాణానికి మినీ గోకులం పథకం ద్వారా లక్ష నుంచి రూ.1.80 లక్షల దాకా ఇచ్చారు. మేకలు, గొర్రెల షెడ్లకు ఈ నిధులు వాడుకోవచ్చు. పొలంలో సెరీ కల్చర్ ప్లాంటేషన్ వేస్తే దాని కోసం రూ.1.64 లక్షలు వ్యయం చేశారు. దీంతోపాటు ఆ కుటుంబానికి లైఫ్ స్కిల్ ట్రైనింగ్ కోసం రూ.26 వేల వరకు ఖర్చు చేశారు. ఇళ్ల నిర్మాణంలో రూ.18 వేల వరకు ఉపాధి పథకం ద్వారా పొందే అవకాశం ఉంది. ఆ ఇంట్లో సోక్‌పిట్ నిర్మాణం కోసం రూ.4700, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.15 వేలు, పెరటి మొక్కల పెంపకానికి కూడా ఈ పథకాన్ని వినియోగించుకున్నారు. ఇలా ఇతర వ్యవసాయ పథకాలతో సంబంధం లేకుండా ఉపాధి నిధులతోనే ఓ పేద కుటుంబం రూ.లక్షల మేర ఆస్తులు సమకూర్చుకున్నారని, ఇప్పుడదంతా చరిత్ర అయిందని అధికారులు అంటున్నారు.

ఐదేళ్లుగా ప్రభుత్వానికి పట్టని పేద రైతులు

టీడీపీ హయాంలో ఉపాధి హామీ పథకం ద్వారా పేద రైతులు పలు రకాలుగా లబ్ధి పొందారు. కూలీలకు పనులు కల్పించడంతోపాటు ఈ పథకంలో పేద రైతుల పొలాలను సస్యశ్యామలం చేసేందుకు పలు పథకాలు అమలు చేశారు. ఎన్టీఆర్ జలసిరి ద్వారా పేదరైతుల పొలాల్లో సోలార్ పంపుసెట్లు ఏర్పాటు చేయడం ద్వారా ఒక్కో రైతుకు రూ.5 లక్షల దాకా లబ్ధి కల్పించారు. ఈ సర్కార్ వచ్చిన తర్వాత బోర్లు వేస్తామని చెప్పి వైఎస్ఆర్ జలకళతో జనాలను మభ్యపెట్టింది. ఉన్న పథకాన్ని మూసేసింది. ఉపాధి హామీ పథకానికి పేద రైతులను దూరం చేసింది. రైతులు ఉపాధి పథకం ద్వారా ఉద్యాన పంటలు వేసుకుంటామని గత ఐదేళ్లుగా మొరపెట్టుకున్నా పట్టించుకోలేదు. ఏడాదికి ఒక్కో గ్రామానికి 10 ఎకరాల్లోపే సీలింగ్ పెట్టి మంజూరు చేశారు. దీంతో రైతులు విసిగిపోయి అధికారులను అడగడం మానేశారు. ఉపాధి పథకంలో ఏటా మెటీరియల్ నిధులను గ్రామ, వార్డు సచివాలయాల భవనాలతోపాటు జగనన్న కాలనీల చదును కోసం వాడారు. వాస్తవానికి ఈ పనులు ఉపాధి హామీ పథకం జాబితాలో లేకపోయినప్పటికీ కార్యకర్తలకు పనులు కల్పించి ఆదాయం పొందేందుకు నిధులను విచ్చలవిడిగా వాడేశారు.

ఎన్నికల ముందు గుర్తొచ్చిన రైతులు

వైసీపీ సర్కార్‌కు ఎన్నికల ముందు ఎస్సీ, ఎస్టీ, బీసీ పేద రైతులు గుర్తొచ్చారు. సీజన్ కాకపోయినప్పటికీ ఉపాధి పథకం ద్వారా పేద రైతుల పొలాల్లో ఉద్యాన పంటలు వేసుకునేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఉపాధి హామీ పథకం ఉన్నతాధికారులు ఆదేశాలిచ్చారు. వైసీపీ సర్కార్‌కు వీరవిధేయుడిగా ఉన్న ఉపాధి హామీ పథకం ఉన్నతాధికారి ఆ పార్టీ పెద్దల ప్రాపకం కోసం పాకులాడుతున్నారు. ఎన్నికల వేళ అవసరం లేని ఉద్యాన పంటల ప్రస్తావన తీసుకొచ్చి పేద రైతుల పొలాల్లో ఉద్యాన పంటలు వేసుకునేందుకు ఉపాధి నిధులు ఇస్తామంటూ ప్రతిపాదనలు తీసుకుంటున్నారు. లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటలు వేస్తామని రైతులకు ఆశ చూపించి ఓట్లు కొల్లగొట్టేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. వైసీపీకి మేలు చేసేందుకు ఓ ఉన్నతాధికారి ప్రయత్నాలు ప్రారంభించారని చెప్తున్నారు. టీడీపీ హయాంలో కీలకంగా ఉన్న ఈ అధికారి వైసీపీ అధికారంలోకి రాగానే ముఖ్య పోస్టులు పొందారు. రిటైర్ అయి మూడేళ్లయినా కీలక పోస్టుల్లోనే కొనసాగుతున్న ఈ అధికారి.. ప్రభుత్వ పెద్దల ప్రాపకం కోసం ఉద్యాన పంటలు వేసుకునేందుకు రైతులకు ఉపాధి నిధులు మంజూరు చేస్తామని చెబుతూ.. పేద రైతుల ఓట్లకు గేలం వేస్తున్నారు.

ఎన్నికల్లో పారదర్శకత కోసం మరింత సమన్వయం!

» తెలుగు రాష్ట్రాల సీఎస్‌ల భేటీలో నిర్ణయం

అమరావతి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికలను పారదర్శకంగా, ఏ విధమైన అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా నిర్వహించేందుకు మరింత సమన్వయంతో పని చేయాలని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు నిర్ణయించాయి. సోమవారం హైదరాబాద్‌లోని బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలో ఎన్నికల సంబంధిత అంతర్రాష్ట్ర అంశాలపై ఇరు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు జవహర్‌రెడ్డి, శాంతికుమారిల అధ్యక్షతన సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి తెలంగాణ డీజీపీ రవి గుప్త, అడిషనల్ డీజీలు శివధర్‌రెడ్డి, మహేష్ భగవత్, ఏపీ అడిషనల్ డీజీ శంకబ్రత బాగ్చి, వాణిజ్య పన్నుల ఎక్సైజ్‌శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్ భార్గవ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏపీ సీఎస్ జవహర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికలను స్వేచ్ఛగా, శాంతియుతంగా నిర్వహించేందుకు తెలంగాణతో కలిసి పూర్తిస్థాయి సమన్వయంతో కృషి చేస్తున్నామన్నారు. ఏపీలో అక్రమ మద్యం, గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల నిరోధానికి ఆపరేషన్ పరివర్తన పేరిట చేపట్టిన స్పెషల్ డ్రైవ్ సత్ఫలితాలిచ్చిందని తెలిపారు. రాష్ట్ర సరిహద్దుల్లో పలు శాఖల ద్వారా 129కిపైగా ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్టులను ఏర్పాటు చేసి, పటిష్ఠమైన నిఘా చర్యలు చేపట్టామని తెలిపారు. ఇరు రాష్ట్రాల ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు మంచి సమన్వయంతో పని చేస్తున్నాయన్నారు. తెలంగాణ సీఎస్ శాంతికుమారి మాట్లాడుతూ.. ఇప్పటికే సరిహద్దు రాష్ట్రాల పరిధిలోని జిల్లా కలెక్టర్లు, వివిధ శాఖల ఉన్నతాధికారులు సమన్వయ సమావేశాలు నిర్వహించామన్నారు. అక్రమ మద్యం, ఓటర్లను ప్రలోభపెట్టేందుకు వివిధ వస్తువుల రవాణా, మాదక ద్రవ్యాల అక్రమ రవాణాలకు అడ్డుకట్ట వేశామని తెలిపారు. శాంతిభద్రతల పరిస్థితి కూడా పూర్తిగా అదుపులో ఉందన్నారు. ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం పోలీస్‌శాఖ ద్వారా 36 అంతరాష్ట్ర చెక్ పోస్టులు, అటవీశాఖ మూడు, ఎక్సయిజ్‌శాఖ ద్వారా ఎనిమిది, 224 ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు, వాణిజ్య పన్నుల ద్వారా 7 చెక్ పోస్టులను ఏర్పాటు చేసి 24 గంటల పాటు పటిష్ఠమైన గస్తీని ఏర్పాటు చేశామని వివరించారు. ఛత్తీస్‌గఢ్ నుంచి మావోయిస్టుల కార్యకలాపాలు జరగకుండా ఇరురాష్ట్రాల పోలీసులు, కేంద్ర బలగాల మధ్య పటిష్ఠమైన సమన్వయంతో పని చేస్తున్నామని తెలిపారు.

ఎన్నికల బాండ్లపై తీర్పును పునఃసమీక్షించండి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 15: ఎన్నికల బాండ్ల పథకం రాజ్యాంగ విరుద్ధమంటూ ఇచ్చిన తీర్పును పునఃసమీక్షించాలని కోరుతూ సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలయింది. న్యాయవాది మ్యాథ్యూస్ జె నెడుంపర దీన్ని దాఖలు చేశారు. ఎన్నికల బాండ్లు అన్నవి శాసనవ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థలు తీసుకున్న విధానపర నిర్ణయమని, దాన్ని కొట్టివేయడం ఏమిటని ప్రశ్నించారు. ఎన్నికల బాండ్ల ద్వారా పిటిషనర్లకు ఎలాంటి నష్టం కలగలేదని, అలాంటప్పుడు ఒక ప్రయివేటు పిటిషన్ మాదిరిగా విచారణ జరిపి ఎలా తీర్పు ఇస్తారని ప్రశ్నించారు. ఎన్నికల బాండ్లపై ప్రజాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోలేదని పేర్కొన్నారు.

బీజేపీపై జనంలో మౌన వ్యతిరేకత


ఆ పార్టీకి 370, ఎన్డీఏకి 400 సీట్లు అసాధ్యం.. మోదీ హవా తగ్గింది.. విపక్షాలపై అణిచివేత వికటించనుంది

» పలు రాష్ట్రాల్లో బీజేపీ స్కోరు తగ్గడమేగానీ పెరగదు

» 'ఇండియా కూటమి' అంచనాలు

» 250 సీట్ల వరకూ సాధించగలమని ధీమా





న్యూఢిల్లీ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి ఎన్ని సీట్లు సాధిస్తుంది? ఇండియా కూటమి ఎన్ని గెల్చుకుంటుంది? అనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. దేశ రాజధానిలో దీనిపై చర్చోపచర్చలు సాగుతున్నాయి. ఎన్డీఏకు, తమకు మధ్య 50 నుంచి 70 సీట్లకు మించి తేడా ఉండకపోవచ్చునని ఇండియా కూటమి వర్గాలు చెబుతున్నాయి. ఇందుకు వారు అనేక కారణాలు చూపిస్తున్నారు. 1. దేశంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలతోపాటు మోదీ వ్యవహార శైలి నచ్చని అనేక ఇతర వర్గాలవారు మౌనంగా సంఘటితమవుతున్నారు. వారే ఈ ఎన్నికల్లో నిర్ణాయక శక్తిగా మారనున్నారు. 2. 2019తో పోలిస్తే 2024లో మోదీ హవా అంతగా లేదు. జనంలో ఆయన మీద మోజు తగ్గిపోతోంది. 3. గత లోక్‌సభ ఎన్నికల్లో యూపీ, గుజరాత్, కర్ణాటక, హరియాణా, అస్సాం, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఢిల్లీ తదితర రాష్ట్రాల్లో బీజేపీ అత్యధిక సీట్లు సాధించింది. ఈసారి ఆయా రాష్ట్రాల్లో ఎంతో కొంత నష్టం తప్పదు 4. బీజేపీకి మోదీ ఏకైక నాయకుడిగా మారటంతో రాష్ట్ర, జాతీయస్థాయి అన్ని ఎన్నికల్లోనూ ఆయన మీదే ఆధారపడే పరిస్థితి ఆ పార్టీకి ఉంది. పలు రాష్ట్రాల్లో ఇతర పార్టీల నుంచి నేతలను పెద్దఎత్తున బీజేపీలో చేర్చుకుంటున్నారు. ఇది ఆ పార్టీకి వ్యతిరేకంగా మారే అవకాశం ఉంది. 5. ప్రతిపక్ష పార్టీలపై ఓవైపు తీవ్ర అణిచివేత చర్యలకు పాల్పడుతూ మరోవైపు వారినే అవినీతిపరులుగా చిత్రిస్తూ మోదీ చేస్తున్న ప్రచారం పస కోల్పోతోంది. ఇది వికటించే అవకాశాలున్నాయి. ఎన్నికల ఫలితాల అనంతరం ఎన్డీఏకు, ఇండియా కూటమికి మధ్య 50 నుంచి 70 సీట్ల తేడా మాత్రమే ఉంటే.. ఎన్డీఏ కూటమిలో ఉన్న పార్టీలే కాక బీజేడీ, అకాలీదళ్, అన్నాడీఎంకే వంటి తటస్థంగా ఉన్న పార్టీలు కీలక పాత్ర పోషించే అవకాశాలున్నాయని ఇండియా కూటమి భావిస్తోంది. ప్రస్తుతం ఎన్డీఏలో అజిత్ పవార్ ఎన్సీపీ, ఏక్‌నాథ్‌షిండే శివసేన, నితీష్ కుమార్ నేతృత్వంలోని జేడీయూ, చిరాగ్ పాశ్వాన్ నాయకత్వంలోని లోక్‌జనశక్తి, అప్నాదళ్, ఆర్‌ఎల్డీ, తెలుగుదేశం, జనసేన ఉన్నాయి. ఎన్నికల అనంతరం ఎన్డీఏ కూటమిలోని పార్టీలు ఫలితాలనుబట్టి రాజకీయ సమీకరణల్లో భాగమయ్యే అవకాశాలు లేకపోలేదని ఇండియా కూటమి వర్గాలు తెలిపాయి. మరోవైపు గత ఎన్నికలతో పోలిస్తే వివిధ రాష్ట్రాల్లో ఫలితాలు మారే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నాయి. రామమందిర ప్రభావం ఎంత ఉన్నా ఉత్తరప్రదేశ్‌లోని 80 సీట్లలో ఈసారి 15 సీట్లన్నా తమకు దక్కుతాయని ఇండియా కూటమి ఆశిస్తోంది. ఆ రాష్ట్రంలో బీసీలు, మైనారిటీలు సంఘటితం కావడం, మాయావతి ప్రభావం దాదాపు తగ్గిపోవడం ఇందుకు కారణాలుగా చెబుతున్నారు. మహారాష్ట్రలో అజిత్ పవార్, ఏక్‌నాథ్ షిండే బీజేపీతో చేతులు కలిపినాప్రజలు శరద్ పవార్, ఉద్ధవ్ ఠాక్రేల వైపే సానుకూలంగా ఉన్నారని, ఈసారి తమ కూటమి మొత్తం 48 సీట్లలో సగమైనా సాధిస్తుందని పేర్కొంటున్నారు. ఇక పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ పుంజుకుంటున్నా మొత్తం 42 సీట్లలో 20 దాటే అవకాశాలు లేవని వారు భావిస్తున్నారు. బిహార్‌లో గత ఎన్నికల్లో ఎన్డీఏ 39 సీట్లు సాధించిందని, తరచూ పార్టీలు మారే నితీష్ కుమార్ విశ్వసనీయత తగ్గిపోవడం, వివిధ సామాజిక వర్గాలు, మైనారిటీలు సంఘటితమై ఇండియా కూటమికి దన్నుగా నిలవటం వల్ల ఎన్డీఏ సంఖ్యాబలంఈసారి 25 సీట్లకు దాటే అవకాశాలు లేవని అంటున్నారు. మధ్యప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్‌లలో దాదాపు అన్ని సీట్లు గత ఎన్నికల్లో బీజేపీ గెల్చుకుంది. ఈసారి ఆ రాష్ట్రాల్లో 8 నుంచి 10 సీట్లు కోల్పోవచ్చని తెలుస్తోంది. కర్ణాటకలో గత ఎన్నికల్లో 28 సీట్లలో 25 సీట్లు గెలుచుకున్న ఎన్డీఏ సంఖ్యాబలం ఈసారి 15 సీట్లలోపే పరిమితం అయ్యే అవకాశాలున్నాయి.

తెలంగాణలో బీజేపీకి నాలుగూ కష్టమే!

తెలంగాణలో బీజేపీ గతంలో గెలుచుకున్న నాలుగు సీట్లనే నిలబెట్టుకోవడం కష్టమని, తమిళనాడు, కేరళలో ఆ పార్టీకి సీట్లు వచ్చే అవకాశాలు లేవని ఇండియా కూటమి వర్గాలు తెలిపాయి. ఇక ఒడిశాలో గతంలో మాదిరే గరిష్ఠంగా 8 సీట్లకు మించి గెలుచుకోలేదని, అస్సాంలో ఏడు సీట్లు గెలుచుకోవచ్చని వారు అంటున్నారు. జార్ఖండ్‌లో 10, ఛత్తీస్‌గఢ్‌లో 8, హర్యానాలో 7, ఉత్తరాఖండ్‌లో మూడు సీట్లు గెలుచుకున్నా బీజేపీకి అధికారం దక్కదని పేర్కొన్నారు.

ఢిల్లీలో కేజ్రీవాల్ అరెస్టు కారణంగా వచ్చిన సానుభూతితో ఇండియా కూటమి కనీసం 3 సీట్లనైనా గెల్చుకుంటుందని అంచనా వేస్తున్నారు. మొత్తమ్మీద బీజేపీ చెబుతున్నట్లుగా సొంతంగా 370 సీట్లు, ఎన్డీఏ కూటమి 400 సీట్లకుపైగా సీట్లను సాధించే పరిస్థితి లేదని చెబుతున్నాయి.

తెలంగాణలో కాంగ్రెస్‌కు 8 సీట్లు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 15: పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో అధికార కాంగ్రెస్‌దే పైచేయి కానుందని న్యూస్ ఎక్స్ ఒపీనియన్ పోల్‌లో వెల్లడైంది. రాష్ట్రంలోని మొత్తం 17 స్థానాలకుగాను కాంగ్రెస్ 8 సీట్లను గెలుచుకుంటుదని, బీజేపీ 5, బీఆర్ఎస్ 3 స్థానాలను దక్కించుకుంటుందని న్యూస్ ఎక్స్ తెలిపింది. ఇక దేశ వ్యాప్తంగా మరోసారి బీజేపీ ప్రభంజనం వీస్తుందని సర్వే సంస్థ పేర్కొంది. అన్ని రాష్ట్రాల్లో కలిసి బీజేపీ 325 స్థానాలు గెలుచుకుంటుందని, కూటమిగా ఎన్డీయేకు 383 వస్తాయని వెల్లడించింది. కాగా, కాంగ్రెస్‌తో కూడిన ఇండియా కూటమి 109 స్థానాలకే పరిమితం కానున్నట్లు తెలిపింది. కాంగ్రెస్‌కు ఒంటరిగా 50 సీట్లు కూడా దాటవని తమ సర్వేలో తేలినట్లు వివరించింది.

కేజ్రీవాల్‌కు లభించని ఊరట

ఈడీ అరెస్టుపై ఆయన పిటిషన్‌ను తక్షణమే విచారించేందుకు సుప్రీంకోర్టు నిరాకరణ



కేజ్రీవాల్‌ను కలిసి వస్తున్న మాన్

న్యూఢిల్లీ, ఏప్రిల్15 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు సుప్రీం కోర్టులోనూ ఊరట దక్కలేదు. మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో తనను అరెస్టు చేయడాన్ని సవాలు చేస్తూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను తక్షణమే విచారించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఈనెల 29వ తేదీ తర్వాత ప్రారంభమయ్యే వారంలో ఆయన పిటిషన్‌ను విచారిస్తామని తెలిపింది. కేజ్రీవాల్ పిటిషన్‌పై ఈడీ ప్రతిస్పందన కోరుతూ సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తా సోమవారం నోటీసులు జారీ చేశా రు. వీటికి ఈనెల 24లోపు జవాబివ్వాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కేజ్రీవాల్ తరఫు న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి మాట్లాడుతూ.. న్యాయస్థానం దిగ్భ్రమకు గురయ్యే కొన్ని వాస్తవాలను వెల్లడించాలనుకుంటున్నట్లు తెలిపారు. కేజ్రీవాల్ అరెస్టుతో ఆయన ఎన్నికల్లో ప్రచారం చేసే పరిస్థితి లేకుండాపోయిందంటూ సింఘ్వి చేసిన వాదనలను సుప్రీం విస్మరించింది. కాగా.. సుప్రీం కోర్టులో కేజ్రీవాల్‌కు ఊరట లభించలేదని తెలిసిన కొద్దిసేపటికే రౌజ్ అవెన్యూలోని ఈడీ ప్రత్యేక కోర్టు కూడా ఆయన జ్యుడీషియల్ కస్టడీని ఏప్రిల్ 23వరకు పొడిగించింది. దాంతో తిహాడ్ జైలులో కేజ్రీవాల్ కనీసం మరో రెండు వారాలు గడపక తప్పదని తెలుస్తోంది.

కేజ్రీవాల్‌ను ఉగ్రవాదిగా చూస్తున్నారు: పంజాబ్ సీఎం మాన్

కేజ్రీవాల్‌ను జైల్లో ఉగ్రవాదిగా చూస్తున్నారని, కరడుగట్టిన నేరగాళ్లకు ఇచ్చే సౌకర్యాలుకూడా కల్పించడంలేదని పంజాబ్ సీఎం భగవంత్ మాన్ ఆరోపించారు. సోమవారం ఆయన తిహాడ్ జైల్లో కేజ్రీవాల్‌ను కలిశారు. అద్దాల గోడకు అటూ ఇటూ కూర్చు ని దాదాపు అరగంటసేపు ఫోన్ లైన్ ద్వారా మాట్లాడుకున్నారు. కాగా కేజ్రీవాల్ జైలు నుంచే ప్రభుత్వ పాలనను నిర్వహించనున్నారు. వచ్చే వారం నుంచి జైల్లోనే రోజుకు ఇద్దరు మంత్రుల చొప్పున కలుసుకుని, ఆయావిభాగాల్లో పురోగతిని పరీక్షించనున్నారు.

మళ్లీ అమ్మాయే పుట్టిందా!

» చిన్నారిని తుప్పల్లో పడేసిన తల్లి

» మగబిడ్డపై మమకారంతో నాలుగోసారి గర్భవతి

» భర్తకు సైతం తెలియనివ్వకుండా గోప్యత

» అబ్బాయి పుడితే చెబుదామనే ఆలోచన



కడియం, ఏప్రిల్ 15: నాలుగో కాన్పులోనూ ఆడ సంతానమే కలగడంతో ఓ తల్లి మానవత్వం మరిచి అప్పుడే పుట్టిన పసికందును 20 అడుగుల ఎత్తు నుంచి తుప్పల్లోకి విసిరేసింది. తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం వేమగిరిలో జరిగిందీ ఘోరం. స్థానికులు, బంధువులు, వైద్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వేమగిరి గణపతినగర్‌కు చెందిన తాపీ పనిచేసే వ్యక్తికి ముగ్గురు ఆడపిల్లలు.. వారు ప్రస్తుతం స్కూలుకు వెళుతున్నారు. అయన భార్యకు మగసంతానంపై మమకారంతో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకోలేదు. అయితే, కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకున్నట్టు భర్తను నమ్మించింది. మరోసారి గర్భం దాల్చింది. అబ్బాయి పుడితే అందరికీ చెబుదాం, అమ్మాయి పుడితే మాయం చేద్దామనే ఆలోచనతో గర్భం దాల్చిన విషయాన్ని గోప్యంగా ఉంచింది. పొట్ట పెరగడంపై భర్త ప్రశ్నించగా, ఈ మధ్య ఎక్కువగా తినడంతో పెరుగుతోందని నమ్మించింది. ఆదివారం పురుటినొప్పులు రాగా.. భర్తను, పిల్లలను చర్చికి పంపింది. తనకు తానే పురుడు పోసుకుని, కత్తిపీటతో పేగును కత్తిరించింది. అమ్మాయి పుట్టడంతో నైటీలో పసికందును చుట్టి 20 అడుగుల ఎత్తు నుంచి తుప్పల్లోకి విసిరేసింది. ఏడుపులు వినిపించడంతో చుట్టుపక్కలవారు వచ్చి చూడగా చిన్నారి కనిపించింది. దీనిపై గ్రామంలో కలకలం రేగడంతో అందరూ వచ్చి చూస్తున్నారు. చిన్నారి తండ్రి కూడా వచ్చి చూశాడు. చిన్నారికి చుట్టిన నైటీ తన భార్యదని గమనించి ఇంటికెళ్లి భార్యను నిలదీశాడు. దీంతో మగ సంతానంపై మమకారంతో ఇలా చేశానంటూ ఆమె కన్నీరుకార్చింది. హుటాహుటిన తల్లీబిడ్డను కడియం ఆస్పత్రికి, అక్కడి నుంచి రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇద్దరూ క్షేమంగా ఉన్నారని వైద్యులు తెలిపారు.

తొలిదశ ఎన్నికల్లో సంపన్నులు

» బరిలో 1,618 మంది అభ్యర్థులు

» ఐదుగురు అపర కోటీశ్వరులు

» 252 మందిపై క్రిమినల్ కేసులు

సార్వత్రిక ఎన్నికల తొలిదశ పోలింగ్ ఈ నెల 19న జరగనుంది. మొత్తం 1,618 మంది అభ్యర్థులు తలపడుతున్నారు. వీరిలో ఐదుగురు అపర కోటీశ్వరులు కావడం గమనార్హం. 252 మందిపై(16%) క్రిమినల్ కేసులు ఉన్నాయి. మరో 161 మందిపై(10%) తీవ్ర స్థాయి క్రిమినల్ నేరాలు నమోదయ్యాయి. ఎన్నికల సంఘానికి అభ్యర్థులు సమర్పించిన అఫిడవిట్ల ఆధారంగా అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్(ఏడీఆర్) సంస్థ ఆయా వివరాలు వెల్లడించింది.

- మధ్యప్రదేశ్‌లోని ఛింద్వారా నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న మాజీ సీఎం కమల్‌నాథ్ కుమారుడు నకుల్ నాథ్ ఆస్తులు రూ.716 కోట్లు. సంపన్నుల జాబితాలో ఈయనదే తొలిస్థానం.
- తమిళనాడులోని ఈరోడ్ నియోజకవర్గం నుంచి బరిలో ఉన్న ఏఐఏడీఎంకే అభ్యర్థి అశోక్‌కుమార్ ఆస్తులు రూ.662 కోట్లు. ఈయన అత్యధిక సంపన్నుల జాబితాలో రెండో స్థానంలో ఉన్నారు.
- రూ.304 కోట్ల ఆస్తులతో బీజేపీ అభ్యర్థి దేవనాథన్ యాదవ్ .టి మూడోస్థానంలో ఉన్నారు. ఈయన తమిళనాడులోని శివగంగ నుంచి పోటీ చేస్తున్నారు.
- ఉత్తరాఖండ్‌లోని తెహ్రీ గఢ్వాల్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థి మాలా రాజ్యలక్ష్మీషా రూ.206 కోట్ల ఆస్తులతో నాలుగో స్థానంలో నిలిచారు.
- ఉత్తరప్రదేశ్‌లోని షహరాన్‌పూర్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న బీఎస్పీ అభ్యర్థి మాజిద్ అలీ రూ.159 కోట్లతో ఐదో స్థానంలో ఉన్నారు.

నేరాల చిట్టా ఇదీ..

- తొలిదశలో పోటీ చేస్తున్న 1,618 మంది అభ్యర్థుల్లో 252 మందిపై క్రిమినల్ కేసులు ఉన్నాయి.
- 161 మంది అభ్యర్థులపై అతి తీవ్ర నేరాలకు సంబంధించిన కేసులు నమోదయ్యాయి.
- ఏడుగురు అభ్యర్థులపై హత్య, 19 మందిపై హత్యాయత్నం కేసులు ఉన్నాయి.
- 18 మంది అభ్యర్థులపై మహిళలపై దాడులకు సంబంధించిన కేసులు నమోదయ్యాయి.
- ఒక అభ్యర్థిపై అత్యాచారం కేసు(సెక్షన్ 376) నమోదైంది.
- 35 మంది విద్వేష ప్రసంగాలతో సమాజంలో అల్లర్లు సృష్టించిన కేసులు ఎదుర్కొంటున్నారు.
- తొలిదశ ఎన్నికలు జరుగుతున్న 102 స్థానాలకు సంబంధించి 43 సీట్లలో ఎన్నికల సంఘం 'రెడ్ అలర్ట్' ప్రకటించింది.

- సెంట్రల్ డెస్క్

ఐకార్ ఆలిండియా పీజీ, పీహెచ్‌డీ ఎంట్రెన్స్ టెస్ట్

వ్యవసాయ సంబంధిత పీజీ, పీహెచ్‌డీ కోర్సుల్లో నిర్దేశిత కోటా సీట్ల భర్తీకి ఉద్దేశించిన 'ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్(ఐకార్) ఆలిండియా ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్(ఏఐఈఈఏ)పీజీ 2024', ఐకార్ ఆలిండియా కాంపిటీటివ్ ఎగ్జామినేషన్ ఫర్ డాక్టోరల్ డిగ్రీ ప్రోగ్రామ్స్ (ఏఐసీఈ- జేఆర్ఎఫ్/ఎస్ఆర్ఎఫ్-పీహెచ్‌డీ)2024'లకు నోటిఫికేషన్‌లు వెలువడ్డాయి. ఈ ఎగ్జామ్‌లను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) నిర్వహిస్తోంది. వీటిలో సాధించిన మెరిట్, కౌన్సెలింగ్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు. దేశవ్యాప్తంగా ఉన్న 74 అగ్రికల్చరల్ యూనివర్సిటీలు అందిస్తున్న కోర్సుల్లో ప్రత్యేకించిన సీట్లకు ప్రవేశాలు కల్పిస్తారు. వీటిలో 63 రాష్ట్రీయ వ్యవసాయ, వెటర్నరీ, హార్టికల్చర్, ఫిషరీస్ యూనివర్సిటీలు; 4 ఐకార్ డీమ్డ్ యూనివర్సిటీలు; 3 సెంట్రల్ అగ్రికల్చరల్ యూనివర్సిటీలు; 4 సెంట్రల్ యూనివర్సిటీలు ఉన్నాయి. ఎగ్జామ్ సిలబస్ కోసం వెబ్‌సైట్‌లో చూడవచ్చు.



పీజీ

విభాగాలు: ప్లాంట్ బయోటెక్నాలజీ, ప్లాంట్ సైన్సెస్, ఫిజికల్ సైన్స్, ఎంటమాలజీ అండ్ నెమటాలజీ, అగ్రానమీ, సోషల్ సైన్సెస్, స్టాటిస్టికల్ సైన్సెస్, హార్టికల్చర్, ఫారెస్ట్రీ/అగ్రో ఫారెస్ట్రీ అండ్ సిల్వికల్చర్, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, కమ్యూనిటీ సైన్స్, యానిమల్ బయోటెక్నాలజీ, వెటర్నరీ సైన్స్, యానిమల్ సైన్సెస్, ఫిషరీస్ సైన్స్, డెయిరీ సైన్స్, డెయిరీ టెక్నాలజీ, ఫుడ్ సైన్స్ టెక్నాలజీ, అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్, వాటర్ సైన్స్ అండ్ టెక్నాలజీ

అర్హత: విభాగాన్ని అనుసరించి(బీఎస్సీ/బీఎస్సీ ఆనర్స్)(అగ్రికల్చర్/ హార్టికల్చర్/ఫారెస్ట్రీ/సెరికల్చర్/బయోటెక్నాలజీ/అగ్రిల్ మార్కెటింగ్ అండ్ కో ఆపరేషన్/వెటర్నరీ సైన్సెస్/కమ్యూనిటీ సైన్స్/హోమ్ సైన్స్/డెయిరీ); (బీఈ/బీటెక్)(బయోటెక్నాలజీ/అగ్రికల్చరల్ ఇంజనీరింగ్/డెయిరీ టెక్నాలజీ/ఫుడ్ టెక్నాలజీ/డెయిరీ ఇంజనీరింగ్/ఫిషరీ సైన్స్); బీవీఎస్సీ అండ్ ఏహెచ్/బీఎఫ్ఎస్సీ తదితర కోర్సులు పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థుల వయసు 2024 ఆగస్టు 31 నాటికి 19 ఏళ్లు నిండి ఉండాలి.

ఎంట్రెన్స్ ఎగ్జామ్: ఇది కంప్యూటర్ బేస్డ్ టెస్ట్. ఇందులో 120 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. కోర్సుకు సంబంధించిన సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు నాలుగు మార్కులు కేటాయించారు. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే ఒక మార్కు కోత విధిస్తారు. పరీక్ష సమయం రెండు గంటలు. ప్రశ్నపత్రం ఆంగ్ల మాధ్యమంలో మాత్రమే ఉంటుంది.

దరఖాస్తు ఫీజు: జనరల్ అభ్యర్థులకు రూ.1200; ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.1100; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.625

పీహెచ్‌డీ (జేఆర్ఎఫ్/ఎస్ఆర్ఎఫ్)

స్పెషలైజేషన్‌లు: జెనెటిక్స్ అండ్ ప్లాంట్ బ్రీడింగ్, సీడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ప్లాంట్ జెనెటిక్ రిసోర్సెస్, ప్లాంట్ పాథాలజీ, నెమటాలజీ, ఎంటమాలజీ, సెరికల్చర్, బయోకెమిస్ట్రీ, ప్లాంట్ ఫిజియాలజీ, మాలిక్యులర్ బయాలజీ అండ్ బయోటెక్నాలజీ, మైక్రోబయాలజీ, వెజిటబుల్ సైన్స్, ఫ్రూట్ సైన్స్, ఫ్లోరికల్చర్ అండ్ ల్యాండ్‌స్కేపింగ్, ప్లాంటేషన్-స్పైసెస్- మెడిసినల్ అండ్ ఆరోమాటిక్ క్రాప్స్, పోస్ట్ హార్వెస్ట్ మేనేజ్‌మెంట్, యానిమల్ జెనెటిక్స్ అండ్ బ్రీడింగ్, యానిమల్ న్యూట్రిషన్, లైవ్‌స్టాక్ ప్రొడక్షన్ మేనేజ్‌మెంట్, లైవ్ స్టాక్ ప్రొడక్ట్స్ టెక్నాలజీ, పౌల్ట్రీ సైన్స్, వెటర్నరీ పాథాలజీ, డెయిరీ కెమిస్ట్రీ, ఫుడ్ ప్రాసెసింగ్ టెక్నాలజీ, ఫారెస్ట్రీ, అగ్రికల్చరల్ ఫిజిక్స్, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, అగ్రికల్చరల్ ఎకనామిక్స్, అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్, ఫుడ్ ప్రాసెస్ ఇంజనీరింగ్, ఫుడ్ సేఫ్టీ అండ్ క్వాలిటీ, అగ్రికల్చరల్ స్టాటిస్టిక్స్, బయోఇన్ఫర్మాటిక్స్, ఫుడ్ అండ్ న్యూట్రిషన్, ఆక్వాకల్చర్, కంప్యూటర్ అప్లికేషన్స్ తదితరాలు.

అర్హత: సంబంధిత స్పెషలైజేషన్‌తో మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. అభ్యర్థుల వయసు 2024 ఆగస్టు 31 నాటికి 20 ఏళ్లు నిండి ఉండాలి.

ఎంట్రెన్స్ ఎగ్జామ్: ఇందులో మూడు పార్ట్‌లు ఉంటాయి. మొదటి పార్ట్‌లో(జనరల్ నాలెడ్జ్/రీజనింగ్ ఎబిలిటీ)(అగ్రికల్చర్, యానిమల్ హజ్బెండ్రీ, డెయిరీ, ఫిషరీస్, అలైడ్ సైన్సెస్) అంశాలనుంచి 20, రెండో పార్ట్‌లో కోర్ గ్రూప్ సబ్జెక్ట్ నుంచి 50, మూడో పార్ట్‌లో స్పెషలైజేషన్ సబ్జెక్ట్ నుంచి 50 చొప్పున మొత్తం 120 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో ప్రశ్నకు నాలుగు మార్కులు కేటాయించారు. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే ఒక మార్కు కోత విధిస్తారు. పరీక్ష సమయం రెండు గంటలు. ప్రశ్నపత్రం ఆంగ్ల మాధ్యమంలో మాత్రమే ఉంటుంది.

దరఖాస్తు ఫీజు: జనరల్ అభ్యర్థులకు రూ.1900; ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.1800; దివ్యాంగులు, ఎస్సీ ఎస్టీ అభ్యర్థులకు రూ.975.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 11
- **కరెక్షన్ విండో ఓపెన్:** మే 13 నుంచి 15 వరకు
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, సికింద్రాబాద్, రంగారెడ్డి, వరంగల్, కరీంనగర్, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం
- **పరీక్షల తేదీ:** జూన్ 29న
- **వెబ్‌సైట్:** www.nta.ac.in, https://exams.nta.ac.in/ICAR/

ఆంధ్ర వర్సిటీలో ఇంటిగ్రేటెడ్ బీబీఏ-ఎంబీఏ



విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీకి చెందిన స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్(ఏయూఎస్ఐబీ)- మూడేళ్ల బీబీఏ, అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ బీబీఏ+ఎంబీఏ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ ప్రోగ్రామ్‌లకు విశాఖ ఐఐఎం సహకారం అందిస్తోంది. ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్‌లో మొదటి మూడేళ్ల తరవాత కోర్సు నుంచి వైదొలగే వీలుంది. వీరికి బీబీఏ డిగ్రీ ఇస్తారు. గ్రూప్ డిస్కషన్స్, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. మొత్తం 120 సీట్లు ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

బీబీఏ+ఎంబీఏ వివరాలు

- ప్రోగ్రామ్‌లో భాగంగా ఫౌండేషన్ కోర్సులు, కోర్ కోర్సులు, ఎలక్టివ్ కోర్సులు, ప్రాక్టికల్ ట్రెయినింగ్, కేస్ స్టడీస్, విదేశీ ప్రొఫెసర్ల ఆన్‌లైన్ లెక్చర్స్, ప్రాజెక్ట్ వర్క్‌లు ఉంటాయి. ఏటా కంపల్సరీ ఇంటర్న్‌షిప్ ఉంటుంది.
- క్రియేటివిటీ, ఇన్నోవేషన్, క్రిటికల్ థింకింగ్, డెసిషన్ మేకింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్, లీడర్‌షిప్, టీంవర్క్, బిజినెస్ ఎథిక్స్, స్ట్రాటజిక్ అనాలిసిస్, లైఫ్ స్కిల్స్ తదితర అంశాల్లో శిక్షణ ఇస్తారు.
- **స్పెషలైజేషన్‌లు:** మార్కెటింగ్, ఫైనాన్స్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, హోటల్ మేనేజ్‌మెంట్

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఏదేని గ్రూప్‌తో ద్వితీయశ్రేణి మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1200; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** మే 18
- **గ్రూప్ డిస్కషన్స్, పర్సనల్ ఇంటర్వ్యూలు:** మే 20 నుంచి 22 వరకు
- **సీట్ల కేటాయింపు:** మే 23
- **ప్రోగ్రామ్ ఫీజు చెల్లింపు:** మే 24 నుంచి 27 వరకు
- **దరఖాస్తు పంపాల్సిన చిరునామా:** డైరెక్టర్, డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్, ఆంధ్ర యూనివర్సిటీ, విజయనగర్ ప్యాలెస్, పెదవాల్తేర్, విశాఖపట్నం-530017
- **వెబ్‌సైట్:** www.andhrauniversity.edu.in

ఎడ్యు న్యూస్

'ఈజీ ఇంగ్లీష్' ఉచిత శిక్షణ

మేధా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లీష్ అండ్ పర్సనాలిటీ డెవలప్‌మెంట్- 30వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని 'ఈజీ ఇంగ్లీష్' ఆన్‌లైన్ ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ఆఫర్ చేస్తోంది. ఇంగ్లీష్‌కు తోడు మోటివేషనల్ సెమినార్లు, వ్యక్తిత్వ వికాస పాఠాలు కూడా ఉంటాయి. మొత్తమ్మీద పది ముఖ్యమైన అంశాలపై శిక్షణ ఉంటుంది. ఈ సంస్థ ఫౌండర్, చీఫ్ అయిన డాక్టర్ చిరంజీవి ఆధ్వర్యంలో క్లాసులు నిర్వహణ ఉంటుంది. విద్యార్థులే కాకుండా నిరుద్యోగులు, ఉద్యోగులు, వ్యాపారులు, గృహిణులు ఈ కోర్సులో చేరవచ్చు. ఏప్రిల్ మూడో వారంలో కోర్సు ఆరంభమవుతుంది. కోర్సు కాలవ్యవధి మూడు వారాలు కాగా, ఈ నెల 21 రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలి. మరిన్ని వివరాలకోసం 9866006662 నెంబర్లో మాట్లాడవచ్చు.

హైదరాబాద్ ఐఐటీలో 'గ్రీన్కో' పీహెచ్‌డీ ఫెలోషిప్స్

హైదరాబాద్ ఐఐటిలోని గ్రీన్కో స్కూల్ ఆఫ్ సస్టయినబిలిటీ - పీహెచ్‌డీ ఫెలోషిప్స్‌ను ప్రకటించింది. టెక్నాలజీ డెవలప్‌మెంట్ ఫర్ నెట్ జీరో ట్రాన్సిషన్‌కు సపోర్ట్ చేసే పనిలో భాగంగా ఈ ఫెలోషిప్‌ను ఇస్తోంది. ఆరు గ్రీన్కో ఫెలోషిప్స్ ఉన్నాయి అలాగే మరో నాలుగు ఎంటీఈ ఫెలోషిప్స్ అయిదేళ్ల కాలవ్యవధికి ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు అవి ఉంటాయి. ప్రథమ శ్రేణి డిగ్రీకి తోడు ఇంజనీరింగ్‌లో పీజీ ఉత్తీర్ణులు ఈ స్కాలర్‌షిప్‌నకు అర్హులు. యూజీసీ - నెట్/ గేట్/ సీడ్/ సీఐఎస్ఆర్ టెస్టుని క్లియర్ చేయాల్సి ఉంటుంది. ఎంటీఈ స్కాలర్‌షిప్స్ కోరే విద్యార్థులు ఎంటెక్/ ఎమ్మెస్సీ/ ఎండిజైన్/ ఎం.ఆర్క్ పాసై ఉండాలి. రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా అభ్యర్థుల ఎంపిక ఉంటుంది. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.75,000 చొప్పున నాలుగేళ్ళ పాటు చెల్లిస్తారు. మూడు లక్షల మేరకు వార్షిక కంటింజెన్సీ ఫండ్ కూడా ఇస్తారు. సస్టయినబుల్ ఇంజనీరింగ్‌లో ఏడు ప్రాజెక్టులపై ఈ సంస్థ పనిచేస్తోంది. ఎంపిక విద్యార్థులను ఈ ప్రాజెక్టుల్లో భాగస్వామిగా చేస్తారు.

వెబ్‌సైట్: http://www.iith.ac.in/phdadmissions, https://gss.iith.ac.in/

ఇండియా ఎంప్లాయ్‌మెంట్ రిపోర్ట్

న్యూఢిల్లీ కేంద్రంగా పనిచేసే మానవాభివృద్ధి సంస్థ(ఇన్‌స్టిట్యూట్ ఫర్ హ్యూమన్ డెవలప్‌మెంట్), జెనీవా కేంద్రంగా పనిచేసే అంతర్జాతీయ కార్మికసంస్థ(ఐఎల్ఓ) సంయుక్తంగా ఇండియా ఎంప్లాయ్‌మెంట్ నివేదిక 2024ను తయారుచేసి ఇటీవల విడుదల చేశాయి. పోటీపరీక్షలకు తయారయ్యే విద్యార్థులు ఈ నివేదికలోని ముఖ్యాంశాలను పరిశీలించి దృష్టిలో పెట్టుకోవాలి. ఆర్థికవేత్తలు, అర్థశాస్త్ర విద్యార్థులు ఈ నివేదికను చదవడం అవసరం. ఇతరులు కూడా నివేదికలోని ప్రధానాంశాలను పరిశీలించినా భారత ఆర్థికవ్యవస్థ, ఉద్యోగితా/ నిరుద్యోగం స్థితిపై ఒక అవగాహనకు వచ్చే అవకాశం ఉంది. ఈ నివేదిక ప్రకారం భారతదేశంలో ఉద్యోగితా స్థితికి సంబంధించిన కొన్ని ముఖ్యమైన ఆర్థిక చలాంకాల ధోరణి ఈ మధ్య కాలంలో కిందివిధంగా ఉంది.



పోటీ పరీక్షల ప్రత్యేకం

ఎకానమీ

భారత శ్రామికశక్తి: పదిహేను సంవత్సరాలు, ఆపై వయసు ఉండి ఉపాధి కోసం ఎదురుచూస్తున్న వారు, ఉపాధి పొందుతున్న వారి మొత్తాన్ని శ్రామికశక్తి(లేబర్ ఫోర్స్)గా పరిగణిస్తారు.

శ్రామికశక్తి రేటు: మొత్తం జనాభాలో శ్రామికశక్తి శాతాన్ని శ్రామికశక్తి రేటు(లేబర్ ఫోర్స్ పార్టిసిపేషన్ రేట్) అంటారు. 2024 ఉద్యోగితా నివేదిక ప్రకారం భారతదేశ శ్రామికశక్తి రేటు 2022లో 55.2 శాతంగా ఉంది. అయితే ప్రపంచ సగటు శ్రామికశక్తి రేటు 59.8 శాతంగా ఉండటం గమనార్హం. అంటే ప్రపంచ సగటు శ్రామికశక్తి రేటు కంటే మనదేశ శ్రామికశక్తి రేటు తక్కువగా ఉంది.

- అంతేకాకుండా కొంతకాలంగా భారత శ్రామికశక్తి రేటు తగ్గుతూ ఉండటం గమనించదగ్గ విషయం. భారత శ్రామికశక్తి రేటు 2000లో 61.6 శాతం కాగా 2019 నాటికి 50.2 శాతానికి చేరింది. అయితే 2022 నాటికి తిరిగి అది 55.2 శాతానికి పెరిగింది. నిరపేక్షికంగా భారత శ్రామికశక్తి 2000లో 39.63 కోట్లు ఉండగా 2019 నాటికి 49.55 కోట్లకు పెరిగింది. అంటే దాదాపు పది కోట్లు(9.92 కోట్లు) పెరిగింది. ఇక 2022లో భారత శ్రామికశక్తి 56.74 కోట్లుగా ఉంది.

కార్మికశక్తి(వర్కింగ్ ఫోర్స్): ఏదేని ఆర్థిక కార్యక్రమంలో ఉపాధి పొందుతున్న వారిని కార్మికశక్తి అంటారు. మొత్తం జనాభాలో కార్మికశక్తి శాతాన్ని జనాభా కార్మికశక్తి నిష్పత్తిగా పిలుస్తారు. 2024 ఉద్యోగితా స్థితి నివేదిక ప్రకారం భారత కార్మికశక్తి నిష్పత్తి 2022లో 52.9 శాతంగా ఉంది. అయితే 2000లో ఇది 60.2 శాతంగా ఉండి 2019 నాటికి 47.3 శాతానికి తగ్గింది.

- నిరపేక్షికంగా భారత శ్రామికశక్తి 2000లో 38.71 కోట్లు కాగా 2019లో 46.65 కోట్లు, ఇక 2022లో 54.45 కోట్లు.

నిరుద్యోగం రేటు: మొత్తం శ్రామికశక్తిలోని నిరుద్యోగుల శాతాన్ని నిరుద్యోగరేటు అంటారు.

సాధారణ స్థితి నిరుద్యోగం

సర్వే సంబంధిత సంవత్సరకాలం(365 రోజులు)లో ఎక్కువ కాలం ఉపాధి దొరకని వారిని సాధారణ స్థితి నిరుద్యోగులు అంటారు. 2024 ఉద్యోగితా స్థితి నివేదిక ప్రకారం భారతదేశ సాధారణ స్థితి(యూజ్‌వల్ స్టేటస్) నిరుద్యోగం రేటు 2000లో 2.3 శాతం ఉండగా 2019 నాటికి 5.8 శాతానికి పెరిగింది. అయితే 2022 నాటికి తిరిగి 4.1 శాతానికి చేరింది. నిరపేక్షికంగా సాధారణ స్థితి నిరుద్యోగుల సంఖ్య 2000లో 9.2 మిలియన్లు ఉండగా 2019 నాటికి 29 మిలియన్లకు చేరింది. అయితే 2022లో అది 22.9 మిలియన్లుగా ఉంది.

- మొత్తమ్మీద శ్రామికశక్తి రేటు, కార్మికశక్తి రేటు 2000 నుంచి 2019 సంవత్సరాల మధ్య తగ్గగా, 2019-2022ల మధ్య పెరిగాయి. ఇక నిరుద్యోగం రేటు 2000-2019 సంవత్సరాల మధ్య పెరగ్గా 2019-22 సంవత్సరాల మధ్య తగ్గింది. 2012 నుంచి 2019 సంవత్సరాల మధ్య శ్రామికశక్తి పెరిగిన స్థాయిలో ఆర్థికవ్యవస్థలో ఉపాధి అవకాశాలు విస్తరించకపోవడం వల్ల నిరుద్యోగం రేటు పెరిగిందని నివేదిక పేర్కొంది.
- అయితే 2019-2022 సంవత్సరాల మధ్య నిరుద్యోగం రేటు కొంత తగ్గినప్పటికీ ప్రపంచ ఆర్థిక మందగమనం దృష్ట్యా ఉద్యోగాల నాణ్యత, తక్కువ ప్రతిఫలంతో కూడిన ఉద్యోగిత గమనించదగ్గ అంశాలుగా నివేదిక చెప్పింది.

పురుషుల, స్త్రీల ఉద్యోగితా స్థితి

- 2022 సంవత్సరంలో పురుషుల శ్రామికశక్తి రేటు 77.2 శాతం ఉండగా, స్త్రీల శ్రామికశక్తి రేటు 32.8 శాతంగా ఉండటం గమనార్హం. ప్రపంచ సగటు మహిళా శ్రామికశక్తి రేటు 47.3 శాతం కాగా దక్షిణాసియా సగటు మహిళా శ్రామికశక్తి రేటు 24.8 శాతంగా ఉంది. 2000 సంవత్సరంలో పురుషుల శ్రామికశక్తి రేటు 83.6 శాతం ఉండగా స్త్రీల శ్రామికశక్తి రేటు 38.9 శాతంగా, 2019లో పురుషుల శ్రామికశక్తి రేటు 75.5 శాతం ఉండగా స్త్రీల శ్రామికశక్తి రేటు 24.5 శాతంగా ఉంది. కార్మికశక్తి నిరుద్యోగం రేట్లలో కూడా ఇదే ధోరణి ఉంది.

గ్రామీణ, పట్టణ ఉద్యోగితా స్థితి

- మొత్తమ్మీద పురుషులు, స్త్రీల విషయంలోనూ, గ్రామాలు, పట్టణాల్లో కూడా 2000-2019 సంవత్సరాల మధ్య శ్రామికశక్తి రేటు, కార్మికశక్తి శాతం తగ్గగా, నిరుద్యోగం రేటు పెరిగింది. 2019-22 సంవత్సరాల మధ్య శ్రామికశక్తి రేటు, కార్మికశక్తి శాతం పెరగ్గా నిరుద్యోగం రేటు తగ్గింది.



డా.ఎం.ఎ.మాలిక్,
అసోసియేట్ ప్రొఫెసర్,
ప్రభుత్వ డిగ్రీ కళాశాల,
కూకట్‌పల్లి, హైదరాబాద్.

లిటిల్స్



తెలివైన సింహం!


చీమలు దూరని చిట్టడవి.. కాకులు దూరని కారడవి. ఆ అడవికి రాజు సింహం. ఈ సింహం చాలా తెలివైనదని అందరూ చెప్పుకునేవాళ్లు. ఎందుకంటే.. చెప్పుడు మాటలు వినదు. పైగా ప్రతి విషయాన్ని ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తుంది. మృగరాజు మాట అంటే మాటే. జంతువులన్నీ ఆ మాటకు కట్టుబడి ఉండేవి.

ఒకరోజు రాజుగారు అడవి జంతువులకు అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. అన్ని జంతువులూ హాజరయ్యాయి. అడవికి రాజు కావాలనే ఆశ పులి, నక్కకు ఉంది. అయితే అవి మనసులోనే ఎప్పటినుంచో బాధపడుతున్నాయి. మేము మీ సహాయకుడిగా ఉంటానని నక్క అడిగింది రాజుగారిని. 'అవసరం లేదు' అన్నది సింహం. 'మీకు మంత్రిగా ఉంటాను' అనడిగింది పులి. 'మాకేమి కావాలో బాగా తెలుసు. మీరు చెప్పాల్సిన అవసరం లేద'న్నది సింహం. ఎదురుగా గజగజ వణుకుతూ ఉండే కుందేలుని దగ్గరకు రమ్మని సింహం పిలిచింది. 'ఈరోజు నుంచి నువ్వే నా బాగోగులు చూడాలి' అన్నది. నా గుహ దగ్గరే నీ ఇల్లు అని చెప్పింది. అయిష్టంతోనే.. నేను శాకాహారిని.. రాజుగారు అన్నది. 'తెలుసు కాబట్టే నువ్వే మాకు సహాయంగా ఉండాలి' అన్నది. రాజు దగ్గర సహాయకుడిగా కుందేలు ఉండేది. అప్పుడప్పుడు అడవిలోకి వెళ్లి ఇష్టమైన ఆహారం తినేసి వచ్చేది. ఆ సమయంలోనే కుందేలును కలిసి నక్క ఒక ఉపాయం చెప్పింది. రాజుగారికి తెలిస్తే ఎలా? అన్నది కుందేలు. 'అది అసంభవం' అన్నది.




ఒకరోజు కుందేలు పరిగెత్తుకొచ్చింది. 'రాజావారు దగ్గర కొలనులో ఓ సింహం ఉంది. ఈ అడవికి ఇదే రాజంట' అన్నది. కుందేలుతో కలిసి సింహం బయలుదేరింది. కొలనులో సింహం రూపం కనిపించింది. 'నేను ఎంత అందంగా ఉన్నానో కదా!' అని కుందేలును అడిగింది. నీటి కొలను ముందు గాండ్రించింది. దూరంగా ఉండే నక్కకు ఈ మాటలేవీ వినపడలేదు. పరిగెత్తుకుంటూ క్షణాల్లో నక్క వెనకాలే సింహం దగ్గరకు వచ్చి ఆగింది. 'రాజుగారూ.. నీళ్లలో దూకి ఆ పొగరుబట్టిన సింహాన్ని సంహరించండి' అన్నది. నీళ్లలోకి దూకినట్లు ముందుకు ఎగిరి.. క్షణాలో వేగంగా వెనక్కి వచ్చింది. 'ఓహో.. తమరి తర్ఫీదా ఇది' అంటూ నక్క గొంతును కొరికేసింది సింహం. 'చెప్పుడు మాటలు ఇకమీదట వింటే నీకిదే గతి' అంటూ కుందేలుతో అన్నది. గజగజవణుకుతూ 'ఈసారి క్షమించండి' అన్నది. 'నీ మనసు నాకు తెలుసు. నా తెలివి నీకు తెలుసు' అంటూ సింహం నవ్వింది. కుందేలు కూడా గట్టిగా నవ్వింది.

సరైన నీడ ఏది?




దారి కనుక్కోండి



10 తేడాలు గుర్తించండి



జత ఉన్న బొమ్మలు ఏవి?



డైలీ సుడోకు - 282

		8		7				6
	3		4	2				5
	9					4	1	
1							5	
			5		3			
	6							1
	8	6					4	
9				4	6		2	
2				5		7		

సుడోకు - 281 సమాధానం

8	6	1	7	9	5	3	4	2
9	2	5	1	3	4	8	6	7
7	4	3	2	6	8	1	9	5
4	3	7	8	5	6	9	2	1
2	8	9	4	7	1	6	5	3
1	5	6	3	2	9	4	7	8
3	9	4	5	1	2	7	8	6
5	1	8	6	4	7	2	3	9
6	7	2	9	8	3	5	1	4

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.